
# ఆఖరి ఘడియలు



# ఆఖరి ఘడియలు

**యర్రంశెట్టి శాయి**




సగం విరిగి గోడకు వేలాడుతున్న అద్దంలో తన ముఖాన్ని అయిదారు యాంగిల్స్ లో చూసుకొని క్రాఫ్ దువ్వుకుంటూ ట్యూన్ నెంబర్ వన్ పాడాడు భవానీశంకర్. సరిగ్గా కుదరలేదది. వెంటనే గొంతు స్థాయి తగ్గించి ట్యూన్ నెంబర్ 'టూ' పాడాడు. అది అంతంత మాత్రంగానే వుంది. ఇంక తప్పేట్లు లేదని కొంచెం గొంతు పెంచి ట్యూన్ నెంబర్ త్రీ పాడటం ప్రాంభించాడు.

మొదటి చరణమైనా పూర్తవకుండానే గది గడప దగ్గర అలికిడైతే అటువేపు చూశాడు.

తనకు తెలీకుండానే తన పాటకు ప్రేక్షకులు వెలిశారక్కడ.

ముందు తులసి నుంచుని వుంది. చింపిరి జేడలు. ఓ పలక పట్టుకుని , తులసి వెనుక సెవెన్త్ క్లాస్ చదూతూన్న పక్కింటి రాజేశ్వరి నిలబడి వుంది. రాజేశ్వరి వెనుక ఆరో క్లాస్ చదూతూన్న రాంబాబు షోడాబుడ్డి గ్లాసు ల్లాంటి అద్దాలతో నిలబడి వున్నాడు. వెళ్ళందరి వెనుకా చాముండేశ్వరి పాపాయి నెత్తుకుని నిలబడి ఉంది. ఆమె వెనుక వాళ్ళత్తగారూ వీళ్ళు గాక ఆ చుట్టూ పక్కల ఇళ్ళ వాళ్ళందరూ కలిసికట్టుగా పెంచుకుంటున్న "టైగర్" అని పిలవబడే ఓ వీధి కుక్క కూడా తలుపు సందులో నుంచి తొంగి చూస్తోంది.

తనేప్పూడు పాట పాడబోయినా ఇలా ఇంతమంది తిరణాలకు మూగినట్లు మూగిపోవడం చూసేసరికి భవానీశంకర్ కి, కోపం, నిరాశ, దిగులూ వగైరాలు కలగలుపుగా కలిగినాయ్. ఇప్పుడే కాదు. కొద్ది రోజుల క్రితం తానా గదిలో దిగిన క్షణం నుంచీ ఎప్పుడు గొంతెత్తి పాడదామన్న ఇదే వరస. రోడ్ మీద యాక్సిడెంట్ అయిన వాడికి "ఫస్ట్ ఎయిడ్" చేసినట్లు ఆ ప్రేక్షక సమూహాన్ని చెదరగొట్టడానికి తన పాటను అర్ధంతరంగా అపుచేయాల్సి వచ్చిందతనికి. ఆపేసి "ఇహి" అని నవ్వాడు.

పాట ఆగిపోయే సరికి ఆ సముహమంతా ఒకరి తర్వాత ఒకరు గడప ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

తులసి మాత్రం ఒక్కర్తే ఇంకా నిలబడి వుంది అమాయకంగా.

"హలో హలో హలో హలో హలో" ఆమె వంక చూస్తూ ఆప్యాయంగా పిలిచాడు భవానీశంకర్.

తులసి ముఖంలో కిప్పుడు చిరునవ్వు వచ్చింది.

"కమాన్ మైడియర్ లిటిల్ ఫ్రెండ్! ట్యూషన్ అయిపోయి చాలా సేపయింది కదా? మళ్ళీ తమరు విచ్చేయుటకు కారణమేమిటి భామా?"

తులసికి అతని భాష అర్ధం కాలేదు సరిగ్గా.

"అంకుల్ - మమ్మీ సేస్ - మమ్మీ సేస్" అంది ఇంగ్లీషులో.

"యస్ డియర్! ఏం చెప్పింది మీ మమ్మీ!"

"నో అంకుల్ నాట్ మమ్మీ!"

"నాట్ మమ్మీ!"

"నాట్ మమ్మీ?"

"నాట్ మమ్మీ!"

"అయితే మరెవరు కామ్రేడ్?"

"మా అంటీ అంకుల్! అంటీ సేస్- అంటీ సేస్ అంటీ చెప్పిందంకుల్ - నాకు పాటలు నేర్పవద్దని మీకు చెప్పమంది."

"వాట్ వాట్ వాట్ వాట్ -" భవానీశంకర్ కన్ ఫ్యూజయిపోయాడు.

"అవునంకుల్! ఇంకోసారి సినిమా పాటలు నేర్పిస్తే నా ట్యూషన్ స్టాప్ చేస్తుందట."

భవానీశంకర్ అదిరిపడ్డాడు.

"వన్ మినిట్ - వన్ మినిట్ కామ్రేడ్, కొంచెం వివరాలు అందించు ! నీకు సినిమా పాటలు నేర్పవద్దని మీ అంటీ చెప్పిందా?"

"అవునంకుల్!"

"అంటీ అంటే ఎవరు?"

"అంటీ తెలీదాంకుల్ నీకు?"

"తెలీదు కామ్రేడ్! అలాంటి కామ్రేడ్ ఒకరు మీ ఇంట్లో వున్నట్లు ఇవాళే వినటం-" ఆలోచనలో పడుతూ అన్నాడు.

ఈ అంటీ ఎవరో అతనికే మాత్రం అర్ధం కాలేదు. తులసికి కేవలం తల్లీ- తండ్రి మాత్రమే ఉన్నరాన్న విషయం తనకు క్షుణ్ణంగా తెలుసు. వాళ్ళిద్దరూ ఉద్యోగం చేసేవాళ్ళే కనుక తులసి ట్యూషన్ విషయం పట్టించుకునే ఓపిక వాళ్ళిద్దరికీ లేదు. వాళ్ళక్కావలసినది -ఇంగ్లిష్, హిందీ భాషల్లో రెండో క్లాస్ చదివిన ఆ పిల్లకు తను తెలుగు నేర్పటం? అంతవరకే! అంతేకాక తెలుగు ఫలానా విధంగా నేర్పించు అని గాని, ఎలాంటి తెలుగు నేర్పించాలి అనిగాని అంక్షలేవీ పెట్టలేదు వారు. అలాంటిది ఇప్పుడెవరో అంటీ వచ్చి ఇలా తనకు బెదిరిపు పంపటం చాలా అవమానకరంగా తోచిందతనకి.

నెమ్మదిగా వెళ్ళి తులసి ముందు మోకాళ్ళ మీద కూర్చుని తులసిని దగ్గరకు తెసుకుని ముద్దు పెట్టుకున్నాడతను.

"అంటీ ఎవరమ్మా?" అడిగాడామెని బుజ్జగింపుగా.

"అంటీ అంకుల్ అంటీ తెలీదా నీకు?"

"తెలీదు కదా! అంటీ పేరేమిటి?"

"స్మేతా అంటీ అంకుల్! మొన్నే ఊర్నుంఛి వచ్చింది కదా. మా కోసం కోవా కజ్జికాయలు కూడా తెచ్చింది. "

"కోవా కజ్జికాయలు తెచ్చిందా? దొంగ రాస్కెల్! మరి నాకు పెట్టలేదెం?"

"కొంచమే ఉన్నాయ్ అంకుల్. నాకే చాలవ్."

భవానీశంకర్ చకచక ఆలోచించ సాగాడు. ఈ స్మిత అంటీ ఎవరో ఎంత ఆలోచించినా అర్ధం కావటం లేదతనికి.

బహుశా తులసి తల్లి వేపు అమ్మాయి గాని తండ్రి వేపు అమ్మాయి గాని అయుండాలి. అయినా ఆ పిల్లకు తను ట్యూషన్ లో ఏం చెపుతున్నాడో అన్న విషయంతో ఏమిటి సంబంధం?

"అల్ రైట్ డియర్! మీ స్మితా ఆంటీకి నేను నమస్తే చెప్పానని చెప్పు. ఇంక ఇంటికేళ్ళు" ఆమె భుజం తట్టి బయటకు పంపాడు తను.

కొద్దిసేపు అక్కడే కూర్చుని "స్మితా అంటీ" అనే పేరు గురించి కొద్దిసేపు ఆలోచించాడు గానీ ఏమీ తట్టలేదు. ఓసారి తులసి వాళ్ళింటికి వెళ్ళి చూద్దామా అనుకున్నాడు గానీ అదంతగా తెలివితేటలు గలవాళ్ళు చేసేపని కాదని మళ్ళీ ఆ ఆలోచన విరమించుకున్నాడు. అతనలా ఎంత సేపు మోకాళ్ళ మీద కూర్చుని శూన్యంలోకి చూస్తూ గడిపేవాడో గాని హటాత్తుగా ఎదురుగ్గా ఓ పొడగాటి ఆకారం కనిపించే సరికి చటుక్కున స్పృహలోకి కొచ్చి ఆ ఆకారం వేపు పరీక్షగా చూశాడు.

స్పోర్ట్స్ సైకిల్ మీద ఠీవిగా కూర్చుని సైకిల్ కి ఓ బాగ్ తగిలించుకుని వున్నడతాను. అతడి నెత్తిమీద ఓ హెల్మెట్.

"ఏమిట్రా ఆ చూపులు. కళ్ళు బైర్లు కమ్మినయా ఏమిటి?" నవ్వుతూ అడిగాడు సైకిల్ వాలా.

"హలో హలో హలో కామ్రేడ్ శ్యామ్. నీ అవతారం సెంట్ పర్సెంట్ మారిపోయింది బ్రదర్. ఆ శిరచ్ఛేదాస్త్రణం వల్ల అన్నట్లు సైకిల్ వాళ్ళు కూడా హెల్మెట్ పెట్టుకోవాలని పోలీస్ రూలేమయినా వచ్చిందా బ్రదర్?"

శ్యామ్ సైకిల్ స్టాండ్ వేసి గదిలో కొచ్చాడు.

"ఆ రూల్ ఇంకా రాలేదనుకో. కానీ రావటం ఎంత సేపు బ్రదర్! హెల్మెట్ కంపెనీల వాళ్ళు ప్రభుత్వాన్ని మరికొంత మేపితే చాలు హటాత్తుగా రేడియో న్యూస్ వచ్చేస్తుంది. ఆ గొడవ సరేగాని ఇవాళ మధ్యాహ్నం మనింటికి లంచ్ కి రావాలి బ్రదర్ నువ్వు."

భవాని శంకర్ ఆనందంతో పొంగిపోయాడు.

"లంచ్ కా? లవ్ లీ అయిడియా కామ్రేడ్. బ్యూటీ ఫుల్ ప్లాను, అవును, వదినమ్మ ఎందుకింత దయతలచిందంతావు నా మీద?"

"మరేం లేదు కాలేజీలో చదివిన వాళ్ళ క్లాస్ మేట్ ఎవర్నో లంచ్ కి పిలిచిందట నేనూ మా బాస్ ని లంచ్ కి పిలిచాను. వాడితో మనక్కొంచెం పని వుందిలే. మన ఉద్యోగం పర్మనెంట్ చేస్తాడేమోనని మస్కా కొడుతున్నాను. సరే ఎలాగూ పెద్ద ఎత్తున లంచ్ కార్యక్రమం జరుగుతుంది కదాని నిన్ను...."

"థాంక్ యూ బ్రదర్! వదినమ్మ చేతివంట తిని చాలా కాలమయింది. నా అంతట నేనే "ఎటాక్" చేద్దామని అనుకుంటున్నాను. నువ్వోచ్చేశావ్- బైదిబై చికెన్ పకోడా, కాలీఫ్లవర్ కర్రీ - ఈ రెండూ మాత్రం వోదినమ్మ అమృత

హస్తాలతో ఏర్పాటు చెయ్యాలని చెప్పు -"

"సరే వస్తా." బయటకు నడిచి మళ్ళీ సైకిల్ ఎక్కడతను. "పదకొండు గంటలకల్లా వచ్చేశాయ్.వెధవ తిరుగుడులు తిరిగి రెండింటికి చేరుకున్నవంటే నువ్వే విచారించాల్సి వస్తుంది..."

"అల్ రైట్ బ్రదర్. పదకొండు వరకూ ఎందుకు" ఇప్పుడే బయలుదేరతాను."

"నేను చికెన్ తేవడానికి వెళుతున్నాను."

"మంచి అలవాటు బ్రదర్ కీపి టప్."

శ్యామ్ వెళ్ళిపోయాడు.

భవానీ శంకర్ మరోసారి అద్దం ముందు నిలబడి ట్యూన్ నెంబర్ త్రీ చాలా మెల్లగా బయటకు వినిపించనంత మెల్లిగా ఆలపిస్తూ తల దువ్వేసుకున్నాడు.

డ్రస్ మార్చుకుని తను ఇంటర్వ్యూ ల కోసం ప్రత్యేకంగా దాచుకున్న కాస్టుమ్స్ వేసుకుని టైం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర అవుతోంది.

తలుపు తాళం వేసి రోడ్ మీద కొచ్చాడు. రోడ్ మీద ఫోటో స్టూడియో కుర్రాడు అతనిని చూచి చిరునవ్వు తో విష్ చేశాడు.

"నమస్కారం సార్."

"నమస్తే బ్రదర్! హౌ ఈజ్ లైఫ్ బ్రదర్?" స్టూడియో లోకి నడిచి కుర్చీలో కూర్చున్నాడు.

"లైఫ్ ఇంకెలా వుంటుంది సార్? కాసేపు పాజిటివ్, కాసేపు నెగటివ్ - మధ్యలో ప్రింట్లు.

"కరెక్టు బ్రదర్. ఒండర్ ఫుల్ డిస్క్రిప్షన్ ! బైదిబై నువ్వింతకు ముందు తెలుగు సినిమాలో యాక్ట్ చేశావా ఫ్రెండ్! ఎందుకంటే ఇలాంటి డైలాగులు ఎక్కడో తెరమీద విన్నట్లు గుర్తు."

"లేద్సార్! ఇవి మన సొంతం! మీకు తెలీదనుకుంటాను. నేను నాటకాలు రాస్తుంటాను. మొన్న శ్రీరామనవమికి మా ఊళ్ళో జవార్ పేట సెంటర్లో వేసిన "కాటేసిన వర్గం" నాటిక ఎవరిదనుకుంటున్నారు" నాదే!"

"టెరిఫిక్ ఎచీవుమెంట్ బ్రదర్! బైదిబై మన ఫోటోల సంగతేమీ చేశావు బ్రదరూ! ప్రూఫ్ లు తీశావా?"

"ఓ - తీశాన్సార్" అంటూ డ్రాయర్ లో నుంచి ఓ పాకెట్ తీసి ముందుంచాడు.

భవానీ శంకర్ ఒకటొకటి చూడసాగాడు. మొదటి ఫోటో తన ప్రియమైన శిష్యురాలు తులసిది. రెండోది రాజేశ్వరి, జానకి , శ్రీవల్లి, కలిసి దిగింది. మూడోది టైగర్ ది!

"అన్నీ బ్రహ్మాండంగా వచ్చేయ్ సార్! మీరెప్పుడూ తీసినా ఒక్కటి కూడా పాడవదు. లైటింగ్, డిస్టెన్స్, అన్నీ పర్ ఫెక్టుగా ఉంటాయ్."

"థాంక్స్ బ్రదర్! ఈ విషయం నువ్ చెపితే ఏం లాభం మిగత ప్రేక్షకులంతా చెప్పాలి. అప్పుడు గాని ది గ్రేట్ ఫోటో గ్రాఫర్ గా వెలిగిపోము. అల్ రైట్ బ్రదర్ అన్నీ కార్డ్ సైజు ప్రింట్లు వేసేయ్ - రేపు సాయంత్రం వస్తా ........" అతని మాట పూర్తీ కాకుండానే పన్నీటి జల్లు కురిసింది.

విశ్వామిత్రుడి లాంటి వాడిని ఆ ఒక్క పిలుపుతోనే గాల్లో పద్నాలుగడుగులు ఎగిరిపడేలా చేసే అద్భుతమైన తీయదనం వుందా గొంతులో.

షాపు కుర్రాడితో పాటు భవానీశంకరం కూడా ఆటోమేటిగ్గా వెనక్కు తిరిగి ఆ గొంతు తాలుకూ ఓనర్ ని

చూశాడు. చూసి కొద్ది క్షణాలు తనని తను మర్చిపోయాడు.

సుమారుగా ఇరవై ఏళ్ళుంటాయా యువతికి. భవానీశంకర్ కెమెరా ల్లాంటి కళ్ళతో ఆ అమ్మాయిని కొన్ని లక్షల స్నాప్ లు తీసేశాడు. ఆ కొద్ది క్షణాలలోనే . ఎంత అద్భుతమైన అందం? ఎంత చల్లటి ఫోటో జేనిక్ ఫేస్? తను చూసిన వేలకొద్దీ అందమైన అమ్మాయిలలో ఇంతటి బ్యూటీ ఎక్కడా కనిపించలేదు.

అతగాడలా స్నాప్ లు తీస్తున్నట్లు చూడటం గమనించి ఆ అమ్మాయి చెక్కిళ్ళు ఒక మోస్తరు సైజు సిగ్గుతో ఎరుపెక్కినాయ్. అతని కళ్ళల్లోకి ఓసారి చూసి, చురుగ్గా చూపులు మరల్చుకుని స్టూడియో కుర్రాడి వేపు చూసింది మళ్ళీ.

"యస్ మేడమ్, ఏం కావాలి?" అడిగాడు కుర్రాడు.

ఆమె తన బ్యాగు లో నుంచి ఫిలిమ్ రీల్ తీసి టేబుల్ మీద వుంచింది.

"ప్రింట్లు వేసివ్వాలి" మళ్ళీ వీణ మీటిన గొంతు.

"బాగా వచ్చినా రాకపోయినా అన్నీ వేయాలా, బాగా లేకపోతే వద్దా."

అతను డ్రాయర్ లో నుంచి రిజిస్టర్ తీశాడు.

"పేరు చెప్పండి"

"జె. స్మితా రాణి."

భవానీ శంకర్ ఉలిక్కిపడ్డాడు.

చాలా కాలంగా కోమాలో ఉండి ఒకే ఒక్క సెకెండు బయట పడినట్లుంది పరిస్థితి.

"స్మిత స్మిత స్మిత స్మిత స్మిత స్మిత........." అనుకున్నాడు వివరాల కోసం -- ఓ లక్షసార్లు.

ఎంత ఆలోచించినా ఏమీ గుర్తుకు రాలేదు.

మరో రెండు సార్లు స్మిత పేరుని తిరగేసి "తస్మి తస్మి" అనుకుని ఆలోచించాడు. అయినా లాభం లేకపోయింది.

అతనికి ఒక్కసారిగా చిరాకు పుతుకొచ్చింది. తన మెదడు మీద ఇంత ముఖ్యమైన విషయం గురించి ఇన్ ఫర్మేషన్ అందించలేక పోతూన్న మెదడు ఉంటేనేం ఊడిపోతేనేం అనుకుని, ఉంటేనే మంచిదని వెంటనే డిసైడ్ చేసుకున్నాడు.

ఏదేమైనా ఇంత అందమైన ఈ అమ్మాయికి కూడా ఫోటో గ్రఫీ హాబీగా ఉండటం ఎక్కడలేని అనందం కలిగించింది. ఇలా ఎక్కడ లేని అనందం కలిగించిన సందర్భాలలో అతను సాధారణంగా చేసే పని ఒక్కటే!

హుషారుగా విజిల్ వేయటం!

అందుకే ఇప్పుడూ అదే పని చేశాడు. కానీ ఈ తలతిక్క ప్రపంచంలో దురదృష్టవశాత్తూ యువకులు వేసే హుషారు మార్క్ విజిల్స్ ని హర్షించి ప్రోత్సహించే వారి సంఖ్య కంటే నిరుత్సాహపరిచే వారి సంఖ్యే ఎక్కువ.

స్మిత ఆ రెండో కేటగిరికి చెందిన యువతి కావటం వాళ్ళ కోపంగా భవానీశంకర్ వేపు చూసింది. భావనీశంకర్ తన తప్పు తెలుసుకుని నాలిక్కరుచుకున్నాడు. గానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఆమె ఆ కుర్రాడడిగిన అయిదు రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి మరోసారి కోపంగా భావానీశంకర్ వేపు చూసి చకచక అడుగులు వేస్తూ బయటకు నడిచింది.

"రేపు సాయంత్రం రండి మేడమ్" అరిచాడు కుర్రాడు మాటలు వినిపించుకోలేదు.

"నాకు ఓ విషయం అర్థం కావటం లేద్సార్" అన్నాడు స్టూడియో కుర్రాడు ఆగిపోయిన తన సంభాషణను

పునరుద్ధరిస్తూ.

"ఏమిటి బ్రదర్ అదీ."

"నే వ్రాసిన మిగతా ముప్పై ఆరు నాటికలూ ఎవరూ స్టేజ్ చేయటం లేద్సార్. ఎంతమంది నడిగినా స్క్రిప్టు చూసి మళ్ళా కనబడకుండా పోతున్నారు. ఎందుకనంటారు?"

""అన్సర్ ఈజ్ వెరీ సింపుల్ బ్రదర్! వాళ్ళందరూ ఇంకా నీ రచనల స్థాయికి ఎదగలేదు డియర్! బహుశా ఏ రెండు వందల సంవత్సరాల తర్వాతో - వీటి విలువ తెలుసుకుంటారు ప్రజలు. అప్పుడు ఊరూరా, వాడవాడలా - నీ ఫోటోలు పెట్టి, దండలు వేసి "తొందరపడి ఓ కోయిల ముందే కూసింది" అన్న పాటలు పాడి "కాలాని కంటే ముందు పరుగెత్తి రచనలు చేసిన కామ్రేడ్ శివన్నారాయణ" అని బిరుదులు తగిలిస్తారు బ్రదర్."

"నా పేరు శివన్నారాయణ కాద్సార్".........

"కాదా?"

"కాదండీ!"

"మరేమిటి?"

"విక్రమార్కారావు సార్."

"ఓహో విక్రమార్కారావు కదూ! రెండింటికీ పెద్ద తేడా లేదు కదా! అందుకని కొంచెం కన్ ఫ్యూజన్--"

"ఇంతకూ నా నాటికలన్నీ మునిసిపాలిటీ వాళ్ళ చెత్తకుండిలో పారేయాల్సిందేనా సార్?" దిగులుగా అడిగాడు విక్రమార్కారావు.

భావానీశంకర్ ఓ క్షణం ఆలోచించాడు.

"ఆ - వండర్ ఫుల్ అయిడియా బ్రదర్! అలాంటి స్టఫ్ ని ఆదరించే వారున్నారన్న విషయమే మర్చిపోయాను. అసలు ఇలాంటి రచనల కోసమే ఆ సంస్థలు నెలకొల్పారు."

"ఏమిటి సార్ అవి?"

"ఇంకా తెలీలేదా బ్రదర్.- టీవి. రేడియో, వెంటనే దాడి ప్రారంభించు! వాళ్ళ దగ్గర పనికిరాని స్క్రిప్టు అంటూ ఏమీ ఉండదు బ్రదర్! కమాన్ ఎటాక్-"

విక్రమార్కారావు ముఖంలో అనందం చొచ్చుకొచ్చేసింది.

"థాంక్ యూ సార్-" అన్నాడు కృతజ్ఞతతో. "మీ ప్రింట్లు ఇవాళ సాయంత్రానికల్లా ఇచ్చేస్తాను సార్-" అన్నాడు ప్రేమగా.

భావానీశంకర్ కంగారుపడ్డాడు. స్మితారాణి మర్నాడు సాయంత్రం మళ్ళీ స్టూడియో కొస్తుంది. అందుచేత తనూ అప్పుడే రావాలి.

"నో నో నో ........అలాంటి తొందరపాటు చర్యలు వద్దు బ్రదర్! రేపు సాయంత్రమే వస్తాను . ఓ.కే."

"ఓ.కే.!"

భావనీశంకర్ షాపు బయటికొచ్చేశాడు. టైమ్ పదయిపోయింది. చకచక బస్ స్టాప్ వేపు నడిచాడతను.

ఆరోజు ఉదయం వరకూ తన భవిష్యత్తు ఏమిటా అన్న వర్రీ అతని ఉత్సాహాన్ని చాలా వరకూ సంహరిస్తూ వచ్చింది. కానీ హటాత్తుగా స్మిత అనే అందమైన దేవత కనిపించి అ వర్రీని అంతులేకుండా తరిమి కొట్టింది.

దాంతో పూర్తి ఉత్సాహంతో బస్ స్టాఫ్ చేరుకొని జన సమూహంలో నిలబడి హుషారుగా విజిల్ వేశాడు మళ్ళీ.

కానీ పక్కనే ఓ పాము "బుస్" మని పరిగెత్తిన శబ్దం వినిపించేసరికి అదిరిపడి చూశాడు. చూసీ మరి ఆశ్చర్యపోయాడు. అది పాముకాదు దాని స్థానంలో స్మితారాణి మళ్ళీ అదే రూపంతో అదే అందంతో నిలబడి వుంది. కానీ పడగ విప్పిన పాములాంటి ఫోజులో వుంది. భావానీశంకర్ పశ్చాత్తాపపడ్డట్లు ఓవరాక్షన్ చేశాడు.

పాము అవతారం చాలించేసి , "ఇడియట్" అని భావానీశంకర్ వినేట్లు అనుకుని అతనికి దూరంగా జరిగి నిలబడింది. తన్ను చూసే విజిల్ వేశాడనుకున్నట్లుంది - అయినా ఆ దేవతను తనెలా గమనించలేకపోయాడు . అర్ధం కావటం లేదు.

భవనీశంకర్ పరిస్థితినంతా అవగాహన చేసుకునే సరికి బస్ వచ్చేసింది.

పరుగుతో వెళ్ళి పుట్ బోర్డు ఎక్కడానికి యుద్ధం ప్రారంభించాడతను. రెండు నిమిషాల యుద్ధం తరువాత బస్ వెళ్ళిపోయింది కానీ అతను మిగిలిపోయాడు. నిజానికి పుట్ బోర్డు ఎక్కేందుకు కావలసిన అవకాశం ఆఖరి క్షణాల్లో అతనికి దొరికింది కానీ ముందు వేపు ఎంట్రన్స్ నుంచి లోపలి కేక్కలేక వెనక్కు తగ్గి నిలబడిపోయిన స్మిత రాణిని చూసి అతనూ తన అవకాశాన్ని వదిలేశాడు.

బస్ స్టాప్ లో ఇప్పుడు నలుగురయిదుగురే మిగిలారు.

భవనీశంకర్ చిరునవ్వుతో స్మితారాణి వేపు చూశాడు మళ్ళీ. ఆమె ముఖం చిట్లించుకుని తల మరోవేపు తిప్పుకుంది.

ఈసారి ఖాళీ బస్ వచ్చింది.

ఇద్దరూ బస్ ఎక్కేశారు.

ముందు భవానీశంకర్ దగ్గరకే వచ్చాడు కండక్టర్.

"ఎక్కడికి?"

భవానీశంకర్ కేం చెప్పాలో తెలీలేదు. "తెలీదు బ్రదర్." బస్సు "వెనక్కు తిరిగేవరకూ కొట్టు--" చిరునవ్వుతో చెప్పాడతను.

"ఆహ్హాహ్హా......" అన్నాడు కండక్టర్ అర్ధమైనట్లు నవ్వుతూ.

"కరెక్టు- కరెక్టు -" అన్నాడు భవానీశంకర్.

కండక్టరు స్మిత దగ్గరకు నడిచాడు.

"విజయనగర్ కాలనీ" అందామె పదిరూపాయల నోటిస్తూ.

"చేంజ్" అన్నాడు కండక్టర్.

"లేదు" అందామె బాగ్ లో చూస్తూ.

కండక్టర్ బెల్ కొట్టాడు. బస్ ఆగిపోయింది.

"దిగండి" అన్నాడతను.

స్మితకు కోపం ముంచుకొచ్చింది. "ఎందుకు దిగాలి" అంది మొండిగా. భవానీశంకర్ ఆ అవకాశాన్ని ఇంక వదల దలచుకోలేదు.

తనే బెల్ కొట్టేశాడు. బస్ స్టార్టయింది మళ్ళీ.

కండక్టరు భవానీ శంకర్ వేపు చూశాడు కోపంగా.

"క్యా హై" అన్నాడు ఉర్దూలో.

"కబీ నహీ" అన్నాడు భవానీ శంకర్.

"బెల్ క్యోం మారా?"

"బస్ స్టార్ట్ కర్ నేకో!"

"ఫీర్ మేమ్ సాబ్ కా టికెట్ కోన్ ఖరీదెంగా?"

"హామ్ ." అంటూ జేబులోంచి చిల్లర తీసి ఇవ్వబోయాడతను ---

స్మితారాణికి అతని వరసే మాత్రం నచ్చలేదు. ఆడపిల్లను చూసి విజిల్స్ వేసే రౌడీ సజ్జు దగ్గర టిక్కెట్ కోసం చిల్లర తీసుకోవటం చాలా అవమానకరంగా తోచింది. దానికంటే బస్సు దిగి మరో బస్సులో వెళ్ళటం ఉత్తమమనిపించింది.

అంచేత ఈసారి తనే బెల్ కొట్టింది. డ్రయివర్ కి వళ్ళు మండిపోయింది. సడెన్ బ్రేకుతో బస్సు ఆపి అందరినీ కిందపడేట్లు చేసి "యే క్యాహో రహేహై!" అన్నాడు గట్టిగా.

"ఏమిటి సంగతి!" స్మిత వైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు కండక్టరు.

"నాకతని డబ్బు అవసరం లేదు. బస్ దిగిపోతున్నాను......." అంది. డ్రయివర్ కాబిన్ వైపు నడుస్తూ.

భవానీశంకర్ చప్పున కల్పించుకున్నాడు.

"నేను చిల్లర మీకివ్వటం ;లేదు మేడమ్. కండక్టరుకి పది చిల్లర ఇస్తున్నాను - " ఆమె దిగాక ముందే డ్రయివర్ బస్సు స్టార్ట్ చేశాడు మళ్ళీ.

"డ్రయివర్ బస్ అపు - నేను దిగాలి- " అరచిందామే ఉక్రోషంగా.

"ఇది స్టేజి కాదు -" అన్నాడు నిర్లక్ష్యంగా.

"మీ పది నోటివ్వండి- " అన్నాడు కండక్టర్.

స్మిత పది నోటిచ్చింది.

అతను చిల్లరిచ్చాడు. తనకు "థాంక్స్" చెప్తుందేమోనని ఆమె వేపు చూశాడు భవానీశంకర్. కాని ఆమె బస్ లో ఏ మూల చూసినా కనిపించే కుటుంబ నియంత్రణ పబ్లిసిటీ బోర్డులు చూస్తోంది.

బస్ విజయనగర కలనీ చేరుకుంది.

స్మితారాణి బస్ దిగి నాలుగడుగులు వేసి ఎందుకో అనుమానం వచ్చి వెనక్కు తిరిగి చూసింది. తన వెనుకే నింపాదిగా నడుస్తూ వస్తోన్న భవానీశంకర్ ని చూసేసరికి ఆమె కోపం ఆగలేదు.

"హు! అనుకుందోసారి.

భవానీశంకర్ గతుక్కుమన్నాడు కొంపతీసి , తనీమే వెంటపడుతున్ననని అనుకోవడం లేదు కదాగ నిజానికి ముందు అదే అనుకున్నా అలాంటి ఆలోచనలు బస్ లోనే కాన్సిల్ చేసుకున్నాడతను.ఎందుకంటే క్షణక్షణానికి ఆమెకు తన మీద కోపం పాదరసంలా పాకిపోవటం అతని కిష్టం లేకపోయింది.

మెయిన్ రోడ్ వదలి సందులోకి తిరిగేసరికి ఆమెకు అనుమాన నివృత్తి అయిపొయింది. తప్పకుండా ఈ రౌడీ తన వెంటపడుతున్నాడు. అయితే వెంటపడే రౌడీల బారి నుండి తప్పించుకోవాలనే మనస్తత్వం కాదామేది. అంచేత అతని కేలాగయినా బుద్ది చెప్పాలన్నా కోరిక ఆమెలో బలంగా నాటుకు పోయింది.

భవానీశంకర్ సందు తిరిగి టక్కున నిలబడిపోయాడు.

ఆ అమ్మాయి వెళ్ళే సందులోకే తనూ వెళ్ళాల్సి రావటం కొంచెం ఇబ్బందికరంగా అనిపించింది. దానికి తోడు ఆమె తననో రౌడీ వెధవని చూచినట్లు ఉండుండి వెనక్కు తిరిగి చూడటం - ---ఈ పరిస్థితుల్లో తనా ఆమెను ఓవర్ టేక్ చేసి నడవడం ఉత్తమ మనిపించింది. అప్పుడిక తనాఆమెను వెంబడిస్తున్నాడన్న అనుమానం ఆమె కుండదు.

అడుగుల వేగం పెంచాడతను. ఆ విషయం గమనించిందామె.

ఆ సందులో ఉండుండి ఓ సైకిల్ వెళ్ళటం తప్పిస్తే వేరే జన సంచారమే లేకపోవటంతో స్మితారాణి అతనిమీద కొత్త అనుమానాలు ప్రారంభమయ్యాయి. కొంపతీసి నడిరోడ్డు మీద పిచ్చి వేషాలు వేయడు కదా . ఈ రోజుల్లో ఏం జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆమెకు చాలా అనుభవాలు చెప్పాయ్. ముఖ్యంగా సినిమాల్లో యేదయినా హీరో హీరియిన్ల అల్లరీ వ్యవహారం చూస్తే మర్నాడే దానిని కాలేజీ రోడ్ల మీద , ఇతర చోట్లా అమలు చేయటానికి కుర్రకారు ప్రయత్నించటం చాలాసార్లు జరిగింది.

భవానీ శంకర్ ఆమెకు సమీపంగా వచ్చేశాడు.

స్మితకు టెన్షన్ పెరిగిపోతుంది.

అతను తనమీద చేయి వేయటం గానీ, లేక తనను చూసి విజిల్ వేయటం గానీ చేస్తే మాత్రం వెంటనే వీలయినంత ఫోర్సుతో అతని చెంప పగలగొట్టాలని నిర్ణయించుకుని సంసిద్ధమయిపోయింది.

భావానీశంకర్ ఆమె పక్కకు వచ్చేశాడు.

స్మిత చేయి స్ప్రింగ్ యాక్షన్ కి రెడీగా వుంది.

హటాత్తుగా భవానీశంకర్ దృష్టి ఎదురుగా వస్తున్న కారు మీద పడింది. క్షణాల్లో దానివేగం ప్రమాదకరంగా పెరిగిపోయింది.

మిగతాదంతా కన్నుమూసి తెరిచే లోపల జరిగిపోయింది.

అలా భయంకరంగా కారు తన మీదకు రావటం , స్మితను భవానీ శంకర్ చటుక్కున తనతో పాటు లాక్కుని కాంపౌండ్ వాల్ కి అతుక్కుపోవటం , కేవలం వెంట్రుక వాసిలో స్మిత పక్కనుంచీ కారు దూసుకుపోవటం ఆ ప్రమాదం గమనించని స్మిత చెయ్యి భవానీశంకర్ చెంపమీద బలంగా నాట్యం చేయటం ......

ఇన్ని కార్యక్రమాలు కేవలం ఆ ఒక్క సెకండ్ లో జరిగిపోయాయ్.

కొద్ది క్షణాల పాటు స్మిత ఆ షాక్ నుంచి కోలుకోలేక పోయింది. తనను ఆకారు డీ కొందనే అనుకుంది. తప్పించుకోడానికి కూడా కదల్లేనంత సమయంలో మీద కొచ్చేసిందది. భవానీశంకర్ తనను ఆ సమయానికి కాంపౌండ్ వాల్ మీదకు లాగకపోయినట్లయితే తను ఈ పాటికి ........

నుదుటి మీద స్వేదబిందువు లొచ్చేసినాయ్ ఆమెకు.

"టేకిల్ ఈజీ మిస్" అన్నాడు భవానీ శంకర్ చిరునవ్వు తో.

"ఎంత రాష్ డ్రయివింగ్ ?" కూడబలుక్కుని అందామె కర్చీఫ్ తో చెమటలు తుడుచుకుంటూ. ఆమె చేతులింకా వణుకుతూనే ఉన్నాయ్.

"ఇది మన రాజధాని నగరం ఫ్రెండ్ శరీరాల్లో రక్తం ప్రవహించే జనాభా కన్నా మందు ప్రవహించే జనాభా మిక్కుటంగా ఉన్న నగరం......."

హటాత్తుగా స్మితకు తన చేయి ఇంకా అతని చేతుల్లోనే ఇరుక్కుని ఉన్నదన్న విషయం గుర్తుకొచ్చి ఒక్కసారి విసురుగా తన చేతిని లాక్కుంది.

భావానీశంకర్ చిన్నగా నవ్వాడు. ఆమెకు పౌరుషం పొడుచుకొచ్చింది.

"అక్కడికి నువ్వో పెద్ద హీరో ననుకోను! నువ్వు లేకపోయినా తప్పించుకునే దానిని -" అందామె రోషంగా. నిజానికామెకు అంత పెద్ద అబద్ధం చెప్పాలంటే చాలా అనీజీగా వుంది కానీ తప్పదు- రౌడీలతో.

"మీ స్టేట్ మెంటుని నేను శంకిస్తున్నాను మేడమ్-ఓ.కే. ఏదే మయినా ఇప్పుడు నేను ప్రదర్శించింది హీరోయిజం కాదు. రక్షించుకోవటం . రక్షించుకోవటం మరి హీరోయిజమనిపించుకుంటుందని నేననుకోను.'

స్మిత మాట్లాడలేదు.

మరోసారి "హు!" అని చరచరా అక్కడి నుంచి ముందుకు నడిచింది.

## 2

భవానీశంకర్ కొద్ది క్షణాల పాటు గోడకు రాసుకుని చర్మం రేగిపోయిన తన పాదానికి జేబులో వున్న చాకుపీసుతో ఫస్ట్ యిడ్ చేసుకుని మళ్ళీ నడక ప్రారంభించాడు.

ఇప్పుడతని ఆలోచనలు స్మిత మీద లేవు.

తమ మీదకు దూసుకువచ్చిన ఆ నల్లటి కారు మీద కెళ్ళినాయ్. ఆది మందు కొట్టడం వల్ల రాష్ డ్రయివింగ్ అనుకోవటానికి ఆస్కారం ఉంది గానీ తనకు వేరే అనుమానాలు కలుగుతున్నాయ్.

రాష్ డ్రయివింగ్ అయినట్లయితే అప్పుడే ఓ సైకిల్ ని తప్పించుకొచ్చి - తమను దాటాక మరో సైకిల్ ని తప్పించుకుని ఆ సందులో నుంచి మెయిన్ రోడ్ మీదకు తిరిగి ఆ ట్రాఫిక్ లో వెళ్ళటం ఎలా సాధ్యం? అది గాక తమ దగ్గర కొచ్చాక దాని వేగం ఎందుకు పెరిగింది?

హటాత్తుగా నిలబడిపోయడతను.

ఒకవేళ - ఒకవేళ- తనను గాని, స్మితను గాని కావాలని చంపటానికి ఎవరయినా ప్రయత్నించలేదు కదా!

గుండె వేగంగా కొట్టుకుందతనికి.

కాని తనను ఎవరూ చంపడానికి ఆస్కారం లేదు. తన పేర ఆస్తులు లేమీ లేవు. తనకు శత్రువులెవరూ లేరు. కాలేజీలో చదువుతున్నప్పుడూ స్టూడెంట్ యూనియన్ ఎలక్షన్స్ లో ఒకే ఒక్కడిని తను బాక్సింగ్ చేసి చావగొట్టాడు గాని వాడు దాని కోసమని ఇన్నేళ్ళ తరువాత తనను వెంబడించి ఈ సందులో ఎటాక్ చేశాడనుకోవటం మీనింగ్ లెస్.

"ఇకపోతే స్మిత."

ఆమెను చంపటానికి ఎవరికయినా ఏమయినా కారణాలున్నాయా?

"ఏమో? అది ఆమెకే తెలియాలి?

నెమ్మదిగా మళ్ళీ నడక ప్రారంభించాడతను. ఇంకెంతో దూరం లేదు శ్యామ్ ఇల్లు మరో ఫర్లాంగు.

అంతే -

అఖిల భాను ఇంటి ముందు ఆగి డోర్ బెల్ మీద ప్రెస్ చేసింది స్మిత. భాను తలుపు తెరచి ఆమెను చూసి

ఆనందంతో పొంగిపోయింది.

"ఇప్పుడే అనుకుంటున్నా - ఇంకా రాలేదేమిటా అని " - అందామె చిరినవ్వుతో.

ఇంట్లోకి అడుగు పెడుతూ ఒకసారి రోడ్ చివరికంటా చూసింది స్మిత. దూరంగా భవానీశంకర్ ఆటే వస్తూ కనిపించాడు.

ఆమె కింకా కోపానికి పట్టపగ్గాలు లేకుండా పోయినాయ్.

"హు!" అంది మరోసారి.

అభిల భాను ఆశ్చర్యపోయింది.

"ఏమిటి హు! అంటున్నావ్! కాలేజీలో ఆ నరేష్ గాడి గాంగ్ ని చూసినప్పుడల్లా ఇలాగే కోపగించుకునే దానివి కదూ" అడిగిందామె.

"అటు చూడు - ఆ రోడ్ సైడ్ రోమియో గాడు మా ఇంటి దగ్గర్నుంచి వదలకుండా వెంబడిస్తూన్నాడు నన్ను" అంది స్మిత.

అభిల భాను కిలకిల నవ్వింది.

"ఈ మాత్రానికే అంత కోపమా? హైదరాబాద్ లో ఇలాంటి పనీ పాటాలేని కుర్ర సజ్జు చాలా ఎక్కువలే లోపలకు రా! వాడే పోతాడు." అందామె.

స్మిత లోపలకు రాగానే అభిల భాను తలుపులు మూసేసింది.

"పద - ముందు టీ తాగుతూ కబుర్లు చెప్పుకుందాం - మనం కలుసుకుని రెండేళ్ళయిపోయింది కదూ?" అడిగిందామె.

"అవును - కిందటి సారి వైజాగ్ లో ఇంటర్వ్యూ కెళ్ళినప్పుడు ట్రైన్ లో కలుసుకున్నాం" అంది స్మిత.

"అవును - రెండేళ్ళంటే ఈ మధ్య కాలంలో చాలా విశేషాలు జరిగాయ్- తెలుసా?"

"అవును మొన్న మీ వారుండగా అడగడం కుదరక ఊరుకున్నాను. నువ్ అదివరకు మీ బావను పెళ్ళి చేసుకుంటానని చెప్పావ్ కదా - మరి మధ్యలో ఈ హీరో తో ఎలా వ్యవహారం కుదిరింది!" అడిగింది స్మిత.

ఇద్దరూ చెస్ కుర్చీల్లో కూర్చున్నారు.

"మా బావ వట్టి ఇడియట్ అని తెలిశాక నేనే చేసుకోనని చెప్పేశాను- " స్టవ్ మీద "టీ" తయారు చేస్తూ అందామె.

'ఇడియట్ అని ఎలా తెలిసింది?"

"ముందే పిచ్చి చేష్టలన్నీ చేయబోయాడు. నాకు వళ్ళు మండిపోయింది."

"అలాంటివి ఈ రోజుల్లో మాములే కదే." నవ్వుతూ అంది స్మిత.

"అయ్యో - చెప్పటానికి నాకు సిగ్గుగా ఉందే - మా బావ చేయబోయినవి మామూలు చేష్టలు కాదు - అసహజమైనవి చేష్టలు - " సిగ్గుపడుతూ అందామె. "ఇంతకంటే ఇంకా వివరంగా ఎలా చెప్పను.!"

"నాకేమీ అర్ధం కావటంలేదు. "- అయోమయంగా చూస్తూ అంది స్మిత.

"ఇప్పుడు నేను చెప్పినా అర్ధంకాదు లేవే - పెళ్ళయాక నీకే తెలుస్తుంది - మీ అయన చెపితే -"

ఇద్దరూ నవ్వేశారు. "ఇంతకూ నువ్వెవరినయినా వరుడిని వెతుక్కున్నావా?" అడిగింది అఖిల భాను.

సరిగ్గా అప్పుడే బెల్ మోగింది.

అఖిల భాను బయటకు వెళ్ళబోతుంటే స్మిత చటుక్కున లేచి ఆమె కడ్డు వచ్చేసింది.

"నువ్విక్కడే ఉండు ! వాడే వచ్చాడేమో అని నా కనుమానంగా ఉంది - చూసి వస్తాను - అంటూ వడివడిగా నడిచి కిటికీ కర్టెన్ కొంచెం పక్కకు లాగి చూసింది.

గేటు పక్కనే దర్జాగా నిలబడి చిరునవ్వుతో తలుపు వేపు చూస్తూ కనిపించాడు భవానీశంకర్.

స్మితకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"నేను చెప్పలేదూ! వాడే! ఎంతకు తెగించాడు. చూశావా! వెంబడించడం చాలక ఇంట్లోకి కూడా జొరబడుతున్నాడు" అంది వెనక్కు తిరిగి గొంతు తగ్గించి.

అఖిల భాను క్కూడా కోపం వచ్చింది.

"అలాగేం?" వాడి పని చెప్తా. ముందు - పెరట్లో కర్ర ఉంది తీసుకొస్తాను." అంటూ పెరట్లోకి పరుగెత్తి కర్ర పట్టుకొచ్చింది అయితే ఆ కార్యక్రమమంతా జరగడానికి ఒక నిమిషం సమయం పట్టింది.

ఇసుక వేస్తే రాలనంత జనాభా కలిగిన భారతదేశంలో ఓ నిమిషం సమయంలో ఎన్ని అద్భుతాలు జరిగినా ఎవరూ ఆశ్చర్యపోనక్కర్లేదు. అలాంటి అద్భుతాలు ఎన్ని జరగటానికయినా ఓ నిమిషం చాలా ఎక్కువని కూడా అనుకోవచ్చు.

ముఖ్యంగా భవానీశంకర్ తలుపు తట్టిన తర్వాత ఓ నిమిషం సమయంలో బయట చాలా వింతలు జరిగాయ్. తలుపు తీసేలోపుగా సిగరెట్ వెలిగించుకుని రిలాక్స్ అవుదామని అతగాడు ముచ్చట పడుతుండగా వెనుక నుంచి "స్స్- స్స్- స్స" అన్న శబ్దం వినిపించింది.

"స్- స్ స్- " అన్న శబ్దానికి మిగతా చోట్లేమో గాని హైదరాబాద్ లో చాలా రకాల అర్థాలున్నాయి.

అ శబ్దం సైకిల్ మీద వెళ్ళే వాళ్ళు చేస్తే దానర్థం "మా సైకిల్ కి బెల్ లేదు! కనుక మీ ఆరోగ్యం కాపాడుకోడానికి పక్కకు తప్పుకోండి" అని!

అదే మీరు హోటల్లో కివెళ్ళి కూర్చుని "స్-స్స-స్- " అంటే "హలో బేరేర్ - త్వరగా రా" అని అర్థం.

రోడ్డు మీద వెళ్ళేటప్పుడు ఆ శబ్దమే వెనుక నుంచి వినిపిస్తే "హలో ఎక్స్ క్యూజ్ మీ ప్లీజ్" అని అర్థం అన్నమాట.

హైదరాబాద్ చేరుకున్న కొద్దిరోజులలోనే ఇలాంటి కోడ్ లాంగ్వేజ్ లు అన్నీ క్షుణ్ణంగా నేర్చేసుకోటం వలన భవానీశంకర్ కి "స్-స్-స్" అంటూ వినిపించిన శబ్దానికి ఏ మాత్రం చలించలేదు. వెనక్కు తిరిగి చూడనూ లేదు.

"యస్ ప్లీజ్" అన్నాడు గేటు దగ్గర తచ్చట్లాడుతున్న లావుపాటి ఆయనతో.

'ఆర్ . కె. శ్యామ్ ఇల్లిదేనా" అడిగిందా ఆకారం గేటు తెరచుకుని లోపలి కొచ్చేస్తూ.

"యస్ కామ్రేడ్! ఇదే ఆర్. కె. శ్యామ్ ఇల్లు" అన్నాడు భవానీశంకర్.

"ఆర్. కె. శ్యామ్ ఇంట్లో వున్నాడా?" తిరిగి అడిగిందా ఆకారం.

"అది తెలుసుకోవటానికే నేనూ ప్రయత్నాలూ చేస్తున్నాను కామ్రేడ్ త్వరలో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది!"

"ఓ అయ్ సి అయ్ సి -" అంటూ మెట్లెక్కి తనే స్వయంగా డోర్ బెల్ మోగించాడతను. భవానీశంకర్ తను మెట్లు దిగి క్రింద నిలబడి డోర్ బెల్ మోగించే అధికారాన్ని పూర్తిగా ఆ లావుపాటి ఆకారం హస్తగతం చేశాడు.

ఈ అద్భుతాలన్నీ కేవలం ఒకే ఒక్క నిమిషంలో జరిగాయ్.

"అంతే!"

ఆ తరువాత కార్యక్రమం మాత్రం చాలా వేగంగా జరిగిపోయింది . ధడేలున తలుపులు తెరుచుకోవటం , స్మితారాణి ఓ లావుపాటి కర్ర తీసుకుని ఆ ఆకారం నెత్తిన బలంగా కొట్టటం ఆ ఆకారం "అబ్బా" అని ఆవులా అరుస్తూ ఆ మేట్ల మీదే కుప్పకూలి పోవడం క్షణంలో జరిగిపోయింది.

భవానీ శంకర్ ఆ దృశ్యాన్ని క్రైమ పిక్చరు లో క్లయిమాక్స్ సీను చూస్తున్నట్లు చూడసాగాడు.

అభిల భాను అర్ధం పర్ధం లేని అవార్డు సినిమా చూస్తున్నట్లు పీలయితే స్మితారాణి తన పెద్ద కళ్ళను మరింత పెద్దవిగా చేసి -- చూసింది హైదరాబాద్ టి.వి. నాటకం చూసినంత షాక్ తో.

హటాత్తుగా వెలసిన శిలా విగ్రహంలా నిలబడిపోయిందామె.

అనిశ్చేష్ట షాకుల పర్వం నుంచి ముందస్తుగా కోలుకుంది ఆ లావుపాటి ఆకారమే. అప్పటికప్పుడే బట్టతల మీద అర్జంటుగా కట్టిన బొప్పిని తడుముకుంటూ "అంబా" అని మరోసారి అని నెమ్మదిగా లేచి నిలబడ్డాడతను.

"మైగాడ్ కొంపమునిగింది!" అంది అఖిలభాను ఆ వ్యక్తీ వేపు భయభక్తులతో చూస్తూ.

భవానీశంకరు చప్పున ఆ వ్యక్తికీ సహాయం చేస్తూ "పదండి లోపల కుర్చుందురు గాని" అన్నాడు.

అఖిలభాను ఆ వ్యక్తికీ చేయి అందించి లోపలకు నడిపించింది. ఆ వ్యక్తీ కుర్చీలో కూలబడుతూనే మరోసారి బాధగా మూలిగి వెనక వాలి కూర్చుని తల వాల్చేశాడు .

అభిల భాను తడబడుతూ మాట్లాడసాగింది.

"సార్! ఐయామ్ వెరీ సారీ! మా ఫ్రెండ్ స్మిత పొరపాటున మీరే అతననుకుని అహహ అతనే డోర్ బెల్ అనుకుని ఆహా అదికాదు. డోర్ బెల్ మీరనుకుని ........" అంటూ తడబడి పోతుంటే భవానీశంకరు చప్పున అందుకున్నాడు.

వదినమ్మా! ఈ కామ్రేడ్ కొంచెం షాక్ లోకి వెళ్ళినట్లు వున్నాడు వివరాలన్నీ వచ్చే సంచికలో ఆయనకి చెప్పవచ్చులే - " అన్నాడు ధైర్యం చెపుతూ.

అఖిల భానుకి భయం బెరకూ పోలేదు.

"అయ్యో ! ఇప్పుడేమిటి చేయటం? ఈయనేవరనుకుంటున్నావు? శ్యామ్ పనిచేసే ఆఫీసులో సూపర్నంటుగారూ! ఈ ఉద్యోగం పర్మినెంట్ అయేలా రికమెండ్ చేయించడానికి కని ఆయనను భోజనానికి పిలిచాడు శ్యామ్" అందామె పాలిపోయిన మొఖంతో.

"డోంట్ వర్రీ సిస్టరిన్ లా! ఇంటికి వచ్చే అతిధుల నెత్తిమీద అమ్మాయిలు పోల్ వాల్టు ప్రాక్టీస్ చేయడాన్ని నేను హర్షించను గానీ పొరపాట్లు అనేవి హిట్లర్ కైనా సహజం! అంచేత ఈ కామ్రేడ్ వ్యవహారం నేను చూసుకుంటాను. మీరేం వర్రీ అవకుండా ముందు ఏ క్లాస్ కాఫీ చేసుకురండి. రెండు కప్పులు తెస్తే బెటర్" అన్నాడు భవానీశంకరు.

స్మితా రాణీ అప్పుడే ఆ షాక్ నుంచి తేరుకుంది. అయితే పరిస్థితులేమీ ఆమెకు అర్ధం కావటం లేదు. తను కర్రతో కొట్టిన దెబ్బ భవానీశంకరుకీ కాకుండా ఆ లావుపాటి వ్యక్తీ కెలా తగిలింది? భవానీ శంకరు స్థానంలో ఆ లావుపాటి వ్యక్తీ ఎలా వచ్చాడు? భవానీ శంకరు అఖిల భాను ని "వదినమ్మా" అని ఎలా పిలుస్తున్నాడు? వీటన్నిటి

సంగతి అలా వుంచితే ఇప్పుడే ఆఫీస్ సూపర్నెంటుగారు శ్యామ్ ఉద్యోగాన్ని పీకీపారేయడు గదా తన వాళ్ళ పాపం అభిలభాను వాళ్ళకి హాని జరుగుతుందేమో! ఎంత తొందరపాటు పని చేసింది తను? ఈ గొడవ అంతటికి కారణమైన భవానీ శంకరు వేపు కోపంగా చూసిందామె. భవానీశంకరు ఆమె వేపు చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఇతరుల నెత్తిమీద కర్రతో బాదటం మీరు ప్రాక్టీస్ చేస్తున్న అద్భుతమైన స్పోర్ట్స్ అన్న విషయం అర్థమయింది మేడమ్! కానీ మీ స్పోర్ట్స్ బాదితులకు మంచినీళ్ళు అందివ్వటం కూడా మీ బాధ్యత అని గైడ్ లైన్స్ లో వుంది."

స్మితా రాణి పరుగులాంటి నడకతో లోపలికెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి భవానీ శంకరుకి అందించింది.

ఆ అకారంకు మంచినీళ్ళు గడగడ తాగాక స్థిమితం చిక్కినట్లనిపించింది. "నేనెక్కడున్నాను?" అన్నాడు చుట్టూ చూస్తూ.

"ఆర్. కె. శ్యామ్ ఇంట్లో కామ్రేడ్ . ఇంకోసారి ట్రై చేయండి మాట సరిగ్గా వచ్చేస్తుంది" అన్నాడు శంకరు.

అప్పుడే అఖిల వడివడిగా ట్రేలో కాఫీ తీసుకొచ్చింది.

"తాగండి సార్! అయన మార్కెట్ కెళ్ళారు? ఈపాటికి వచ్చేస్తూ వుండాలి" అంది కంగారుగా.

అతను కాఫీ ముట్టుకోలేదు.

"నన్నెవరు కొట్టింది? అడిగాడు నెత్తిమీద బొప్పి తడుముకుంటూ అఖిలభాను పూర్తిగా భయపడిపోయింది.

"పొరపాటున మా స్మిత" నిస్సహాయంగా భవానిశంకరు వేపు చూస్తూ అందామె.

భవానీ శంకరు చప్పున కల్పించుకున్నాడు.

'అదా ---అదీ ------ఆహ్------మీరు మన్నిస్తే --------మిస్ స్మిత ---------మా మరదలు -------అదిగో ఆ పిల్ల"

స్మిత ఉలిక్కిపడి కోపంగా చూసిందతని వేపు.

భవానీశంకరు ఆమె వేపు చూసి కన్నుకొట్టాడు.

"కామ్రేడ్ జగన్నాథం! -----ఈ బావ - మరదళ్ళ సరసాల గురించి మీకు తెలీందేముంది? ఆ? వాడ్డూ యూ సే? ఒకరి కళ్ళల్లో ఒకరు కారం కొట్టుకోవడం, కూరలు ఉప్పుకళం చేసి వండటం, కుర్చీ కాళ్ళు తీసెయ్యటం కోటు జేబులో తేళ్ళూ జెర్రులు వదలటం - ఇలా ఎన్ని రకాలని? అందులో జస్ట్ ఇది కూడా ఒకటి కామ్రేడ్! స్మిత మరీ అల్లరి వ్యవహారం కావటం వల్ల ఈ సరసాలు మరింత ప్రమాదకర ధోరణిలో సాగుతుంటాయ్."

జగన్నాధానికి కోపం మరింత ఎక్కువయింది. స్మిత వేపు మండిపడుతూ చూశాడు.

సరసాలు మీ ఇద్దరి మధ్యా వుండాలి గానీ ఇంటికొచ్చిన గెస్ట్ లతో ఏమిటి?"

"అక్కడే దెబ్బతిన్నారు కామ్రెడ్. మీరు నా ఫ్రెండనుకుని - బైదిబై మీకు చెప్పటం మర్చిపోయాను. మిస్ స్మిత కు నా ఫ్రెండ్ తో కూడా సరసాలడటం సరదా-"

స్మిత కోపం అణుచుకోలేక అభిలభాను వేపు చూసింది.

అభిలభాను ఆమెను శాంతంగా వుండమన్నట్లు సైగలు చేసింది.

"దటీజ్ వెరీ బాడ్" అన్నాడు జగన్నాథం తన తలమీద ఏర్పడ్డ బొప్పిని తడుముకుంటూ.

"ఎగ్జాక్ట్ లీ కామ్రేడ్! నేనూ అదే చెపుతుంటాను స్మితకు -----మా ఫ్రెండ్ చాలామందిని ముప్పతిప్పలు పెట్టింది. డూ యూ నో - మనోహర్ మెహతా అనే మా ఫ్రెండ్ ఇలాగే పాపం నాకోసం ఇంటికొస్తే వాడి కాఫీలో స్లీపింగ్ పిల్స్ కలిపేసింది - వాడు పాపం ఆర్రోజులు హాస్పిటల్లో వుండటమే కాకుండా ఆత్మహత్యా నేరం మీద కోర్టు చుట్టూ

తిరగాల్సి వచ్చింది ......."

జగన్నాథం ఈసారి స్మిత వేపు భయంగా చూశాడు . స్మితకు సహనం నశించిపోతోంది.

"నన్నడిగితే అది సరసాల స్టేజీ దాటిపోయిందని నా అనుమానం" అన్నాడతను.

"యస్ కామ్రేడ్ - ఆరోజు నన్ను క్రికెట్ బాల్ తో నెత్తిమీద కొట్టినప్పుడు నాకు కుట్లు వేసిన డాక్టర్లు కూడా అదే అన్నారు -"

"మైగాడ్ - క్రికెట్ బాల్ తో కొట్టిందా?"

"అవును! డైనింగ్ టేబుల్ కింద పదహారు కప్పల్ని ఓ అట్టపెట్టెలో పెట్టి భోజనం చేసేటప్పుడు నా మీదకు వదిలిన తర్వాత రోజే క్రికెట్ బాల్ ఉపయోగించింది కామ్రేడ్."

"దిసీజ్ నథింగ్- " అన్నాడు జగన్నాథం. "బహుశా సైక్రియాటిస్ట్ కి చూపించడం మంచిదేమోనని నా అభిప్రాయం -"

"సెంట్ పర్సెంట్ కామ్రేడ్ - నా అభిప్రాయం కూడా అదే -"

స్మిత ఇక సహించలేకపోయింది.

"ఏయ్ మిస్టర్! స్టాప్ దిస్ నాన్సెన్స్ -" అంది ఉగ్రురాలౌతూ.

అభిలభాను చప్పున భవానిశంకరుని అందుకుంది.

"స్మితా - మళ్ళీ అందరి ఎదురుగా గొడవపడుతున్నారా? వెరీ బాడ్. పద లోపలకు- " అంది ఆమె చేయి పట్టుకుని లోపలకు తీసుకేళుతూ.

"మొత్తంమీద చాలా మంచి పిల్ల కామ్రేడ్ - ఏదో అప్పుడప్పుడు కొంచెం అతిగా ప్రవర్తిమ్తుంది గానీ - ఐ లవ్ హర్-"

జగన్నాథం అర్ధమైనట్లు తల పంకించాడు.

"ఆఫ్ కోర్స్ - "లవ్" అంటే అంతే - పిచ్చికి లవ్ కీ తేడా ఏమీ లేదు."

లోపల స్మిత అభిలభాను మీద మండిపడుతుంది.

"ఏమిటే ఇది - అతనెవరో అలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే నువ్వూ వత్తాసు పలుకుతావెం?" నిష్టూరంగా అంది.

"అయ్యో! నీకు చెప్పాను కదే. అయన సహాయం చేస్తే మావారి ఉద్యోగం ఊడిపోకుండా నిలబడుతుంది. పాపం భవానిశంకరు ఏవేవో కల్పించి చెప్పటం వల్ల ఆ ముసలాడు కొంచెం తగ్గిపోయే ఛాన్స్ వుంది. కాసేపు నువ్వేమీ మాట్లాడకుండా ఊరుకో చాలు."

స్మితకి ఏమనాలో తోచలేదు.

"నీకు తెలీదే - ఆ భవానీ శంకరు మరీ ఆకతాయి వ్యవహారంలా కనిపిస్తున్నాడు. కావాలని నాతో చనువు కోసం ప్రయత్నిస్తున్నాడని నా అనుమానం-"

"ఛ! అతనలాంటి వాడు కాదె! మా వారికి బెస్టు ఫ్రెండ్ - నాకు చాలా మంచి చనువుందతనితో - నేనూ, మా వారూ అంటే ప్రాణం ఇచ్చేస్తాడనుకో!"

"ఏం చేస్తుంటాడతను?"

"ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు ---------ఫోటో గ్రాఫర్ గా ఓ దినపత్రికలో పనిచేసేవాడు అదివరకు. ఆ ఉద్యోగం కాస్తా పోయిందీ మధ్య"

"ఎందుకని?"

"ఓ పత్రిక ఓనర్ వద్దన్నా కూడా వినకుండా వాళ్ళ బంధువుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న చైల్డ్ లేబర్ ఫోటోలు తీశాడట. దాంతో వళ్ళు మండి తీసిపారేశాడు.

వీళ్ళ సంభాషణ ఇలా సాగుతుండగా బయట సైకిల్ బెల్ వినిపించింది. శ్యామ్ చిరునవ్వుతో ఓ సంచీ తీసుకుని లోపలికొచ్చాడు. లోపల బట్టతల ఆకారాన్ని చూడగానే సంబరపడిపోయాడు.

"హల్లో సార్ -- వచ్చేశారా - ఇప్పుడే అనుకుంటున్నాను - మా యిల్లు కనుక్కోగలిగారో లేదో అని! ఆ రోజు మొదటిసారి వచ్చినప్పుడు పాపం చీకట్లో వచ్చారు కదా." అన్నాడు జగన్నాధంతో.

"ఏం ఫరవాలేదు. చాలా ఈజీగానే కనుక్కోగాలిగాను - కానీ ఇలా గేస్తుల మీదకు మానసకస్థితి సరిగా లేని వాళ్ళను వదలడం నాకేం నచ్చలేదు" అన్నాడు జగన్నాధం నిష్టూరంగా.

శ్యామ్ కేమి అర్ధం కాలేదు.

"మానసిక స్థితి సరిగ్గా లేని వాళ్ళా?"

"అవును - నేను మిస్టర్ భవానీ శంకర్ మరదలు గురించి మాట్లాడుతున్నాను."

"భవానీ శంకర్ మరదలా?"

అప్పుడే ఆ గదిలోకి వచ్చిన అఖిలభాను శ్యామ్ కి కనుసైగ చేసింది.

"అవును శ్యామ్ - మన భవానీ శంకర్ మరదలు స్మితారాణి -"

శ్యామ్ కి సంగతేమిటో అర్ధం కాక స్మితారాణి వేపు చూశాడు.

స్మితారాణి చిన్నగా నవ్వటానికి ప్రయత్నించి విఫలురాలయింది. అతను చప్పున అరడజను సైగలు చేసేశాడు.

"ఓ - స్మిత - ఆ- అవును- కొంచెం పాపం - ఆమె మానసిక పరిస్థితి - కొంచెం - " అన్నాడు సర్దుకుంటూ.

జగన్నాధం కోపంగా చూశాడు.

"కొంచెమేమిటి బాగానే ముదిరింది. ఎంత ఎక్కువ లేకపోతే ఇంటికొచ్చిన అతిధుల నెత్తిమీద కొడతారు!"

"అదీ లావుపాటీ కర్రతో - " అందించాడు భవానీ శంకర్.

"అయాం సారీ జగన్నాధం గారూ! అయాం వెరీ వెరీ సారీ - మీ కసలు ముందే హెచ్చరిక చేయకపోవడం నా తప్పు - " అన్నాడు జగన్నాధం చేతులు పట్టుకుంటూ.

"దట్స్ ఒకే. " అన్నాడు జగన్నాధం.

"అందరూ రండి! లంచ్ సర్వ్ చేసేస్తాను -" అంది అఖిలభాను.

అందరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. స్మితారాణి వేపు వుండుండి భయంగా చూస్తున్నాడు జగన్నాధం.

కూరలన్నీ ముందు రుచి చూసి మరీ వేసుకుంటున్నాడు. టేబుల్ కింద కప్పలేమయినా ఉన్నాయేమోనని వెతుకుతున్నాడు. అనుమానం వచ్చినప్పుడల్లా!

జగన్నాధం వెళ్ళిపోయాక భవానీశంకర్ మీద విరుచుకుపడింది స్మిత.

"మీ అతి తెలివి నా దగ్గర చూపించకండి!" అంది కోపంగా.

"మీరు అపార్ధం చేసుకుంటున్నారు కామ్రేడ్ ...........ఆ పరిస్థితుల్లో అంతకంటే మంచి ఉపాయం ఇంకొకటే ముందో ఎవరయినా సరే చెప్పండి. చూద్దాం!"

"ఆఫ్ కోర్స్ యూ ఆర్ కరెక్టు." అన్నాడు శ్యామ్.

"ఆఫ్ కోర్స్" అంది అఖిలభాను.

"ఏ ఉపాయము లేకపోతే నేనే ఆయనకు క్షమార్పణ చెప్పుకునే దానిని -" రోషంగా అంది స్మితా రాణి.

"దాంతో మా ఆర్.కె. శ్యామ్ ఉద్యోగం గోవిందా - గోవిందా " అన్నాడు భవానీశంకర్ -స్మిత మరింత ఉలికిపడిపోయింది.

"ఎనీవే - అయాం ఎక్స్ ట్రీంలీ సారీ! మిస్ స్మితా!" అన్నాడతను.

"ఇంక నేను వెళతానే! " అంది స్మితా రాణి అభిలభానుతో.

"నేను వెళతాను" అన్నాడు భవానీ శంకర్.

స్మిత అనుమానంగా అతనివేపు చూసింది. అతగాడు మళ్ళీ తనకు బాడీ గార్డుగా రాబోతున్నాడని అర్ధమై పోయిందామెకి.

ఇద్దరూ బయటికొచ్చారు.

"థాంక్స్ ఫర్ యువర్ గ్రాండ్ హాస్పిటాలిటీ వదినమ్మా" అన్నాడు భవానీశంకర్.

"మీ ఇద్దరి ఇళ్ళూ ఒకేచోటా కదా , వై డోంట్ యూ గో బై అటో అన్నాడు శ్యామ్.

బెస్ట్ అయిడియా , మీరేమంటారు మిస్ స్మితా - ---ఆఫ్ కోర్స్ సగం చార్జీ నేను పెట్టుకుంటాను."

"అవసరం లేదు .....నేను బస్ లో వెళతాను" అంది స్మిత.

"ఓ.కే. - మిస్ - మీ ఇష్టప్రకారమే వెళదాం."

ఇద్దరూ రోడ్ మీద కొచ్చారు. స్మిత ఎంత వేగంగా నడిచినా భవానీశంకర్ కి దూరంగా వెళ్ళటం సాధ్యం కావటం లేదు. ఎప్పుడు చూసినా అతను తనకు ఓ నాలుగడుగుల దూరంలోనే ఉంటున్నాడు.

ఇద్దరూ బస్ స్టాప్ దగ్గరకొచ్చి నిలబడ్డారు.

బస్ లు మాములు ప్రకారం స్టాప్ లో ఆగకుండా వెళ్ళిపోతున్నాయ్.

"పోనీ అటో పుల్ ఫేర్ నేనే భరిస్తే ఆటోలో వస్తారా మిస్?" అడిగాడు భవానీ శంకర్.

"దయచేసి నాతో మాట్లాడకండి" అందామె కోపం అణుచుకుంటూ.

"ఓ.కే. మిస్ - మాట్లాడననీ హామీ ఇస్తున్నాను! నాకూ సైలెన్స్ అంటే చాలా ఇష్టం! టెన్త్ క్లాసు చదివేటప్పుడు ఓ రోజు అరగంటసేపు సైలెంట్ గా గడిపాను."

"బహుశా ఆ అరగంటా ఏదో జ్వరం వచ్చి స్పృహ లేని స్థితిలో ఉండి ఉంటారు" కసిగా అందామె.

"ఎగ్జాక్ట్ లీ మిస్ - మీరు భలే కనిపెడతారే - బైదిబై మీకూ ఫోటోగ్రఫీ హాబీనా."

"మీకనవసరం-"

"నాకవసరం మిస్ - నేనూ ఫోటోగ్రాఫర్నే కదా - ఇలా ఇద్దరూ ఫోటో గ్రాఫర్స్ అయితే సంసారం సాఫీగా

సాగుతుందని మా ఫ్రెండ్ సింహాచలం అంటుండేవాడు........."

"డోంటాక్ నాన్సెన్స్"

"నేను ఊరికే చెప్పాను మేడమ్ అంతే. అది ఫాక్ట్ కావాలనిలేదు."

3

అప్పుడే బస్ వచ్చి ఆగింది.

ఆమె వెనుకే బస్ ఎక్కేశాడు భవానీశంకర్.

అదే కండక్టర్ చిరునవ్వుతో వచ్చాడతని దగ్గరకు.

భవానీశంకర్ పదిరూపాయలు నోటు తీసి ఇచ్చాదతనికి.

కండక్టర్ చిరాకు పడ్డాడు.

"చిల్లర లేద్సార్! చిల్లర ఇవ్వండి. అందరూ పదులు, అయిదులూ ఇస్తే ఎలా? నా దగ్గరేం కాయిన్స్ తయారుచేసే ఫ్యాక్టరీ ఉందనుకున్నారా?"

"లేకపోతే త్వరగా ఓపెన్ చెయ్ బ్రదర్! సింగిల్ విండో సిస్టం లో రెండు నెలల్లో గవర్నమెంట్ లోన్ కూడా దొరుకుతుంది నీకు."

"సారీ బాస్! నో చేంజ్? ఇందాక నీ ఎదురుగుండానే కదా ఓ అందమైన అమ్మాయికి సహాయం చేయడం కోసం నా దగ్గరున్న చిల్లరనంతా త్యాగం చేశాను."

కండక్టర్ అతని మీద జాలిపడ్డాడు.

"అవున్సార్! పాపం! చాలా త్యాగం చేశారు! నైన్ టీన్ ఎయిటీసిక్స్ లో కూడా నేను దిల్ షుక్ నగర్ డిపోలో పనిచేస్తున్నప్పుడు, ఒక స్టూడెంట్ అచ్చం మీలానే త్యాగం చేశాడు ఓ అమ్మాయి కోసం!"

"అలాగా బ్రదర్! చరిత్రలో అక్కడక్కడా నాలాంటి త్యాగమూర్తులు కనబడుతూనే ఉంటారని మా టి.జె. యమ్ . బాబు చెప్పినమాట నిజమేనన్నమాట.

"అవున్సార్! చాలా నిజం - ఇప్పుడు మీరు చిల్లర కావాలంటే ఆమె నడగండి ! ఆ అమ్మాయి కోసమేగా ఇందాక మీరు అంత త్యాగం చేసిందీ?" సలహా ఇచ్చాడతను.

భవానీశంకర్ కాసలహ అర్ధవంతంగా తోచింది.

"హలో మిస్" అన్నాడు చిరునవ్వుతో!

"హు!" అంది స్మితారాణి తల తిప్పుకుంటూ.

"నా టికెట్ మీరు దయతో తీసుకుంటే ......"

"హు!" అందామె ఇంకా కోపంగా.

"మనీ ఓ రూపాయి చిల్లర అప్పివ్వండి, బస్సు దిగగానే ఎక్కడో చోట చిల్లర తీసుకొచ్చి మీ రుణం తీర్చేసుకుంటాను."

"నో! నేనివ్వను" ఖచ్చితంగా చెప్పేసిందామె.

భవానీశంకర్ ఆశ్చర్యంగా చూశాడామె వేపు.

"ఇది అన్యాయం మిస్! మనం ఇంత దగ్గరవారమయ్యుండి ఇలా ......."

ఆమె కోపంగా అతనివేపు తిరిగింది.

"దగ్గరవారమేమిటి?" అంది మండిపడుతూ.

"అంటే అదే మిస్! రెండు రకాలుగా మనం దగ్గరి వాళ్ళం, మొదటిదేమిటంటే బస్సులో మనం చాలా దగ్గరగా నిలబడ్డాం గనుక దగ్గరవాళ్ళం రెండోదేమిటంటే నేను ఆర్.కె . శ్యామ్ బెస్టు ఫ్రెండ్ ని! అలాగే మీరు మిసెస్ అఖిలభానుకి బెస్టు ఫ్రెండు! మరి వాళ్ళిద్దరూ బెస్టు భార్య భర్తలు కనుక మనం కూడా."

కండక్టర్ తో పాటు మరికొంతమంది ప్రయాణికులు కూడా భవానీ శంకర్ కి శ్రోతలుగా మారారని తెలిసేసరికి స్మితారాణికి కోపం ముంచుకొచ్చేసింది.

"డోంటాక్ రబ్బిష్" అంది అతని మాట పూర్తి కానీకుండా.

"పోనీ ఇందాక మీ బస్సు టికెట్ నేను తీసుకున్నాను కదా మిస్ - ఇప్పుడు నా టికెట్ మీరు తీసుకుంటే ......"

"మిమ్మల్ని తీసుకోమని నేనేం అడగలేదు ......." రోషంగా అంది ఆమె.

"ఆఫ్ కోర్స్ అడగలేదు గానీ అలా ప్రాణాలకు రిస్కు తీసుకుని సహాయాలు చేస్తుంటే ఏదొక రోజు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు ప్రెసిడెంట్ గాలంట్రీ ఎవార్డు రిపబ్లిక్ పెరేడ్ లో అందుకోవచ్చానీ ఆశ! సరే మీరిప్పుడు వప్పుకోవడం లేదు కాబట్టి."

కండక్టర్ బెల్ కొట్టాడు . బస్ ఆగిపోయింది.

"కమాన్ మిస్టర్- బస్సు దిగు" అన్నాడు కండక్టరు.

భవానీశంకర్ స్మితా రాణి వేపు చూశాడు.

"మీ స్వగ్రామం రాయలసీమలో ఉంటుందని నాకు పూర్తి నమ్మకం కలిగింది మిస్. మీ హృదయం చూస్తే ఇట్టే తెలిసిపోతుంది సంగతి. నాపరాయి - కడపరాయి - " అనేసి బస్సు దిగాడతను. బస్సు బయలుదేరింది మళ్ళీ.

"ఇడియట్" కోపం అణుచుకుంటూ అందామె. అయితే ఆమె సంతృప్తి ఏంతోసేపు నిలువలేదు. బస్సు వెనుకే వస్తోన్న ఆటోను చూడగానే మళ్ళీ కోపం ముంచుకొచ్చింది. ఆటోలో అతను చిరునవ్వు నవ్వుతూ కనిపించాడు.

బస్సు దిగేసరికి బస్సు స్టాప్ పక్కనే రెడీగా నిలబడి వున్నడతను. అతని వేపు కోపంగా చూసి తనింటికి బయలుదేరిందామే. కొద్దిదూరం నడిచిందో లేదో అతను మళ్ళీ తన పక్కనే నడవటం గమనించింది. ఈ పరిస్థితిలో అతని చెంప చెళ్ళుమనిపించటం తప్ప మరో గత్యంతరం లేదని అర్ధమయిందామెకి. వెంటనే అందుకు సన్నాహాలు కూడా ప్రారంభించింది. అతని వేపు చిరునవ్వుతో చూస్తూ రోడ్ ప్రక్కనే నిలబడి పోయింది.

"ఏయ్ మిస్టర్! ఓ సారిలా రండి - మీ కోమాట చెప్పాలి!" అంది అద్భుతమైన నటన ప్రదర్శిస్తూ.

అతడు కాలరు సర్దుకుని ఉత్సాహంతో ఆమె సమీపంగా నడిచాడు.

"యస్ కామ్రేడ్. ఏమిటామాట!" అన్నాడు ఆనందంగా.

ఆమె ఇంక ఆలస్యం చేయకుండా చేయి ఎత్తి అతని చెంప మీద విసురుగా కొట్టబోయింది.

అప్పుడు గమనించాడతను. అతివేగంగా తమ మీదకొస్తున్న మరో కారు. అతి సమీపంగా వచ్చేసిందప్పటికే.

ఒక్కసారిగా స్మితతో పాటు రోడ్ పక్కనే వున్న గోతిలోకి దొర్లిపోయాడతను. కారు ఫుట్ పాత్ ని కొట్టుకుని కంట్రోల్ తప్పి ఎలక్ట్రిక్ పోల్ ని తగిలి , అక్కడికి ఆగక బస్సు స్టాప్ లో దూరి ఆగిపోయింది.

స్మిత కొద్ది క్షణాల వరకూ నిశ్చేష్టురాలయి కూర్చుండి పోయిందా గోతిలో. భవానీశంకర్ మాత్రం స్ప్రింగ్ లా లేచి

నిలబడి పరుగుతో కారు దగ్గరకు చేరుకున్నాడు.

అప్పుడే కార్లో నుంచి అతి కష్టం మీద డోర్ తీసుకుని దిగుతున్నాడోకతను. అతని కాలికి దెబ్బ తగిలింది. అతని కాలర్ పట్టుకున్నాడు భవానీశంకర్!

"నీ ఫీట్స్ చాలా అద్భుతంగా ఉన్నాయ్ కామ్రేడ్! గ్రాండ్ ఫ్రిక్స్ ఎవార్డు కొట్టే ఉంటావని నాకు అనుమానంగా వుంది."

"సారీ! డ్రయివింగ్ నేర్చుకుంటున్నాను , అందుకని- "

అతని ముఖం మీద భవానీశంకర్ ఉక్కు పిడికిలి చాలా బలంగా తాకింది. అతను వెనుకే ఉన్న కారు మీద విసురుగా పడి జారి ఫుట్ పాత్ మీద పడిపోయాడు మళ్ళీ.

వెంటనే అతనిని తన చేయి అందించి లేపి నిలబెట్టాడు భవానీ శంకర్.

"నీ ఎక్స్ ప్లనేషన్ ని చాలా చక్కగా అల్లావ్ కామ్రేడ్! ఇంకొంచెం గట్టిగా ప్రయత్నిస్తే "బెస్టు తెలుగు ఫిక్షన్ర్ రైటర్ ఆఫ్ ది ఇయర్" బహుమతిని సునాయాసంగా గెలుచుకోవచ్చు!

ఆ ప్రయత్నాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసి నిజం చెప్పు కామ్రేడ్ లేకపోతే మరోసారి ఫుట్ పాత్ కి పాదాభివందనం చేయాల్సి వస్తుంది అన్నాడు మరోసారి పిడికిలి బిగిస్తూ.

అతను చేతులు జోడించాడు. "నిజంగానే చెప్తున్నాను. కొత్తగా డ్రయివింగ్ నేర్చుకోవడం వల్ల స్టీరింగ్ కంట్రోల్ తప్పి."

ఈసారి మరింత గట్టిగా తగిలిందతనికి దెబ్బ. కిందపడి లేచి కూర్చునేసరికి నోటి నుంచి రక్తం కారుతోంది.

అప్పుడే పోలీసు వాన్ సైరన్ శబ్దం చేసుకుంటూ వచ్చి ఆగింది అక్కడ.

అందులో నుంచి ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ దిగివచ్చారు. ఆ వ్యక్తి వాళ్ళ దగ్గరకు పరిగెత్తాడు ఒగరుస్తూ.

"స్టీరింగ్ కంట్రోలు తప్పింది, దెబ్బలు తగిలి నేను బాధపతుంటే - వీడెవడో నన్ను కొడుకున్నాడు:" అన్నాడు భవానీశంకర్ ని చూపుతూ.

కానిస్టేబుల్ భవానీశంకర్ దగ్గరకొచ్చాడు.

"నీ పేరు" అన్నాడు నోటు పుస్తకం , పెన్ను తీసుకుని.

"కామ్రేడ్ డ్రయివర్" చిరున్నవ్వుతో సమాధానం చెప్పాడు. భవానీ శంకర్.

రాసుకోబోయి టక్కున ఆగిపోయాడు కానిస్టేబుల్

"కామ్రేడ్ డ్రయివర్ ఏమిటి? ఇలాంటి పేర్లు నేనెక్కడా వినలేదే?"

"వినలేదా కొంచెం ఆలోచించు కామ్రేడ్! మెదడుకి పదును పెట్టండి. లేక మీ మెదడుకి మేత పెట్టండి! శీర్షికలో చురుకుగా పాల్గొనండి! రాజేష్ పైలటు అనే కేంద్రమంత్రిగారూ లేరూ. అయన మనదేశంలో "పైలటు" వుండగా లేనిది నా పేరులో "డ్రైయివర్" ఉంటే తప్పొచ్చిందా?"

కానిస్టేబుల్ ఇంకా మాట్లాడలేదు.

"నీ బాబు పేరు."

"రమేష్ ట్రాక్టర్!"

కానిస్టేబుల్ మరోసారి అనుమానంగా చూసి పేరు రాసుకున్నాడు.

"నీ తాత పేరు చెప్పు......"

"భీమేష్ బాక్సర్."

"నీ అడ్రసెంటి?"

"కేరాఫ్ ఉమేష్ సింగర్ - శ్మశానం పక్కన - రోడ్ నెంబర్ 1183 బై 1183 సికింద్రాబాద్."

"సాయంత్రం స్టేషనుకి రావాలి -- లేకపోతే అరెస్టు చెయ్యాల్సి వస్తుంది.

"ఓ.కే. కామ్రేడ్! తప్పకుండా వస్తాను. మనం ప్రస్తుత పరిస్థితుల్లో "ఫ్రీ అండ్ ఫ్రాంక్" డిస్కషన్స్ చేసుకునే అవకాశం చాలా అవసరం."

భవానిశంకర్ వెనక్కు తిరిగే సరికి స్మితారాణి వెళ్ళిపోతూ కనిపించింది.

"హలో మిస్ ఆగండి - వన్ మినిట్" అంటూ ఆమె వెంట పరుగెత్తాడతను.

ఆమె మరింత వేగంగా నడిచి సందులోకి తిరిగి రెండో యింట్లోకి ప్రవేశించింది.

భవానీశంకర్ కూడా ఆమె వెనకే యింట్లోకి నడుస్తుంటే తులసి ఎదురుగా వచ్చింది.

భవానీశంకర్ ఆశ్చర్యంతోఉక్కిరిబిక్కిరయ్యాడు. అది తులసి ఇల్లు! మరి ఈమె ఆ ఇంట్లో కెందుకేళ్తుంతుంది?

"గుడ్ మార్నింగ్ అంకుల్" అంది తులసి చిరునవ్వుతో.

తులసి వరస చూసేసరికి స్మితారాణికి కోపం ముంచుకొచ్చేసింది.

"ఏయ్! పద లోపలకు. " అంటూ ఆమెను వెనక్కు లాగి తలుపులు వేయబోయింది. భవానీశంకర్ అందుకు అవకాశం ఇవ్వకుండా గడపలో కుర్చుండిపోయాడు తులసి ముందు.

"హాయి హాయి హాయి మైడియర్ లిటిల్ బ్యూటీ ఫుల్ స్టూడెంట్ హౌ ఆర్ యూ?"

"ఫైన్ అంకుల్"

"నేను చెప్పిన ఇంగ్లీషు పొయిట్రీ వచ్చేసిందా డియర్?"

"ఓ! అప్పజెప్పనాంకుల్!"

"వెల్ కం డియర్!"

తులసి అప్పజేప్పటానికి నోరు తెరిచేంతలో రాణి టక్కున ఆమె నోటికి తన చేయి అడ్డం పెట్టి నోరు మూసేసింది. అతనే తులసికి ట్యూషన్ చెప్పుతోన్న వ్యక్తీ అని తెలిసేసరికి ఆమె కోపం మరింత పెరిగిపోయింది.

"ఇప్పుడేమీ అక్కరలేదు......." అంది కోపం అణుచుకుంటూ."

తులసికి ఆమె కోపం అర్ధం కాక సైలెంటయిపోయింది.

"సో - మా తులసి టీచర్ మీరేనన్నమాట" అంది తల పంకిస్తూ.

"సెంట్ పర్సెంట్ కరెక్టు! అందుకే తులసి ఈసారి టరమ్ ఎగ్జామ్స్ లో క్లాస్ ఫస్టు వచ్చింది."

గర్వంగా చెప్పాడు భవానీ శంకర్.

"కాని మీరు ట్యూషన్ యివ్వకుండా ఉన్నట్లయితే స్కూలు ఫస్టు వచ్చేది" హేళనగా అంది.

"ఆఫ్ కోర్స్! స్కూల్ ఫస్టు వచ్చేదేమో గాని - అది వితవుట్ జనరల్ నాలెడ్జి కామ్రేడ్! కేవలం స్కూలు పుస్తకాలే చదువుతూ, స్కూల్ ఫస్టుగా వస్తూ జనరల్ నాలడ్జిలేకపోవటం వాళ్ళ మీరెంత యిబ్బంది పడుతున్నారు చూడండి పాపం! నాలాంటి గ్రేట్ టాలెంటెడ్ ఫెలో తో ఫ్రెండ్ షిప్ చేసుకోవాలని మనసులో వున్నా, ఈ అద్భుతఅవకాశాన్ని వినియోగించుకోలేకపోతున్నారు."

"మీకంటే ఎక్కువ జనరల్ నాలెడ్జి ఉంది మాకు" రోషంగా అందామె!

"నో నో! అయ్ కాంట్ బిలీవ్ డియర్! ఎనీవే ఓ చిన్న జనరల్ నాలెడ్జి టెస్టు పెడతాను. మా స్టూడెంట్ గెలుస్తుందో , మీరు గెలుస్తారో చూద్దాం."

"ఏం అక్కర్లేదు" - అంటూ తులసి చేయి పట్టుకుని లోపలకు లాక్కెళ్ళబోయింది.

భవనీశంకర్ చటుక్కున తులసి రెండో చెయ్యి పట్టుకుని " ఆపేశాడు.

"కమాన్ మైడియర్ స్టూడెంట్. జనరల్ నాలెడ్జి కాంపీటీషన్లో కొశ్చన్ నంబర్ వన్"

తులసి ఉత్సాహంగా ముందుకొచ్చింది స్మిత చేయి విసురుగా పదిలించుకుని.

"అడుగంకుల్"

"పాత దేవదాసు సినిమాలోని ఘంటశాల పాట ఒకటి ఈ మధ్య మరో తెలుగు సినిమాలో కాపీ కొట్టారు. ఆ పాటేమిటో ఆ సినిమా పేరేమిటో చెప్పుకో చూద్దాం!"

"ఓ! అదా! వెరీ ఈజీ అంకుల్! 'సంసారం ఓ చదరంగం ' స్నిమా అంకుల్ అది! పాటేమో "జగమే మాయ, బ్రతుకే మాయ!" గొల్లపూడి జానకి కాంబినేషన్ తో పాడించారు" టకటక చెప్పేసిందామె.

భవానీ శంకర్ అనందం పట్టలేక చప్పట్లు కొట్టాడు.

"ఒండర్ ఫుల్ మైడియర్ చైల్డు! ఇప్పుడు సెకెండ్ రౌండ్ ప్రశ్న కుమారి స్మితారాణి చెప్తారు."

"నేను చెప్ప........."

"దంపతులం - అది దంపతులం" అనే పాత ఆదిదంపతులు సినిమాలో నాగేశ్వరరావ్, జయసుధలు పాడారు కదా! అదే పాట నూతన్ ప్రసాద్, విజయల మీద ఈ మధ్య మరో చిత్రంలో పారడీ పాడించారు - ఏ సినిమా అది?"

"ఇలాంటి చెత్త ప్రశ్నలకు జవాబుచెప్పాల్సిన అవసరం నాకు లేదు" ఉడికిపోతూ అంది స్మితా రాణి.

"అంటే ఆ ప్రశ్నకు సమాధానం మీకు తెలీదన్నమాట! కమాన్ మైడియర్ స్టూడెంట్ నువ్ చెప్పగలవా?"

"ఓ వెరీ ఈజీ అంకుల్! పున్నమి చంద్రుడు సినిమా."

"టెరిఫిక్ నాలెడ్జి మైడియర్ లిటిల్ గాళ్" అంటూ తులసిని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడతను.

స్మితకు కోపం అగలేదింక!

"వెధవ తెలుగు సినిమాల గురించి తెలియడం జనరల్ నాలేడ్జా- పిల్లలను సర్వనాశనం చేస్తారు మీలాంటి వాళ్ళు టీచర్లయితే"

"అలా అనకండి మేడమ్! నేటి తెలుగు సినిమాలే రేపటి రాజకీయాలు, నేటి సినిమా హీరోలే రేపటి ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు , నేటి ........"

"తులసీ - నువ్ లోపలకు పద" అతని మాటలు కట్ చేస్తూ అంది స్మితారాణి.

తులసి అంటీ కోపం చూసి భవానీ శంకర్ చంకదిగి లోపలకు నడిచింది.

స్మిత ఆమెతోపాటు లోపలకు నడిచి తలుపు మూసేయబోయింది. భవానీ శంకర్ చప్పున ఆమెకు అడ్డుపడ్డాడు.

"ఒక్క విషయం స్మితాజీ, మీతో కొంచెం మాట్లాడాలి!"

"నాకేం మాట్లాడాల్సిన అవసరం లేదు"

"నేను మాట్లాడాల్సింది మీ గురించే మిస్"

"ఏమిటది?"

"మీ మీద హత్యాప్రయత్నం జరగబోతోందని నాకు అనుమానంగా వుంది."

స్మితారాణి మొహంలో కలవరపాటు కనిపించింది కొద్ది క్షణాల పాటు.

"నాకేం అనుమానం లేదు." అంటూ తలుపులు మూయబోయింది. కానీ అప్పటికే భవానీ శంకర్ గడపలో కొచ్చి నిలబడ్డాడు.

"నిజంగానే స్మితాజీ! ఉదయం ఆర్. కె. శ్యామ్ ఇంటి సందులో ఆ కారు మీ మీదకు రావటం, ఇప్పుడు మళ్ళీ ఇక్కడ ఇంకోకారు మిమ్మల్ని డాష్ ఇవ్వబోయి , యాక్సిడెంట్ కి గురవ్వటం , యిదంతా చూస్తుంటే మిమ్మల్ని ఎవరో వెంటాడి చంపటానికి ప్రయత్నిస్తున్నారని అనుమానంగా ఉంది."

"నాకేం అనుమానం లేదు. వాళ్ళెవరో మిమ్మల్నే చంపటానికి ప్రయత్నిస్తున్నారేమో."

భవానీ శంకర్ కొద్ది క్షణాలు ఆలోచించాడు.

ఆ పాజిబులిటీ కూడా ఉంది. కానీ తనకు తెలిసి శత్రువు లెవరు లేరు. అయినా చంపాలనుకుంటే ఉదయం ఆ సందులో కారు తన మీదకే రావాల్సింది గానీ అది స్మితారాణి మీదకు ఎందుకు వెళుతుంది?

"అల్ రైట్ స్మితాజీ! ఏదేమయినా మీరు కొంచెం జాగ్రత్తగా ఉండటం మంచిది - బైదిబై తులసి మమ్మీ డాడీ వాళ్ళున్నారా?"

"మా బావగారికి అనుకోకుండా సింగపూర్ లో జాబ్ వచ్చింది అందుకని మా అక్కతో పాటు వెళ్ళిపోయారు! ఇంకో మూడునెలల వరకూ రారు."

"అయితే మీరొక్కరే ఉండాలన్నమాట ఇంట్లో. ఈ పరిస్థితులలో మీరు మరింత జాగ్రత్తగా ఉంటేగానీ లాభం లేదు మేడమ్."

"ముందు మీ మెదడు జాగ్రత్తగా పరీక్షించుకొండి. డిటెక్టివ్ నవలలు మీ ఆరోగ్యానికి మంచిది కాదు" తలుపులు దభేలుమని మూసేసిందామె.

భవానీశంకర్ ఒక్కసారిగా ఎగిరి బయటకు దూకాడు. లేకపోతే ఆ తలుపు సందులో పడి నలిగి పోవాల్సి వచ్చేది.

గదికి చేరుకొని బట్టలు మార్చుకుని మంచం మీద పడుకున్నాడతను. అతనికి ఆ నల్లకారు వ్యవహారమే అంతుబట్టటం లేదు. వాళ్ళు స్మితారాణినే చంపాలనుకుంటున్నది ఖాయం, కానీ ఎందుకు చంపాలనుకుంటున్నారో మాత్రం తెలీటం లేదు. ఆ అమ్మాయితో వివరంగా మాట్లాడితే కొన్ని విషయాలు తెలియవచ్చు. ఎవరికి ఆ అవసరం ఉన్నదీ, ఎందుకా అవసరం కలిగిందీ, అన్నీనూ.

కానీ ఆ అమ్మాయి తనను చూస్తూనే టెర్రరిస్ట్ లా బాంబులు విసిరేస్తున్నట్లు మాట్లాడుతోంది హటాత్తుగా అతనికో ఆలోచన తట్టింది.

అవును! స్మితారాణి సంగతులు చాలా వరకూ అభిలభానుకి తెలిసుండవచ్చు. రేపోసారి అటో రౌండ్ వెళ్ళి వదినమ్మను కూర్చోబెట్టి జరిగినదంతా చెప్పి ఇన్ ఫర్మేషన్ తీసుకుంటే ఏమయినా ఉపయోగం వుంటుందేమో.

ట్యూన్ నెంబర్ త్రీ పాడసాగాడు భవానీశంకర్.

ట్యూన్ నెంబర్ త్రీ ఆ చుట్టూ ప్రక్క వాళ్ళందరికీ చాలా ఇష్టమని అతనికి తెలుసు.

మరుక్షణంలో తలుపు దగ్గర యధాప్రకారం అరడజను మంది పిల్లలు, నలుగురయిదుగురు చుట్టు ప్రక్కల స్త్రీలు , ఓ కుక్క హాజరయివున్నారు.

అయితే ట్యూన్ ఆఖరి దశ కొచ్చేవరకూ అతనికా విషయం తెలీక పాట ఆపలేదు. చివరకు ఎలాగయితేనేం ట్యూన్ నెంబర్ త్రీ ఆగిపోయింది.

ప్రేక్షకులందరూ ట్యూన్ నెంబర్ ఫోర్ పాడమని బ్రతిమాలటం ప్రారంభించారు. హటాత్తుగా ఆ గది పక్కనే వున్న పెంకుటింట్లో నుంచి ఒక స్త్రీ కేకలు వినిపించాయ్. ఒక్క ఉదుటున లేచి ఆ ఇంటి దగ్గరకు పరుగెత్తాడు భవానీ శంకర్.

ఒక స్త్రీ నులక మంచం మీద పడుకుని బాధతో విలవిలలాడుతుంది. ఆమె పిల్లలు  మంచం దగ్గర బిక్క మొహం వేసుకుని చూస్తున్నారు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాడు భవానీశంకర్.

"కడుపు నొప్పి బాబూ - అప్పుడప్పుడూ అలాగే వచ్చి ప్రాణం తీస్తుంది! బాధతో మెలికలు తిరుగుతోందామె.

"ఒరేయ్ కిట్టూ వెళ్ళి ఆటో తీసుకురారా! హాస్పిటల్ కి తీసుకెల్దాం" ఓ కుర్రాడిని పురమాయించాడు భవానీ శంకర్. రెండు నిముషాల్లో ఆటో వచ్చింది.

"నేను హాస్పిటల్ కి వెళ్ళితే నా పిల్లల్ని ఎవరు చూస్తారు బాబూ వద్దు నేను వెళ్ళను" వారిస్తూ అందామె.

"నీ పిల్లలకేం మునిగిపోదులే పద. అంతా నేను చూసుకుంటాను సరేనా?" ఆమెను తీసుకుని కిట్టూ గాడితో పాటు గవర్నమెంటు హాస్పిటల్ కి చేరుకున్నాడు భవానీ శంకర్.

ఆమెతో పాటు అవుట్ పేషెంట్ వార్డులోకి జొరబడ్డాడతను. క్యూని తప్పించుకుని తిన్నగా డాక్టర్ దగ్గర కెళ్ళిపోయాడు.

"గుడ్ మార్నింగ్ డాక్టరు! ఈమె కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఎపెండిసైటిస్ అని నా అనుమానం! వెంటనే పరీక్ష చేస్తే."

డాక్టర్ అతని వేపు ఎగాదిగా చూసాడు.

"వెళ్ళి క్యూలో రా!" అన్నాడు చిరాకుగా.

"ఎక్కువ బాధపడే వాళ్ళను ముందుగా చూడాలి డాక్టర్! ఈ పద్ధతిని తెలుగులో ఏమంటారో మీకు తెలుసుండదు బహుశా! "మానవత్వం" అంటారు దీన్నే ఉర్దులో "ఇన్సినియత్ " అంటారు బెంగాలీలో"

డాక్టరు మొహం కందిపోయింది కోపంతో.

"బయటికెళతావా? ప్యూన్ ని పిలిచి గెంటించమంటావా?"

భవానీశంకర్ జేబులో నుంచి చిన్న కెమెరా బయటకు తీశాడు.

అల్ రైట్ డాక్టరు మేము క్యూలోనే రావాలని అంటే అలాగే వస్తాం . కానీ ఈమె కేమయినా ప్రమాదం జరిగిందంటే మాత్రం మీ ఉద్యోగం, మీ ప్రాణాలూ కూడా రిస్కులో పడతాయ్! నేను ప్రెస్ ఫోటోగ్రాఫర్ని! ఈ కేసు గురించి మొత్తం వివరాలన్నీ ఫొటోలతో సహా అన్ని పేపర్లలోనూ న్యూస్ వచ్చేస్తుంది. ఆ ఫోటోలు చూశారంటే జనం ఏం చేస్తారో మీకూ తెలుసు. ఈ మధ్యే ఓ పేషెంటు డాక్టర్ లంచగొండితనం వల్ల చనిపోతే జనం డాక్టరుని ఊరితీశారు" ఆమెను బయటికి నడిపిస్తూ అన్నాడు భవానీశంకర్.

డాక్టరులో ఆ మాటలు సంచలనం కలిగించినాయ్. వెంటనే లేచి ఆమెను స్క్రీన్ పక్కకు పిలిచి పరీక్షించి ఆపరేషన్ థియేటర్ కు పంపించాడు అర్జంటుగా.

భవానీశంకర్ థియేటర్ బయట కూర్చున్నాడు. అతని మనసంతా తన ఆర్ధిక పరిస్థితి మీదకు మళ్ళిందిప్పుడు.

"కేవలం పదిరూపాయల బాలెన్స్ ఉందింకా! దాంతో మహా అయితే ఇంకొక్కరోజు గడుస్తుంది. ఆ తర్వాత ఏం చెయ్యాలో అర్ధం కావటం లేదు. ఆపరేషన్ అయ్యాక ఆమె తిరిగి ఇంటికి రావటానికి రెండు రోజులు పడుతుంది. అంతవరకూ ఆమె పిల్లల్ని కూడా తనే పోషించాలి. ఆమె భర్త తాగుబోతు. ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో వాడికే తెలీదు.

డాక్టరు బయటికొచ్చాడు. వెనుకే స్ట్రెచర్ మీద పేషెంట్ ! ఇంకా మత్తులోనే ఉందామె.

"ఒరే! కిట్టూ! ఈ అయిదు రూపాయలు నీ దగ్గరుంచుకుని ఆమె బెడ్ పక్కనే కూర్చో! నేను తర్వాత మళ్ళీ వస్తాను ఓ.కే.!"

"ఓ.కె." అన్నాడు కిట్టూ.

భవానీశంకర్ మళ్ళీ తన రూమ్ కి చేరుకున్నాడు.

రూమ్ బయటే నిలబడి ఉన్నడొకడు. ఫుల్ సూట్ లో వున్న అతడిని చూసేసరికి భవానీశంకర్ కి ఎక్కడలేని అనందం కలిగింది.

తప్పకుండా అతనేదో పత్రికకు ఎడిటర్ గానీ, యజమాని గానీ అయుంటాడు. బహుశా తన ఫోటోగ్రఫీ ప్రావీణ్యత గురించి విని తనను వాళ్ళ పత్రికలో ప్రెస్ ఫోటో గ్రాఫర్ గా ఉద్యోగం చేయమని అడగటానికి వచ్చి వుంటాడు.

తలుపు తాళం తీస్తుంటే రాజేశ్వరీ వచ్చింది.

"అంకుల్ - ఆయనెవరో మీ కోసం వచ్చారంకుల్"

భవానీ శంకర్ అతనివేపు చూశాడు.

"మీరు భవానీ శంకర్ కదూ?" అడిగాడతను.

"యస్ కామ్రేడ్! కమిన్ - కమిన్ " అతనిని లోపలకు ఆహ్వానించాడతను.

అతను గదిలో కొచ్చాడు.

భవానీశంకర్ ఫోల్డింగ్ చైర్ తీసి అతని కోసం వేశాడు.

"నా పేరు భూషణ్! "పురానా పూల్" దగ్గర మా అఫీసుంది. ఈ మధ్యే అత్యంత ఆధునికంగా ఓ స్టూడియో తెరిచాము. మొత్తం ఎక్విప్ మెంట్ అంతా డైరెక్టుగా జపాను నుంచి తెప్పించాము. ఇన్ స్టెంట్ ఫొటోస్ కంప్యుటరైజ్డ్ ప్రింటింగ్, త్రీ డైమెన్షన్ ఎఫెక్ట్ - ఇలా ఇండియాలో ఎవరూ చేయలేని పని మేము చేస్తున్నాము. మీరు మాకు సహాయం చేయాలి!

"చెప్పండి కామ్రేడ్ - ఏం కావాలి!"

"మా స్టుడియోలో అందమయిన అమ్మాయిల లైఫ్ సైజ్ ఫోటోలు కొన్ని కట్ అవుట్స్ గ ఏర్పాటు చేయదల్చుకున్నాం! చాలా మంది ఫోటో గ్రాఫర్స్ ని కాంటాక్ట్ చేశాం గానీ వాళ్ళు చూపిన మెడల్ ఫోటోలు మాకే మాత్రం సంతృప్తి కలిగించలేదు. అందుకని నగరమంతా తిరిగి మేమే కొంతమంది అందమైన అమ్మాయిలను సెలక్టు చేసుకున్నాం" ఈ ప్రాంతంలో కనిపించిన ఓ అమ్మాయి ఫోటో మా కందజేసే బాధ్యత మీ కిస్తున్నాం. ఇందుగ్గాను మీకు రెండువేల రూపాయలు ఇస్తాం!"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"ఒక్క ఫోటోకి రెండు వేల రూపాయలా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"యస్ - మాది చాలా ప్రెస్టేజియస్ షాపు అని ముందే మీకు చెప్పాను. మాకు క్వాలిటీ కావాలి! మీరు బెస్ట్ ఫోటోగ్రాఫర్ గా వర్క్ చేసినట్లు కూడా చెప్పారు ."

భవానీ శంకర్ కళ్ళల్లో గర్వం తొణికిసిసలాడింది.

"ఓ.కే. కామ్రేడ్! నో ప్రాబ్లం! రేపు ఉదయానికల్లా ఫోటో తెచ్చిస్తాను! కాకపోతే మీరు సెలక్టు చేసుకున్న అమ్మాయ్ తనను ఫోటో తీసేందుకు ఒప్పుకుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"మీకు రెండు వేల రూపాయలు ఇస్తోంది అందుకే మిస్టర్ భవానీ శంకర్? ఒకవేళ ఆ అమ్మాయి డబ్బేమయినా అడిగేట్లయితే అది కూడా మేమే ఇస్తాము. డబ్బుకి లొంగని రకమైతే అప్పుడు మీ పత్రికా ఫోటోగ్రాపర్ అనుభవాన్ని ఉపయోగించాలి! ఆమెకు తెలీకుండా రహస్యంగా ఆమె ఫోటో తీసేయాలి. మీరు ఆంధ్రదేశం పత్రికలో ప్రెస్ ఫోటో గ్రాఫర్ గా పనిచేసేటప్పుడు చాలా రిస్క్ తీసుకుని కొన్ని విలువయిన ఫోటోలు రహస్యంగా తీసి, మీ పత్రికలో ప్రచురించి కొంతమంది ఘరానా పెద్ద మనుషులను బజారుపాలు చేసిన విషయం కూడా మాకు తెలిసింది-----"

భవానీ శంకర్ లో ఆ దినపత్రికలో పని చేస్తున్నప్పటి ఉత్సాహం మళ్ళీ పొంగి పొరలింది.

"ఓ.కే. కామ్రేడ్! డన్!" అన్నాడు ఉత్తేజంతో.

అతను తన జేబులోంచి ఓ నోట్ల కట్ట తీసి అందులో నుండి వెయ్యి రూపాయలు లెక్కపెట్టి భవానీశంకర్ కిచ్చాడు.

"ఇది అడ్వాన్స్! రేపు ఆ అమ్మాయి నెగటివ్ లు తెచ్చిస్తే మిగతా డబ్బు అక్కడే ఇచ్చేస్తాము -"

భవానీశంకర్ తన చేతిలోని డబ్బువేపు చూసుకున్నాడు. ఈమధ్య కాలంలో ఇంతడబ్బు ఒకేసారి ఎప్పుడూ సంపాదించలేదు.

సూట్ వాలా తన చేతిలో వున్న బాగ్ లోనుంచి ఓ అందమైన కెమెరా బయటకు తీశాడు.

"ఇది స్పెషల్ ఎలక్ట్రానిక్ కెమెరా మిస్టర్ భవానీశంకర్ ! ఇందులో లోడ్ చేసింది కూడా స్పెషల్ ఫిలిమ్! నెలరోజుల క్రితం జపానులో వచ్చిన లేటెస్ట్ మోడల్ ఇది. లక్ష రూపాయలు దీని ఖరీదు. లైటింగ్, క్లారిటీ, త్రీ డైమెన్షన్ ఎఫెక్ట్స్ డిస్టెన్స్ అన్నీ ఆటోమేటిగ్గా ఎడ్జస్ట్ అయిపోతాయి. ఎటొచ్చి ఆ అమ్మాయి యాభయి అడుగుల కంటే ఎక్కువ దూరంలో వుండకూడదు - ఇందులో రెండే రెండు స్నాప్ లు వున్నాయ్ ఆ అమ్మాయిని రెండు యాంగిల్స్ లో స్నాప్ లూ తీసి రేపు కెమెరా, నెగటివ్ లు మా ఆఫీసుకి తెచ్చివ్వాలి. వెంటనే మిగతా వెయ్యి రూపాయలూ నీకిస్తాం ఈజిట్ ఓ.కే."

"ఓ.కే. కామ్రేడ్! సెంట్ పర్సెంట్ ఓ.కే!"

భవానీశంకర్ కెమెరా అందుకున్నాడు. అంతకుముందు తనెప్పుడూ అలాంటి కెమెరా చూడలేదు.

"ఇదిగో ఈ ఎల్లో బటన్ స్నాప్స్ కి ఉపయోగించాలి. " చూపించాడతను.

"ఇంతకూ అమ్మాయి ఎవరు?"

"బసు స్టాప్ పక్క సందులోనే రెండో ఇల్లు - పేరు స్మీతారాణి."

భవానీ శంకర్ ఉలిక్కిపడ్డాడు.

"స్మితారాణి?" నమ్మలేనట్లు అడిగాడు.

"అవును! కావాలంటే అమ్మాయినో సారి చూపిస్తాను - పద --------"

"అవసరం లేదు కామ్రేడ్! స్మితారాణి అయితే మనకు బాగా తెలుసు. వాళ్ళ ఫాదర్ పేరు అగ్ని! అన్నీ తండ్రి పోలిక లోచ్చాయ్. ఆ అమ్మాయికి!"

"అయితే ఇంక నేను వెళ్ళవచ్చునుకుంటాను. తెలిసినమ్మాయే కాబట్టి ఇప్పుడామెని ఫోటో తీయడం నీకేమి కష్టం కాదని నా ఉద్దేశ్యం!" భవానీశంకర్ భుజం మీద తట్టి బయటకు నడిచాడతను.

భవానీ శంకర్ అతనితో పాటు బయటివరకూ నడిచి ఆగిపోయాడు.

"ఓ.కే. -భవానీ శంకర్ ! రేపు మాణింగు ఆ రెండు స్నాప్ లతో మీరు మా ఆఫీసుకొస్తారు - అంతే కదూ?"

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"నో ప్రాబ్లమ్!"

అతను వెళ్ళిపోయాడు. భవానీ శంకర్ గదిలోకొచ్చి హుషారుగా ట్యూన్ నెంబర్ ఫైవ్ పాడటం ప్రారంభించాడు. చేతిలో బాగా డబ్బు ఉన్నప్పుడు ఆటోమేటిగ్గా ఆ ట్యూన్ అతని పెదాల మీదకు వచ్చేస్తుంది. అదివరకన్నా ఎక్కువమంది ప్రేక్షకులు గుమికూడిన విషయం తెలిసేసరికి ట్యునుని ఆపేశాడతను.

దూరంగా సత్యమ్మ భర్త రాజయ్య చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు.

"కమాన్ మైడియర్ రాజయ్యా కం హియర్! మీ ఆవిడ హాస్పిటల్లో వుంది. రేపో ఎల్లుండో చస్తుంది. మనకేం ఫరావాలేదు. మనం వెళ్ళి మందుకొడదాం. బైదిబై "మందేరా మన జీవితం, మందేరా మన ఊపిరి" అనే పాట వచ్చా నీకు. ఓసారి పాడితే అందరం కలిసి డాన్స్ చేస్తాం. పాడు కామ్రేడ్, కమాన్ , క్విక్ క్విక్."

రాజయ్యా భవానిశంకర్ వైపు కోపంగా చూశాడు.

"వాట్ కామ్రేడ్? నీ ముఖంలో కోపం లాంటిదేదో హండ్రెడ్ కాండిల్స్ బల్బులా వెలిగిపోతోందేమిటి? పాట పాడు. ఓ నీ పిల్లలు మాడుతున్నారని ఆలోచిస్తున్నావా? వాళ్ళు చస్తారు కామ్రేడ్ - మనకెందుకు? నారు పోసినవాడే నీరు పోస్తాడు - లేదా వురివేస్తాడు - కమాన్. "మందేరా జీవితం, మందేరా మన ఊపిరి."

భవానీశంకర్ పాడటం ప్రారంభించేసరికి పిల్లలంతా డాన్సు చేయడం ప్రారంభించారు.

రాజయ్య కోపంగా తన గుడిసెకు వెళ్ళిపోయాడు.

భవానీ శంకర్ నవ్వుతూ అతని వెనుకే అతనింట్లోకి చేరుకున్నాడు.

"హల్లో రాజయ్యా! ఏడుస్తున్నావా? ఎందుకని? మందు దొరకలేదా? ఇదిగో - ఈ వందరూపాయలు తీసుకో! మందుకొట్టెయ్ బ్రదర్ - నీ భార్య సత్యమ్మ, పిల్లలు చస్తే తగలెయ్యటానికి ఇంకో వంద ఇస్తానులే బ్రదర్, డోంట్ వర్రీ - ఎబౌట్ దెమ్-"

"బాబూ- " కోపంగా, అసహనంగా అరిచాడు రాజయ్య.

"అరె! నీకు కోపం కూడా వస్తోందే, వెరీ స్ట్రేంజ్! వెంటనే డాక్టర్లకి చూపించుకో బ్రదర్! కోపం అనేది పశువుల కొస్తుంది గానీ , నీలా భార్యా బిడ్డలకి తిండి పెట్టకుండా తాగేవాడికి రాకూడదు-"

రాజయ్య తల వంచుకుని అక్కడే కూలబడిపోయాడు. భవానీ శంకర్ అతడిని లేపి నుంచోబెట్టాడు.

"ఆ ఏడుపు అపు కామ్రేడ్! ఇంకా బాగా ప్రాక్టీస్ చేస్తే గానీ కుదరదు నీకు! ఎప్పుడూ మందుకోసం ఎడిచేవాడు పెళ్ళాం బిడ్డల్ కోసం ఏడిస్తే ఇలాగే అఘోరిస్తుంది! ఇదిగో ఈ వంద తీసుకెళ్ళు! దీంతో మందు కొడతావో, హాస్పిటల్లో చావుబ్రతుకుల మధ్య ఉన్న నీ భార్యను రక్షించుకుంటావో - నీ యిష్టం - పో!"

రాజయ్య వందనోటు అందుకుని భవానీ శంకర్ కి నమస్కరించాడు. తర్వాత కన్నీళ్ళు తుడుచుకుని పిల్లల్ని తీసుకుని హాస్పిటల్ కి బయలుదేరాడు.

అప్పటికీ సాయంత్రం అయిదవుతోంది.

భవానీశంకర్ కెమెరా భుజాన వేసుకుని, గదికి తాళం వేసి రోడ్ మీద కొచ్చాడు. పిల్లలంతా పరుగుతో వచ్చి అతనిని చుట్టూముట్టారు మళ్ళీ.

"అంకుల్ మమ్మల్ని ఫోటో తీయ్యవూ?"

తీయాలనే అనిపించి కెమెరా చేతిలోకి తీసుకున్నాడు గాని స్నాప్ కొట్టే ముందు గుర్తుకొచ్చిందతనికి ఆ సూటు వాలా చెప్పిన విషయం.

"లోపల వున్నది స్పెషల్ ఫిలిము --రెండే రెండు స్నాప్ లు ఉన్నాయి - ఆ అమ్మాయిని రెండు యాంగిల్స్ లో తీయాలి."

భవానీశంకర్ కెమెరా మళ్ళీ భుజాన వేసేసుకున్నాడు.

"మీ అందరినీ రేపు ఫోటో తీస్తా కామ్రేడ్స్. ఇందులో ఫిలిం మంచిది కాదు -"

అనేసి స్మితా రాణి ఇంటివేపు నడవసాగాడు. స్మితారాణిని ఎలా అంగీకరింపజేయటమా అనేదే అర్థం కావటంలేదతనికి.

అదీ తను కోరితే సెంటు పర్సెంటు వ్యతిరేకిస్తుంది. ఏదేమయినా తను ఆమెను ఇవాళ ఫోటోలు తీయాల్సిందే! ఒకవేళ ఆమె ఒప్పుకోకపోయినా రహస్యంగా ఏ కిటికీ లో నుంచో తీయవచ్చు.

అందం అనేది పదిమందీ చూసి ఆనందించాలనేది తన పాలసీ రెండు వేల రూపాయలు సెకండరీ ఇష్యూ!

హటాత్తుగా నిలబడి పోయాడతను.

ఎదురుగ్గా కనిపిస్తున్న దృశ్యం అతనిని ఆనందంతో ముంచెత్తింది. అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు రోడ్ పక్కనే వున్న పెద్ద చెట్టు మీద పడుతుంటే కొమ్మ మీద నుంచున్న ఓ పాలపిట్ట వింత రంగులతో మెరిసి పోతోంది. భవానీ శంకర్ ని ఆ దృశ్యం పూర్తిగా మైమరపింపజేసింది. ఇంత చక్కని పకృతి దృశ్యం దొరకడం చాలా అరుదయిన విషయం. అనాలోచితంగా కెమెరా తీసి ఆ అద్భుత దృశ్యాన్ని ఫోటో తీయడానికి సన్నద్ధుడయ్యాడతను.

ఆ సమయంలో అతనికి కెమెరా "వ్యూ" లో నుంచి పాలపిట్ట తప్పితే మరేమీ కనిపించడం లేదు.

సూటువాలా చెప్పిన "రెండే రెండు స్నాప్ లున్నాయ్" అనే మాట కూడా గుర్తులేదు.

జాగ్రత్తగా పక్షిని సెంటర్ చేసుకుని తన చేతులు కదలకుండా ఫిక్స్ చేసుకుని బటన్ నొక్కాడు.

అంతే! అతి భయంకరంగా అరిచిందా పిట్ట.

మరుక్షణం చెట్టు కొమ్మ మీద నుంచి విలవిల కొట్టుకుంటూ క్రింద పడింది. రెక్కలు రెపరెప కొట్టుకుంటూ బాధతో అరుస్తూ అక్కడే ఎగిరేరేగిరి పడుతోంటే భవానీశంకర్ నిశ్చేష్టుడయి చూస్తుండిపోయాడు.

అతను ఆ షాక్ నుంచి తేరుకుని పక్షి దగ్గరకు పరుగెత్తే సరికి అప్పటికే దాని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. నిశ్చలంగా పడి వుంది! వణుకుతున్న చేతులతో దానిని పట్టుకుని పరీక్షగా చూశాడతను.

అది ఎలా పడిచచ్చిపోయిందో ఏ మాత్రం అర్ధం కావటం లేదతనికి. మరోసారి దాని రెక్కలు కింద చూస్తుంటే కనిపించింది పిన్ను లాంటి లోహం.

పచ్చగా రెండంగుళాలు బయటకు కనబడుతోంది. దాని శరీరంలోకి ఎంత భాగం దిగిందో తెలీటం లేదు.

భవానీశంకర్ చూస్తుండగానే పాలపిట్ట రంగు మరిపోసాగింది. బ్లూ రంగులో ఉన్న భాగం తప్ప మిగతా శరీరమంతా క్రమేపీ నల్లబడిపోతోంది.

భవానీశంకర్ దానిని క్రింద వదిలేశాడు.

మరికొద్ది నిమిషాల్లో ఆ పక్షి నల్ల బొగ్గులా మారిపోయింది.

భవానీశంకర్ కి కొంచెం కొంచెంగా జరిగింది అర్ధమవుతోంది. ఆ పక్షి శరీరంలో గుచ్చుకున్న "పిన్" ఏదో పాయిజన్ తో నింపబడి వుంది. అయితే అసలా ముల్లు దాని శరీరంలో ఎలా దిగిందీ ఇంకా స్పష్టంగా తెలీటం లేదు. తన కేమెరా తాలుకూ బటన్ నొక్కగానే అది అరిచి క్రింద పడటం చూస్తుంటే ఆ "పిన్" తన కెమెరా నుంచే వెళ్ళిందేమో అనిపిస్తోంది. తన కెమెరాలో అలాంటి పిన్ లు ఎందుకుంటాయ్? కెమెరా నెమ్మదిగా ఓపెన్ చేసి చూశాడు. లోపల ఇంకో పిన్ అచ్చం అలాంటిదే ఓ చిన్న బారెల్ లో లోడ్ చేసినట్లుంది. హటాత్తుగా ఓ ఆలోచన అతనిని నిలువెల్లా కంపింపజేసింది.

మొత్తం అర్ధమై పోయిందతనికి.

అది నిజంగా కెమెరా కాదు. స్మితారాణిని హత్య చేయడానికి ఆ సూట్ వాలా పన్నిన పననగం! తను ఆ పక్షిని ప[ఫోటో తీయాలని అనుకోక పోయినట్లయితే స్మితారాణి కి ఆ పిన్ గుచ్చుకుని చనిపోయేదే!

అతని గుండెలు ఝల్లుమన్నాయ్.

ఎంత ఘోరం ? తను అంతగా ప్రేమించిన అమ్మాయిని తన చేతులతోనే చంపించాలనుకున్నారు ఆ దుర్మార్గులేవరో.

అసలెవరు వాళ్ళు? ఆమె నెందుకు చంపాలనుకుంటున్నారు? ఆరోజు ఉదయం, మధ్యాహ్నం - ఆమె మీదకు కారుని పోనిచ్చిన వాళ్ళేనా వీళ్ళు?

ఎవరయినా కానీ - ఖచ్చితంగా ఆమెను హత్య చేయాలనుకొంటున్నారన్న విషయం ఇప్పుడు స్పష్టమై పోయింది.

తను ఇంక ఆలస్యం చేయకూడదు. ఏ క్షణాన్నయినా ఆమెను వాళ్ళు ఎటాక్ చేసి చంపేసే అవకాశం వుంది.

ఆ పక్షి వంక మరోసారి చుశాడతను. నల్లబొగ్గు! అంతే! అంతకు ముందు పకృతికే వింత శోభను తెచ్చిన దాని రూపం ఆనవాలు వీల్లేకుండా మారిపోయింది.

దానిని వెంటనే తీసుకెళ్ళి లాబ్ లో పరిక్షలు జరిపిస్తే ఏ పాము ద్వారా చంపబడిందీ తెలుస్తుంది. చేత్తో దానిని

పట్టుకోబోయి ఆగిపోయాడతను - ముట్టుకుంటే తనక్కూడా ప్రమాదం కలిగిస్తుందేమో -

వెంటనే అక్కడి నుంచి ఆటోలో శ్యామ్ ఇంటికి చేరుకున్నాడతను. అప్పటికి చీకటి అలుముకుంటుంది. శ్యామ్ , అఖిలభాను ఇంటి ముందు ఆవరణలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారప్పుడు.

భవానీశంకర్ ని చూస్తూనే ఆశ్చర్యపోయరిద్దరూ.

"వీడినీ మధ్యాహ్నం ఒక్క పూటనే కదా భోజనానికి పిల్చింది మళ్ళీ వచ్చాడేమిటిప్పుడు?" ఆశ్చర్యంగా అభిలభానుని అడిగాడు ఆర్.కె. శ్యామ్.

భవానీ శంకర్ నవ్వుతూ మెట్లమీద అతనికి పక్కనే కూర్చున్నాడు.

"వదినమ్మ దగ్గర మనకలాంటి ఫార్మాలిటీస్ లేవు కామ్రేడ్. ఎప్పుడు వదినమ్మ చేతి వంట తినలనిపిస్తే అప్పుడు వచ్చేయటమే!"

"కాఫీ తేనా - టీ తేనా?" లేచి నిలబడుతూ అడిగింది అఖిలాభాను.

"టీ అయితేనే బెటర్ ఎందుకంటే మనం ముగ్గురం అతి భయంకరమైన సమస్య ఒకటి చర్చించబోతున్నాము."

అఖిలాభాను లోపలికెళ్ళి మూడు కప్పుల్లో టీ తీసుకొచ్చింది క్షణాల్లో.

"ఏమిటా భయంకరమైన సమస్య? సీక్రెట్ ఫొటోలేమయినా తీశావా?" అడిగాడు శ్యామ్.

"నో, నో ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలకు కొంచెం దూరంగా ఉన్నాం కామ్రేడ్! చిన్నారి బాలలకు ప్రస్తుతం అవసరమైన సినిమా కమ్ పొలిటికల్ జనరల్ నాలెడ్జి ని సరఫరా చేసే స్కీము మాత్రమే అమలు పరుస్తున్నాం. కానీ ఇవాళ మాణింగ్ నుంచీ పరిస్థితులు కొంచెం తమషాగా నటిస్తున్నాయ్. ఆ విషయం డిస్కస్ చేయడానికే వచ్చాను" అనేసి టీ తాగి కప్పు కింద పెట్టడతను.

"సంగతేమిటంటే ఉదయం నేనూ, స్మితారాణి , కేవలం పది అడుగుల దూరం మెయిన్ టెయిన్ చేస్తూ మీ ఇంటికొస్తున్నప్పుడు ఈ సందులోనే ఒక నల్లకారు స్మితారాణి మీదకు "దూసుకొచ్చింది. సమయానికి నేనామేను పక్కకు నేట్టేశాను. తరువాత మధ్యాహ్నం మీ ఇంటి నుంచి వెళుతుంటే మా బస్ స్టాప్ దగ్గర మళ్ళీ అదేకారు ఆమెను డీ కొట్టబోయి ఫుట్ ఫాత్ మీద కొచ్చి బాలెన్స్ తప్పి ఎలక్ట్రికల్ పోల్ ని కొట్టుకుని స్మాష్ అయిపోయింది. డ్రైవర్ ని పట్టుకుని మనం కాలేజ్ డేస్ లో నేర్చుకున్న రెండు బాక్సింగ్ పంచేస్ ఇచ్చాననుకో. పూర్తీ డిటైల్స్ సేకరించక ముందే మాములు ప్రకారం పోలీసులు వచ్చి దొంగలను - గుండాలను రక్షించే స్కీమ్ అమలు పరిచి వాడిని తీసుకెళ్ళిపోయారు. కనుక స్మితారాణిని ఎవరో చంపేయటానికి ప్రయత్నిస్తున్నారన్న అనుమానం ప్రారంభమైంది నాకు. ఈ సంగతి చెప్తే ఆ అమ్మాయి నన్ను ఖైదీ నెంబర్ వన్, వన్, వన్ ని చూసినట్లు చూసి బయటకు గెంటేసినంత పని చేసింది."

ఆర్. కె. శ్యామ్ నవ్వాడు.

"ఈ కాలేజీ గాల్స్ అంతా ఇంతే మడ్ హెడ్స్" అన్నాడు జాలిగా.

అఖిలాభాను రోషంగా చూసిందతని వేపు.

"మడ్ హెడ్స్ నయం కదా! ఖాళీ బుర్రకంటే " అంది కోపంతో.

భవానీ శంకర్ పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించేశాడు.

"మన సబ్జక్ట్ ఇప్పుడు కాలేజీ అమ్మాయిలు మడ్ హేడ్సా లేక ఏం హేడ్సా అనేది కాదు మైడియర్ సిస్టరిల్లా!

స్మితారాణి అనే అందమైన అమ్మాయికి పొంచి వున్న ప్రమాదం గురించి మాట్లాడుకుంటున్నాము.

"కారీ అన్, కారీ అన్" అన్నాడు శ్యామ్.

"ఇవాళ సాయంత్రం యింకో సంఘటన జరిగింది" అంటూ కెమెరా సంగతంతా చెప్పాడతను. ఆ విషయం వినేసరికి శ్యామ్, అఖిలాభాను మొఖాల్లో ఆందోళన చోటు చేసుకుంది.

"అవును! యూ ఆర్ సెంట్ పర్సెంట్ కరెక్ట్" అన్నాడు శ్యామ్.

"మనకిప్పుడు స్మితారాణి తాలూకు పూర్తి డిటైల్స్ కావాలి కామ్రేడ్స్. జే. స్మితారాణి ఎవరు? ఆమె బయోడేటా ఏమిటి? చిన్నప్పటి నుంచి స్టాంపులు సేకరించడమే కాకుండా టెర్రరిజం కూడా హాబీగా స్వీకరించిందా? లేక సి.ఐ.డి. కి ఏజెంట్ గా పార్ట్ టైము జాబ్ చేస్తోందా? ఇవన్నీ సిస్టరిల్లా కు తెలిసే ఉంటాయేమోనని నా అనుమానం."

అఖిలాభానుకి కోపం ముంచుకొచ్చింది.

"అది నా బెస్ట్ ఫ్రెండ్! దానిని గురించి అలా మాట్లాడటం నాకిష్టం లేదు. హైస్కూల్ రోజుల్నుంచి మేము ఫ్రెండ్స్ గా వున్నాం. స్కూలు , ఇల్లు, నవలలు చదవటం , క్రికెట్ ఆడటం తప్ప దానికి యింకో వ్యాపకమే లేదు" అంది నిష్టూరంగా.

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"ఏమీ లేకపోతే ఆమె మీద ఇంత పెద్ద ఎత్తున హత్యప్రయత్నాలు ఎవరు చేస్తున్నట్లు? ఎందుకు చేస్తున్నట్లు?"

"నాకూ అదే అర్థం కావడం లేదు."

"ఏదేమయినా మనం వెంటనే వార్ పుటింగ్ లో ఆమెకు రక్షణ కార్యక్రమాలు చేపట్టటం చాలా అవసరం శ్యామ్. నా ఉద్దేశ్యం ఏమిటంటే మీ ఇద్దరూ కొద్దిరోజులు ఆమె ఇంట్లో ఉండటం మంచిది."

శ్యామ్ అఖిలభాను మొఖాలు చూసుకున్నారు.

"అల్ రైట్ , రేపు మార్నింగ్ మేము స్మితారాణి ఇంటికొచ్చి ఆమెతో మాట్లాడి డిసైడ్ చేస్తాము సరేనా?" అడిగాడు శ్యామ్.

"బ్యుటీఫుల్ సజెషన్ కామ్రేడ్! మరి నేనింక వెళ్ళవచ్చా! " లేచి నిలబడుతూ అడిగాడు భవానీశంకర్.

"ఎలాగూ మీరా ఇంటికి దగ్గరే ఉంటున్నారు కాబట్టి - కొంచెం కనిపెడుతుండండి స్మితను" అంది అఖిలాభాను.

"ష్యూర్ మైడియర్ సిస్టరిల్లా! ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు ఆ ఇంటి చుట్టూ ఓ రౌండ్ కొడతాను ఘూర్ఖాలాగా."

"రేపు మార్నింగ్ మేము స్మిత ఇంటికెళ్ళేప్పుడు నీ రూంకి కూడా వస్తాం" అన్నాడు శ్యామ్.

"వట్టిచేతులతో రాకూడదు కామ్రేడ్! సిస్టరిల్లా ఫేమస్ డిష్ "పావ్ భాజీ" ఓ టిఫిన్ కారియర్ లో చేసుకొస్తే - వెల్ కమ్ బోర్డు, మామిడి తోరణాలు, మంగళవాయిద్యాలు లాంటి వాటితో ఘనంగా స్వాగతం ఏర్పాటు చేయబడుతుంది.

"సరే చేసుకోస్తానులే" నవ్వుతూ అంది అఖిలభాను.

"అది! 'స్పోర్ట్స్ వుమన్' స్పిరిట్ అంటే అలా వుండాలి."

భవానీశంకర్ ట్యూన్ నెంబరు "టూ" ని విజిల్ రూపంలో రిలీజ్ చేస్తూ రోడ్డు మీద కొచ్చి అప్పుడే వస్తున్న బస్ ని చూసి అడ్డం పరుగెత్తి డ్రయివర్ కి కనిపించేట్లు హైదరాబాద్ ఫాషన్ తో "సలామాలేఖుం" చేసేసరికి బస్ సడన్

బ్రేకులతో ఆగిపోయిందతని కోసం.

దర్జాగా బస్ ఎక్కడతను.

బస్ దిగి తన రూం వేపు నడుస్తుండగా ఆలోచన వచ్చిందతనికి.

స్మితారాణికి జరిగినదంతా చెప్పి -- హెచ్చరిస్తే ఆమె తగు జాగ్రత్తతో వుంటుంది. లేకపోతే ఏ క్షణంలో నయినా ఆమెకు ప్రాణాపాయం కలుగవచ్చు. ఉదయం శ్యామ్, అఖిలభాను వెళ్ళేసరికే ఆలస్యం కావచ్చు చూసుకున్నాడతను.

పదవుతోంది - బహుశా ఈపాటికి ఆమె నిద్రపోయి ఉంటుంది. వెనక్కు తిరిగి ఆమె ఇంటివేపు నడవసాగాడతను.

అతనూహించినట్లే జరిగింది. తెరిచిన కిటికీల్లోంచి డిం లైట్ బడుతోంది. అంటే నిద్రపోతోందన్న మాట. గేటు తీసుకుని లోపలకు నడిచాడతను.

తలుపు ముందు నిలబడి కొద్ది క్షణాలు తటపటాయించాడు. ఆమెను ఇప్పుడు నిద్ర లేపి అసంగతి వివరిస్తే ఏం జరుగుతుందో అతనికి తెలుసు.

తను కావాలనే ఆ కథంతా కల్పిస్తున్నాడనీ కేవలం ఆమె చనువుగా ప్రవర్తించేందుకే ఈ నాటకం ఆడుతున్నాడనీ నిందిస్తుంది . అయినా గానీ తనమెను హెచ్చరించక తప్పదు. ఆమె తనమీద ఎలాంటి నిందలు వేసినా తను సాహించగలడు. గానీ ఆమె ప్రాణానికీ అపాయం కలిగితే తను భరించలేడు. అందుక్కారణం తనామేని - తనామెని - యస్ ప్రేమిస్తున్నాడు.

తలుపు తట్టాడతను. జవాబు రాలేదు ----ఈసారి గడపను తడిమితే డోర్ బెల్ మీట కనిపించింది. అది నొక్కేసరికి లోపల్నుంచి పిట్ట అరచిన అరుపు వినిపించింది. గుండె జల్లుమందతనికి.

"ఎవరూ?" స్మితారాణి గొంతు వినిపించింది లోపల్నుంచి. అప్పుడు ధైర్యం వచ్చిందతనికి.

"నేనే ఫ్రెండ్! భవానీశంకర్ ని!"

"ఎందుకొచ్చారిప్పుడు?" ఆమె గొంతులో ఇరిటేషన్ స్పష్టంగా తెలుస్తోంది.

"మీతో చాలా అర్జెంటుగా మాట్లాడాలి డియర్! రెండే రెండు నిమిషాలు అంతే."

ఆమె ఓ క్షణం సంశయించి తలుపు తెరచింది.

"ఏమిటి?" గడపలోనే నిలబడి అడిగింది.

"అతిధులను ఇలా నడిరోడ్డు మీద నిలబెట్టి మాట్లాడటం అందమైన అమ్మాయిలు కలలో కూడా చేయరాని నేరం ఫ్రెండ్! లోపలకు రానిస్తే కథంతా సినిమా న్యూస్ రీల్ లాగా క్లుప్తంగా చెప్పేసి వెళ్ళిపోతాను."

ఆమె సంశయిస్తూనే పక్కకు జరిగింది.

భవానీ శంకర్ లోపలకు నడిచి కుర్చీలో కూర్చున్నాడు.

"వెరీగుడ్! 'నేర్వంగ రాని విద్యకలదే ముదితలకు ముద్దారనేర్వంగన్' అన్న మాట అక్షరాల నిజం అయిపోయింది. లోపలకు రానిచ్చినందుకు థాంక్స్ డియర్! ఇప్పుడు డైరెక్టుగా సబ్జెక్టు లో కొచ్చేద్దామంటారా -ముందు "టీ" "కాఫీ" లాంటి వాటితో అతిధి సత్కారం లాంటి దేమయినా చేస్తారా?"

"నా నిద్ర పాడు చేయకుండా త్వరగా చెప్పండి" విసుక్కుంటూ అందామె.

"అల్ రైట్ -- శ్రోతల కోరిక మీద సబ్జెక్టు వినిపించేస్తున్నాను. మధ్యాహ్నం ఆ కారు మీ మీదకు రావటం

యాక్సిడెంట్ కాదని రుజువయింది మిమ్మల్ని ఎవరో చంపటానికి ప్రయత్నిస్తున్నారన్న నిజం నేను స్వయంగా తెలుసుకున్నాను."

"నేను నమ్మను."

## 5

",మీరు నమ్ముతారా, నమ్మరా అనేది మన సబ్జెక్టు కాదు డియర్ - అసలు......."

"ఇంకోసారి "డియర్ " అన్నారంటే మర్యాదగా వుండదు" కోపంగా అతని మాటలకు అడ్డుపడుతూ అందామె.

"ఓ.కే. డియర్ - డియర్ అనే పదం మీకిష్టం లేకపోతే ఇంకో పదమేమయినా వాడదాం! ఉదాహరణకు "స్వీట్" ఎలా వుంటుంది? హౌ డూ యూ లై కిట్?"

"నన్నేమీ అనక్కర్లేదు. నాతో మాట్లాడమే అనవసరం అసలు......."

"వెరీ బాడ్! మన మధ్య ఇంత అనుబంధం ఉండి కూడా కొత్తవారిలా పొడిగా మాట్లాడుకోవాలంటే నాకు చాలా బాధగా ఉంది."

"మన మధ్య అనుబంధం లేదు- ఏమీ లేదు. ప్లీజ్ డోంటాక్ నాన్సెన్స్."

భవానీశంకర్ ఆమె వేపు ఆశ్చర్యంగా చూశాడు.

"కొంచెం కూడా లేదా?"

"కొంచెం కూడా లేదు"

"మీరింక వెళ్ళిపోతే నేను నిద్రపోతాను" మరింత కోపంతో అంది.

"అల్ రైట్. మీకు కోపం కొంచెం ఎక్కువ పాళ్ళలో ఉంది. తెలుగు సినిమాలు చూడకపోవడం వల్ల వచ్చిన ట్రబుల్ ఇది! వాటిల్లో చూడండి - ఈ సీనులో హీరోయిన్ హీరో మీద మండిపడుతుంది. నెక్ట్స్ సీనులో మళ్ళీ కోపాన్ని ప్రేమగా మార్చేసుకుని డ్యుయేట్ పాడుతుంది."

స్మితారాణికి నవ్వొచ్చింది. కానీ దాన్ని టెంపరరీగా కట్టకట్టేసి మళ్ళీ కోపాన్నీ ఫోకస్ చేసింది.

"ఓ.కే. ఓ.కే. మీ కోపం ఓవర్ ఫ్లో అవుతున్నట్లు అనుమానంగా ఉంది కనుక సబ్జెక్టులో కొచ్చేద్దాం. ఇవాళ మధ్యాహ్నం జరిగిన ఓ అద్భుతమయిన సంఘటన గురించి చేప్తాను వినండి - ' అంటూ కెమెరా, దాని లోపల పాయిజన్ పిన్స్ అన్నీ చెప్పాడతను.

అతని మాటలు వినేసరికి ఆమె ముఖంలో భయం స్పష్టంగా కనిపించసాగింది. కొద్ది క్షణాల పాటు మౌనంగా ఉండిపోయింది.

"ఇప్పటికయినా నా మాటలు నమ్ముతారా స్మితాజీ" అడిగాడు భవానీశంకర్.

"ఇదంతా మీరు కల్పించి చెప్పటం లేదు కదా!" అనుమానంగా అడిగిందామె.

"నేను ఫోటోగ్రాపర్ని మిస్! రచయితను కాదు. ఆఫ్ కోర్స్!క్ అవటం కష్టమేమీ కాదనుకోండి. మీరు ఆసక్తి ఉందంటే రేపే రచయిత నవుతాను."

స్మీతారాణి మళ్ళీ ఆలోచనలో పడింది. అతని మాటలు నమ్మాలో లేదో ఇంకా తెలీటంలేదు.

"మీరు అర్జెంట్ గా మీ ఫ్లాష్ బాక్ కొంచెం వివరించాలి. స్మీతాజీ. మీరెప్పుడయినా ఏమయినా కాంప్లికేషన్స్ లో

ఇరుకున్నారా, లేక మీకున్న కోట్ల ఆస్తి కోసం ఎవరయినా మిమ్మల్ని చంపటానికి ప్రయత్నిస్తున్నారా?"

"కంప్లీకేషన్సు లేవు, నా పేర ఆస్తీ లేదు."

"మరి ఎవరయినా మీ మీద ఇంత పగబట్టి ఎందుకు చంపాలనుకుంటున్నారు? ఒకవేళ మీరు హైదరాబాద్ టి.వి. లో ప్రొడ్యూసర్ గా గాని, ఏనౌన్సర్ గ గాని చేశారా?"

"నేనసలు బయట ప్రపంచంలోకి అడుగు పెట్టిందే ఇప్పుడు! అమ్మా నాన్నా పోయిన దగ్గర్నుంచీ కాలేజీ హాస్టల్లోనే ఉండి గడుపుతున్నాను డిగ్రీ ఎగ్జామిన్స్ అయ్యేసరికి అక్కా, బావా సింగపూర్ వెళ్ళాల్సివచ్చింది అందుకని వాళ్ళ పాప చదువుకోసం ఇక్కడుండటానికని వచ్చాను." అమాయకంగా చెప్పిందామె.

భవానీశంకర్ మళ్ళీ కొద్ది క్షణాలు ఆలోచనలో పడ్డాడు.

"ఓ.కే. స్మీతా జీ! ఇందాకే నేనూ కామ్రేడ్ శ్యామ్ మీ గురించి మాట్లాడుకున్నాము. మిమ్మల్ని రేపు ఉదయమే వాళ్ళింటికి తీసుకెళ్ళి కొద్ది రోజులు మా హైపవర్ కమిటీ అక్కడే వుంచాలని నిర్ణయించింది. ఆఫ్ కోర్స్ ఆ కమిటీలో మీ ఫ్రెండ్ అఖిలభాను కూడా వుంది."

స్మీతారాణి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి? వాళ్ళింట్లో ఎందుకు?"

"మీ సెక్యురిటీ కోసం డియర్! అనుక్షణం మీ రక్షణే నా ఊపిరిగా జీవితం గడపాలనే కోరిక నన్ను సైక్లోన్ గాలిలా ఊపేస్తోంది. అసలు దాని మీద ఓ పాట కూడా రాశాను -"

"నో - నేనెక్కడికి రాను! ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉంటె నన్నెవరూ ఏమీ చేయలేరు -"

భవానీశంకర్ పగలబడి నవ్వాడు.

"మీ ధైర్యాన్ని అభినందిస్తున్నాను స్మీతాజీ! నేనెప్పటికయినా సినిమా తీస్తే "హంటర్ వాలీ కరాటే గ్రీన్ బెల్టు" అనే సినిమా తీసి మిమ్మల్నే హీరియిన్ గా వేసుకుంటానని ప్రామిస్ చేస్తున్నాను. కానీ ప్రస్తుతం మాత్రం మీరు ఈ ఇంట్లో ఒంటరిగా ఉండటం మంచిది కాదు."

స్మితా రాణికి కోపం, పట్టుదల పెరిగిపోయినాయ్ . అతని అవహేళనకు రోషం పొడుచుకొచ్చింది.

"నేనిక్కడే ఉంటాను - మీరింకా వెళ్ళవచ్చు - " అంది మొండిగా.

భవానీ శంకర్ లేచి నిలబడ్డాడు.

"ఓ.కే. స్మీతా జీ జెనీవాలో సెకండ్ రౌండ్ ఆఫ్ డిస్కషన్స్ కి రేపు ఉదయం కలుసుకుందాం. మళ్ళీ అంతవరకూ శెలవ్ - జైహింద్." అనేసి బయటకు నడవబోయాడు . సరిగ్గా అప్పుడే బయట ఓ కారు వేగంగా వచ్చిన ఆగిన శబ్దం వినిపించేసరికి అతను కిటికీ లోనుంచి బయటకు చూశాడు అనుమానంగా.

ఇద్దరు వ్యక్తులు కారు దిగి స్మీతారాణి ఇంటివేపే రావటం కనిపించిందతనికి. చకచక ఆలోచించడతను.

"స్మితాజీ !" మీ ఇంటి కెవరో అతిధులు వస్తున్నట్లున్నారు - ఇంత రాత్రి సమయంలో మనిద్దరం ఇంట్లో కనిపించడం మీ పరువు ప్రతిష్టలకు అంత మంచిది కాదనుకుంటాను. నేను ఇంటికి వెనుక తలుపు తీసుకుని వెళ్ళిపోతాను- కొంచెం దారి చూపిస్తే -"

స్మీతారాణి మోహంలో కలవరపాటు స్పష్టంగా కనిపించింది.

"ప్లీజ్ - మీరు వెళ్ళకండి - వాళ్ళెవరో , ఎందుకోస్తున్నారో తెలీటం లేదు - భయపదిపోతూ అందామె.

"ఓ.కే. డియర్! నో ప్రాబ్లం -  నేను లోపల గదిలో వుంటాను. మీరు తలుపు తెరిచి వాళ్ళెవరో చూడండి- "అంటూ లోపలి గదిలోకి పరుగెత్తాడు.

డోర్ బెల్ మోగింది.

స్మీతారాణి తడబడుతున్న అడుగులతో వెళ్లి తలుపు దగ్గర నిలబడి "ఎవరు?" అడిగింది కంపిస్తోన్న స్వరంతో.

"మేము పోలీసు దిపార్టుమెంట్ వాళ్ళం! ఇవాళ సాయంత్రం మీకు దాష్ ఇవ్వబోయిన కారు విషయంలో అర్జెంటుగా కొన్ని ప్రశ్నలడగటానికి వచ్చాము."

స్మీతారాణి తలుపు తెరిచింది.

ఇద్దరు వ్యక్తులూ లోపలి కొచ్చేశారు. వాళ్ళ ముఖాలు చూస్తూనే స్మీతారాణి బెదిరిపోఆయింది. పెద్ద రౌడీ గాంగ్ లో మెంబర్స్ ల ఉన్నారు. పోలీస్ కళలేమాత్రం కనిపించడంలేదు/ వాళ్ళని చీకటి గదిలో నుంచి గమనిస్తోన్న భవానీశంకర్ కలవరపడ్డాడు. అందులో ఒకడు ఉదయం కారు ప్రమాదం చేసిన రౌడీ. స్మీతారాణి కేదో ఆపద కలుగబోతోందనిపించసాగిందతనికి.

"ఏం కావాలో అడగండి - " హీన స్వరంతో అడిగింది స్మీతారాణి.

ఇద్దరూ జవాబు ఇవ్వలేదు. గదంతా ఓసారి కలియజూసారు.

"చాలా రోజులయింది మనం కలుసుకుని! కదూ?" నవ్వుతూ అడిగాడు సన్నటి వ్యక్తీ. అతను మాట్లాడుతుంటే బంగారు పన్ను ఒకటి మెరుస్తూ కనబడుతోంది.

"మిమ్మల్ని నేనెప్పుడూ కలుసుకోలేదు" ఆశ్చర్యంగా అంది స్మీతారాణి.

"ఓహో గుర్తులేదన్నమాట! అవునులే మతిమరుపు! ఏం చేస్తాం! ఒకోసారి అలా ఇబ్బంది పెడుతుంటుంది. బహుశా భార్గవ్ ని కూడా మర్చిపోయావనుకుంటాను ! కదూ?"

"మీరు మాట్లాడేదేమీ నాకు అర్ధం కావటంలేదు. ఆ పేరే వినలేదు నేనసలు."

ఇద్దరు వ్యక్తులూ ముఖాలు చూసుకున్నాడు.

సన్నని వ్యక్తీ మళ్ళీ నవ్వాడు.

"మేమంటే పోనీ నీకు గుర్తులేదనుకో! కానీ భార్గవ్ తో పాటు ఇంచుమించుగా పెళ్ళాంలాగా కాపురం చేసి కూడా భార్గవ్ ని మర్చిపోయావా?"

"మర్యాదగా మాట్లాడండి! భార్గవ్ అనేవాడేవడో నాకు తెలీదు. నేనేవరితోనూ కాపురం చేయలేదు."

ఇద్దరు వ్యక్తులూ మళ్ళీ మొఖాలూ చూసుకున్నారు.

"ఇలా మర్యాదగా మాట్లాడినంత సేపూ ఇది యిలాగే యాక్షన్ చేస్తూంటుంది. లేపి రెండు తగిలించు" అన్నాడు లావుపాటి వ్యక్తీ.

సన్నటి వ్యక్తీ తన జేబులోంచి ఓ కత్తి తీశాడు.

ఆమె దగ్గరకు నడిచి కత్తి మొన ఆమె చెక్కిళ్ళమీద అనించాడు.

"భార్గవ్ ఏం చెప్పాడు నీకు?"

తన మీదకు వస్తున్నా డేగ వంక చూస్తున్న పావురాయిలా అతని వేపు చూస్తోందామె.

"భార్గవ్ ఎవరో నాకు తెలీదని యిందాకే ...... చెప్పాను" వణుకుతోన్న స్వరంతో అందామె.

"చాలా అందంగా ఉన్న నీ ముఖమంతా ఈ కత్తి గాట్లు పడేవరకూ నిజం చెప్పవ్ కదూ?"

"నన్నేం చేయకండి - నాకేం తెలీదు" వెనక్కి తగ్గుతూ అందామె.

ఆమె కళ్ళల్లో విపరీతమైన భయం కనబడుతోంది.

భవానీశంకర్ ఆమెను చూస్తె జాలేస్తోంది. మరోపక్క ముసురుకుంటున్న ఆలోచనలు!

స్మీతారాణిని నిజంగానే భార్గవ్ అనే వ్యక్తీ తెలీదా? నిజంగానే ఆమెకు ఆ యిద్దరు వ్యక్తులూ ఎందుకొచ్చారో తెలీదా?"

కెవ్వున కేకేవేసింది స్మీతారాణి. అమె ముఖం మీదున్న కత్తి కిందకు జారి మెడలో కొంచెం గుచ్చుకుంది. రక్తం ఊరుతోంది అ ప్రాంతం నుంచి!

"చెప్పు - భార్గవ్ నీకేం చెప్పాడు?"

భవానీశంకర్ యింక ఉండబట్టలేకపోయాడు. నిశ్శబ్దంగా - పిల్లిలా అడుగులు వేసుకొంటూ గదిలో నుంచి బయటకొచ్చాడు.

మళ్ళీ కత్తి ఆమె చెక్కిలి మీద పెట్టబోతున్నాడతను. స్మీతారాణి వెనక్కి నడుస్తోంది నెమ్మదిగా.

"నన్నేం చేయకండి - నాకేం తీలీదు" అంటోంది భయంగా.

భవానీశంకర్ నీడలా కదిలి ఆ సన్నని వ్యక్తీ వెనుకకు చేరుకున్నాడు.

మరుక్షణంలో అతని మెడమీద తన బలమంతా ఉపయోగించి పిడికిలి దెబ్బ వేశాడు.

ఆ ఫోర్సుకి అతను వెళ్ళి దూరంగా వున్న గోడను కొట్టుకుని కిందపడ్డాడు. అతని చేతిలోని కత్తి ఎగిరి దూరంగా పడింది.

ఆ హఠాత్సంఘటనకి నిశ్చేష్టుడైన లావుపాటి వ్యక్తీ కోలుకుని భవానీశంకర్ వేపు తిరిగేసరికి అతని ముఖం మీద పిడిగుద్దు పడింది. అతనూ అరటి చెట్టులా వెనక్కి విరుచుకుపడిపోయాడు. ఈలోగా సన్నటి వ్యక్తీ తన శక్తినంతా కూడాదీసుకుని లేచి నిలబడుతూ జేబులోకి చేయి పోనిచ్చి ఓ చిన్న పిస్టల్ బయటికి తీశాడు. అది గమనిస్తూనే భవానీ శంకర్ తన పక్కనే వున్న ఫోల్డింగ్ చైర్ తీసి అతని మీదకు బలంగా విసిరాడు. కుర్చీ అతన్ని మళ్ళీ నేల కూల్చింది. భవానీశంకర్ కుర్చీ విసిరేలోగా లావుపాటి వ్యక్తీ లేచి నిలబడి నడుము చుట్టూ బిగించి వున్న చెయిన్ తీసి భవానీ శంకర్ మీదకు తిప్పాడు.

అది మొఖానికి సమీపంగా వచ్చే సమయానికి అతని రెండు చేతులూ అడ్డం పెట్టుకోవడంతో అతని చేతుల మీద చర్మం తెగీ క్షణాల్లో రక్తం ముద్దల్లా కనిపించసాగినాయ్. చేతులూ రెండూ తెగి పడిపోయినంత బాధ అతన్ని పిండేయసాగింది. అదే అదనుగా చూచుకుని సన్నని వ్యక్తీ మళ్ళీ కిందపడిన పిస్టల్ అందుకొని భవానీ శంకర్ వేపు గుడ్డిగా కాల్చబోయాడు కాని అప్పటికే భవానీ శంకర్ మెరుపులా ఎగిరి కాలితో అతని ముఖం మీద తన్నాడు. సరిగ్గా అప్పుడే పేలిన పిస్టల్ బుల్లెట్ భవానీ శంకర్ కాలి పైనుంచి వెళ్ళి గోడకు తగిలింది. ఆ శబ్దంతో పాటు పిస్టల్ కూడా ఎగిరి స్మితా రాణి కాళ్ళ ముందు పడింది. రెండు చేతులతో ముఖం పట్టుకుని కూలబడిపోయాడు సన్నటి వ్యక్తీ బాధతో గట్టిగా అరుస్తూ.

భవానీ శంకర్ స్మితారాణి దగ్గరకు నడిచాడు. ఆమె నేల మీద కూలబడి కళ్ళు మూసుకుంది. పిస్టల్ జేబులో

వేసుకుని ఆమెను రెండు చేతులతోనూ ఎత్తుకుని లోపలి గదిలో మంచం మీదకు చేర్చాడతను.

రెండో మంచం మీద నిద్రపోతున్న తులసి అప్పటికే ఆ శబ్దాలకు నిద్రలేచి కుర్చుని ఉంది.

"గుడ్ మాణింగ్ అంకుల్ -" అంది నిద్రకళ్ళతోనే భవానీశంకర్ ని చూస్తూ.

"గుడ్ మాణింగ్  మైడియర్ చైల్డ్ - అర్జంటుగా ఆ గ్లాసులోని మంచినీళ్ళు ఇటు అందివ్వమ్మా! స్మితా ఆంటీకి ఫస్ట్ ఎయిడ్ చేద్దాం"

తులసి లేచి టేబుల్ మీదున్న మంచినీళ్ళ గ్లాసు అతనికి అందించింది. కర్చీఫ్ తడిపి మెడమీద గాయమైనచోట తుడిచాడతను. తరువాత ముఖం మీద నీళ్ళు చల్లాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచింది స్మీతారాణి.

"అంటీకి ఏమయిందంకుల్? మెడ మీద రక్తం ఎలా వచ్చింది?" అడిగింది తులసి ఆశ్చర్యంగా.

"విలన్స్ వచ్చి ఫైటింగ్ చేశారు డియర్! మీ ఆంటీని చంపబోతే నేను కరాటే , బాక్సింగ్ , కుంగ్ ఫూ చేసి వాళ్ళను చావగొట్టి ఆంటీని రక్షించాను."

తులసి ఆనందంతో పొంగిపోయింది! "అబ్బ!  చాణక్య శపదంలో ఫైట్స్ అంకుల్?"

"కొంచెం తేడా వుంది డియర్! దొంగ మొగుడులో ఫైట్స్ అనుకో......."

'అబ్బ! వండర్ ఫుల్ అంకుల్! చిరంజీవిలా ఫైట్ చేశావా అంకుల్."

"చిరంజీవి గ్రాండ్ ఫాదర్ లా చేశాను డియర్!"

"అయ్యో! నన్ను నిద్రలేపి ఫైటింగ్ చేయాల్సిందంకుల్."

సరిగ్గా అప్పుడే బయట కారు స్టార్టయిన శబ్దం వినిపించింది. భవానీ శంకర్ ఒక్క ఉదుటున లేచి బయటకు పరుగెత్తాడు. హాల్లో ఆ యిద్దరూ వ్యక్తులూ లేరు. అప్పటికి దూరంగా వెళ్ళిపోతున్న కారు ఎర్రదీపం కనబడుతోంది.

అతని వెనుకే స్మితారాణి కూడా వచ్చి హాల్లో నిలబడింది.

"స్పృహ తప్పి పడ్డారనుకున్నాను - రాస్కెల్స్ ! పారిపోయారు" అన్నాడు భవానీ శంకర్. స్మిత మాట్లాడలేదు. వెక్కి వెక్కి ఏడ్వేయసాగింది హటాత్తుగా.

భవానీశంకర్ ఆశ్చర్యంగా ఆమె దగ్గరకు నడిచాడు.

"అరె! ఏడుస్తున్నారా? ఎందుకు? ఇప్పుడింక భయమేమీ లేదు స్మితాజీ! అల్ ఈజ్ వెల్!" తులసి ఆశ్చర్యంగా చూస్తుంది స్మిత వేపు.

స్మిత చప్పున కన్నీరు తుడిచేసుకుంది.

"మీరు చెపితే నేను నమ్మలేదు. అయాం రియల్లీ సారీ -" అంది పశ్చాత్తాపంతో.

"ఇప్పుడు కావలసింది పశ్చాత్తాపం కాదు మై డియర్ ఫ్రెండ్! రెండు కప్పుల వేడి "టీ"! మనిద్దరికీ అది చాలా అవసరం అనిపిస్తోంది."

"ఇప్పుడే చేసుకోస్తాను."

"ఈలోగా నేను ఈ హితులకు తగిలిన గాయాలను మా స్టూడెంట్ సహాయంతో రిపోర్టు చేసేస్తాను. " అంటూ బాత్ రూం వేపు నడిచాడతను.

"నా మూలానే మీకీ గాయాలు - నాకు చాలా సిగ్గుగా వుంది " అంది స్మితా రాణి బాధగా.

"నో నో - నాకు చాలా ఆనందంగా వుంది మిస్! ఎచ్చట గాయాలు ఉండునో అచ్చట వసంతము వచ్చును. ఎచ్చట వసంతము వచ్చునో అచ్చట హృదయములు వికసించును -ఎచ్చట హృదయములు వికసించునో -"

స్మిత సిగ్గుపడి వంటింటి వేపు వెళ్ళిపోయింది.

"డైలాగ్ ఏ సినిమాలోదంకుల్ - ఎక్కడా విన్నట్లు గుర్తులేదే"

"ఈ పిక్చర్ ఇంకా రాలేదు డియర్ స్టూడెంట్! ఏ క్షణంలోనయినా రిలీజ్ కావచ్చు. వేచి యుండుము."

రక్తం అంటిన మోచేతిని నీళ్ళతో కడిగి డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న ఫేస్ పౌడర్ ని గాయాలకు అద్దాడు భవానీశంకర్.

ఈలోగా స్మిత రెండు కప్పుల్లో "టీ" తీసుకొచ్చింది.

ఇద్దరూ "టీ" తాగాసాగారు.

"ఆహా! స్వర్గానికి అరంగుళం దూరానికి నెడుతోంది స్మిత మీ చేతి "టీ" అంత అద్భుతంగా చేశారు - " మెచ్చుకున్నాడతను.

"ఇప్పుడు మనమేమి చెయ్యాలి?" పోలీస్ రిపోర్టు ఇద్దామా." అడిగిందామె.

హటాత్తుగా అతను పగలబడి నవ్వటంతో అతని చేతిలోని "టీ" ఒలికి అతని ఫాంట్ మీద పడింది.

"ఎంత గొప్ప జోక్ చేశారు స్మితాజీ, పోలీసులకు రిపోర్టు చేయటమా? వాళ్ళేం చేస్తారు? ముందు వాళ్ళను అరెస్టు చేస్తారు. తరువాత మన దగ్గర కొస్తారు. రెండొందలు అడుగుతారు. మళ్ళీ వాళ్ళ దగ్గర కేళతారు నాలుగొందలు అడుగుతారు - మళ్ళీ మన దగ్గర కొస్తారు మూడొందలు తీసుకుంటారు. తరువాత అయిదొందలు - మన దగ్గర నాలుగొందలు - వాళ్ళ దగ్గర ఆరొందలు -

ఇలా జీవితాంతం మనం ఓవర్ టైములూ, నైట్ డ్యూటీలూ పార్ట్ టైములో , విరామ సమయాల్లో బిచ్చమెత్తుకుని పోలీసు వారికీ అందిస్తూ చివరకు పశ్చాత్తాపంతో సలసల కాగిపోతూ "హూ! పోలీస్ రిపోర్టు - హో - పోలీస్ రిపోర్టు - హహ " అనేసి ఆఖరి శ్వాస వదిలేస్తాం సినిమా హాలు గేటు బయట బఠాణీలమ్ముతూ "స్మితకు నవ్వాగలేదు.

ఆమె మనసులోని భయం కొంతవరకూ తొలగిపోయిందిప్పుడూ .

"ఏం చేద్దామంటారు మరి?"

"మీరు వెంటనే ముఖ్యమయిన బట్టలు, ఇతర సామగ్రి ఓ సూట్ కేసులో సర్దుకుని రడీ అయితే - మనం ఆర్.కె. శ్యామ్ ఇంటికి జేరుకుందాం. తరువాయి కార్యక్రమం వచ్చే సంచికలో."

స్మితారాణి కొద్ది క్షణాలు ఆలోచించింది.

'అంటే వాళ్ళు మళ్ళీ ఎటాక్ చేస్తారని మీరనుకుంటున్నారా?"

"అనుకోవటం కాదు మిస్! చేస్తారు - మీరింకా క్విజ్ ప్రోగ్రాం ఆపి త్వరగా రడీ అయితే -"

"ఇప్పుడే రెడీ అవుతాను" అంటూ లేచి తులసిని తీసుకుని బెడ్ రూంలోకి వెళ్ళిందామే. పది నిమిషాల్లో తులసి సంచీ తగిలించుకుని బయటికొచ్చింది.

ఆమె వెనుకే స్మిత సూట్ కేస్ తో వచ్చేసింది.

"ఆ సూట్ కేస్ ఇటివ్వండి స్మితాజీ! మీలాంటి సుకుమారి మణులు ఇలా ఫిజికల్ లేబర్ చేయకూడదు. మీకు హెల్ప్ చేయటానికే గాడ్ ది గ్రేట్ మాలాంటి ఎనర్జిటిక్ యంగ్ మెన్ ని ప్రపంచం మీద వదిలాడు."

"ఊహు! మీ చేతికి అసలే దెబ్బ తగిలింది - నేనే పట్టుకుంటాను."

:పహలే అప్ - పవలే అప్ - వ్యవహారంలా వుంది మనది! అల్ రైట్ కొంచెం సేపు నేను పట్టుకుంటాను - కొంచెం సేపు మీరు పట్టుకుందురు గాని? ఓ.కే.?"

అతనికి సూట్ కేస్ అందించిందామె.

"అంకుల్ గ్రేట్ ఫఫ్" పిక్చర్ లో కూడా ఇలాంటి సీనే వుందని చెప్పావ్ కదంకుల్. హీరో హీరోయిన్ నేనంటే నేననీ పోట్లాడుకుంటారు గార్డెన్ వర్క్ చేయడానికి."

"కరెక్టు లిటిల్ ఫ్రెండ్ - వండర్ ఫుల్ జ్ఞాపశక్తి నీది?"

ముగ్గురూ రోడ్ మీద కొచ్చారు. అప్పటికే రోడ్ నిర్మానుష్యంగా తయారయింది.

టైం చూసుకున్నాడు భవానీశంకర్. పన్నెండవుతోంది.

బస్ స్టాప్ దగ్గర కనిపించింది ఖాళీ ఆటో. అయిదు నిమిషాలు లేపాక ఆటో డ్రయివర్ బద్ధకంగా నిద్రలేచాడు.

"డబల్ మీటర్ సార్" అన్నాడు నిద్రమత్తులోనే.

"నాకు తెలుసు కామ్రేడ్! నిద్రలో కూడా మీరదే కలవరిస్తారని కమాన్ త్వరగా పోనీ!"

పావుగంటలో శ్యామ్ ఇల్లు చేరుకోగలిగారు వాళ్ళు. డోర్ బెల్ కొద్ది సేపు మోగించాక గానీ తలుపులు తెరుచుకోలేదు.

భవానీశంకర్ నీ, స్మితారాణినీ చూస్తూనే ఆశ్చర్యపోయాడు శ్యామ్.

"ఏమిటి సంగతి" ఏమయినా జరిగిందా" అనుమానంగా అడిగాడతను.

భవానీశంకర్ సమాధానం చెప్పకుండా సూట్ కేస్ తో లోపలి జొరబడ్డాడు. వెనుకే స్మితారాణి, తులసి కూడా లోపలికి కొచ్చేశారు. అఖిలభాను మాక్సీతో బెడ్ మీద నుంచి దిగి వచ్చింది నిద్రమత్తులో.

":హలో సిస్టరిల్లా! ముందీ ముక్కుపచ్చలారని ముద్దు పాపని తీసుకెళ్ళి ఓ బెడ్ మీద పడక ఏర్పాటు చేస్తే మిగతా వివరాలన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెపుతాను" అన్నాడు తులసి చేతిని ఆమె కందిస్తూ.

తులసి ఆమెతో పాటు వెళ్ళి మంచం మీద పడుకుంది.

"మనం అనుకున్నదంతా జరిగింది కామ్రెడ్. నేను స్మితారాణి ఇంటికెళ్ళి జాగ్రత్తగా వుండమని చెపుతూనే వున్నాను. అంతలోనే మన గాంగ్ స్టర్స్ వచ్చేశారు. వాళ్ళను మన పవర్ ఫుల్ బాక్సింగ్ తో పంపించి వేసి వీళ్ళను తీసుకొచ్చేశాను" సోఫాలో కూలబడి చెప్పాడు భవానీ శంకర్.

"ఎవరు వాళ్ళు?"

"అదే తెలీదు కామ్రెడ్. కారు నెంబర్ మాత్రం దొరికింది. దాన్ని బట్టి ఆ గాంగ్ స్టర్స్ ఎవరో కనుక్కోవాలి మనం."

శ్యామ్ నవ్వేశాడు.

"ఇన్ని డిటెక్టివ్ పుస్తకాలు చదివినా ఇంకా కారు నెంబరు నోట్ చేసుకునే బుద్ధి పోలేదన్న మాట నీకు? ఇలాంటి నేరాలు చేయడానికొచ్చే వారు దొంగ నెంబరు ప్లేట్లు పెడతారు. లేదా ఇంకెవరిదయినా కారు దొంగలిస్తారు. కావాలంటే రేపు పోలీసు కంట్రోలింగు రూంకి ఫోన్ చేసి కనుక్కో."

"యూ ఆర్ కరెక్టు కామ్రేడ్! ఆ పాయింట్ నా బుర్రలో ఉంది గానీ ఏదో ఆశ పొరబాటున సొంతకారు తెస్తారేమోనని."

"ఇంతకూ వాళ్ళు మన స్మిత మీద ఎందుకు ఎటాక్ చేసినట్లు అడిగింది అఖిలభాను.

"అదే ఇప్పుడు మనకు మిస్ స్మిత అందించాల్సిన రహస్యం ఫ్రెండ్" అన్నాడు భవానీశంకర్.

స్మితారాణి కలవరపాటుతో భవానీశంకర్ వేపు చూసింది. అతనింకా తన మాటలు నమ్మనట్లు మాట్లాడటం బాధ కలిగించింది.

"నాకూ అదే అర్థం కావడం లేదు. వాళ్ళొచ్చి "భార్గవ్" అనే అతను నాతో ఏం చెప్పాడో చెప్పమని బెదిరించారు. భార్గవ్ అనే అతనూ నేనూ చాలా కాలం భార్యాభర్తల్లా కాపురం కూడా చేశామట. నేను అసలు ఆ పేరూ వినలేదు. ఆ వచ్చినవాళ్ళను ఇంతకుముందు చూడనూలేదు" చెప్పింది స్మితారాణి.

"తమాషాగా ఉందే" అంది అఖిలభాను.

"ఇంకేం మాట్లాడారు వాళ్ళు!" అడిగాడు శ్యామ్.

"ఇంకేమీ లేదు. భార్గవ్ ఏం చెప్పాడు?" అంటూ రెండు మూడు సార్లు అడిగారు అంతే చెప్పిందామె.

అంతా కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయారు.

ఎవరెంత ఆలోచించినా ఎవరికీ ఏమీ తట్టడం లేదు.

"ముందు మనం ఆ ఇద్దరు గాంగ్ స్టర్స్ ని తెలుసుకుంటేనే గాని వాళ్ళెందుకొచ్చిందీ వాళ్ళకేం కావలసిందీ తెలీదు" అన్నాడు శ్యాం. భవానీ శంకర్ ఉత్సాహంగా సోఫాలో ముందుకు వంగాడు.

"కరెక్టు కామ్రేడ్! మనం వెంటనే రంగంలోకి దూకితే గానీ పరిస్థితులు అదుపులో కొచ్చేట్లు లేవు. అఫెన్స్ ఈజ్ బెస్టు ఫారం ఆఫ్ డిఫెన్స్ అనే ఫార్ములా అవసరం చాలా ఉందిక్కడ."

"కానీ అసలు వాళ్ళెవరో ఎలా తెలుసుకుంటారు మీరు" అడిగింది అఖిలభాను.

"దౌజెండ్ డాలర్ కొశ్చేన్ సిస్టరిల్లా! ఎటొచ్చి కొశ్చేన్ కొంచెం ఆలోచించిన తరువాత వేసివుంటే ప్రజలు హర్షించేవాళ్ళు - వాళ్ళను కనుక్కోవటం చాలా ఈజీ ! రేపు పోలీసు స్టేషన్ కెళితే వాళ్ళ అడ్రస్ లు - వాళ్ళ ఆచార వ్యవహారాలూ అన్నీ తెలిపోతాయ్!"

"అంటే?"

## 6

"ఇవాళ మధ్యాహ్నమే వాళ్ళ కారు స్మితారాణిని డీ కొట్టబోయి ప్రమాదానికి గురయింది. పోలీసులు అతనిని పోలీసు స్టేషనుకు లాక్కెళ్ళరు. గనుక అక్కడ వాళ్ళ జాతకాలూ, అడ్రస్ లూ అన్నీ ఖచ్చితంగా రికార్డు చేసే వుంటారు.

'అయితే ఇప్పుడే వెళ్ళి తెల్సుకుందాం!" ఆవేశంగా అన్నాడు శ్యామ్.

"ఎలాంటి భయంకరమయిన పరిస్థితులలో ఉన్నాసరే మనం అర్ధరాత్రుళ్ళు పోలీస్ స్టేషన్ కెళ్ళాకూడదు కామ్రేడ్ శ్యామ్. నిద్రమత్తులో వున్న కానిస్టేబుల్స్, నిద్ర డిస్టర్బ్ చేసినందుకు మనల్ని లోపల పడేసి వాళ్ళు నిద్రలో మునిగిపోతారు మళ్ళీ. కనుక ప్రస్తుతానికి రెస్టు తీసుకుంటే మిగతా కార్యక్రమాలన్నీ రేపొద్దున్నే ప్రకటించవచ్చు."

"హలో సిస్టరిల్లా? ఓ చాపా, తలగడా ఇటు పారేస్తే నేను "హాపీ స్లీప్ ఇయర్ ఎగైన్" స్కీమ్ లో కెళ్ళిపోతాను."

అఖిలభాను చాప తలగడ తెచ్చి అతనికిచ్చింది.

"ఒకే కామ్రేడ్స్ గుడ్ నైట్ విష్ యూ స్వీట్ డ్రీమ్స్." అంటూ చాప పరిచి దాని మీద వాలిపోయాడతను.

ఉదయం మెలకువ వచ్చేసరికి టైం తొమ్మిదయిపోతోంది. అప్పటికే శ్యామ్ రడీ అయిపోయి కనిపించాడు.

"నువ్వెప్పుడు లేస్తావా అని చూస్తున్నాను. మనము పోలీస్ స్టేషన్ కెళ్ళాలి కదా." అన్నాడు చిరునవ్వుతో.

భవానీ శంకర్ ఒక్క వుదుటున లేచి కూర్చున్నాడు.

"సారీ కామ్రేడ్! శరీరానికి నిన్న కొంచెం ఎక్సర్సయిజ్ ఎక్కువ అవటం వల్ల నిద్ర కోటా పెరిగిపోయింది. పది నిమిషాలలో రడీ అయిపోతాను. ఈలోగా సిస్టరిల్లాను వేడివేడి కాఫీ ఫలహారాలు సిద్ధంగా వుంచమని చెప్పు." అంటూ లేచి బాత్ రూమ్ వేపు పరుగెత్తాడతను.

ఇద్దరూ పోలీస్ స్టేషన్ చేరుకునే సరికి మధ్యాహ్నమయి పోయింది.

ఇన్ స్పెక్టర్ వాళ్ళను చూస్తూనే చిరాకు పడ్డాడు.

"యస్ - ఏం కావాలి మీకు?" మాములుగానే విసుగ్గా అడిగాడు.

"నిన్న మా సిస్టర్ ని ఓ కారు డాష్ ఇవ్వబోయింది ఇన్ స్పెక్టర్ గారూ! ఆ కేసు మీరే రిజిస్టర్ చేసి ఉంటారు బహుశా!" అన్నాడు శ్యామ్.

"ఇప్పుడెం కావాలి మీకు?" మళ్ళీ చిరాకుగా అడిగాడతను.

"ఆ కారు ఎవరిదో అతని అడ్రస్సేమిటో కొంచెం మాకు చెపితే"

"ఎందుకు మీకది?" శ్యామ్ ఆ ప్రశ్నతో ఉక్కిరి బిక్కిరయ్యాడు.

భవానీ శంకర్ చప్పున అందుకున్నాడు.

"ఆ కారు డాష్ ఇవ్వడం వలన మా స్మితారాణికి గాయాలు తగిలాయ్ కామ్రేడ్! మరి ఆ గాయం తాలుకూ మందులకూ, డాక్టర్ ఫీజులకూ కారు ఓనరులే డబ్బు కట్టడం మన దేశపు ఆనవాయితీ గనుక" ఇన్ స్పెక్టర్ ప్రవర్తనలో సడెన్ గా మార్పు వచ్చేసింది.

"అల్ రైట్ ఇప్పుడే ఇస్తాను" అనేసి ఎవర్నో పిలవబోయి మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్లు అనుమానంగా భవానీశంకర్ వేపు చూశాడు . "మీరు ఇప్పుడా కారు వాళ్ళమీద కంప్లయింటేమీ ఇవ్వటం లేదు కదా?"

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"అలాంటి ఆలోచనలేమీ ప్రస్తుతానేకీ లేవు కామ్రేడ్! ఇన్ ఫాక్టు జనాభాను పెరగకుండా అదుపులో పెట్టేందుకూ కృషి చేస్తోన్న ఆ కారు డ్రయివరుకీ, యజమానులకూ సన్మానం చేయాలని చాలా కోరికగా ఉంది మాకు."

ఇన్ స్పెక్టర్ భవానీశంకర్ వేపు కోపంగా చూశాడు.

"ఇదిగో చూడు మిస్టర్! ఇంకోసారి "కామ్రేడ్" అని అనకు నన్ను అర్ధమయిందా?"

'అయింది కామ్రేడ్! నేనూ తెలుగు మీడియంలోనే చదివాను.

ఇన్ స్పెక్టర్ కోపం దిగమింగుకుని రైటర్ ని పిలిచాడు.

"రామస్వామి నిన్న మనం బుక్ చేసిన ఆ కారు ఒనర్సు డిటెయిల్స్ కావాలిట వీళ్ళకు! ఇచ్చేయ్."

"అలాగే సార్! అన్నాడతను. "నాతొ రండి" అన్నాడు భవానీ శంకర్ వేపు తిరిగి.

ఇద్దరూ రామస్వామి వెంబడి నడవసాగారు.

"ఆ కారు ఓనరు ఎవడో గాని వీళ్ళను బాగా తడిపినట్లున్నాడు అందుకే మనం కంప్లయింట్ ఇవ్వకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు" శ్యామ్ తో అన్నాడు భవానీశంకర్.

"రాసుకోండి" అన్నాడు రైటర్ ఓ రిజిస్టర్ తీసుకొచ్చి.

భవానీశంకర్ వెంటనే తన డయిరీ, పెన్ను తీసుకున్నాడు చేతిలోకి.

"భార్గవ్, గోదావరి ఫ్లాట్స్ , ఫ్లాటు నెంబరు 602 బేగం పేట హైదరాబాద్.

"థాంక్యూ కామ్రేడ్ మీ రుణం ఏదొక రోజు తీర్చేసుకుంటాను అంటూ బయటకు నడిచాడతను.

"హరియప్ కామ్రేడ్! ఆర్.కె. శ్యామ్ అర్జంటుగా మనం ఈ అడ్రసుకి చేరుకొని దీని వెనుక వున్న మిస్టరీ ఏమిటో తెల్సుకోవాలి కనుక థర్టీ కిలోమీటర్సు ఫర్ అవరు చొప్పున నీ సైకిల్ వేగం మెయింటేన్స్ చేయాల్సివస్తుంది." అన్నాడు అతని సైకిల్ కారియర్ మీద కూర్చుంటూ.

ఆర్.కె. శ్యామ్ సైకిల్ వేగం పెంచాడు.

అరగంట తర్వాత వాళ్ళు గోదావరి ఫ్లాట్స్ చేరుకున్నారు. మెయిన్ రోడ్ కి చాలా దూరంగా వుందా బిల్డింగ్.

లిఫ్టులో ఆరో అంతస్తు చేరుకున్నారు.

లిఫ్టు పక్కనే ఉంది "602" నెంబరు గల ఇల్లు.

డోర్ బెల్ నొక్కాడు భవానీశంకర్.

నిమిషం సేపు గడిచిపోయినా ఎవరూ తలుపు తీయలేదు. మరోసారి మీట నొక్కి - శ్యామ్ వేపు చుశాడతను.

"రడీగా వుండు కామ్రేడ్ శ్యామ్! తలుపు తెరవగానే మనం యాక్షన్ లోకి దిగాల్సిన పరిస్థితులు రావచ్చు" శ్యామ్ ని హెచ్చరించాడు అతను.

"ఆయామ్ రెడీ!" అన్నాడు శ్యామ్ పిడికిళ్ళు బిగిస్తూ.

తలుపులు ఇంకా తెరచుకోక పోవటం చూసి ఎకధాటిన నిమిషం పాటు బెల్ మోగించాడాతను. అయినా సమాధానం లేకపోయేసరికి తలుపు మీద గట్టిగా తట్టాడు. తట్టగానే తెరుచుకుంది. తలుపు లోపల గడియ వేసిలేదని అర్ధమయిందతనికి.

"భార్గవ్" తల లోపలకు పెట్టి గట్టిగా పిలిచాడతను. అయినా ఎలాంటి సందడి కనిపించక పోయేసరికి యిద్దరూ లోపలికి నడిచి హాలు మధ్యలో నిలబడ్డారు.

"హలో! యింట్లో ఎవరు?" గట్టిగా అరిచాడు శ్యామ్.

"పరిస్థితులు కొంచెం తమాషాగా యాక్షన్ చేస్తున్నాయ్ కామ్రేడ్! నువ్ ఏ వస్తువులూ ముట్టుకోకుండా నా వెనుకేరా" అంటూ లోపలి గదివేపు నడిచాడు భవానీశంకర్.

బెడ్ రూములో ఎవరూ కనిపించలేదు. కానీ గదంతా బట్టలు, కాగితాలు, చిందర -వందరగా పడేసి ఉన్నాయ్. ఓ మూలగా వున్నా స్టీల్ అల్మారా కొంచెంగా తెరిచి వుంది. అల్మారా డోర్స్ తెరిచి చూడటానికి ప్రయత్నించాడు భవానీశంకర్. దభీల్ మని అల్మారాలో నుంచి ఓ పెద్ద మూట అతని కాళ్ళ మీదకు జారిపడింది.

ఇద్దరూ అదిరిపడి వెనక్కు గెంతారు. అది మూట కాదు! మూటలా చుట్టబడిన శవం. బట్టలన్నీ రక్తపు మరకలతో నిండి భయంకరంగా కనబడుతోంది.

"బహుశా యితనే భార్గవ్ అయుంటాడు" అన్నాడు భవానీశంకర్ వెంటనే కోలుకుని.

"ఎవరో మర్డర్ చేశారు" అన్నాడు శ్యామ్ కలవరపాటుతో.

"ఇపుడు కొంపదీసి ఈ తద్దినం మనమీదకు రాదుగదా?"

"రాకముందే మనం ఈ పరిసరాలను వదిలేయాలి కామ్రేడ్! యిక్కడ ఈ మర్డరు గురించి చర్చించుకునేంత

సమయం ఏమాత్రం లేదు" అంటూ బయటకు నడవసాగాడు.

హటాత్తుగా అతని దృష్టి టేబుల్ మీదున్న డయిరీ మీద పడింది. వెంటనే అది తీసుకుని తన బాగ్ లో వేసుకున్నాడతను. అప్పుడు వినిపించింది - బయట తలుపు ఎవరో విసురుగా మూసేసిన శబ్దం.

ఇద్దరూ ఉలిక్కిపడి ముఖాలు చూసుకున్నారు. భవానీశంకర్ పరుగుతో హాల్లోకి నడిచి ఆ తలుపు తెరవటానికి ప్రయత్నించాడు. కానీ అది లాక్ అయినట్లు తెలిసిపోయింది.

"మనల్ని ఎవరో ట్రాప్ చేశారు" అన్నాడు శ్యామ్ కలవరపాటుతో.

"అవును! ఆ పక్షులు వెంటనే పోలీసులకు ఫోన్ చేస్తారు. ఇంకాసేపట్లో పోలీసులు వస్తారు. ఈ శాల్తీని మనమే హత్య చేశామని లోపల పడేస్తారు. చాలా రొటీన్ స్టఫ్ కామ్రేడ్ యిది! మనం చిన్నప్పటి నుంచి సినిమాలలో చూస్తూనే వున్నాము. డిటెక్టివ్ పుస్తకాల్లో చదువుతూనే వున్నాం. ఈ హంతకుల గ్యాంగ్ - పాపం యింకా పాత పద్ధతులలోనే ఆపరేట్ చేస్తోంది."

"ఇప్పుడు మనం ఎలా తప్పించుకోవటం?"

"వెరీ సింపుల్ కామ్రేడ్ శ్యామ్ మన భుజబలం ఉపయోగించి తలుపు విరగొట్టటమే ఏకయిక మార్గం" అంటూ వంటిట్లోకి పరిగెత్తి సన్నని పొడవాటి రాడ్ కర్చీఫ్ తో పట్టుకుని బయటకొచ్చాడు. రెండు నిమిషాలలో డోర్ నాబ్ ఊడి వచ్చింది. రాడ్ వంటింట్లోకి విసిరేసి యిద్దరూ త్వరత్వరగా మెట్లు దిగి సైకిల్ మీద బయలుదేరారు. జన ప్రవాహంలోకి జొరబడ్డాక వారికి కనిపించింది పోలీస్ జీప్.

"అది చాలా ఒండర్ ఫుల్ డిపార్టు మెంటు కామ్రేడ్! ప్రపంచంలో కెల్లా పేరెన్నికగన్నది భారతదేశంలోని పోలీస్ ! భారతదేశంలో కెల్లా పేరెన్నికగన్నది ఆంధ్రప్రదేశ్ పోలీస్! అందులోనూ అద్భుత ప్రావీణ్యత మన రాజధాని నగర శాఖది. దేశంలోని దొంగలూ, హంతకులూ అందరికీ పారడైజ్ బ్రదర్ మన రాజధాని."

యిల్లు చేరుకోగానే అఖిలభాను స్మితారాణి వాళ్ళ చుట్టూ మూగారు.

"ఏం జరిగింది?" ఏమయినా వివరాలు తెలిశాయా?" అడిగింది అఖిలభాను.

"కేస్ యింకా పరిశోధనలోనే వుంది సిస్టరిన్ లా! ముందు మాకు భోజన సత్కారాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే తర్వాత రంగంలోకి దూకటానికి సాధ్యమౌతుంది."

స్మితారాణి త్వరత్వరగా వారికి భోజనాలు వడ్డించింది.

"కమాన్ మైడియర్ ఫ్రెండ్స్! అందరం కలిసి భోజనం చేద్దాం! కామ్రేడ్ తులసి ఆకలిగా చూస్తున్నట్లు అనుమానంగా వుంది."

"మేమేప్పుడో తినేశాం" నవ్వుతూ అంది అఖిలభాను.

"వ్వాట్? పవిత్ర భారతదేశంలో భర్తాగ్రేసరుడు భోజనం చేయక ముందే భార్య భోజనం చేయటమా? వెరీ స్ట్రేంజ్ ఫినౌమినా కామ్రేడ్ అఖిలభానుజీ"

"అలాంటి పిచ్చి వ్యబహారాలు మనకు నచ్చావ్! ఆ మొగుడుగాడు అడ్డమయిన ఫ్రెండ్స్ తో కాఫీ హోటల్స్ లో తిని తిరుగుతుంటే పెళ్ళాం యింటి దగ్గర తులసి చెట్టు ముందు కూర్చుని పాటలు పాడుతూ ఆకలితో చావాలా? రబ్బిష్" అందామె చిరాగ్గా.

భోజనాలు ముగిశాక భార్గవ్ యింట్లో దొరికిన డయిరీతీసి వరసగా పేజీలు తిరగేయసాగాడు.

ఇంచుమించుగా మొదట్లో పేజీలన్నీ ఖాళీగానే వున్నాయ్. సగం పేజీలు తిప్పాక కనిపించింది "సంధ్యారాణి" అనే పేరు అపాయింట్ మెంట్స్ లో రాసి వుంది పేరు గురించి.

"ఇవాళ సాయంత్రం సంధ్యారాణిని కలుసుకోవాలి?"

ఆ తర్వాత చాలాసార్లు సంద్యారాణిపేరు అప్పాయింట్ మెంట్స్ కాలంలో రాసివుంది.

"మనకు ఈ సంధ్యారాణి అడ్రస్ దొరికితే కొంత ఇన్ ఫర్మేషన్ దొరుకుతుందనుకుంటాను" అన్నాడు భవానీశంకర్.

డైరీలో అడ్రస్ పేజీలు తిప్పడతను. చాలా తక్కువ అడ్రసులున్నాయి. ఆఖరులో కనిపించిందామె పేరు, పేరు కెదురుగా టెలిఫోన్ నెంబరు.

"ఈ సంధ్యారాణి ఎవరో, ఆమె చరిత్ర ఏమిటో, అవన్నీ మనం ముందు పరిశోధించాల్సి వుంది. కామ్రేడ్ ఆర్.కె. శ్యామ్ .ఆ వివరాలన్నీ సేకరించుకుని నేను మళ్ళీ రాత్రికి పునర్దర్శనం యిస్తాను" అన్నాడతను . సంద్యారాణి ఫోన్ నెంబరు తన డైరీలో రాసుకుంటూ.

"జాగ్రత్త! రిస్క్ తీసుకోవద్దు " అన్నాడు శ్యామ్.

"మనదేశంలో రిస్కు అనేది పుట్టుకతోనే మొదలౌతుంది కామ్రేడ్! పసికందుని హాస్పిటల్లో కుక్కలేత్తుకుపోవటం, స్కూల్లో సీటు దొరక్కపోవటం, ఎండకు వడగొట్టి పడిపోవటం , వానకు వరదొచ్చి పైకెళ్ళి పోవటం, తాగే నీళ్ళకోసం, సినిమా టిక్కెట్ కోసం, రేషన్ కోసం ఇలా అనుక్షణం రిస్కు బ్రదర్! అలాంటి రిస్కులు లేకపోతే జీవితంలో థ్రిల్ వుండదని మన ప్రభుత్వం యొక్క అచంచల విశ్వాసం! అంచేత డోంట్ వర్రీ అబౌట్ ది రిస్క్! వస్తా"

అనేసి బయటకు నడిచాడు . తిన్నగా నడిచి ఎదురుగా వున్న హోటల్లో నుంచి ఆ నెంబర్ కి డయల్ చేశాడతను.

కొద్దిక్షణాలు మోగ్రాక ఓ స్త్రీ గొంతు వినిపించిందతనికి.

"హలో!" అందా గొంతు తీయగా.

"హలో - సంధ్యారాణిగారేనా?"

"అవును! మీరెవరు?"

"హలో - నన్ను గుర్తు పట్టలేదా ఫ్రెండ్" నేను భవానీశంకర్ ని!"

ఆమె కొద్ది క్షణాల వరకూ మాట్లాడలేకపోయింది.

"వుచ్ భవానీశంకర్!" అడిగింది తేరుకుని.

"అప్పుడే మర్చిపోయారా మిస్! వెరీ బాడ్! మనం ఇంత క్లోజ్ ఫ్రెండ్సయి వుండి కూడా నాల్రోజులు కలుసుకోక పోయేసరికి అలా మర్చిపోవటం చాలా దారుణం ఫ్రెండ్! బైదిబై మిమ్మల్ని కలుసుకుని ఓ అరగంట సరదాగా మాట్లాడుతూ గడపాలని నా కోరిక. మరి మీకెప్పుడు తీరిక వుంటుందో చెపితే."

ఆమె మళ్ళీ ఆలోచనలో పడింది.

"ఇవాళ నేను చాలా బిజీగా వున్నాను!"

"నో ప్రాబ్లెం డియర్! రేపు కల్సుకుందాం! మాణింగ్ ఎయిటో క్లాక్ ఓ.కే.?"

"ఓ.కే."

"హలో - వన్ మినిట్ ఫ్రెండ్ మీ ఇంటి అడ్రసు ఎక్కడో పోయింది. చెపితే నోట్ చేసుకుంటాను."

ఆమె కొద్ది క్షణాలు మౌనం వహించింది. తర్వాత ఫోన్ డిస్కనెక్ట్ అయిపోయింది. తను అడ్రస్ అడిగి చాలా తెలివి తక్కువ పని చేశానని భవానీశంకర్ కి అర్ధమైపోయింది.

వెంటనే మళ్ళీ రింగ్ చేశాడామెకి. "ఎంగేజ్" అయిన శబ్దం వినిపించసాగింది. మరో అరగంట వరకూ అక్కడే నిలబడి ప్రతి అయిదు నిమిషాలకూ ఓసారి రింగు చేస్తూనే ఉన్నాడు. అయినా లాభం లేకపోయేసరికి అక్కడి నుంచి తన రూముకి బయలుదేరాడు.

బస్ దిగి రూమ్ వేపు నడుస్తుంటే వెనుకనుంచి కేక వినిపించింది.

"హలో గురూజీ -హలో-"

వెనక్కు తిరిగి చూశాడు భవానీశంకర్. ఫోటో స్టూడియో లో నుంచి శివనారాయణ చేయి వూపి పిలుస్తున్నాడు తనని.

అతను స్టూడియోకు చేరుకొని కుర్చీలో కూలబడ్డాడతను.

"మీ ప్రింట్స్ అన్నీ రడీ చేశాన్సార్ - చాలా బాగా వచ్చాయ్......" అంటూ డ్రాయర్ నుంచి ఓ కవరు తీసి అతని ముందుంచాడు.

భవానీశంకర్ ఫోటోలు తీసి చూశాడు. తన దగ్గర ట్యూషన్ కొచ్చే పిల్లలందరూ వెలిగిపోతున్నారు ఫోటోల్లో. అందరికంటే బాగా తులసి వుంది.

"మరి జే. స్మితారాణి ఇచ్చిన రీల్ తాలుకూ ప్రింట్స్ కామ్రేడ్ అవి కూడా బాగా వచ్చాయా?"

"ఓ! ఫస్టుక్లాసుగా వచ్చాయి సార్!"

"అవి కూడా నాకిచ్చేయ్ కామ్రేడ్ డబ్బు నేనే ఇస్తాను."

శివనారాయణ కొంచెం కన్ ఫ్యుజన్ లో పడ్డాడు.

"కానీ ఆమె వచ్చి అడిగితే-"

"డోంట్ వర్రీ కామ్రేడ్ - మా ఇద్దరి మధ్యా పాము ముంగిస వైరం ఆగిపోయాయ్. ప్రస్తుతం పాలు నీరులా కలిసిపోయి బ్రతుకుతున్నాం అందుచేత అనుమానాలు పక్కకు నేట్టేసేయ్."

ఫోటోలు తీసుకుంటుంటే టేబుల్ మీద ఓ పక్కగా కనిపించిందతనికి టెలిఫోన్ డైరెక్టరీ.

చటుక్కున అది చేతిలోకి తీసుకున్నాడతను.

"కామ్రేడ్! నేను ఈ పుస్తకంలతో పాటు కొద్ది గంటలు గడపదలుచుకున్నాను. కనుక మధ్యలో నన్ను డిస్టర్బ్ చేయకు. ..." అంటూ సంధ్యారాణి ఫోన్ నెంబర్ కోసం వేగంగా వెతకటం ప్రారంభించాడతను."

"నా పేరు విక్రమార్కారావు సార్! ఇంతకూ నాకో విషయం అర్ధం కావటం లేదు. గురూజీ." కొద్ది క్షణాలాగి అన్నాడు శివనారాయణ .

"యస్ కామ్రేడ్! ఏమిటది?"

"మీరు చెప్పినట్లే నిన్న టి.వి . స్టేషను కెళ్ళి నా స్క్రిప్టు అన్నీ ప్రొడ్యూసర్ కి ఇచ్చానండీ! అని ఎంతో బాగున్నాయని భలే మెచ్చుకున్నారు సార్ అయన! కానీ అన్నీ ఇవాళ పోస్టులో తిరిగి వచ్చేశాయ్ ఎందుకుని

సార్?"

"ప్రతి స్క్రిప్టు తో పాటు వందనోటు జతచేసి పంపాలి కామ్రేడ్ అక్కడ దెబ్బతిన్నావు నువ్వు. దూరదర్శన్ అంటే అర్థం అదే. వాళ్ళ దగ్గర ఏ పని మీద వెళ్ళాలన్నా దూరంగా అలోచించి అప్పుడు దర్శనం చేసుకోవాలి!"

విక్రమార్కారావు ముఖం వెలిగిపోయింది.

"అబ్బ! ఎంత గొప్పగా చెప్పాను సార్! అయితే త్వరగా కోటీశ్వరుడవ్వాలంటే దూరదర్శన్ లో చేరాలన్న మాట! నేనింకా కస్టమ్స్ డిపార్టుమెంటే బెస్ట్ అనుకుంటున్నాను గురూజీ!"

భవానీ శంకర్ అతనికి జవాబివ్వలేదు. సంధ్యారాణి పేరు మీద ఆమె నెంబర్ కనిపించకపోవటం వల్ల నెంబర్ ని బట్టి అడ్రస్ వెతకటానికి నిర్ణయించుకున్నాడతను.

రాత్రి పదవుతొండగా విక్రమార్కారావు వచ్చి అతని దగ్గర నిలబడ్డాడు.

"ఓ.కే. కామ్రేడ్! నేను వెళ్ళటానికి రడీయేగాని ఓ కండిషన్ ఉంది"

"ఏమిటి సార్ అది?"

"ఈ డైరక్టరీ ఈ రాత్రికి నా దగ్గరే వుంటుంది."

"అలాగే సార్ - తీసుకెళ్ళండి."

భవానీ శంకర్ డైరక్టరీ తో పాటు తన గదికి నడవసాగాడు. నిద్ర ముంచుకోస్తోందతనికి. అంతకు ముందు రాత్రంతా ఇంచుమించుగా నిద్ర పోనేలేదు. మరోపక్క ఆకలి. గది చుట్టుపక్కలంతా చీకటి దట్టంగా పేరుకుపోయి వుంది. గది ముందు నిలబడి తాళం చెవి కోసం జేబులు వెతికి కీచైన్ బయటకు లాగాడు. తాళం తీసి గది తలుపులు తెరిచి లైట్ స్విచ్ కోసం గోడ తడుముతుంటే వినిపించింది ఎవరో అడుగులు వేసిన చప్పుడు.

చటుక్కున గోడకానుకుని నిలబడి చుట్టూ చూశాడు. కిటికీ పక్కన నీడల్లా కదిలాయ్ రెండు ఆకారాలు. మరుక్షణంలో టార్చిలైట్ కాంతి అతని ముఖం మీద పడింది. టక్కున స్విచ్ వేశాడు భవానీశంకర్ హండ్రెడ్ కాండిల్స్ బల్బు క్షణంలో కాంతిని విరజిమ్మింది గదంతా.

లావుపాటి వ్యక్తీ, సన్నని వ్యక్తీ ఇద్దరూ కిటికీ దగ్గర నిలబడి వున్నారు. సన్నని వ్యక్తీ చేతిలో పిస్టల్ కనబడుతోంది. గదంతా వెతికినట్లు చిందర వందరగా పడివున్న పుస్తకాలు చెబుతున్నాయి.

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు వాళ్ళవేపు చూసి.

"హలో కామ్రేడ్స్! నేను మొన్న కుట్టించుకున్న సఫారీ సూట్ కాజేయడానికి వచ్చారన్నమాట! అంతేనా?" అడిగాడతను.

వాళ్ళిద్దరూ మొఖాలు చూసుకుని నవ్వుకున్నారు.

"చూశావా - ఎంత చలాకీగా మాట్లాడుతున్నాడో?" లావుపాటి వ్యక్తితో అన్నాడు రెండోవాడు.

"అవునవును! తను చాలా స్మార్ట్ అనుకున్నాడు."

"నన్నడిగితే నేనే గది "కీ" ఇచ్చేవాడిని కామ్రేడ్! యిప్పుడు చూడండి పాపం! అనవసరంగా కిటికీ చువ్వలు వంచి లోపలికి దూకడం చీకట్లో ఆ గుడ్డి టార్చ్ లైట్ వేసుకుని వెతుక్కోవడం ఎంత బాధయిపోయిందో మీకు?"

మళ్ళీ లావుపాటి వ్యక్తీ వేపు చూసాడు రెండోవాడు.

"చూశావా! ఎంత బాగా నటిస్తున్నాడో?" పిస్టల్ గురిపెట్టి వుంటేనే మాట్లాడాడు.

"బ్రహ్మాండమైన నటన నిజంగానే" ఒప్పుకున్నాడు లావుపాటి వ్యక్తి.

"భట్రాజుల్లా చాలా బాగా పొగుడుతున్నారు కామ్రేడ్! ఇంక బోడి పొగడ్తలు ఆపి ఇక్కడికి ఏం పనిమీద వచ్చారు త్వరగా చెప్పండి. చిరాకుగా అన్నాడు భవానీశంకర్.

"మనం ఏం పనిమీద వచ్చామో చెప్పమని అడుగుతున్నాడు విన్నావా?" అడిగాడు సన్నపాటి వ్యక్తి.

లావుపాటి వ్యక్తి తలూపాడు.

"విన్నాను - విన్నాను."

"మరి ఏం సమాధానం చెప్పమంటావు?"

"పిచ్చివాగుడు వాగాకుండా మర్యాదగా మన వస్తువు మనకివ్వమని చెప్పు."

సన్నవాడు ఈసారి భవానీశంకర్ వేపు చూశాడు.

"విన్నావుగా! ఇంక నాటకాలాడటం ఆపి అదెక్కడుందో చెప్పు." అన్నాడు తీవ్రంగా.

"ఏమిటది?" కుతూహలంగా అడిగాడు భవానీశంకర్.

సన్నపాటి వ్యక్తి నవ్వాడు.

"నేను చెప్పలేదూ ఓవర్ స్మార్టు అనీ! ఏమిటదీ అంటూ మనల్నే కొశ్చేన్ చేస్తున్నాడు."

"లావుపాటి వ్యక్తి ముఖంలో కోపం పెరిగిపోయింది. భవానీశంకర్ వేపు నడుస్తూ భయంకరంగా గర్జించాడు.

"ఇంక నీ అతి తెలివి ఆపి అదెక్కడ దాచావో చెప్పు?"

భవానీశంకర్ ఏ మాత్రం జంకలేదు. అతనికిప్పుడు కొంతవరకూ అర్ధమయిపోయింది. వాళ్ళక్కావలసిన వస్తువేదో తన దగ్గర వుందనుకుంటున్నారు. అదేదో చాలా విలువయినదయి ఉండాలి. కనుక అది దొరికే వరకూ తన ప్రాణానికి ఎలాంటి హానీ చేయలేరు. తను ఆ ఫిస్టల్ వ్యక్తి గురించి పట్టించుకోవాల్సిన అవసరమే లేదు.

"ఏమిటది?" అడిగాడు భవానీశంకర్.

సన్నటి వ్యక్తి అసహనంగా తనూ రెండడుగులు ముందుకొచ్చాడు.

"వీడికి చాలా సరదాగా వున్నట్లుంది. రెండు బుల్లెట్సు ఎక్కిస్తే గానీ దార్లోకి రాడు."

## 7

"ఇప్పుడే కాదు" అన్నాడు లావుపాటి వ్యక్తి.

అప్పుడు గమనించాడు భవానీశంకర్ , అతను తనకు చాలా సమీపంగా వచ్చేశాడు. తను మెరుపు వేగంతో ఎటాక్ చేయగలిగితే ఒకే ఒక గుద్దుతో మళ్ళీ లేవకుండా చేయవచ్చు. సరిగ్గా అప్పుడే లావుపాటి వ్యక్తి ప్రక్కకు తిరిగి రెండో వాడితో మాట్లాడటం కనిపించింది భవానీశంకర్ కు. ఇంక ఆలస్యం చేయకుండా తన శక్తి నంతా ఉపయోగించి అతని ముఖం మీద బలంగా కొట్టాడు. లావుపాటి వ్యక్తి ఆ దెబ్బకు వెనుక ఉన్న కుర్చీ మీద పడి తర్వాత కుర్చితో సహా నేల మీద పడిపోయాడు. ఈ హటాత్సంఘటనకు సన్నటి వ్యక్తి నివ్వెరపోయాడు. భవానీ శంకర్ అతని మీద కూడా వెళ్ళబోయెంతలో తేరుకుని పిస్టల్ ట్రిగ్గర్ మీద వేలు నొక్కాడు.

"అక్కడే నిలబడు - లేకపోతే చస్తావు" అన్నాడు కఠినంగా.

భవానీ శంకర్ నిలబడి పోయాడు. తనేం చేసినా ఫిస్టల్ పేలుతుంది. ఈ పరిస్థితి చూసి కిందపడిన వ్యక్తి లేచి నిలబడ్డాడు. నిలబడటంతోనే భవానీ శంకర్ మీదకు అతి భయంకరంగా వచ్చేశాడు. అతనిని ఇప్పుడు

ఎదుర్కోవడం కష్టమని అర్థమయిపోయింది భవానీశంకర్ కి. వెనక్కు ఒక్కొక్క అడుగే వేయడం ప్రారంభించాడు. అతను ఒక్కొక్క అడుగే ముందుకి వస్తున్నాడు. సడెన్ గ ముందుకి దూకి అతని ముఖం మీద ఇంకొక్క షాట్ ఇస్తే మరోసారి కింద నుంచి లేవడని నమ్మకం కలిగింది అతనికి. మరుక్షణం అతను గాలిలోకెగిరి ముందుకు దూకి అతని ముఖం మీద కు వదిలాడు పిడికిలిని. లావుపాటి వ్యక్తీ ఇది ముందే ఊహించటం చేత పక్కకు తిరిగాడు అంతే! భవానీ శంకర్ చేయి అతని భుజం పక్క నుంచి గాలిలోకి దూసుకుపోయింది ఆ పరిస్థితి నుంచి మళ్ళీ కూడదీసుకోక ముందే లావుపాటి వ్యక్తీ పిడికిలి అతివేగంగా బలంగా భవానీ శంకర్ మెడ మీద తాకింది. ఆ స్పీడులో భవానీ శంకర్ వెనుక వున్న గోడను కొట్టుకుని కిందపడిపోయాడు. మెడ మీద చాల పెద్ద బరువున్న వస్తువేదో పదినట్లనిపించిందతనికి. ఈలోగా సన్నని వ్యక్తీ భవానీ శంకర్ దగ్గర కొచ్చి పిస్టలు వెనక్కు తిప్పి అతని నెత్తి మీద కొట్టాడు. తల పగిలిపోయినంత బాధ భవానిని మెలికలు తిరిగేట్లు చేసింది. తల మీద గాయం తగిలిన చోట నుంచి రక్తం ప్రవహిస్తోంది.

లావుపాటి వ్యక్తీ రెండో అతన్ని అభినందించాడు.

చాలా కరెక్టు పని చేశావ్! లేకపోతే మరీ అల్లరి చిల్లరిగా ప్రవర్తిస్తున్నాడు."

భవానీశంకర్ కొద్ది క్షణాల తర్వాత కింద నుంచి లేచి కూర్చున్నాడు. చాతీ పై భాగమంతా నొప్పి, భయంకరమైన నొప్పి, ఓర్చుకుంటూ తలెత్తి వాళ్ళిద్దరి వేపూ చూశాడు. లావుపాటి వ్యక్తీ నోటి మీద తగిలినట్లుంది తను కొట్టిన దెబ్బ. పెదాల మీద రక్తం చార కనబడుతోంది.

చొక్కా పట్టుకుని భవానీశంకరుని లేపి నిలబెట్టాడు లావుపాటి వ్యక్తీ.

"నువ్వొక్కడివే తీస్ మారే ఖాన్ నని అనుకోకు! నిన్ను మించిన వాళ్ళు చాలా మంది వున్నారు -" అన్నాడతను.

"సరిపోయిందా! ఇంకొంచెం ట్రీట్ మెంట్ కావాలా?" అడిగాడు సన్నని వ్యక్తీ.

భవానీ శంకర్ ఏమీ మాట్లాడలేదు. ఉన్న నొప్పికంటే ఇంకొంచెం ఎక్కువ బాధతో విలవిలలాడుతున్నట్లు నటించసాగాడు.

"ఇప్పుడు చెప్పు! సంధ్యారాణి దగ్గర్నుంచి తెచ్చి ఎక్కడ దాచావ్ అది!"

"అదేమిటో నాకు తెలీదు-"

"నేను చెప్పలేదూ - వీడంతా తేలిగ్గా లొంగే రకం కాదని .........?" అన్నాడు సన్నని వ్యక్తీ.

"ఎలా లొంగడో చూద్దాం! సిగరెట్ లైటర్ ఇలా ఇవ్వు. కొత్త పద్దతి ప్రయోగిద్దాం."

అతను సిగరెట్ లైటర్ తీసి లావుపాటి వ్యక్తికీ ఇచ్చాడు.

లైటర్ తో భవానీ శంకర్ దగ్గరకొచ్చాడు.

"నీ కర్లింగ్ హెయిర్ చాలా బాగుంది - నిప్పంటిస్తే క్షణంలో బోడి గుండు మిగుల్తుంది. కానీ తరువాత నీ రూపం చూసుకోడానికి నువ్వే మిగలవనుకో - నేనిది నీ జుట్టుకి అంటించే లోపల చెప్పేయ్ అది ఎక్కడ దాచావో. లేకపోతే చేతులారా నువ్వే నీ ప్రాణం తీసుకున్నట్లవుతుంది.

భవానీ శంకర్ కిటికీ వేపు చూశాడు నెమ్మదిగా. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవాలంటే ఒకే ఒక్క మార్గం వుంది. అదేమిటంటే కిటికీ కి వున్న అలారం టైం పీస్ ని వీధి పక్కనున్న పాక అవతలకు విసిరేయాలి అది చేసే శబ్దానికి పాకల వాళ్ళందరూ లేస్తారు. అప్పుడు గానీ వీళ్ళు కాలికి బుద్దీ చెప్పరు. అయితే ఇదంతా కనుమూసి

తెరిచే లోపల జరగాలి.

లావుపాటి వ్యక్తి లైటర్ వెలిగించాడు.

సరిగ్గా అదే సమయంలో భవానీ శంకర్ వెనక్కు జరిగాడు. భయపడుతున్నట్లు. అతని చేయి వేగంగా అలారం టైంపీస్ మీద పడింది మరుక్షణంలో కిటికీ చువ్వల మధ్య నుంచి ఎగిరి రాజయ్య తలుపుకి కొట్టుకుని పాకల మధ్య శబ్దంతో పడింది.

ఆ చర్యకు తెల్లబోయాడు లావుపాటి వ్యక్తి. భవానీ శంకర్ ఉద్దేశ్యమేమిటో అర్ధమయిందతనికి. అప్పటికప్పుడే ఆ పాకల్లో సంచలనం కనిపించిందతనికి.

"పద - వీడి సంగతి తరువాత చూచుకుందాం! ఆలస్యమయితే వాళ్ళేవరయినా వస్తారేమో" అన్నాడతను.

"ఒరేయ్ , నీ దగ్గరునుంచి అదెలా సాధించాలో మాకు తెలుసు నిన్నిలా వదిలేస్తున్నామనుకోకు! అది మాకు దొరక్కపోతే ఇంకెవరికి దొరక్కుడదు."

ఇద్దరూ తలుపు తెరచుకుని బయటకు పరుగెత్తారు. మరుక్షణంలో రాజయ్య మరికొంతమంది పరుగుతో వచ్చారక్కడికి.

"ఏంటి బాబూ. మీ గడియారం ఎగిరొచ్చి మా ఇంటిముందు పడింది - " అన్నాడు రాజయ్య.

"మన రూంలోకి కొంతమంది సినిమా విలన్స్ వచ్చారు రాజయ్యా. వాళ్ళ బారినుంచి తప్పించుకోడానికి మీకు నిద్రాభంగం చేయాల్సి వచ్చింది."

అప్పుడే రోడ్ మీద కారు స్టార్టయిన చప్పుడయింది. రాజయ్య అందరిని వెంబడేసుకుని కారు వెనుక పడ్డాడు కానీ ఉపయోగం ల;లేకపోయింది.

కాసేపటి తర్వాత అందరూ వెళ్ళిపోయారు మళ్ళీ.

భవానీశంకర్ ఉత్సాహంగా టెలిఫోన్ డైరెక్టరీ తీశాడు. సంధ్యారాణి ఇంటి అడ్రస్ కనుక్కోగలిగితే మొత్తం మిస్టరీ అంతా సాల్వ్ అయిపోతుంది. తలకు తగలిన గాయాన్ని చన్నీళ్ళతో కడిగి మంచం మీద పడుకుని డైరక్టరీ వెతకటం ప్రారంభించాడతను.

రాత్రి రెండు గంటలకు దొరికిందా నెంబరు.

అడ్రస్ చూసి తన డయిరీలో రాసుకున్నడతను.

"203, షబ్నమ్ అపార్టుమెంటు , దోమల్ గూడా. హైదరాబాద్."

ఆ భవనం భవానీశంకర్ కి తెలుసు. అంతా ఖరీదయిన వ్యక్తులు వుండే అపార్టుమెంటు. గల్ఫ్ దేశాల నుంచి కోట్లు సంపాదించుకోచ్చిన వారి కోసం ఎంతో అధునికంగా , ఎంతో సుందరంగా నిర్మించిన భావానాలవి.

బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకున్నాడతను!

ఇంకొద్ది గంటల్లో తను ఆ వస్తువు రహస్యమేమిటో తెలుసుకోగలడన్న ఉత్సాహం అతన్ని ఆనందంతో ముంచెత్తింది.

వెంటనే ట్యూన్ నెంబర్ సిక్స్ పాడసాగాడు బిగ్గరగా. కొద్ది సేపటి తర్వాత అలికిడయి పక్కకు తిరిగి చూసేసరికి రాజేశ్వరి నిలబడి ఉంది నిద్రకళ్ళతోనూ, చింపిరి జుత్తుతోనూ -

"ఇది కొత్త ట్యూన్ అంకుల్! చాలా బాగుంది" అంది సంతోషంగా.

"థాంక్యూ జూనియర్! ఈ శుభ సందర్భంలో మీ మమ్మీ నడిగి అర్జెంటుగా ఓ కప్పు స్పెషల్ చాయ్ తీసుకురా!"

"ఓ! అలాగే అంకుల్!" అంటూ పరుగెత్తబోయి నిరాశగా అక్కడే ఆగిపోయింది "మా ఇంట్లో పంచదార లేదు అంకుల్.ఎలా మరి?"

"పక్కింట్లో దొంగతనం చేసేయ్ జూనియర్! ఇలాంటి అత్యవసర సమయాల్లో దొంగతనాలు శుభ్రంగా చేసేయవచ్చు! ఏం ఫర్లేదు."

"ఛీ వద్దంకుల్....."

"అల్ రైట్! అయితే ఇందిర వాళ్ళ మమ్మినీ అర్జంటుగా నిద్రలేపి పంచదార అప్పు అడుగు!" ఆ పిల్ల పరుగుతో వెళ్ళిపోయింది.

వెంటనే డ్రస్ మార్చుకుని రడీ అయేసరికి ఓ గ్లాసులో "టీ" తీసుకొచ్చి అందించిందతనికి.

"థాంక్యూ జూనియర్! రెండ్రోజుల్లో దేవుడు నిన్ను కోటీశ్వరురాలీని చేసేయుగాక."

"రెండ్రోజుల్లో ఎలా చేస్తాడంకుల్?"

"దేవుడు తలచుకుంటే రెండ్రోజులు కూడా అనవసరం జూనియర్! నిన్ను డిఫెన్స్ మినిస్టర్ ని చేశాననుకో . ఒక్క గంటలో భోఫర్స్ డీల్ లాంటిది చేస్తే 70 కోట్లు కొట్టెయ్యొచ్చు."

టీ తాగి తలుపు వేసుకుని బయటకు నడిచాడతను.

మూడవుతోంది టైము. చల్లనిగాలి ఆహ్లాదకరంగా శరీరాన్ని తాకుతోంది.

రోడ్ పక్కనే వున్న అటో దగ్గరకు చేరుకున్నాడతను. అటో డ్రయివర్ ఆటోలో ముడుచుకుని నిద్రలో "డబల్ మీటరు త్రిబుల్ మీటరు మీటర్ పెదస్ రుపయా " అంటూ కలవరిస్తున్నాడు.

అతన్ని తట్టి లేపాడు భవానీశంకర్. అయిదు నిమిషాలలో షబ్నమ్ అపార్టుమెంట్స్ చేరుకున్నాడతను.

భవనం అంతా నిశ్శబ్దంగా వుంది. వాచ్ మెన్ జాడేక్కడా కనిపించలేదు. లిఫ్ట్ దగ్గరకెళ్ళేసరికి అది అప్పుడే రెండో ఫ్లోర్ చేరుకున్నట్లు నెంబరు మారుతూ కనిపించింది! భవానీ శంకర్ ఆశ్చర్యపోయాడు. ఇంతరాత్రి వేళ ఎవరో తను వెళ్ళాలనుకుంటున్న రెండో అంతస్తుకే వెళ్ళటం విచిత్రంగా కనిపించిందతనికి.

ఇంకొక్క క్షణం కూడా ఆలశ్యం చేయకుండా మెట్లు ఎక్కేస్తూ వేగంగా రెండో అంతస్తు చేరుకున్నాడు. అప్పుడే 203 ఫ్లాట్ ముందు నిలబడి తాళం చేత్తో తలుపు తెరవడానికి ప్రయత్నిస్తుండా యువతి. ఆమె ఎవరో అతనికి కనిపించడం లేదు. తలుపు తెరుచుకుంది. ఆమె ఓసారి అటూ ఇటూ చూసి లోపలకు నడిచి తలుపు దగ్గరగా వేసింది! భవానీ శంకర్ ఆలస్యం చేయకుండా పిల్లిలా అడుగులు వేసుకుంటూ తలుపు దగ్గరకు నడిచి కొంచెం గా తోసి లోపలకు చూశాడు. ఆమె హాల్లో వున్నా ఓ టేబుల్ ముందు నిలబడి టేబుల్ మీద వస్తువు లేవో వెతుకుతోంది. తరువాత లోపలి గదిలో కెళ్ళి లైటు స్విచ్ వేసింది. అక్కడ కూడా ఏదేదో వెతుకుతున్న చప్పుడు వినిపిస్తూనే వుంది. మరికొద్ది నిమిషాల తర్వాత తిరిగి హాల్లో కొచ్చి టేబుల్ సోరుగులు తెరచి అందులోని కాగితాలు ఫైల్సు, చూస్తూ దేనికోసమో వెతకసాగింది. భవానీశంకర్ లోపలకు నడిచి తలుపు దబెలున మూసివేసి బోల్టు వేసేశాడు.

ఆమె అదిరిపడి వెనక్కు తిరిగింది.

అతన్ని కొద్ది క్షణాలు నిశ్చేష్టురాలయి చూస్తుండిపోయింది భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"భయపడకు కామ్రేడ్! మీరు టి.వి.లు చూడలేదూ? మనమంతా ఒకే జాతి ఒకే ప్రజ" అన్నాడు సమీపంగా నడుస్తూ.

"ఎవర్నువ్వు?" ధైర్యం తెచ్చుకుంటూ అడిగిందామె.

"ప్రస్తుతానికి ఆ ప్రశ్నను వాయిదా వేద్దాం కామ్రేడ్! మనిద్దరం తెలుసుకోవలసిన విషయాలు వేరే వున్నాయి. ముందు మీరిక్కడి కెందుకొచ్చారో కొంచెం చెపితే -"

ఆమె కోపంగా చూసిందతనివేపు "అది నీ కనవరసరం."

భవానీ శంకర్ ఆమెను పట్టించుకోకుండా హాలంతా ఓసారి చూసాడు. చాలా ఖరీదయిన ఫర్నిచర్ తో నిండి వుంది. టేబుల్ మీద రాక్ లో కొన్ని బుక్స్ అందంగా, వరసగా పేర్చి వున్నాయి. గోడల పెయింట్ చూస్తూ "నా ప్రశ్నకు త్వరగా జవాబు కావాలి కామ్రేడ్" అన్నాడు. "మనకి మూగగా మాట్లాడుకునేంత టైం లేదు -"

"ఇది మా స్నేహితురాలి ఇల్లు. ఆమె కోసం వచ్చాను.-" అంది గొంతు పెగల్చుకుని.

"ఇంకొంచెం మంచి కథ అల్లడానికి ప్రయత్నించండి ఫ్రెండ్ అ\ఇదేమంత ఆసక్తికరంగా లేదు........" సోఫాలో కూర్చుంటూ అన్నాడతను.

ఆమె తలుపు వేపు అడుగులు వేసింది "నేను వెళ్ళిపోతున్నాను అంటూ.

భవానీ శంకర్ లేచి మెరుపులా పరుగెత్తి ఆమెకు అడ్డు నిలబడ్డాడు.

"అలాంటి తొందరపాటు చర్యలు వద్దు కామ్రేడ్! విషయాలు తెలుసుకోకుండా మిమ్మల్ని వదుల్తాననుకోవటం కల్ల! త్వరగా చెప్పండి--"

ఆమె వెనక్కి తిరిగి వచ్చి సోఫాలో కూర్చుంది మౌనంగా.

"మనిద్దరం ఒకే వస్తువు వెతకడం కోసం ఇక్కడి కొచ్చాం కామ్రేడ్! నాకంటే మీరు ముందు లోపలికొచ్చారు కనుక అది మీరు కాజేసి ఉంటారని నాకు సెంట్ పర్సెంట్ నమ్మకంగా ఉంది -" మళ్ళీ మాట్లాడాడతను.

ఆమె కలవరపాటుతో చూసిందతనివేపు.

"ఏమిటా వస్తువు?"

"నా ముందు మీ నటన వృథా చేయవద్దు కామ్రేడ్! నేనసలే హైదరాబాద్ దూరదర్శన్ తాలూకు ఆడిషన్ నటుడినీ! వళ్ళు మండి నేనూ నటించడం ప్రారంభిస్తే - మీరేమయిపోతారో ఒక్కసారి మీరే ఊహించు కొండి!"

ఆమె కొద్ది క్షణాలు ఆలోచించింది.

"నాకా వస్తువు దొరకలేదింకా! వెతుకుతుండగానే మీరొచ్చేశారు." అంది అతని వంకే అనుమానంగా చూస్తూ.

ఆ నటనలే వద్దంటున్నాను కామ్రేడ్! మనిద్దరం మన పాత్రల్లో జీవిద్దాం! ప్రతి మూవ్ మెంతులోను సహజత్వం ఉట్టిపడే విధంగా నిజాలు మాట్లాడుకుందాం!" పెదాలమీద నవ్వు చేరగనీయకుండా మాట్లాడుతున్నాడతను.

"నేను నిజమే చెపుతున్నాను" కోపం అణుచుకుంటూ అందామె.

"చెప్పటం లేదు కామ్రేడ్! చెపుతున్నావని భ్రమపడుతున్నారు. అంతే! ఇల;ఇలా ఇద్దరం భ్రమపడుతూ , భ్రమింపజేస్తూ, జీవితం గడిపేస్తుంటే చివరకు ఇంక అందులోనుంచి బయటపడటం కష్టమైపోతుంది. అసలు సిసలయిన నిజం ఏమిటంటే మీరు ఓ వస్తువు కోసం సంధ్యారాణి ఫ్లాట్ కొచ్చారు. దొంగతనంగా మారుతాళాలతో ఫ్లాటులోకి ప్రవేశించారు. " అంటూ చటుక్కున మాట్లాడటం ఆపివేశాడతను. అతని కళ్ళు టేబుల్ మీదున్న

పుస్తకాల రాక మీద పడినాయ్. వాటిల్లో ఓ నవల కొంచెం పైకి లేచి వుంది. దానిమీద పేరు చూశాడతను "హంచ్ బాక్ ఆఫ్ వాటర్ డామ్" అని వుంది! మరుక్షణం అతనికి మెరుపులా భార్గవ్ డైరీ గుర్తుకొచ్చింది! అంతకు ముందు రోజు హత్య చేయబడ్డ భార్గవ్ డైరీ అంతా చూస్తుంటే ఓ పేజీలో కనిపించిందా పేరు. "హంచ్ బాక్ ఆఫ్ వాటర్ డామ్" అని! ఈ పేరు తప్పితే ఆ పేజీలో ఇంకే వివరాలు లేవు అందులో. నెమ్మదిగా ఆ నవలను బయటకు లాగి చూశాడతను. చాలా అందంగా, ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవరుతో బైడింగ్ చేసి వుంది. లోపల మనీ పర్సు లాగా ప్లాస్టిక్ అరలు, ఫోమ్ లేయర్స్ అన్ని అరలు చూశాడతను. అన్నీ ఖాళీగానే వున్నాయి. అట్టమీదంతా దుమ్ము పేరుకుపోయి వుంది!@ ఆ దుమ్ములో ఆమె సన్నటి చేతివేళ్లు స్పష్టంగా ముద్రించబడి కనబడుతున్నాయ్. ప్లాస్టిక్ అట్టకు లోపలవేపు కిందభాగంలో స్టీలు బటన్ లాంటిది కనిపించిందతనికి. అది తిప్పడానికి ప్రయత్నించాడతను. కానీ తిరగటం లేదు. ఈసారి దానిని గట్టిగా నొక్కాడు. ప్లాస్టిక్ కవరులోంచి స్ప్రింగు యాక్షన్ లో చిన్న మూత తెరుచుకుంది. లోపల చిన్న అర! ఖాళీగా ఉంది.

ఆ యువతి వేపు చిరునవ్వుతో చూసాడు భవానీశంకర్. ఆమె మొహం పాలిపోయి ఉంది.

"చాలా బ్రహ్మాండంగా వుంది దొంగ అర! ఏమంటారు కామ్రేడ్ .

ఆమె కళ్ళల్లో బెదురూ కనిపించిందతనికి.

"మాట్లాడు కామ్రేడ్! ఈ రహస్య అరలోంచి మీరు కాజేసిన వస్తువు గురించి మనిద్దరం త్వరగా రాజీకి రావాలి."

ఆమె కొద్ది క్షణాలు తర్వాత షాకులోంచి కోలుకుంది.

"మీకన్నీ తెలుసనీ నాకు నాకు తెలీదు. నేను కొన్ని ఫోటోలు వెతకటం కోసం ఇక్కడి కొచ్చాను."

"ఏం ఫోటోలవి?"

"నేను నా భర్తకు తెలీకుండా ఒక వ్యక్తితో జరుపుతున్న ప్రేమ కలాపాలను సంభందించిన ఫోటోలు. సంధ్యారాణి ఆ ఫోటోలు తీసి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తోంది. అందుకని ఆ బ్లాకు మెయిల్ నుంచి తప్పించుకొనేందుకని వాటిని దొంగాలించాడానికి వచ్చాను. కాని అవి దొరకలేదు ఇంతకంటే నాకింకేమీ తెలీదు. ఇంక దేనితోనూ సంబంధం లేదు.......' అందామె దీనంగా.

భవానీ శంకర్ చప్పట్లు కొట్టాడు.

"కధ బాగా అల్లారు కామ్రేడ్. వండర్ ఫుల్ సినిమా అవుతుంది. మందు కొట్టేసి సినిమా చూడ్డానికొచ్చే భారత ప్రజానీకం ఆ సినిమాని వెయ్యి రోజులులాడిస్తారనటంలో నాకేం డౌట్ లేదు. కానీ దురదృష్టవశాత్తూ మనక్కావలసింది సినిమా కధలు కాదు కామ్రేడ్. క్లీన్ ఫాక్ట్! పచ్చి నిజాలు" నీ జాకెట్లో దాచిన ఆ పాకెట్ బయటకు తీస్తే మన మధ్య వున్న అపార్థాలు తొలిగిపోయే అవకాశం ఉంది!"

ఆమె విస్తుపోయింది కొద్ది క్షణాల పాటు.

తర్వాత వుడికిపోతూ చూసిందతనివేపు.

"అవి నాకు సంబంధించిన ఫోటోలు! వాతినిఒ ఎవ్వరికీ ఇవ్వను......"

భవానీశంకర్ ఆమెకు సమీపంగా నడిచాడు.

"అలా మొండిపట్టు పట్టటం అన్ని వెళ్ళల్లోనూ మంచిది కాదు కామ్రేడ్. ఆ పాకెట్ ని నా చేతితోనే తీసుకునే పరిస్థితి కల్పించుకుండా ఉంటే మంచిది. ఇంతవరకూ నా కండాక్టు సర్టిఫికెట్టు మీద ఎవరూ "బాడ్" అని రాయలేదు. గానీ రాసినా పట్టించుకునే రకం కాదు నేను."

ఆమె చటుక్కున వెనకకు గెంతి తన పిడికిలితో బలంగా అతని ముఖం మీద కొట్టింది. భవానీ శంకర్ కి కొద్ది క్షణాల పాటు కళ్ళముందు చుక్కలు కనిపించినాయ్. ఇనుపచువ్వ ముఖం మీద తగిలినంత నొప్పి అతనిని ఊగించివేసింది. నెమ్మదిగా కళ్ళకడ్డం పెట్టుకున్న చెయ్యి తీసి ఆమె వేపు చూశాడు. అతని పెదాల మీదకు మళ్ళీ చిరునవ్వు వచ్చింది.

ఈసారి మళ్ళీ మెరుపులా అతని ముఖం మీద కొట్టబోయిందామె. కానీ ఆమె చేతిని పట్టుకుని తన దగ్గరకు బలంగా లాక్కుని కౌగిట్లో కదలకుండా బంధించాడు.

ఆమె ముఖం కోపంతోనూ, అవమానంతోనూ దహించుకు పోతోంది. అతని చేతుల్లోంచి తప్పించుకోడానికి తన బలమంతా ప్రయోగించి పెనుగులాడసాగింది. ఆమె శక్తి గమనిస్తోంటే భావనీశంకర్ కే ఆశ్చర్యంగా వుంది. ఓ అమ్మాయికి ఇంతటి రాక్షస బలం వుంటుందని తనకింతవరకూ తెలీదు. కొద్ది క్షణాల తర్వాత పూర్తిగా అలసిపోయిందామె.

"నన్నొదులు - ఇచ్చేస్తాను" అంది నీరసంగా.

భవానీశంకర్ ఆమెని వదిలేశాడు. ఆమె రొప్పుతూ సోఫాలో కూలబడింది. ఆమె కళ్ళల్లో కోపం, నిస్సహాయత, ద్వేషం గమనించేసరికి నవ్వు వచ్చింది భవానీశంకర కి.

"కమాన్ కామ్రేడ్. మీ అందమైన ఫేస్ లో ఎక్స్ ప్రేషన్స్ వాచ్ చేసేంత టైం లేదు నాకు! క్విక్ - త్వరగా ఇవ్వండి అది- "

జాకెట్ జిప్ లాగబోయి అతనివేపు చూసిందామె.

"అటువేపు తిరగండి" అంది రోషంగా.

భవానీ శంకర్ వెనక్కు తిరిగి "జిప్" శబ్దం కోసం చెవులు రిక్కించి వినసాగాడు.

జిప్ శబ్దం బదులు అడుగుల చప్పుడు వినిపించేసరికి ఒక్క గెంతు గెంతి వెనక్కు తిరిగి చూసాడు. అప్పటికే పూలకుండీ అతని మీదకు బలంగా విసిరేసిందామె. వెంట్రుక వాసిలో అతని తల పక్క నుంచి దూసుకుపోయి గోడను కొట్టుకుని పెద్ద శబ్దంతో కిందపడిందది. వెంటనే గోడకున్న గాజు బొమ్మను అందుకోబోయిందామె. భవానీ శంకర్ యిక ఆలస్యం చేయలేదు. గాలిలోకి స్ప్రింగు లా యెగిరి ఆమె భుజం మీద బలంగా తన్నేడు. అతను ఊహించినదానికంటే బలంగా దెబ్బ తగిలేసరికి ఆమె సోఫాలో విరుచుకుపడిపోయింది. మళ్ళీ లేవటానికి ప్రయత్నించింది గాని నడుము నొప్పి పుట్టేసరికి మళ్ళీ సోఫాలోనే కూర్చుండిపోయింది.

"అబ్బా-" అంది మూలుగుతూ.

"కరాటే కమల " "మరాటీ విమల" లాంటి సినిమాలు చూడకు కామ్రేడ్. అవితెర మీదే గాని బయట పనికిరావ్ - " ఆమె దగ్గరగా నడిచి సమీపంగా కుర్చున్నాడతను.

ఆమె సోఫాలో వెనక్కు వాలి కళ్ళు మూసుకుంది బాధగా.

"హరీయప్ కామ్రేడ్! ఆ పాకెట్ త్వరగా ఇచ్చేస్తే మనం మళ్ళీ ఫ్రెండ్స్ అయిపోయి "స్నేహమేరా జీవితం ......." అంటూ పాడుకోవచ్చు-"

ఆమె జవాబివ్వలేదు -

"హలో - ఆమెను పిలిచాడతను గట్టిగా ఆమె భుజం కుదుపుతూ.

ఆమె జవాబివ్వలేదు. మగతగా కళ్ళు మూసుకుండిపోయింది. మరో రెండు మూడు సార్లు ఆమెను లేపటానికి

విఫల ప్రయత్నం చేసి చివరకు తనే ఆమె జాకెట్ జిప్ లాగి , లోపలకు చేయి పోనిచ్చి పాకెట్ కోసం వెతికాడు. చాతికి ఓ మూలగా దొరికిందది. ఆత్రుతగా బయటకు లాగి చూశాడు.

అందంగా ఎర్ర కవరుతో ఉన్న చిన్న పుస్తకం అది. పుస్తకం తెరచి చూశాడు. లోపల అందమైన దస్తూరితో ఎవరెవరివో అడ్రస్ లున్నాయి. చివరివరకూ వడివడిగా చూశాడు.

అన్నీ అడ్రసులే, సుమారు అయిదారువందల చిరునామాలుంటాయ్. వాటి ప్రాముఖ్యతేమిటో అతనికేమాత్రం అర్థం కావటం లేదు.

అదీ గాక సమాధానం దొరకని ప్రశ్నలు రోజురోజుకి పెరిగి పోతున్నాయి. స్మితారాణి వెంతబడుతున్న గాంగ్ మెంబర్స్ ఎవరు? వాళ్ళకు కావలసిన వస్తువేమిటి? భార్గవ్ ని ఎవరు చంపారు? సంధ్యారాణి ఎవరు? ఆమె ఇల్లు ఎందుకు ఖాళీగా వుంది? ఆమె ఇంటికి ఈ యువతి దొంగతనంగా ఎందుకొచ్చింది? ఈ చిరునామాల రహస్యం ఏమిటి? ఏమీ అర్థం కావటంలేదతనికి. ఆమె పక్కనే సోఫాలో పడివున్న లేడీస్ బాగ్ తీసి చూశాడు. లోపల అంతా మేకప్ సామాన్లున్నాయ్ - పైన ఆమె పేరున్న కార్డు కనిపించింది. వి. సునంద, కేరాఫ్ హోటల్ నైటింగేల్.

టైమ్ చూసుకున్నాడు భవానీశంకర్. నాలుగవుతోంది. తనింక ఆలస్యం చేయటం మంచిది కాదు.

"సారీ కామ్రేడ్! నీ అతి తెలివి వల్లే నిన్నీ పరిస్థితిలో వదిలి వెళ్ళాల్సి వస్తోంది! బెస్టాఫ్ లక్!" అనేసి బయటకు నడిచి తలుపు మూసి వేశాడు. మెట్లు దిగి వడివడిగా రోడ్ మీదకు వచ్చాడు. నడుస్తూనే ఆర్.కె. శ్యామ్ ఇంటికి బయలుదేరాడు. ఇల్లు చేరుకునే సరికి ఇంచుమించుగా తెల్లారి పోయింది.

అఖిలభాను నిద్రకళ్ళతో తలుపు తెరిచింది.

"రాత్రి తెల్లార్లూ తిరగటం తప్ప మీకింక వేరే పనేమీ లేదా?" చిరుకోపంతో అడిగిందామె.

"ప్రజాసేవకు రాత్రి పగలూ అన్న విచక్షణ వుండదు సిస్టరిన్ లా! ముందు నాకు పడుకుని నిద్ర పోవటానికి పిడికెడు చోటు చూపిస్తే మిగతా వివరాలు నిద్ర లేచాక మాట్లాడుకుందాం!" అంటూ లోపలకు నడిచాడతను.

అతని వెనకే లోపలకు నడవబోయి అఖిలభాను అతని రూపాన్ని చూసి నిశ్చేష్టురాలయింది.

"ఏమిటి? దెబ్బలు తగిలినట్లున్నాయే? ఎలా తగిలినాయ్?" ఆత్రుతగా అడిగిందామె.

"ష్! గట్టిగా అరవకు సిస్టరిన్ లా ! మీ గొంతు విన్నారంటే భారత ప్రజానీకం నా ఆరోగ్యం కోసం దేశమంతా ప్రార్ధనలు జరపటం ప్రారంభిస్తారు అనవసరంగా! ఈ దెబ్బల గురించి మీరేం వర్రీ అవకండి. ఇవి పిల్లల ఆటల్లో తగిలే దెబ్బల్లాంటివి " అన్నాడతను.

అఖిలభాను లోపలికెళ్ళి పరుపు తీసుకొచ్చి వేసిందతని కోసం. దాని మీద పాడుకుంటూనే గాడనిద్రలో మునిగిపోయాడు భవానీ శంకర్.

అతనికి తిరిగి మెలకువ వచ్చేసరికి చుట్టూ కూర్చుని అతని ముఖంలోకే చూస్తున్న శ్యా]మ్ , అఖిలభాను. స్మితారాణి, తులసి కనిపించారు.

"అంకుల్! నువ్ విలన్స్ తో ఫైటింగ్ చేశావు కదూ?" ఆత్రుతగా అడిగింది తులసి.

"అవును కామ్రేడ్ - ముందు మా వదినమ్మ, గుప్పెడు కాఫీ, పిడికెడు బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేస్తే రాత్రి జరిగిన సినిమా కథంతా వివరించి చెప్పేస్తాను -" అన్నాడతను.

"అవన్నీ రెడీగా వున్నాయ్ - ముందు లేచి కూర్చోండి -" అంది అఖిలభాను.

భవానీశంకర్ లేచి ముఖం కడుక్కుని ఫలహారం చేస్తూ రాత్రి తన గదిలోనూ, సంధ్యారాణి ఫ్లాట్ లోను జరిగిన విశేషాలన్నీ వర్ణించి చెప్పాడు.

శ్యామ్ అతని చేతిలోని ఆ ఎర్ర పుస్తకం తీసుకుని ఒక్కొక్క అడ్రస్ చూడసాగాడు.

"అరె! ఈ అడ్రస్ మన హైదరాబాద్ లోని ఫేమస్ కంట్రాక్టర్ ది కోట్లు సంపాదించాడతను. ఇదిగో ఈ అడ్రస్ చూశావా? చెమన్ లాల్ - పెద్ద నగల షాపు ఓనర్. ఈ పేరు చూడు నిరంజన్ - అయ్. ఏ. యస్ ఆఫీసర్! కోట్ల లంచాలు తిన్నాడని ఈ మధ్యే యాంటీ కరప్షన్ వాళ్ళు పట్టుకున్నారు. ఇదిగో ఈ అడ్రస్ లన్నీ ఫిలిమ్ ప్రొడ్యుసర్స్ వి"

## 8

ఈ పుస్తకంలో వున్న అడ్రసుల్లో కొన్నే వారికి తెలిసినాయ్. మిగతావి ఎవరివో వాళ్ళేం చేస్తుంటారో ఆ వివరాలేమీ లేవు.

"దీన్ని బట్టీ చూస్తుంటే ఈ అడ్రస్ లన్నీ బాగా ధనవంతులు పేరు ప్రఖ్యాతలు వున్న వారివే అని అర్థమవుతోంది - " అన్నాడు శ్యామ్.

'అంతవరకూ కరక్టే. కానీ ఆ అడ్రస్ లు ఎందుకు నోట్ చేశారు. ఈ పుస్తకం ఆ అమ్మాయి ఎందుకు దొంగతనం చేసింది. మనల్ని స్మితారాణినీ ఆ గ్యాంగ్ యివ్వమని బెదిరిస్తోన్న వస్తువు ఈ పుస్తకమేనా? ఈ విషయాలన్నీ తేలాలి ముందు" అంది అఖిలభాను.

"అవి తేలాలంటే ఇవాళ సాయంత్రం నేనూ, కామ్రేడ్ శ్యామ్ కలిసి హోటల్ నైటింగేల్ కెళ్ళాలి! అక్కడ మిస్ సునందను కలుసుకుంటే అన్ని వివరాలు తెలుస్తాయ్" అన్నాడు భవానీ శంకర్.

"అంటే మళ్ళీ ఫైటింగ్ చేస్తావా అంకుల్! ఉత్సాహంగా అడిగింది తులసి.

"ఇంతవరకూ జరిగిందేదో జరిగిపోయింది. ఇంక మీరు ఇల్లు కదలకుండా కూర్చోండి కొన్నాళ్ళు! వాళ్ళ జోలికి వెళ్ళవద్దు- " అంది అఖిలభాను కోపంగా.

"ఛఛ! వీరపాంచాలి పుట్టిన దేశంలో అఖిలభాను లాంటి స్త్రీలు కూడా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది!" అన్నాడు భవానీశంకర్ ఆమెను అవహేళన చేస్తూ. "అన్నట్లు కామ్రేడ్ శ్యామ్ ఇంత పిరికి వదినమ్మను ఎలా పెళ్ళి చేసుకున్నావ్ నువ్వు?" శ్యామ్ నడిగాడతను.

"అంతా విధివ్రాత బ్రదర్! ఏం చేస్తాం? ఆ సమయంలో మంచి అమ్మాయిల కొరత తీవ్రంగా ఏర్పడింది అంచేత- "

అఖిలభాను తన కుర్చీలోని దిండు తీసి విసిరి కొట్టింది శ్యామ్ మీద.

అందరూ గట్టిగా నవ్వేశారు.

## 9

రాత్రి ఎనిమిదయింది. శ్యామ్, భవానీశంకర్ కలిసి నైటింగేల్ హోటల్ చేరుకునే సరికి భారత సంస్కృతికి అనుగుణంగా స్టేజీ మీద నలుగురు అమ్మాయిలు భరతనాట్యం చేస్తున్నారు.

రాత్రి పదకొండయ్యేసరికి ఆ భరతనాట్యమే కాబరేడాన్స్ గా మారిపోతుందని అందరికీ తెలుసు.

భవానీ శంకర్, శ్యామ్ స్టేజీకి దగ్గరగా వున్న టేబుల్ ముందు కూర్చున్నారు. బేరర్ వినయంగా వచ్చి నిలబడ్డాడు ఆ టేబుల్ దగ్గర.

"ఏం కావాలి సార్?"

"ఆ డాన్స్ చేస్తున్న అమ్మాయిల్లో ఒకమ్మాయ్ కావాలి?"

బేరర్ అదిరిపడి భవానీశంకర్ వేపు మరోసారి చూసి తల గోక్కున్నాడు.

"ఇప్పుడా సార్?"

"ఇప్పుడే."

"రాత్రి పన్నెండు తరువాతయితే ఒకమ్మాయి దొరుకుతుంది సార్" ఈలోగా కావాలంటే కష్టం!"

"ఒకవేళ నీకు యాభయ్ రూపాయలిస్తామనుకో! అప్పుడు కూడా దొరకదా!" అడిగాడు భవానీశంకర్. వాడి ముఖంలో ఆశ స్పష్టంగా కనిపించింది.

"కష్టం సార్-"

"పోనీ వందరూపాయలు నీకిస్తే?"

వాడు అదిరిపోయాడు, "సరే సార్! ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికెళ్ళిపోయాడు. కొద్దిసేపటి తర్వాత నలుగురు డాన్సింగ్ గాళ్స్ లో ఒకామె లోపలికి వెళ్ళిపోయింది. మరికొద్ది సేపటి తర్వాత బేరర్ తిరిగి వచ్చాడు.

"ఓ అమ్మాయి ఒప్పుకుంది సార్. కాని ముందే చెప్పమంది వెయ్యి రూపాయలివ్వాలట!"

"డబ్బు కోసం వర్రీ అవకు కామ్రేడ్! కుక్కను తంతే పడుతుంది డబ్బు! కాకపోతే ఏ కుక్కనీ అనేది తెలీటంలేదు మనకి!"

"అయితే ఇలా - నావెంట రండి సార్- వెనుక వేపు మెడ మీద గదులు వున్నాయి. " భవానీశంకర్ లేచి శ్యాం కి కన్ను కొట్టాడు.

"వెళ్ళి వస్తాను కామ్రేడ్! పదినిమిషాలు టైమిచ్చి ఆ ఆతరువాత మనం అనుకున్న కార్యక్రమం ప్రారంభించు" అంటూ శ్యాంతో చెప్పి బేరర్ వెంబడి లోపలికి నడిచాడు భవానీశంకర్. హోటల్ వెనుక వున్న గార్డెన్ లో నిలబడి తనకోసమే ఎదురుచూస్తోంది ఆ అమ్మాయి.

"హలో" అంది భవానీశంకర్ని చూస్తూ చిరునవ్వుతో.

"హలో అంటూ ఆమెకి సమీపంగా నడిచాడతను.

ఆమెలో అందం కన్నా, సెక్స్ తనం ఎక్కువగా వుంది. శరీరపు వంపుల్ని కావాలనే బహిర్గత పరుస్తోన్నట్లు తెలిసిపోతోంది.

:"మీరు చాలా సెక్సీగా వున్నారు కామ్రేడ్! మనం స్వర్గద్వారాల వరకూ ప్రయాణం చేద్దాం పదండి" అన్నాడతను ఆమె చేయి పట్టుకుని.

ఆమె అందంగా నవ్వింది.

"పదండి"

ఇద్దరూ మేడమీద గదిలోకి నడిచారు. చాలా చిన్న గది అది. ఒక డబల్ కాట్, వాష్ బెసినూ, మాత్రం వున్నాయి. అయితే గది నీటుగా వుంది. గదిలోకి రాగానే తలుపులు మూసి బోల్టు వేసిందామే.

"లైటు వుంచాలా , తీసేయాలా?" అడిగిందామె అతనికి అభిముఖంగా నిలబడి.

"నేను నీతో మాట్లాడటానికి వచ్చాను కామ్రేడ్ - నువ్వనుకుంటున్నట్లు ఫన్ ఫన్ ప్రోగ్రాం కోసం కాదు"

"ఏం మాట్లాడటానికి?" తన మాక్సీ హుక్స్ తీయబోతూ ఆపి అనుమానంగా అడిగిందామె.

"కొన్ని వివరాలు కావాలి కామ్రేడ్ - చాలా అర్జెంట్"

ఆమె వూడిన హుక్స్ మళ్ళీ పెట్టేసుకుంది.

"అలాగయితే ప్లీజ్ గెటౌట్" అందామె తలుపు మళ్ళీ తీయబోతూ.

భవానీశంకర్ చప్పున లేచి తలుపు తెరవకుండా ఆమె చేతి మీద చేయి వేసి పట్టుకున్నాడు.

"వదులు నీకేం కావాలో నాకు తెలుసు! నువ్వో రచ్ఛయితవో, జర్నలిస్టువో అయ్యుంటావు! నేనెలా ఈ వృత్తిలోకొచ్చాను, ఎంత సంపాదిస్తున్నాను. ఎవరివరితో గడిపాను ఇవన్నీ కావాలి నీకు. అది పబ్లిష్ చేసి వెయ్యో, రెండు వేలో సంపాదిస్తావూ కదూ?" కోపంగా చేయి విదిలించుకుంటూ అందామె.

"పొరపాటుపడ్డావు ఫ్రెండ్! కేస్ అదికాదు"

"నా జీవిత చరిత్ర కావాలని చెప్పి - కిందటిసారి ఆ రచయితేవరో రాత్రంతా నన్నూ, నా కథనూ రెండూ వాడుకుని నాకివ్వాల్సిన డబ్బు కూడా బాకీ పెట్టి పారిపోయాడు. బాస్టర్డ్ - అప్పటినుంచీ నాకు రచయితలన్నా, జర్నలిస్టులన్నా ద్వేషం , ఐ హెట్ దెం"

భవానీశంకర్ ఆమెను బలవంతంగా లాగి మంచం మీద కూర్చోబెట్టి తను పక్కనే కూర్చున్నాడు.

"నన్నొదులు" కోపంగా అందామె.

"నేను చెప్పేది విని తర్వాత మాట్లాడు కామ్రేడ్ -రేడియో ఇంటర్వ్యూలూ, ప్రోగ్రామ్స్ లో లాగా అందరూ ఒకేసారి మాట్లాడకూడదు. నాకు కావలసింది నువ్వు కాదు నీ ఆత్మ కాదు."

"మరి?"

"సునంద గురించి వివరాలు కావాలి. ఆ వివరాలు అందజేసినందుకుగ్గాను ఇదిగో ఈ వందరూపాయలు నీదవుతుంది - ఏమంటావు?"

ఆమె ప్రవర్తనలో కొంత మార్పు వచ్చింది . కొంచెం సౌమ్యంగా మారింది ముఖం.

"సునందా!" ఆశ్చర్యంగా అడిగిందామె . "ఇంతకు ముందు మీరిద్దరూ కలుసుకున్నారా?"

"అవును-"

"దానికి వంట్లో బావుండలేదుట ఇంట్లోనే వుంది."

"ఆ అమ్మాయికి సంధ్యారాణికి చాలా స్నేహం ఉన్నట్లుంది కదూ?"

"ఆ ప్రశ్నతో త్రుళ్ళిపడిందామె.

"ఆ - అహ - అవును - మీకెలా తెలుసా విషయం?

"తనే చెప్పింది చాలా సార్లు."

ఆమె అనుమానంగా చూసిందతని వేపు.

"ఇప్పుడు వాళ్ళగురించి ఎందుకులెండి - ఇంక నేను వెళ్ళవచ్చా?" లేచి నిలబడిందామె.

"నాకు సునంద ఇల్లు ఎక్కడుందో చెప్పగలవా?"

కొద్ది క్షణాలు అలోచించి జవాబు చెప్పిందామె.

"మారేడుపల్లిలో దీప్తి నర్సింగ్ హోమ్ పక్కన రెండో ఇల్లు -"

"థాంక్యూ - ఇదిగో నీ వంద రూపాయలు."

ఆమె నోటు తీసుకుని , "ఊరికే డబ్బు తీసుకోవటం అలవాటు లేదు." అనేసి అతని పెదవుల మీద గట్టిగా ఓ ముద్దు పెట్టి వెళ్ళిపోయింది.

భవానీశంకర్ బార్ లో కొచ్చాడు. బేరరు అతని కోసమే ఎదురు చూస్తున్నాడు.

"నమస్కారం సార్- అల్ ఓకేనా సార్?" అన్నాడు ఆనందంగా నవ్వుతూ.

"అల్ ఒకే బ్రదర్! ఈ ప్రేమికులకు నువ్వు బృహత్తర సేవ చేస్తున్నావు! త్వరలో నీకు సేవా విభూషణ్ బిరుదు తప్పదు" అంటూ వందనోటు తీసి అతనికిచ్చాడు.

వాడి ముఖంలో అనందం మరింత వెలిగిపోయింది.

"థాంక్యూ సార్ ! మీరెప్పుడూ కావాలంటే అప్పుడు తిన్నగా నా దగ్గరకొచ్చేయండి సార్! ఏ డాన్సర్ కావాలన్నా నో ప్రాబ్లమ్ సార్."

భవానీ శంకర్ శ్యామ్ కోసం బార్ లో వెతుకుతుండగా అతని పక్కకు వచ్చి నిలబడ్డాడో వ్యక్తీ.

"లైటర్ ఉందా మిస్టర్?"

"స్మోకింగ్ ఈజ్ ఇన్ జురియస్ టు హెల్త్ కామ్రేడ్! అందుకని నా దగ్గర ఆ సరుకులుండవు" అంటూ కదల బోయాడు గానీ ఆ వ్యక్తీ చేయి భవానీ శంకర్ భుజం మీద పడింది.

మరో చేతిలోని ఫిస్టల్ బారెల్ తన గుండెల్ని తాకుతుంది.

ఎప్పుడు అతని చేతిలోకి పిస్టల్ వచ్చిందో భవానీశంకర్ కే అర్ధం కాలేదు.

"చాలా అద్భుతమయిన వేగం కామ్రేడ్! అంత వేగంగా వస్తువులు సృష్టించటం , మాయం చేయటం , మేజిషియన్స్ కే సాధ్యమవుతుందని నా అనుమానం - బైదిబై నువు మెజీషియన్ "షాడో" ట్రూప్ లో మెంబర్ వా కామ్రేడ్?"

"ఆ పుస్తకం ఎక్కడుంది?"

భవానీ శంకర్ ఆశ్చర్యం నటించాడు.

"ఏ పుస్తకం కామ్రేడ్? షాడో రాసిన "మాజిక్" పుస్తకమా" మన ఫ్రెండ్ ఆర్. కె శ్యామ్ దగ్గరుంది. వెంటనే మనం ఇంటికెళితే అరువిస్తాడు."

"అతి తెలివి ప్రదర్శించకు - అడ్రస్ బుక్ మర్యాదగా ఇచ్చేయ్"

"ఓ - అడ్రస్ బుక్ కావాలా? అది ఏ స్టేషనరీ షాప్ లో అడిగినా దొరుకుతుంది కామ్రేడ్ - మంచి మోడల్ పధ్నాలుగు రూపాయలు ఉంటుంది."

"నువు చావుకి అతి సమీపంగా ఉన్నావన్న విషయం మర్చిపోకు నిన్ను కాల్చేసినా పట్టించుకునే వారెవరూ లేరిక్కడ.

సరిగ్గా శ్యామ్ వచ్చి భవానీశంకర్ వెనుక నిలబడ్డాడు.

"ఎవరూ పట్టించుకోరనటం ఓవర్ స్టేట్ మెంట్ బ్రదర్ - మేమిద్దరం ఎలిమెంటరీ స్కూల్లో చదివే రోజుల్లోనే కలసి ఆ ఆపోజిట్ గాంగ్ తో బాక్సింగ్ చేసేవాళ్ళం" చిరునవ్వు తో అన్నాడు శ్యాం.

పిస్టల్ వ్యక్తి కలవ్రపదిపోయాడు.

శ్యాం పిస్టల్ ఉన్న అతని చేతిని నెమ్మదిగా కిందకు దింపేశాడు.

"పుస్తకాలూ, కాలాలు. చాక్ పీస్ లూ కావాలంటే ఏదయినా షాప్ కెళ్ళి కొనుక్కోవాలి కామ్రేడ్ - ఇలా బారుల్లోనూ, రోడ్లమీదా పిస్టల్ చూపించి అడక్కూడదు" అన్నాడు భవానీ శంకర్.

ఆ వ్యక్తిని పక్కకు తోసి ఇద్దరూ బారు బయటకు నడిచారు.

"నెక్ట్స్ ప్రోగ్రాం ఏమిటి?" అడిగాడు శ్యాం.

"సునంద ఇంటికి వెళ్ళాలి కామ్రేడ్! అక్కడ గానీ అసలు కథంతా బయటకురాదు"

"అల్ రైట్ - పద"

మళ్ళీ సైకిల్ మారేడు పల్లి వేపు బయల్దేరింది. గంటసేపు పట్టింది సునంద ఇల్లు పట్టుకోవడానికి.

డోర్ బెల్ నొక్కగానే కిటికీలోనుంచి బయటకు చూస్తూ "ఎవరు!" అందామె.

భవానీ శంకర్ చీకట్లో నక్కి శ్యాంని ముందుకి తోశాడు.

"నా పేరు శ్యాం! మీతో అర్జెంటుగా మాట్లాడాలి. " అన్నాడు శ్యాం.

"ఏమి మాట్లాడాలి?"

"ఇలా రోడ్డుమీద నుంచోబెట్టి అడిగితే ఏమని చెప్పనండి ? మీ మేలు కోరే వచ్చాను."

"ఎవరు పంపించారు మిమ్మల్ని?"

"సంధ్యారాణి -"

ఆమె ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

"సంధ్యారాణా" నమ్మలేనట్లు అడిగింది.

"అవును"

"ఎక్కడుంది తను!"

"చార్మినార్ దగ్గర్లో ఓ రహస్య ప్రదేశంలో , మీరు తలుపు తెరిస్తే ........" ఆమె ఇంక ఆలస్యం చేయలేదు. కొంచెం తలుపు తెరిచి మాట్లాడబోయింది. పక్కనే ఉన్న భవానీశంకరు మెరుపు వేగంతో తలుపు సందులోకి జొరబడి బలవంతంగా తలుపులు తెరిచేశాడు. ఆమె ఆ వేగానికి వెనకకు జరిగి బాలెన్స్ తప్పి కింద పడిపోయింది.

"సారీ కామ్రేడ్ - మళ్ళీ బలప్రదర్శన ద్వారానే కలుసుకోవాల్సి వచ్చినందుకు చింతిస్తున్నాను - " అన్నాడతను నవ్వుతూ.

అతనిని చూస్తూనే సునంద ముఖంలోకి కోపం, ఆశ్చర్యం రెండు వచ్చినాయ్.

"బ్లడీ బాస్టర్డ్" అంది కోపంగా.

భవానీ శంకర్, శ్యామ్ ని కూడా లోపలకు రానిచ్చి తలుపులు మూసి వేశాడు.

మర్యాదగా ఇక్కడి నుంచి పోతారా లేదా?" గట్టిగా అరిచిందామె..

"నువ్వెంత అరచినా లాభం లేదు కామ్రేడ్! బయట వందమంది మా తాలూకు మనుషులు కత్తులతోనూ ,

కర్రలతోనూ కసరత్తు చేస్తున్నారు. మర్యాదగా మేమడిగిన విషయాలు చెప్పావంటే నీకే హనీ కలగదని హామీ ఇస్తున్నాము - వాడ్డూ యూ సే మిస్టర్ ఆర్.కె శ్యామ్."

"సెంట్ పర్సెంట్ కరెక్టు! ఎవరికీ హాని చేయకూడదనేదే మా పాలసీ!"

"అయితే ఆ పాలసీ అవతలి వాళ్ళు మన సహనాన్ని పరిక్షించనంతవరకే కదూ - మిస్టర్ ఆర్. కె. శ్యామ్?"

"హండ్రెడం డ్ వన్ పర్సెంట్ కరెక్ట్! మనకు సహనం కూడా మిగతా ఆరోగ్యవంతులయిన వారి సహనంతో పోలిస్తే చాలా తక్కువ."

భవానీ శంకర్ చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాడు.

"కమాన్ కామ్రేడ్ - త్వరగా చెప్పు - ఆ పుస్తకంలో అడ్రస్ లు ఎవరివి? వాటి కోసం కార్ల చేజింగ్స్, కెమెరా కిల్లింగ్సు, కప్ బోర్డ్ శవాలు, అందాలభామల నాజుకూ దొంగతనాలు - క్యాబరే ఆర్టిస్టుల రహస్య విన్యాసాలు, ఫెల్టు హాట్ విలనీ పిస్టల్ పోటీలూ - ఈ హడావుడి అంతా ఎందుకు? వాటి తాలుకూ ఫ్లాష్ బాక్ కదేమిటి? ఈ కథలో నీ పాత్ర ఏమిటి? రెండు నిమిషాల్లో ఈ వివరాలు చెప్పకపోతే నిర్ధాక్షిణ్యంగా నిన్ను కిడ్నాప్ చేయవలసి వస్తుంది.."

ఆమె విసురుగా చేయి వదిలించుకోటానికి ప్రయత్నించింది. కానీ సాధ్యం కాక ఊరుకుండిపోయింది. ఓ నిమిషం మౌనంగా గడిచిపోయింది.

"కమాన్ కామ్రేడ్ ఆర్ - కె- శ్యాం! ఈ చిన్నారికి కిడ్నాప్ సీనులు చాలా ఇష్టమని అర్ధమయిపోయింది - కనుక తీసుకెళ్ళి మన అండర్ గ్రౌండ్ డెన్ లో పడేయటం మంచిది."

ఆర్.కె. శ్యామ్ ఆమె వేపు ఓ అడుగు వేసి ఆగిపోయాడు.

"కానీ అక్కడ ఇప్పటికే అరుశవాలు ఉన్నాయ్ కదా - పాపం ఈ బాల ఆ శవాల మధ్య ఎలా ఉంటుంది?" అడిగాడతను అనుమానంగా.

"తప్పదు కామ్రేడ్! ఒక్కొక్కరికీ ఒక్కొక్క హాబీ! ఈ బాలకు శవాల మధ్య కూర్చుని సీరియల్స్ రాయడం ఎంతో సరదా-"

శ్యాం ఆమె రెండో చేయి పట్టుకోబోయాడు. ఆమె కళ్ళల్లో భయం కన్పించింది.

"వదలండి - చెప్తాను - " అంది కలవరపాటుతో .

భవానీ శంకర్ చిరునవ్వు నవ్వాడు.

"స్పోర్ట్స్ మన్ స్పిరిటు అంటే అదే కామ్రేడ్ - కమాన్ - అంతా చెప్పేసేయండి -- ఆ అడ్రస్ బుక్ కథేమిటో ముందు చెప్పండి" అంటూ ఆమె చేతిని వదిలేశాడు.

ఆమె చెప్పటం ప్రారంభించింది.

"ఆ అడ్రస్ పుస్తకం - "అంటుండగానే తలుపు ధభేలుమని మూసుకున్న చప్పుడయింది. భవానీ శంకరు శ్యాం మెరుపులా వెనుకకు తిరిగారు - లావుపాటి వ్యక్తీ, సన్నపాటి వ్యక్తీ చేతుల్లో పిస్టల్స్ తో నిలబడి వున్నారు.

"నేను చెప్పలేదూ! మళ్ళీ వీడే వచ్చాడు" అన్నాడు లావుపాటివాడు సన్న వ్యక్తితో.

"కిందటి సారి మనం ఇచ్చిన షాక్ ట్రీట్ మెంటు అప్పుడే మరిచిపోయినట్లున్నాడు" అన్నాడు సన్నటి వ్యక్తీ.

"ఈసారి ఇంకోడిని కూడా తీసుకొచ్చినట్లున్నాడు -"

"వీడొక తీన్ మారు ఖాన్ కాబోలు - " శ్యాం వంక వెటకారంగా చూస్తూ అన్నాడు. భవానీ శంకర్ గుండె మీదకు పిస్టల్ నొక్కి పెట్టాడు లావుపాటి వ్యక్తీ.

"వీడేనా అడ్రస్ బుక్ పట్టుకెళ్ళింది?" అడిగాడు సునందను.

"అవును-' అందామె.

"ఎక్కడ పెట్టావ్ రా అది?" అడిగాడతను.

"చాలా సిల్లీ ప్రశ్న కామ్రేడ్! అలా హోటల్ పక్కన అజయ్ భాయ్ బుక్ షాపులో మోడల్ క్వొశ్చన్స్ దొరుకుతాయ్. వాటిని ప్రాక్టీస్ చేస్తే ప్రశ్నలు ఇంప్రూవ్ చేసుకోవచ్చు-"

"చూశావా బాస్ - మళ్ళీ అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు."

"అవును మరి పాఠం చెప్పేద్దామా?"

లావుపాటి వ్యక్తి పిస్టల్ ట్రిగ్గర్ నిక్కబోతున్నట్లు వెళ్ళు కదిపాడు.

"అడ్రస్ బుక్ సంగతి చెప్తావా లేదా?"

"నటనలు వద్దు కామ్రేడ్? చీఫ్ మినిస్టరు దగ్గర్నుంచి [ప్రధానమంత్రి వరకూ వీర నటన ప్రదర్శిస్తోంటే ప్రజలు విసుగెత్తిపోయి ఉన్నారు. అడ్రస్ బుక్ దొరికే వరకూ మీరు నన్నేమీ చేయలేరని నాకు తెలుసు. అంచేత బెదిరింపులు మానేస్తే బిజినెస్ మాట్లాడుకుందాం."

అతను మాట్లాడుతుండగానే శ్యాం ఒక్కసారిగా ఆర్తనాదం చేసి నేలకొరిగిపోయాడు. అతనికి పిస్టల్ గురిపెట్టి నిలబడ్డ సన్నని వ్యక్తి అదిరిపోయి వెనక్కు గెంతాడు. లావుపాటి వ్యక్తి కంగారుగా పక్కకు చూశాడు.

అంతే!

ఆ సమయం కోసమే వేచియున్న భవానీశంకరు గాలిలోకి అమాంతం ఎగిరి చేతిలోని పిస్టల్ ని బలంగా తన్నాడు. అదే సమయంలో నేల మీద పడ్డ శ్యాం రెండు చేతులతో సన్నని వ్యక్తి కాళ్ళు పట్టుకుని అతి వేగంగా తన్నాడు.

మరుక్షణం పరిస్థితులు తరుమరాయి పోయినాయ్. పిస్టల్స్ రెండూ భవానీ శంకర్, శ్యాం చేతిలోకి వచ్చేసినాయ్.

అంతవరకూ ఆనందంగా చూస్తోన్న సునంద ముఖం మాడిపోయింది.

"ఇప్పుడు చెప్పండి కామ్రేడ్ - అడ్రస్ - బుక్ తాలూకు రహస్యం ఏమిటి? ఎందుకు దానికోసం మీరు వీరవిహారం చేస్తున్నారు? మూడు అనే లోపల చెప్పకపోతే నిష్కారణంగా మీ ఆత్మ శాంతి కోసం నేనూ. కామ్రేడ్ ఆర్.కె. శ్యామ్ , కామ్రేడ్ సునంద ప్రార్ధనలు చేయాల్సివస్తుంది."

భవానీశంకరు మాట్లాడుతుంటే సునంద ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ గోడ దగ్గరకు చేరుకుంది. మరుక్షణం ఆమె చేయి లైట్ స్విచ్ మీద పడింది. క్షణంలో అంధకారం నిండి పోయింది గదంతా. శ్యాం అతి వేగంతో సునందను వెనకకు తోసి లైటు స్విచ్ వేసేసరికి ఆ ఇద్దరు వ్యక్తులూ మాయమయిపోయారు.

సునంద చెంప మీద చెళ్ళుమనిపించాడు భవానీశంకరు. ఆ దెబ్బకు ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినాయ్.

"నువ్వు చేసిన దారుణానికి ఇది చాలా చిన్న శిక్ష కామ్రేడ్! యింక టైము వేస్టు చేయకుండా త్వరగా నీ అత్మకదా- ఆ అడ్రస్ ల పుస్తకం తాలూకు జరిగిన కథా చెప్పేయ్" అన్నాడు పిస్టల్ ఆమెకు గురి పెడుతూ.

ఆమె కళ్ళల్లో భయం కనిపించింది.

"అడ్రస్ బుక్ మా వ్యాపారానికి సంబంధించినది."

"మా" అంటే ఎవరు?"

"మాధవరావు, సిద్ధార్ధరావు - మా బాస్ లు! మేమంతా వాళ్ళ దగ్గర వర్కు చేస్తున్నాం-"

"మీ వ్యాపారం ఏమిటి?"

ఆమె జవాబు చెప్పడానికి నోరు తెరిచింది.

అంతే! నోట్లో దిగింది కత్తి! చివ్వున చిమ్మిన రక్తం. మరుక్షణం అక్కడే కుప్పగా కూలిపోయిందామె.

పరుగుతో గది బయటకొచ్చారు భవానీశంకరు.

అప్పుడే నల్లని కారు ఒకటి శరవేగంతో స్టార్టు అయి అతివేగంగా చీకట్లోకి దూసుకుపోయింది.

## 10

కొద్ది క్షణాలు గిలగిల కొట్టుకుని నిశ్చలంగా పడిపోయిందామే. చటుక్కున వంగి కూర్చుని ఆమె చేతిని పట్టుకుని ఫల్స్ చూశాడు శ్యామ్.

"షి ఈజ్ డెడ్" అన్నాడతను ఆందోళనగా. "బహుశా ఈ కత్తి పాయిజనస్ అయుంటుంది" భవానీశంకర్ మనసంతా ఆమె మీద జాలితో నిండిపోయింది.

"కరెంటు పోగానే అ రాస్కెల్స్ పారిపోయి ఉంటారని భ్రమ పడ్డాము కామ్రేడ్. మనం ఇంకొంచెం జాగ్రత్తగా వ్యవహరించినట్లయితే పాపం సునంద ప్రాణాలు పోయేవికావు" ఆమె ఆత్మశాంతికి భగవంతుని ప్రార్ధించటం కోసం మనం అర్జెంటుగా ఈ ప్రదేశం వదిలేయాలి శ్యాం! ఆలస్యమయితే పోలీసులతో గొడవ" అన్నాడతను.

ఇద్దరూ బయటకు పరుగెత్తారు.

ఆ అమ్మాయిని ఎవరు చంపి ఉంటారు?" దారిలో అడిగాడు శ్యామ్.

"నేనుహిస్తోంది కరెక్టు అయితే మాధవరావ్, సిద్దార్ధరావ్ గ్రూప్ వాళ్ళు చంపి వుండాలి."

"ఈ మాధవారావ్, సిద్దార్ధరావ్ లు ఎవరసలు?"

"ఇంకెవరు? మాధవరావ్ మన పార్లమెంట్ మెంబర్ కామ్రేడ్! మన సిటిలోని కల్లు కాంపౌండ్ బార్ లు సినిమాహల్సూ ప్రారంభోత్సవం చేస్తుంటాడు కదా ఎప్పుడూ! ఇక సిద్దార్ధరావు సంగతి నీకూ తెలిసే ఉంటుంది. నోటోరియస్ గుండా లీడర్. మాధవరావు పొలిటికల్ సపోర్టుతో సిద్దార్ధరావ్ ఎన్నో రకాల క్రిమినల్ కేసుల నుంచి తప్పించుకున్నాడు. అలాగే తన రాజకీయాలకూ, ఎలక్షన్స్ కీ సిద్దార్ధరావ్ ని ఉపయోగించుకుంటున్నాడు మాధవరావ్ - ఈ విషయాలన్నీ మన జర్నలిస్టు ఫ్రెండ్స్ చెపుతుండేవారు."

శ్యాం కొద్ది క్షణాలు మాట్లాడలేదు.

"పాపం? నాకింకా ఆ అమ్మాయి ముఖమే కళ్ళముందు కనబడుతుంది" అన్నాడు జాలిగా.

"వాళ్ళ రహస్యం బయట పడకుండా - ఆమెను అంత దారుణంగా చంపారంటే వాళ్ళేదో చాలా పెద్ద నేరమే చేస్తుండి ఉండాలి?"

"అందులో అనుమానం లేదు కామ్రేడ్! అందుకే ఇన్ని హత్యలు ఇంత గందరగోళం జరుగుతోంది. ఇప్పుడు ఆ పుస్తకం మనకు దొరికిందన్న విషయం వాళ్ళకు తెలిసిపోయింది కాబట్టి మనం చాలా జాగ్రత్తగా ఉండాలి."

శ్యాం సైకిల్ స్లో చేశాడు. రియల్ మిర్రర్ లో కనబడుతోన్న దృశ్యం అతనికి కలవరం కలిగిస్తోంది. ఎర్ర రంగు

మారుతీ కారు తమ సైకిల్ వెనుకే వస్తోంది.

"అంటే మన ఇంటిమీద కూడా వాళ్ళు ఎటాక్ చేసే అవకాశం ఉందంటావా!" అద్దంలో జాగ్రత్తగా చూస్తూ అడిగాడతను.

"సెంట్ పర్సెంట్ కామ్రేడ్! అందులో అనుమానమేమీ లేదు . హటాత్తుగా శ్యాం సైకిల్ ని బ్రేక్ వేసి నిలబెట్టి మిర్రర్ లో చూస్తూ మాట్లాడసాగాడు.

"భవానీ! మననేవరో ఆ ఎర్ర మారుతీకార్లో వెంబడిస్తూన్నరనీ అనుమానంగా వుంది నాకు. మన సైకిల్ ఎటు తిరిగితే ఆ కారూ అటు తిరుగుతూ చాలా స్లో గా వస్తోంది. నువ్వు ఆ కిల్లి కొట్లో సిగరెట్టూ కొనుక్కోస్తున్నట్లు నటించు! వాళ్ళేం చేస్తారో చూద్దాం!" భవానీ పక్కనే ఉన్న సిగరెట్ షాప్ కెళ్ళి సిగరెట్లు కొంటూ తల పక్కకు తిప్పి చూశాడు.

ఎర్ర మారుతీ కూడా చాలా స్లో అయిపోయింది. అసలది కదులుతుందో , లేదో కూడా తెలీటం లేదు.

ఓ పాకెట్టు సిగరెట్లు, అగ్గిపెట్టె కనుక్కొని శ్యాం దగ్గర కొచ్చాడతను. ఇద్దరూ చెరో సిగరెట్టు వెలిగించుకున్నారు. కారు బాగా దగ్గర కొచ్చేసింది.

"పిస్టల్ తీయడానికి సిద్దంగా వుండు" అన్నాడతను శ్యాంతో.

"రెడీ" అన్నాడు శ్యాం చేతిని పాంటు పాకెట్ దగ్గరికి పోనిస్తూ.

హటాత్తుగా కారు వేగం పెరిగింది. మరుక్షణంలో వాళ్ళను దాటి ముందుకు వెళ్ళిపోయింది శ్యామ్ నవ్వేశాడు.

"మనం అనవసరంగా అపోహపడ్డామనుకుంటాను"అన్నాడు.

భవానీశంకర్ కి అతని మాటలు వినిపించటం లేదు. ఆ కార్లో వెనుక సీట్లో కూర్చున్న ఆ ఇద్దరు వ్యక్తుల గురించి ఆలోచిస్తున్నాడు. అందులో ఒక వ్యక్తీ మొఖం అంతకు ముందేక్కడో చూసిన గుర్తు. ఎంత ఆలోచించినా ఎక్కడ చూసింది జ్ఞాపకం రావడం లేదు.

సైకిల్ మళ్ళీ బయలుదేరింది. ఆ తరువాత జంక్షన్ దాటేసరికి రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద ఆగి వుందా కారు.

శ్యామ్ మళ్ళీ కలవరపాటుతో "భవానీశంకర్ "వేపు చూశాడు.

"మన కోసమే అగారేమో" రహస్యంగా అన్నాడతను.

భవానీ శంకర్ సైకిల్ బ్రేకులు నొక్కేశాడు తనే.

"ముసుగులో గుద్దులాటెందుకు కామ్రేడ్! మనమే వారితో స్నేహంచేసుకుందాం. అప్పుడిక ఈ అపోహలు, అపార్ధాలు ఉండవు కదా" అన్నాడతను.

శ్యామ్ సైకిల్ ని కారు ప్రక్కనే ఆపాడు. భవానీశంకర్, వెళ్ళి కారు కిటికీ దగ్గర తలపెట్టి లోపలకు జాగ్రత్తగా చూశాడు.

ఇద్దరూ వ్యక్తులూ ఒకరి మోహాలోకరు చూసుకున్నారు మళ్ళీ.

"గుడ్ మాణింగ్ కామ్రేడ్స్! మీకిలాంటి చీకటి వాతావరణమంటే ఇంత ఇష్టమని నాకు తెలీదు. ఎనీవే ఈ చీకటి చాలా బావుంది కదూ? అయ్ మీన్ చిక్కగా ఉంది కదూ?"

ఓ వ్యక్తీ కారు దిగి నిలబడ్డాడు.

"ఊ!" అన్నాడు తీవ్రంగా.

భవానీ శంకర్ చప్పున అందుకున్నాడు.

"చూడండి కామ్రేడ్స్! మిమ్మల్ని చూస్తుంటే జాలితో ఏడుపొచ్చేస్తోంది నాకు. పాపం ఇంకా పాత సినిమాల్లో సీన్లను కాఫీ కొట్టి చేజింగ్ సీన్లు ప్రాక్టీస్ చేస్తున్నట్లున్నారు. ఇప్పుడు సినేరియా మారిపోయింది బ్రదర్స్! అంతా డయిరెక్ట్ ఎటాక్! ఏం కావాలో అడగండి చెప్పేస్తాం! అంతేగానీ ఇలా మైళ్ళకొద్దీ వెంబడించడం చాలా తెలివితక్కువ పని!"

ఆ ఇద్దరూ వ్యక్తులూ మళ్ళీ మొహాలు చూసుకున్నారు.

"త్వరగా మాట్లాడండి కామ్రేడ్స్! మేము నిద్రపోయే టైమయిపోయిందిందాకే! రాత్రి పదకొండు తర్వాత నిద్ర మేలుకోవటానికి కామ్రేడ్ శ్యామ్ ఏమాత్రం ఇష్టపడడు" అన్నాడు భవానీశంకర్. శ్యామ్ అప్పుడే పెద్దగా ఆవులించాడు.

ఇద్దరిలోనూ ఓ వ్యక్తీ డోర్ తెరచుకుని కారు దిగాడు. శ్యామ్ చెయి అప్రయత్నంగా పిస్టల్ మీద కెళ్ళింది.

"మీరూ మీ కుటుంబాలూ క్షేమంగా ఉండాలంటే మర్యాదగా ఆ అడ్రస్ బుక్ ఇచ్చేయండి! ఆ పుస్తకం మీకేమీ ఉపయోగపడదు" బెదిరింపుగా అన్నాడతను.

భవానీశంకర్ గట్టిగా నవ్వేశాడు.

"ఉపయోగపడదా? యూ ఆర్ మిస్టేకన్ కామ్రేడ్! "తైలంబు తీయవచ్చు" అనేది మా లేటెస్టు పాలేసీ! తైలం అంటే తెలుసు కదా! క్యాష్!"

ఆ వ్యక్తీ ఆశ్చర్యపోయాడు.

"అయితే మీకు ఆ పుస్తకం సంగతి తెలిసిపోయిందన్న మాట అన్నాడు ఆశ్చర్యంగా.

"పూర్తిగా తెలిసిపోయింది కామ్రేడ్స్! ఆ పుస్తకం ఆ అడ్రసు తాలూకు ఫ్లాష్ బాక్ లూ అన్నీ తెలిసిపోయినాయ్-" అబద్ధమాడేశాడు భవానీశంకర్.

ఆ ఇద్దరూ వ్యక్తులూ కొంచెం దూరం నడిచి రహస్యంగా మాట్లాడుకున్నారు. మొదటి వ్యక్తీ మళ్ళీ భవానీశంకర్ దగ్గరకొచ్చాడు.

"నువు మా బాస్ దగ్గర కొచ్చి మాట్లాడటం మంచిదనుకుంటాను. అనవసరంగా రక్తం చిందించటం మా కిష్టం లేదు" అన్నాడు గంబీరంగా.

"మోస్ట్ సెన్సిబుల్ అయిడియా కామ్రేడ్! మీ బాస్ ఎక్కడుంటాడో చెప్తే ఇప్పుడే కలుసుకుందాం."

"హోటల్ నైటింగేల్!"

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"ఓహో! ఇప్పుడు మేము పరిశోధన జరిపి వచ్చిన బార్ అన్నమాట. బైదిబై మీ బాస్ పేరేమిటి?"

"సిద్దార్ధరావు"

భవానీ శంకర్ తను కూడా మారుతీ కార్లో కూర్చున్నాడు.

"కామ్రేడ్ శ్యాం! నువ్వు సైకిల్ మీద వచ్చేసేయ్ హోటల్ దగ్గరకు చెప్పాడతను.

"ఒకే" అన్నాడు శ్యాం సైకిల్ వెనక్కు తిప్పేస్తూ.

పదినిముషాల్లో నైటింగేల్ బార్ చేరుకుంది కారు. తలుపు తీసుకుని బార్ లోకి నడిచారిద్దరూ.

లోపల జనం క్రిక్కిరిసిపోయి వున్నారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ భరతనాట్యం చేసిన అమ్మాయిలు ఇపుడు ఒంటిమీద నూలు పోగుతో కాబరే డాన్స్ లు చేస్తున్నారు.

"ఇలారా" అన్నాడా వ్యక్తి భవానీశంకర్ ని ఓ మూలగా ఉన్న మెట్లవేపు పిలుస్తూ.

అప్పుడు గుర్తుకొచ్చింది భవానీశంకర్ కి.

ఆ రోజు స్మితారాణిని ఫోటోలు తీయమని కెమెరా ఇచ్చింది వీరే. అతని వెనుకే మెట్లెక్కి పైకి చేరుకున్నాడు.

పైన చాలా పెద్ద ఆఫీస్ వాతావరణం కనబడుతుంది. డేకలాన్ తో చేసిన వుడెన్ పార్టిషన్స్ తో కొత్త ఫర్నిచర్ తో చాలా నీట్ గా , అందంగా ఉంది. ఓ పెద్ద గదిలో అడుగు పెట్టరందరూ. లోపల చాలా విశాలంగా అందంగా అలంకరించి వుంది. గది మధ్యలో రౌండ్ టేబుల్ - మధ్యలో రివాల్వింగ్ ఛైర్ - ఆ చెయిర్ లో కూర్చుని ఉన్నాడో వ్యక్తి - అతనే సిద్దార్ధరావు అయ్యుంటాడని ఊహించాడు భవానీశంకర్. లావూ, లావుకి తగ్గ పొడుగూ, మొఖమంతా మచ్చలు, కత్తిగాట్లు, మొటిమలతో భయంకరంగా వున్నాడతను. అతనికి ఓ పక్కన ఓ మధ్య వయసు స్త్రీ కూర్చుని వుంది.

"రా! కూర్చో" అన్నాడు సిద్దార్ధరావు.

భవానీశంకర్ కుర్చీలో కూర్చున్నాడు.

"ఎక్కడుందా నోట్ బుక్?" అడిగాడతను కర్కశంగా.

"అలాంటి సిల్లీ ప్రశ్నలు వేయకూడదు కామ్రేడ్ సిద్దార్ధరావు! ఆ పుస్తకం విలువ తెలిసి కూడా ఎవడయినా జేబులో పెట్టుకుని తిరుగుతాడా? కొంచెం కామన్ సెన్స్ అవసరం బ్రదర్" చిరునవ్వు తో అన్నాడు భవానీ శంకర్.

సిద్దార్ధ మొఖంలో కోపం కనిపించింది. అకస్మాత్తుగా కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఇదిగో చూడు తంబీ! ఎక్కువ మాట్లాడకుండా అడిగిన దానికి సమాధానం చెప్పు! సంధ్యారాణిని ఎక్కడ దాచావు?"

"నాకు తెలీదు కామ్రేడ్! ఆ పేరే వినలేదెప్పుడూ!"

సిద్దార్ధరావు ముఖం కోపంతో మరింత తీక్షణంగా మారింది -

"ఆ అబద్ధాలే నా దగ్గర పనికిరావు. సంధ్యారాణిని నువ్వే ఎక్కడికో తీసుకెళ్ళి దాచావని మావాళ్ళు చెప్పారు."

"వాళ్ళందర్నీ వెంటనే పిచ్చాసుపత్రిలో చేర్పించండి కామ్రేడ్! లేకపోతే పిచ్చి ముదిరి రోడ్డు మీద ఏ ఆడపిల్ల కనిపించినా "ఓ సంధ్యారాణి నా సంధ్యారాణి" అంటూ వెర్రి కేకలు వేస్తూ వెంబడి పడే అవకాశం వుంది."

సిద్దార్ధరావు కోపం అణుచుకోలేక పిడికిలి బిగించి బలంగా టేబుల్ మీద కొట్టాడు.

"ఆఖరి వార్నింగిస్తున్నాను. నిజం చెప్పేయ్! సంధ్యారాణిని కారు ప్రమాదం నుంచి రెండు సార్లూ రక్షించింది నువ్వు కదూ?"

"నిజమే చెపుతున్నారు కామ్రేడ్! అబద్దాలు ఇంకా ప్రాక్టీస్ చేయలేదు" అంటుండగానే అతని మెదడులో లైట్లు వెలిగినట్లయింది.

అంటే వీళ్ళు స్మితారాణిని చూసి సంధ్యారాణి అనుకుంటున్నారా! సంధ్యారాణి, స్మితారాణి ఒకటిగానే వుంటారా? సంధ్యారాణి మీద పగతోనే స్మితారాణిని పొరబాటున చంపబోయారా? అసలు సంధ్యారాణి ఎవరు? ఆ అమ్మాయికి సిద్దార్ధరావుకీ ఎందుకు వైరం వచ్చింది?

"నువ్వూ ఆ మాధవరావుగాడూ కలిసి నాటకమాడుతున్నారు! నా కంతా తెలుసు. ఆ మాధవరావుగాడితో పాటు నిన్నూ మర్డరు చేయక ముందే సంధ్యారాణిని ఎక్కడ దాచావో చెప్పు.'

"నీ మీద ఒట్టు కామ్రేడ్! నాకందులో ఎలాంటి ప్రమేయం లేదు."

"సిద్దార్థరావు ఓ క్షణం నిశ్శబ్దంగా వుండిపోయాడు. తరువాత లేచి హాలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

"సరే - ఇప్పుడు ఆ నోట్ బుక్ కావాలి మాకు! నీకు పదివేల రూపాయలిస్తాను వెంటనే తెచ్చిస్తే - " ఆగి భవానీ శంకర్ మొఖంలోకి చూస్తూ అన్నాడు.

భవానీశంకర్ నవ్వాడు.

పుస్తకం తాలుకూ ఆడ్రస్ లలో ఏదో గొప్ప సీక్రెట్ దాగి వుంది. అదేదో తెలుసుకోందే తను ఆ పుస్తకాన్ని చెయి జారనీయ కూడదు.

"పదివేలా? అహ్హాహ్హా ! కొంచెం మనసు విశాలంగా చెయి కామ్రేడ్! పదివేలు మంచిరకం చెప్పుల జత కూడా చాలవు!" హేళనగా అన్నాడు.

సిద్దార్థరావు ఉడికిపోతున్నాడు - "సరే! నువ్వే చెప్పు! నీ కెంత కావాలో?"

భవానీ శంకర్ త్వరత్వరగా ఆలోచించసాగాడు. ఎంత అడగవచ్చు? రెండు లక్షలా, పది లక్షలా. ఎటూ పాలుపోవటం లేదతనికి. ఏదో ఒక అంకె గ్యాంబుల్ చేయాలి.

"పాతిక లక్షలు" అన్నాడతను. సిద్దార్థ ఉలిక్కిపడ్డాడు.

"నీకేం పిచ్చెక్కలేదుకదా! ఇదేం గోల్డు వ్యాపారమనుకున్నావా?"

"గోల్డు కంటే ఎక్కువ" చిరునవ్వుతో అన్నాడు భవానీశంకర్.

"నువ్వు మరీ అత్యాశకు పోతున్నావు! అత్యాశకుపోయే వాళ్ళ గతి ఏమవుతుందో తెలుసు కదా!"

"తెలుసు . మన తెలుగు దేశంలో ఎంత అత్యాశకు పోతే అంత ధనవంతులవుతారు. కొంతమంది బార్ ఓనర్స్ అయితే ఇంకొంత మంది ఇండస్ట్రియలిస్ట్ అవుతారు."

సిద్దార్థరావు మొఖానికి చెమటలు పట్టినాయ్.

"అరేయ్ , పుస్తకం లేకపోతే పోనిండి. వీడిని నరికి అవతల పారెయ్యండి" కసిగా అరిచాడతను. అంతవరకూ భవానీ శంకర్ వెనుకే నిలబడ్డ వ్యక్తులిద్దరూ అతనిని కుర్చిలోంచి కింద కీడ్చేశారు.

"పద - బయటకు పద" అన్నడోకతను లాగి అతని పొట్టలో తన్ని.

భవానీ శంకర్ బాధతో పొట్ట రెండు చేతులతో పట్టుకొని కూర్చునిపోయాడు. అంతవరకూ సిద్దార్దరావు పక్కనే నిశ్శబ్దంగా కూర్చున్న యువతి ఆందోళనగా చూసింది సిద్దార్థ వేపు.

"నీకేమయినా పిచ్చెక్కిందా? మనకి ఆ పుస్తకం దొరక్కుండా చంపేస్తానంటావేమిటి?" అంది చిరాకుగా.

సిద్దార్థరావు మాట్లాడలేదు. కర్చీఫ్ తో ముఖం తుడుచుకున్నాడు .

"వదిలేయండి" అందామె భవానీ శంకర్ ని బంధించి పట్టుకున్న వ్యక్తులతో.

ఇద్దరూ అతనిని వదిలేశారు. భవానీ శంకర్ లేచి నిలబడ్డాడు మళ్ళీ.

"మాగాడికంటే ఆడది తెలివిగలదనటానికి మీ ఇద్దరే కరెక్ట్ ఎగ్జాంపుల్ కామ్రేడ్! భవిష్యత్తులో కూడా మీ గాంగ్ మొత్తం ఆమె మాట వింటే బాగుపడతారు" అన్నాడు సిద్దార్థతో.

"ఏయ్ ! ఆఖరి మాటగా చెప్తున్నాను. ఆ పుస్తకం ఇస్తే నీకు లక్ష రూపాయలిస్తాను. అంతకుమించి చిల్లిగవ్వ కూడా ఇవ్వను -" కోపం అణుచుకుంటూ అన్నాడు అతను.

"లక్షా! ఆహ్హాహ్హా లక్షా! లక్ష రూపాయలకు వాల్యు ఎప్పుడో పోయింది కామ్రేడ్! కనీసం పది లక్షలయినా లేందే రాజీకి రావటం అసంభవం."

సిద్దార్ధరావ్ అసహనంగా లేచి నిలబడ్డాడు.

"నీకు పిచ్చెక్కింది. పది లక్షలంటే తమాషాగున్నట్లుందే నీకు. వెళ్ళు! ఒక్క పైసా కూడా ఇవ్వను. మన పాతికేళ్ళ సర్వీసులో మనం డబ్బు తీసుకోవటమే కాని ఎవరికీ ఒక్క పైసయినా ఇవ్వలేదు. వెళ్ళు నీ ముఖం చూస్తేనే కత్తితో చెక్కబుద్దవుతోంది" ఉద్రేకంగా అరిచాడు అతను.

"బాష కామ్రేడ్! మరికొంచెం మంచిబాష వాడడానికి ప్రయత్నించు పైకొస్తావు! లేకపోతే ఎప్పటికి ఇలానే "ఫిట్ ఫర్ నథింగ్"లెవల్లో మిగిలిపోతావు." అనేసి బయటకు నడిచాడు. సిద్దార్ధరావు అనుచరులందరూ అతనివేపే చూస్తూ నుంచున్నారు. తలుపు మూసుకునే ముందు భీకరంగా అరిచాడు సిద్దార్ధరావ్.

"ఏం ఆఖరిసారిగా చెపుతున్నా! రేపు ఉదయం పదిగంటలలోగా ఆ పుస్తకం తెచ్చియ్యకపోయావో - నీ శాల్తీ గల్లంతవుతుంది గుర్తుంచుకో"

"సరే కామ్రేడ్! అలాగే గుర్తుంచుకుంటాను. జ్ఞాపశక్తికి మనం పెట్టింది పేరు" అనే తలుపు మూసి బయటకొచ్చాడు . సన్నటి వ్యక్తీ, లావుపాటి వ్యక్తి యిద్దరూ నిలబడి వున్నారు బయట. మెట్లు దిగి కిందకు వచ్చాడు తను. బార్ లో తలుపు దగ్గర నిలబడి వున్నాడు శ్యామ్.

"హమ్మయ్యా! లోపల ఇంతసేపు వుండిపోయేసరికి నిన్నేం చేస్తున్నారో అని భయపడిపోయాను" అన్నాడతను.

"పద - ఇంటికేళదాం! ఇవాళ చాలా అభివృద్ధి సాధించాం ఈ కేసులో - మిగతా కార్యక్రమం రేపు"

సైకిల్ ఇంటివేపు దూసుకుపోయింది.

అఖిలభాను, స్మితారాణి, తులసీ మేలుకునే వున్నాడు. ఇద్దరూ సైకిల్ మీద యిల్లు హా\చేరుకోవడం చూడగానే వాళ్ళిద్దరి ముఖాలూ వికసించాయి.

"మీరేమైపోయారో , ఏం గొడవల్లో ఇరుక్కున్నారోనని నాకొకటే భయంగా ఉంది. ఇంక మీరు ఈ పరిశోధనలూ, తిరుగుళ్ళు మానేసి యింట్లో కూర్చోండి" అంది అఖిలభాను కోపంగా.

"ఏమిటి? మధ్యలో వెనక్కు తిరగటమా! ఇంపాజిబుల్ సిస్టరిల్లా! అభిమన్యుడు - పద్మవ్యూహం గురించి వినలేదా? మనమూ అంతే"

"అయితే ఆ గొడవేదో నువ్వేపడు! శ్యాముని ఇందులోకి లాగొద్దు" ఖచ్చితంగా చెప్పేసిందామె. శ్యాం ఆనందంగా గర్వంగా చూశాడు భవానీశంకర్ వేపు.

"చూశావా నేనంటే ఎంత ప్రేమో" అన్నాడు నవ్వుతూ.

అఖిలభాను కోపంగా చూసింది శ్యామువేపు.

"అంకుల్ ఇవాళ మళ్ళీ ఫైటింగ్ చేశారా?" ఆత్రుతగా అడిగింది తులసి.

"ఓ! టెరిఫిక్ ఫైట్! ముగ్గుర్ని చట్నీ చేసేశాము"

"అబ్బ! త్రిమూర్తులలో ఫైట్సాగానా?"

"ఎగ్జాక్ట్ లీ"

అంతవరకూ వాళ్ళ మాటలు వింటున్న స్మితా రాణి కలిపించుకుంది.

"పోనీ నేనూ తులసీ మాబావ వెంకటరత్నం వాళ్ళింటికి పోతామే అఖిలా! అనవసరంగా నావల్ల మీ అందరికి సమస్యలు ఎక్కువవుతున్నాయ్" దీనంగా అందామె.

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"వాట్ కామ్రేడ్ స్మితారాణి! మధ్యలో ఈ బావ వెంకటరత్నం ఎవరు? ఇంత హటాత్తుగా ఆ పాత్ర మన కథలో కెందుకొచ్చింది?" అడిగాడు ఆత్రుతగా.

స్మితారాణి ఏదో చెప్పబోయి సిగ్గుపడింది.

"వెంకటరత్నం వాళ్ళ దూరపు బంధువు .వీళ్ళిద్దరికీ వివాహం చేయాలని వాళ్ళక్క బావలు నిశ్చయించారట" చెప్పింది అఖిల.

"నో నో నో ! నేనొప్పుకోను కామ్రేడ్! ఈ బావ మరదళ్ళ పెళ్ళిళ్ళన్నీ ఫ్లాష్ అవుతున్నాయి ఈమధ్య. వాళ్ళందర్నీ ఇంటర్వ్యూ కూడా చేశాన్నేను. మగాళ్ళు- అంటే ఈ బావ అసోసియేషన్ వాళ్ళు చెప్పేదేమీటంటే మరదలు పిల్లలతో చిన్నప్పట్నుంచి చనువుగా గడపటం వలన పెళ్ళికూతురు ఇచ్చే థ్రిల్ వాళ్ళకు ఏమాత్రం దొరకటంలేదట. అందుకు బావలను పెళ్ళిచేసుకుని ఆ నరకం భరించలేక గత వారంరోజుల్లో డెబ్బయి ఎనిమిది మంది ఆత్మహత్యలు చేసుకున్నారట. నిన్న ఈవెనింగ్ ఎడిషన్ లో వేశారు"

"అవునంకుల్ సినిమాలలో కూడా అంతే! బావా బావా అంటూ తిరిగే అమ్మాయిని వదిలేసి ఇంకో హీరోయిన్ ని చేసుకుంటాడు హీరో అంది తులసి."

"బైదిబై మీరు హిస్టరీ స్టూడెంటా స్మితాగారూ?"

"కాదు"

"వండర్ ఫుల్ - అయితే నేను చెప్తాను చూడండి , లైలా - మజ్నూల లవ్ ఎందుకు ఫెయిలయింది? వాళ్ళిద్దరూ ఒరిజినల్ గా బావామరదళ్ళు అవటం వల్ల! పార్వతీ- దేవదాసులు ఎందుకు పెళ్ళి చేసుకోలేకపోయారు? దేవదాసు దూరపు చుట్టరికం వల్ల తనకు బావ అవుతాడని పార్వతికి తెలియటం వల్ల. మల్లేశ్వరి అన్ని ట్రబుల్స్ ఎందుకు పడింది? ఎన్టీఆర్ బావ అవటం వల్ల. ఇలా ఎన్నో కోట్ల కొద్దీ ఎగ్జాంపుల్స్ వున్నాయ్"

అఖిలభాను లేచి నిలబడింది.

"టైము ఒంటిగంటవుతోంది - ఇక పడుకుందాం పదండి" అందామె. ఆ రాత్రంతా భవానీశంకర్ కి నిద్రపట్టలేదు.

స్మితారాణిని ముమ్మూర్తులా పోలి వున్న సంధ్యారాణి గురించే ఆలోచిస్తున్నాడు.

ఆ అమ్మాయి ఎలా అంతర్థానమయినట్లు? ఎవరు మాయం చేసినట్లు? ఆమె నేవరయినా చంపేశారా? లేక ఆమె పారిపోయిందా? మాధవారావు , సిద్దార్ధరావ్ మధ్య వైరం ఎందుకొచ్చింది? ఆ పుస్తకం తాలుకూ సిక్రెట్ ఏమిటి? ఎంత ఆలోచించినా ఎటూ తేలటంలేదు.

ముందు సంధ్యారాణి ని వెతికి పట్టుకుంటే గానీ తనకు ఈ కేసు వివరాలు తెలీవు. కానీ ఆమె ఎక్కడుందో ఎలా తెలుస్తుంది? అసలు ఆమెకూ స్మితారాణికి అంత పోలికలున్నాయా?

లేచి కూర్చున్నాడు భవానీశంకర్. టైము తెల్లవారుఝామున నాలుగావుతోంది. తను సంధ్యారాణి ఫ్లాటు కెళ్ళి

మళ్ళీ వెతికితే ఆమె తాలూకు వివరాలు కొన్ని దొరికే అవకాశముంది. ఆమె చదువు సంధ్యలు, ఆమె స్నేహితురాండ్రు , ఆమె తల్లిదండ్రులు.

నెమ్మదిగా నిలబడి షర్టు వేసుకున్నడతను. అందరూ గాడ నిద్రలో వున్నారు. శబ్దం కాకుండా తలుపు తీసి శ్యామ్ సైకిల్ బయటకు తీసి తలుపులు దగ్గరాగా మూసి రోడ్ మీద కొచ్చాడు. సంధ్యారాణి ఫ్లాటు తలుపు బయట తాళం వేసుంది. తన సైకిల్ తాలుకు స్క్రూడ్రైవర్లతో గొళ్ళెం విప్పటానికి అరగంట సేపు పట్టిందతనికి.

లోపలకు నడిచి తలుపు బోల్టు వేసేశాడు. లైటు స్విచ్ వేస్తూ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. ఇంట్లో సామాన్లన్నీ చిందర వందరగా ఇల్లంతా పూర్తిగా వెతికి వెతికి వెళ్ళినట్లు తెలిసిపోతోంది. బహుశా తను సునంద ఆ నోట్ బుక్ తీసుకుపోయాక ఇంకెవరో ఆ పుస్తకం కోసం వెతికి వుండాలి.

త్వరత్వరగా అల్మారాలూ, సూట్ కేసులూ వెతకసాగాడతను. చాలాసేపటి తర్వాత అతని ప్రయత్నం ఫలించింది. బెడ్ రూమ్ లోకి కప్ బోర్డులో అరలో కనిపించింది ఫోటో ఆల్బం.

అక్కడే కూర్చుని త్వరత్వరగా ఆల్బమ్ తెరచి చూశాడు. మొదటి కార్డుమీదే కనిపించింది కలర్ ఫోటో. ఆ ఫోటో చూస్తూనే నిశ్చేష్టుడయ్యాడతను. అచ్చం స్మితారాణి లాగానే వుందామే కూడా. ఇద్దరికీ డ్రస్ లో తప్ప మరెందులోనూ తేడా వున్నట్లు కనిపించలేదు. సంధ్యారాణి చాలా ఆధునికమైన డ్రస్ లో వుంది. జీన్స్, మిడ్డీ, చుడీదార్ అన్నీ అలాంటి డ్రస్ లే!

ఒక్కొక్క కార్డు తీసి చుస్తున్నడతను. సునందతో దిగిన ఫోటోలు, మరికొంతమంది బోయ ఫ్రెండ్స్ తోనూ, గాళ్ ఫ్రెండ్స్ తోనూ దిగిన ఫోటోలు. ఎక్కువగా భార్గవ్ తో దిగిన ఫోటోలు కనబడ్తున్నాయి అతనికి. ఆఖరి పేజీలో కనిపించింది అతనికి కావలసిన ఫోటో.

ఆమె, మరో యువకుడు మాధవరావు దంపతులకు చెరో వేపు, కూర్చుని వున్నారు. వెనుక తాజ్ మహల్ కనబడుతోంది. అంటే ఒకవేళ సంధ్యారాణి మాధవరావుకి కూతురా? లేక బంధువా?

మొత్తం మిస్టరీ అంతా క్షణంలో సాల్వ్ అయిపోయినట్లు అర్ధమయిందతనికి. స్మితా రాణిని సిద్దార్ధరావు గ్రూపు వాళ్ళు చంపటానికి ప్రయత్నించటానికి కారణం ఆమెను సంద్యారాణి గా భ్రమ పడటమే. అందులో ఏ మాత్రం అనుమానం లేదు.

కానీ అసలు సంధ్యారాణిని ఎందుకు చంపాలనుకున్నారో మాత్రం తెలీటం లేదు . ఈ దారుణాలన్నీ కూడా ఆ అడ్రస్ బుక్ వల్లే జరుగుతున్నాయని మాత్రం తెలుస్తోంది.

త్వరత్వరగా ఆ అల్బం లోని ఫొటోలన్నీ తీసుకుని ఇంటి బయటికొచ్చాడతను. అప్పటికే పూర్తిగా తెల్లారిపోయింది. తలుపు దగ్గరగా వేసి మెట్లమీద నుంచి వడివడిగా కిందకు దిగి సైకిల్ మీద ఇంటికి చేరుకున్నాడు.

శ్యాం, అఖిలభాను, స్మితారాణి, తులసి ఇల్లంతా చిందర వందరగా పడి వున్న సామాన్ల మధ్య కూర్చుని ఉన్నారు దిగులుపడి.

"ఏమిటది ? ఏం జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"విలన్స్ వచ్చారంకుల్! శ్యాం అంకుల్ తోనూ, స్మితా అంటీ తోనూ, అఖిలాంటీతోనూ ఫైటింగ్ చేసి ఓడిపోయి పారిపోయారు........" అంది తులసి ఉత్సాహంగా.

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు. "ఇలా జరగవచ్చనీ నేననుకుంటూనే ఉన్నాను కామ్రేడ్."

"ముందు ఆ అడ్రస్ పుస్తకం కోసం ఇల్లంతా వెతికారు. ఆఖరుకి బెడ్ రూంలో నిద్రపోతున్న స్మితారాణిని చూసి ఆమెను కిడ్నాప్ చేయబోయే సరికి నేను పిస్టల్ తీయాల్సి వచ్చింది" చెప్పాడు శ్యాం." అప్పుడు గానీ కాలికి బుద్ధి చెప్పలేదు వాళ్ళు."

"అందుకే నీకు పిస్టల్ ఇచ్చాను కామ్రేడ్! మనం తక్షణం ఒక మాస్టర్ ప్లాన్ తయారు చేయకపోయినట్లయితే స్మితారాణిని ఇంటర్నేషనల్ లెవల్లో స్మగ్లింగ్ చేసే గాంగ్ లు యాక్షన్ లోకి దిగటం ఖాయం అన్నాడు భవానీ శంకర్ తన చేతిలోని ఆల్బం శ్యాం మీదకు విసురుతూ.

శ్యాం దానిని కింద పడకుండా పట్టుకుని మొదటి పేజీ చూశాడు చూస్తూనే ఆశ్చర్యంగా అఖిలభాను వేపు చూశాడు.

'అఖిల! ఇదిగో ఈ అమ్మాయ్ చూడు! అచ్చం మన స్మితారాణి లాగానే ఉంది" అన్నాడు అల్బం ఆమె ముందు పెడుతూ.

తులసీ, స్మితారాణి కూడా చూశారది.

"అబ్బ! అచ్చం స్మితా అంటీయే " అంది తులసి.

"ఎవరీ అమ్మాయ్?" అడిగింది అఖిలభాను భవానీ శంకర్ వేపు చూస్తూ.

"ఆఖరులో ఉన్న గ్రూప్ ఫోటోని బట్టి చూస్తుంటే మాధవరావ్ కుటుంబానికి చెంది ఉండాలి. లేదా వాళ్ళ కుటుంబానికి అతి సన్నిహితమున్న వ్యక్తయినా అయిండాలి- మన స్మితారాణిని చూసి ఈ అమ్మాయే అనుకుని హత్యాప్రయత్నాలు చేశారని నాకనిపిస్తుంది" వివరించాడతను. స్మితారాణి ముఖంలో భయం కనిపించింది.

"మనం ఇప్పుడేమిటి చేయటం? ఏదొక విధంగా స్మితారాణికి వేరు సంధ్యారాణి వేరన్న విషయం అందరికీ తెలిసేలా చేయకపోతే స్మితారాణికి చాలా ప్రమాదం" అన్నాడు శ్యాం ఆలోచనల్లో సతమతమవుతూ.

"మనకు ఇప్పుడు రెండు విషయాలు తేలాలి! సంధ్యారాణి ఎవరు? ఆ అడ్రసుల పుస్తకం తాలుకూ రహస్యం ఏమిటి? ఈ రెండూ తేలితే ఆమెను ఎవరు ఎందుకు చంపాలనుకుంటున్నారుఅనే విషయం తెలిసి పోతుంది" అన్నాడు భవానీ శంకర్.

అందరూ నిశ్శబ్దంగా ఆలోచనల్లో మునిగిపోయారు. స్మితారాణికి సహనం నశించిపోయింది. తనవల్ల ఇంతమందికి సమస్యలు ఎదురవటం తనకే మాత్రం ఇష్టం లేదు. తను వెంటనే అత్తయ్య వాళ్ళ ఊరు వెళ్ళిపోతే అన్ని చిక్కులూ తొలగిపోతాయ్.

"నా మాట విని నన్ను బావ వాళ్ళింటికి పంపించేయండి" అందామె దీనంగా.

భవానీ శంకర్ ఆమె మాటలు వినిపించుకోలేదు. అతని కళ్ళముందు తను చూసిన అనేక తెలుగు ఇంగ్లీష్ సినిమాలు కనబడుతున్నాయ్. చాలా వాటిల్లో హీరో డబలాక్షన్ . కొన్నిట్లో హీరోయిన్ డబలాక్షన్- ఏ డబల్ యాక్షన్ సినిమాకయినా క్లైయిమాక్స్ ఒక్కటే. ఒక్కటే పోలికలున్న హీరోలు లేక హీరోయిన్ లు ఒకరి స్థానంలోకి

ఒకరు పొరపాటున వెళ్ళటం. అక్కడి నుంచి అన్నీ థ్రిల్లింగ్ సీన్స్! ఇప్పుడు ఇక్కడా అదే జరగాలి. జరిగితే గానీ మొత్తం కథ వెనుక కథ బయటకు రాదు. అంటే-

హుషారుగా విజిల్ వేశాడతను.

"సెన్సేషనల్ ప్లాన్ దొరికింది కామ్రేడ్ శ్యాం! ఇది పకడ్బందీగా అమలు జరపామంటే ఈ అడ్రస్ బుక్ ఫజిల్ సాల్వ్ చేసేయవచ్చు.'

"ఏమిటది?" అడిగాడు శ్యాం.

"స్మితారాణిని మనం సంధ్యారాణి స్థానంలో ప్రవేశపెడదాం."

"అంటే ?" అర్థంకాక అడిగింది అఖిలభాను.

'అంటే స్మితారాణి సంధ్యారాణి తొడిగే జీన్స్ లాంటి దుస్తుల్లో అదే గెటప్ లో రేపే కామ్రేడ్ మాధవరావ్ ఇంటికెళుతుంది. ఆ తరువాత ఏం జరుగుతుందో మనందరం వేచి చూద్దాం."

స్మితారాణి ముఖంలో కలవరపాటు కనిపించింది.

"భవానీశంకర్ గారూ! దయచేసి నా దారిన నన్ను పోనీండి. అనవసరంగా నా వల్ల మీరు మరికొన్ని సమస్యల్లో ఇరుక్కోవాల్సి వస్తుందేమో.........."అంది ఆందోళనగా.

"ఇంత దూరం జొరపడ్డాక మధ్యలో వెనక్కు తిరిగి పారిపోవటం ధీరుల లక్షణం కాదని ఎక్కడో చదివాను కామ్రేడ్! అదీగాక మనం వాళ్ళను వదిలేసినా వాళ్ళు మిమ్మల్ని వదులుతారన్న నమ్మకం నాకు లేదు. ఏ క్షణాన్నయినా మీరే సంధ్యారాణి అనుకుని మీ ప్రాణానికి అపాయం కలిగించవచ్చు."

"కలిగిస్తే కలిగించనీయండి! ప్రాణం మీద నాకు మరీ అంత తీపేమీలేదు --------" నిరాసక్తతతో అందామె.

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"మీకు లేకపోవచ్చు స్మితాజీ! కానీ మీ ప్రాణాలమీద మాకు చాలా తీపి ఉంది! అంచేత దయచేసి నేను చెప్పినట్లు చేయండి. హాపీగా మనందరం కలిసి గ్రూప్ ఫోటో దిగేయవచ్చు - ఏమంటావ్ కామ్రేడ్ శ్యాం?"

"ఉపాయం చాలా బావుందనుకో! కానీ ఇందులో స్మితకు ఇంకేమయినా ప్రమాదం ఉందా అని ఆలోచిస్తున్నాను."

"డోంట్ వర్రీ కామ్రేడ్! మనం స్మితారాణిని బాడీగార్డుల్లా కనిపెట్టుకొనే ఉంటాం! మనమే కాదు కామ్రేడ్ అఖిలభాను వదిన కూడా రంగంలోకి దిగుతుంది."

"స్మిత కోసమయితే నేను రెడీ" అంది అఖిలభాను ఉత్సాహంగా.

"నేనూ రడీ" అంది తులసి.

"ఓ! ఒండర్ ఫుల్ స్పిరిట్ కామ్రేడ్!" హేవతన్ హేవతన్" అంటూ దేశభక్తి గీతం పాడటం ఒక్కటే తరువాయి - అల్ రైట్! ముందు ప్రోగ్రాం చాకవుట్ చేదాం. ఇవాళ రాత్రికే స్మితారాణి మోడ్రన్ డ్రస్ లో మాధవరావ్ భవనం ముందు టాక్సీ దిగుతుంది. తిన్నగా లోపలకు నడుస్తుంది. దారిలో ఎవరు పలుకరించినా పలక్కూడదు. ఆఖరికి మాధవరావు పలుకరించినా కూడా ముక్తసరిగా "అబ్బా! తలనొప్పి అర్జంటుగా డాక్టర్ ని పిలవండి" అనేయాలి. దాంతో డాక్టర్ రావటం, మందులివ్వటం , ఉదయం వరకూ ఎవ్వరూ డిస్టర్బ్ చేయక పోవటం జరుగుతుంది. అంటే ఆ ఇంట్లో ఇంచు మించుగా అన్ని విషయాల్ని అందరు వ్యక్తుల్ని గమనించేందుకు పన్నెండు గంటల సమయం దొరుకుతుందన్నమాట. ఈ పన్నెండు గంటల్లో ఒక కుటుంబాన్నే కాదు! ఒక దేశాన్ని కూడా

పరిశీలించేయవచ్చునని అన్నారెవరో" వాడ్డూ యూ సే కామ్రేడ్ శ్యామ్?"

"సింప్లీ సూపర్బ్ అండ్ బ్రిల్లియేంట్ అయిడియా!" అన్నాడు శ్యామ్.

"మరి నా పాత్ర ఏముందిందులో?" అడిగింది అఖిలభాను.

"సంధ్యారాణి ఫ్రెండు నసేవంకతో ప్రతి అరగంటకో, గంటకో బయటేక్కడి నుంచయినా ఫోన్ చేసి స్మితారాణి బాగోగులు కనుక్కుంటుండాలి. టెలిఫోన్ సంభాషణలో మనమాడే నాటకం గురించి ఒక్క ముక్క మాట్లాడినా గానీ ఇంటర్ కం ద్వారా , మాధవరావుకి తెలిసిపోయే అవకాశం వుంది.

ఆ తరువాత ప్రతి రోజూ మాధవరావు ఇంటికెళ్ళి స్మితారాణి కలెక్ట్ చేసే విషయాలు సేకరిస్తూఉండాలి. ఇలా మహా అయితే రెండు మూడు రోజులు మనమందరం కష్టపడాలి! అంతే ఆ తరువాత "హాపీ డేస్ ఆర్ హియర్ ఎగైన్" అని పాడేసుకోవటమే -

అందరూ కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"కమాన్ సిస్టరిన్ లా! ఆడాళ్ళు ఎక్కువగా ఆలోచిస్తే ప్రపంచానికే ప్రమాదం! అంచేత ఆలోచనలు ఆపేసి మాకు అద్భుతమయిన కాఫీ సప్లయ్ చేశారంటే మీ ఫోటో ఓ వారపత్రిక కవరు మీద వేసి లోపల "నా చేదు అనుభవం" అనే ఆర్టికల్ వేయిస్తాను."

అఖిలభాను నవ్వేసింది "ఇప్పుడే తెస్తాను" అంటూ లోపలికెళ్ళింది. అయిదు నిముషాల తర్వాత అందరూ కాఫీలు తాగారు.

"ఇప్పుడు మన కార్యక్రమం ఏమిటి?" అడిగాడు శ్యామ్.

"నువ్వూ సిస్టరిన్ లా కలిసి స్మితా జీని ఓ డ్రెస్ షాప్ కి తీసుకెళ్ళి ఈ కవరు ఫోటో లో సంధ్యారాణి వేసుకున్న డ్రెస్ లు కొనాలి. ఆ తరువాత ఏదయినా ఒక బ్యూటీ క్లినిక్ వెళ్ళి ఆమె హెయిర్ స్టయిల్ కూడా ఈ సంధ్యారాణి హెయిర్ స్టయిలులాగా మార్చాలి."

"మరి నీ సంగతేమిటి?"

"నేను ఈలోగా ఆ మాధవరావు తాలూకు పూర్తీ ఇన్ ఫర్మేషన్ లాగటానికి ప్రయత్నిస్తాను. నా అనుమానం ఏమిటంటే నిన్న రాత్రి ఆ సునందను కత్తి విసిరి చంపిన వాళ్ళు మాధవరావు గాంగే ఆయింటారని" అంటూ లేచి బయటకు నడవబోయాడతను.

"బైదిబై కామ్రేడ్ శ్యామ్! ఇదిగో ఈ అయిదువందలూ స్మితాజీ డ్రెస్సుల కోసం ఖర్చు పెట్టు. నేనోసారి నీ వాహనం మీద నా రూం కెళ్ళి ఏ క్షణాన్నయినా పీలకలయి పోడానికి సిద్దంగా వున్న నా డ్రెస్ మార్చుకోస్తాను" అంటూ శ్యామ్ కి డబ్బిచ్చి సైకిలు తీసుకుని బయల్దేరాడు.

ఫోటో స్టూడియోలో నుంచి హటాత్తుగా "గురూజీ" అంటూ కేకలు వినిపించేసరికి చటుక్కున బ్రేకులు వేసి వెనక్కు తిరిగి చూశాడు.

విక్రమార్కరావు చేతులు వూపుతూ పిలిస్తున్నాడు.

సైకిలు అతని షాపు దగ్గరకు పోనిచ్చాడు భవానీ శంకరు.

"యస్ కామ్రేడ్ శివనారాయణా! హౌ ఆర్ యూ."

విక్రమార్కారావు . "నేను ఫైన్ సర్! మీకో శుభవార్త చెప్దామని పిలిచాను."

"ఏమిటి కామ్రేడ్ అది? త్వరగా చెప్పేసెయ్."

"నేను పదేళ్ళ వయసులో రాసిన ఓ కథను మీ సలహా మీద రేడియో స్పాన్సర్లు ప్రోగ్రాం కి సబ్మిట్ చేశాను కద్సార్. అది శాంక్షన్ అయినట్లు లెటరు వచ్చింది. వచ్చే నెల ఆఖరి వారం నుండి , తెలుగుదేశ మంతటా అది సీరియల్ గ వస్తుంది."

"ఓ! నీకు కంగ్రాచ్యులేషన్స్ కామ్రేడ్. బైదిబై దానికి డైరెక్షన్ ఎవరు?"

"మా షాప్ ఊడ్చే కుర్రాడు సార్! ఎప్పటినుంచో అడుగుతున్నాడు వాడు, డైరెక్షన్ చేయాలని ఉందని. వాడెలాగూ పగలంతా ఖాళీగానే వుంటాడు. మొత్తం పదమూడు వారాలు డైరెక్షన్ చేసినందుకు పదిరూపాయలు ఎక్ స్ట్రా ఇస్తే సరిపోతుంది సార్?"

"అద్భుతం కామ్రేడ్! అలాగే కానీ బైదిబై నటీనటులు."

అందరినీ మాట్లాడాను సార్! హోటలు షాన్ బాన్ పక్కన కూలీలు దొరుకుతారు. మా ఫాదర్ వాళ్ళందరినీ కాంట్రాక్టు తీసుకుని రోడ్లు వేయించేవాడు కదండీ! వాళ్ళనే రోజు కూలీ మీద యాక్షన్ చేసేందుకు కాంట్రాక్టు మాట్లాడాను."

"ఒండర్ ఫుల్ కామ్రేడ్! నీ సీరియల్ ని ఏ టూత్ పేస్టువాడో తప్పక కొనుక్కుంటారని నాకు తెలుసు? వస్తాను కామ్రేడ్ కీప్ టప్ -"

తన గదికి వచ్చేశాడు భవానీశంకర్ - పిల్లలందరూ అతని చుట్టూ మూగిపోయారు. ఆనందంగా, వాళ్ళతో కాసేపు గడిపి స్నానం వగైరా ముగించి బట్టలు వేసుకుంటుంటే బూట్ల చప్పుడు వినిపించింది.

చటుక్కున వెనక్కు తిరిగి చూశాడు భవానీశంకర్.

ఎదురగా పోలీస్ ఇన్స్ పెక్టర్ , ఇద్దరు కానిస్టేబుల్స్ కనిపించారు.

"భవానీశంకర్ నువ్వేనా?" అడిగాడతను.

"యస్ - కామ్రేడ్ ! ఎనీ ప్రాబ్లమ్?"

"నిన్ను అరెస్టు చేస్తున్నాము."

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు. "అరెస్టు చేస్తున్నారా?" రెండు రోజుల క్రితం హెల్మెట్ లేకుండా సైకిల్ తొక్కాను. అదే కారణమా కామ్రేడ్?"

ఇన్ స్పెక్టర్ అతని మాటలు పట్టించుకోలేదు.

"సునంద అనే అమ్మాయిని హత్య చేసిన నేరానికి!" అంటూ కానిస్టేబుల్ వేపు చూశాడు.

"నేను హత్య చేశానా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

అవును, ఇంతకుముందే మా పోలీస్ స్టేషన్ కి ఎవరో ఫోన్ చేసి చెప్పారు మర్డర్ గురించి. వెంటనే అక్కడి కెళితే ఆ డెడ్ బాడీ చేతిలో మీ పెన్ టార్చి దొరికింది. ఆ టార్చి మీద మీ పేరుంది."

పెన్ టార్చీలు , పెన్సిల్ టార్చీలు నేనెప్పుడూ ఉపయోగించలేదు కామ్రేడ్స్! అంచేత ఆ కథ మార్చేయండి! ఇంకో వస్తువేదయినా చూడకపోతే కోర్టులో అభాసుపాలయిపోతారు జాగ్రత్త-----"

"ఎక్కువగా మాట్లాడకు! ఆ సునంద వంటిమీదున్న ఖరీదయిన నక్లెస్ కాజేయటానికి నువ్వక్కడికి వెళ్ళావు! ఇద్దరికీ పెనుగులాట జరిగింది. ఆమె గట్టిగానే కేకలు వేయసాగింది! నువ్వు కోపం కొద్దీ ఆమె నోట్లో కట్టిపెట్టి

పోదిచావ్--" త్వరత్వరగా అన్నాడు ఇన్స్ పెక్టర్.

భవానీ శంకర్ చిరునవ్వు నవ్వుతూ చప్పట్లు కొట్టాడు.

"హాట్సాఫ్ కామ్రేడ్! ప్రజలకు అద్భుతమయిన కథలల్లి చెప్పటంలో మీ డిపార్టుమెంటుకి సాటి మరొకటి లేదు. నన్నడిగితే ఇపుడు సీరియల్స్ రాస్తున్న రచయితలందరినీ పీకిపారేసి పోలీస్ లందరితోనూ వరుసగా సీరియల్స్ రాయిస్తే మన పత్రికల సర్క్యులేషన్స్ మూడింతలవుతుందని నాకు సెంట్ పర్సెంట్ నమ్మకం వుంది -"

"ఏమిటి?" అన్నాడు ఇన్స్ పెక్టర్ "ఏయ్ త్రీనాట్ తీ - ఆ అల్మారా వెతుకు" కానిస్టేబుల్ ని ఆదేశించాడతను. అప్పటికే ఆ చుట్టూ పక్కలున్న పిల్లలూ, పెద్దలూ మూగిపోయారా ఇంటిచుట్టూ.

ఇద్దరు కానిస్టేబుల్స్ త్వరగా వెళ్ళి అల్మారా తెరచి అందులోని బట్టలన్నీ కానిస్టేబుల్ విసిరేశాడు కిందకు. వాటిల్లో నుంచి బయటపడింది నక్లెస్.

భవానీ శంకర్ గట్టిగా చప్పట్లు కొట్టేశాడు.

"కమాన్ చిల్డ్రన్స్! చూశారా మాజిక్ లు! ఏమీ లేని ప్రదేశం నుంచి నెక్లెస్ లు బయటకు లాగగలరు! ఖాళీగా ఉన్న ఇళ్ళల్లో నుంచి మానో లిటరేచర్ సృష్టించగలరు. అడుక్కుతినేవాడిని తీసుకెళ్ళి సగ్మలైట్ అని మూసేయగలరు. గుండాగాళ్ళను నిమిషాల్లో జైల్లో నుంచి మాయం చేసేసి పారిపోయారని స్టేట్ మెంట్ ఇచ్చేయగలరు. అమాయకులను కిడ్నాప్ చేసి తీసుకెళ్ళి గుండాలని జైల్లో వేసేయ్యగలరు. చూశారా, ఎంత చక్కని ఇంద్రజాలికులో - చప్పట్లు కొట్టండి.

అక్కడ చేరినవరందరూ చప్పట్లు కొట్టారు.

ఇన్ స్పెక్టర్ కి కోపం ముంచుకొచ్చింది.

"మిస్టర్! ముందు పోలీసు స్టేషనుకి పద. లేకపోతే బేడీలు వేసి లాక్కెళ్ళాల్సి వొస్తుంది" కఠినంగా అన్నాడతను.

"తప్పకుండా వస్తాను కామ్రేడ్! కానీ నిజం చెప్పండి. ఈ కట్టు కథంతా ఎవరి ప్రోద్భలం వల్ల అల్లారు?"

"అదంతా నీ కనవసరం."

"అవసరం కామ్రేడ్! ఈ చిక్కులో నుంచి బయట పడాలంటే ఈ మర్డర్ వెనుక , నా మీద ఈ కక్ష వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలి."

"నువ్వు ఇంక బయటపడటం కల్ల! నీమీద మర్డర్ చార్జి వుంది"

భవానీ శంకర్ కేం చేయాలో తోచటం లేదు. ఎలాగోలా ముందు ఈ పోలీసుల చేతినుంచి బయటపడాలి. రెండు మూడు రోజులు బయట ఉంటేనే గానీ ఈ మాధవరావు వ్యవహారం ఏమిటో తెలీదూ లేకపోతే తను చేసిన ప్లానింగు అంతా సర్వనాశనమైపోతుంది.

"ఒకే కామ్రేడ్. లాకప్ డెత్ కోసమే కదా నన్ను పిలుస్తుంది మీరు. అల్ రైట్/ ఆయామ్ రెడీ." అంటూ వాళ్లతో పాటు బయటకు నడవబోయి ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"కొంచెం మంచినీళ్ళు తాగావచ్చా కామ్రేడ్. ఎందుకంటే పోలీసు స్టేషనులో అడుగు పెట్టాక ఎంత చక్కని అతిధి మర్యాదలు లభిస్తాయో మాకు తెలుసు."

"తాగు" అన్నాడు ఇన్ స్పెక్టర్. ఓ క్షణం ఆలోచించి కిటికిలో వున్న చిన్న కూజా దాని పక్కనే వున్న గాజుగ్లాసు చేతిలోకి తీసుకున్నాడు భవానీ శంకరు. గ్లాసులోకి నీళ్ళు వంచుతూ జాగ్రత్తగా ఇన్ స్పెక్టర్ నీ, కానిస్టేబుల్స్ నీ గమనించసాగాడు.

అందరూ రిలాక్సింగ్ గా ఉన్నట్లు తెలిసిపోతుంది. ఇన్ స్పెక్టర్ జేబులో నుంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుంటూన్నాడు. కానిస్టేబుల్స్ ఇద్దరూ గదంతా పరిశీలనగా చూస్తున్నారు.

భవానీ శంకర్ కి అర్థమయిపోయింది. ఇదే తనకు మిగిలిన ఆఖరి అవకాశం. వాళ్ళ ముగ్గురినీ మెరుపువేగంతో ఎటాక్ చేసి తను పారిపోవాలి. ఏమాత్రం ఆలస్యమయినా వాళ్ళు మళ్ళీ ఎలర్టు అయిపోవచ్చు.

మరుక్షణంలో అతని చేతిలోని కూజా రాకెట్ వేగంతో దూసుకెళ్ళి ఇన్ స్పెక్టర్ మొఖాన్ని తాకి ముక్కలు ముక్కలయి కిందపడింది. అదే సమయంలో గాజు గ్లాసులోని నీళ్ళు ఓ కానిస్టేబుల్ ముఖం పైన గాజు గ్లాసు మరో కానిస్టేబుల్ ముఖానికి విసురుగా ఎగిరిపడింది. ఇన్ స్పెక్టర్ అక్కడే తూలి పడిపోయాడు. "అబ్బా" అంటూ గ్లాసు తగిలిన కానిస్టేబుల్  కూడా కళ్ళు రెండింటి మీదా చేతులు మూసుకుని "అమ్మో అమ్మో నొప్పి" అంటూ గట్టిగా అరవసాగాడు. కళ్ళమీద అంతవేగంతో నీళ్ళు కొట్టుకునేసరికి రెండో కానిస్టేబులు రెండు చేతులతో కళ్ళు నులుముకోసాగాడు. వెంటనే ఇన్ స్పెక్టర్ బెల్టుకున్న పిస్టలుని చటుక్కున లాగేసుకున్నాడు భవానీ శంకర్.

ఆ దృశ్యమంతా సినిమాలా చూస్తుండిపోయిన ఆ జనమంతా ఆనందంతో చప్పట్లు కొట్టేశారు.

"వాళ్ళను ఇంకా కొట్టంకుల్" అంటూ అరవసాగారు పిల్లలు.

బావానీ శంకర్ పిస్టలుని కానిస్టేబుల్ కి గురిపెట్టాడు.

"మర్యాదగా చెప్పండి కామ్రేడ్స్! నామీద ఇలాంటి కేసు పెట్టమని ఎవరు చెప్పారు మీకు? రెండు నిమిషాలలో చెప్పకపోతే మీ ముగ్గురు శవాలూ గంటసేపటిలో మార్చురీ కేళతాయి. మీకూ నక్సలైట్లకూ నా గది సమీపంలో జరిగిన కాల్పులలో మీరు ముగ్గురూ కాల్చి చంపబడినట్లు స్టేట్ మెంటిస్తాను. ఆ స్టేట్ మెంటు నిజమని వీళ్ళంతా సాక్ష్యంగా ఉంటారు!"

"అవును మేము సాక్ష్యం చెపుతాం" అరిచాడు రాజయ్య.

కానిస్టేబుల్సు భయపడిపోయినట్లు వాళ్ళ ముఖాలు చూస్తే తెలిసిపోతుంది.

"ఇదంతా మాధవరావుగారు మా ఎస్పీతో చెప్పి చేయిస్తున్నారు. మిమ్మల్ని ఎలాగోలా మర్డరు కేసు కింద బుక్ చేసి జైలు లో వేసేమన్నారు" భయంతో వణుకుతూ చెప్పాడు ఓ కానిస్టేబులు.

ఇన్ స్పెక్టర్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

"అసలయిన హంతకుడెవరో పట్టుకోకుండా నాలాంటివాడిని జైలుల్లో వేయటం వల్ల మీకేమిటి లాభం?"

"మొదటీ నుంచి మాకూ మాధవరావుగారికి కనెక్షన్స్ ఉన్నాయి సార్! అయన చెప్పినట్లల్లా మేము చేస్తుంటాము. అందుగ్గాను మాకాయన సంవత్సరానికి తలా యాభయివేలూ ఇస్తుంటారు. అంతే కాకుండా మాకు పొలిటికల్ గా కూడా అయన సపోర్టు వుంటుంది. " వివరించాడు రెండో కానిస్టేబుల్.

"డబ్బు కోసం , పొలిటికల్ సపోర్టు కోసం ఇలా అమాయకుల జీవితాలతో చలగాటాలాడ్డానికి మీకు సిగ్గులేదూ?"

"సర్వీస్ లో చేరిన కొత్తలో ఉండేదండి! ఇప్పుడు అలవాటు పోయింది."

"అల్ రైట్. నిజం చెప్పారు గనుక వదిలేస్తున్నాను కామ్రేడ్. మీ పిస్టల్ మాత్రం అదిగో ఆ బావిలో పాడేస్తున్నాను. తర్వాత మీరెలాగూ మళ్ళీ వాన్ లో వచ్చి నా గదిని ఎటాక్ చేస్తారు కదా! అప్పుడు పట్టుకేళ్ళండి" అంటూ నడిచి పిస్టల్ ని బావిలో పడేసి పాకాల మధ్యనుంచి సైకిల్ తొక్కుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు.

సైకిల్ తిన్నగా వెళ్ళి జూబిలీ హిల్స్ లోని "మాధవీ మాన్షన్" ముందు ఆగింది. బయట అప్పటికే పది పదిహేను కార్లు ఆగి వున్నాయ్. గేటు దగ్గర ఘూర్కాలిద్దరూ నిలబడి వున్నారు.

"క్యాహోనా?" అడిగాడు ఘూర్ఖా.

"మాధవరావు సాబ్ కో దేఖ్ నహై" అన్నాడు భవానీ శంకర్.

"క్యా కామ్ హై?"

"కామ్ మేరా నహీ కామ్రేడ్! ఉన్కా కా కామ్ హై"

ఘూర్ఖా పక్కనే ఉన్న గదిలో కెళ్ళి ఓ కాగితం తెచ్చి అతని కిచ్చాడు.

"తుమ్ హారా నామ్ లిఖో" అన్నాడు పెన్ కూడా ఇస్తూ, భవానీ శంకర్ కాగితం మీద తన పేరు రాయబోయి ఒక్క క్షణం ఆలోచించాడు. తన పేరు రాస్తే తనకే ప్రమాదం జరిగినా జరగవచ్చు. అంచేత మరో వేషంలో లోపలికెళ్ళాలి.

"కానిస్టేబుల్ త్రీనాట్ త్రీ, భవానీ శంకర్ అరెస్టు విషయంలో అర్జెంటుగా మాట్లాడాలి" అని రాసి ఆ కాగితం ఘూర్ఖాకిచ్చి వేశాడు.

ఘూర్ఖా ఆ కాగితం భవనం లోపల నిలబడ్డ నౌఖరు కిచ్చాడు. అయిదు నిమిషాల్లో అతనికి పిలుపు వచ్చింది.

గేటు లోపల్నుంఛి భవనంలోకి అడుగు పెట్టాడు భవానీశంకర్. మొదటి హాల్లోనే ఎదురుగా ఓ పెద్ద టేబుల్ - దానిమీద అరడజను ఫోనులు ఉన్నాయ్. డస్క్ వెనుక కుర్చీలో ఓ అందమయిన అమ్మాయి కూర్చుని ఉంది.

చుట్టూ ఉన్న సోఫాల్లో అనేకమంది విజిటర్స్ కూర్చుని ఉన్నారు. వాళ్ళంతా నగరంలోని అతి ఖరీదయిన మనుషులని తెలుస్తూనే ఉంది. అయినా గానీ వాళ్ళందరి కంటే తనకు ప్రాముఖ్యత లభించింది. నౌకరు భవానీ శంకర్ ని వెంటనే తీసుకుని ఆ హాలో నుంచి మరో గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ అతి బలిష్టంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ముందుకొచ్చి భవానీ శంకరు జేబులు తడిమారు. నడుము చుట్టూ కూడా చూశాక "ఒకే" అన్నాడు ఒకతను.

నౌకరు భవానీ శంకరు వేపు చూసి "పదండి" అన్నాడు. మరో తలుపు తెరచుకుని ఇంకో గదిలోకి నడుస్తూ.

ఆ గదిలోకి అడుగు పెడుతూనే నిశ్చేష్టుడయిపోయాడు భవానీ శంకర్. అంత అందంగా , అంత పెద్దదిగా ఉన్న గది తానెప్పుడూ చూళ్ళేదు. గదంతా చక్కని డిమ్ లైట్ కాంతితో, ఏసి చల్లదనంతో మెత్తని తివాచీలతో, చక్కని మత్తెక్కించే సువాసనలతో నిండిపోయి ఉంది. నౌకరు బయటకు వెళ్ళిపోయాడు. గదంతా చూస్తుండిపోయిన భవాని శంకరు కి "ఏం కావాలి?" అన్న ప్రశ్న వినిపించింది. చటుక్కున దృష్టిని ఎదురుగా అతి విశాలంగా ఉన్న టేబుల్ వేపు సారించాడు.

ఆ టేబుల్ వెనకే పెద్ద కుషన్ చైర్ లో కూర్చుని కనిపించాడు మాధవ్. కోలముఖం, గద్దముక్కు, విశాలమైన నుదురు తో భయం గొలిపెట్లున్నాడతను. అతనినిచూస్తూనే గుర్తు పట్టాడు భవానీ శంకర్.

"నమస్కారం సార్! మేము ఆ భవానీ శంకరు గాడిని అరెస్ట్ చేయటానికి వాడి గదికి వెళ్లాం సార్! అంతా ప్లాను చేసుకున్నట్లే జరిగింది గానీ ఆఖరి నిముషంలో వాడు సడెన్ గా ఎదురు తిరిగి ఆ చుట్టూ పక్కల వున్న గుడిశెల వాళ్ళ సహాయంతో పారిపోయాడు."

మాధవరావ్ ముఖంలో ఎలాంటి భావాలు కనిపించలేదు.

కళ్ళు తెరచి చూస్తున్న శవం ముఖంలా నిశ్చలంగా ఉంది. కాని చూపు మాత్రం కొంచెం తీక్షణమైనట్లు అన్పించింది.

"ఎవర్నువ్వు" అన్నాడతను. అతని గొంతు కర్కశంగా కరుగ్గా వుంది. అయితే ఆ ప్రశ్న వేసేప్పుడు అతని పెదాల్లో గానీ అతనిలో గానీ కదిలిక లేదు.

భవానీ శంకర్ ఆశ్చర్యపోయాడు. తను కానిస్టేబుల్ కాదన్న సంగతి కనిపెట్టేశాడేమో అని అనుమానంగా వుంది.

"మాట్లాడు. ఎవర్నువ్?"

"కాగితం మీద రాశాను కద్సార్! కానిస్టేబుల్ త్రీ నాట్ త్రీ ని."

"పిచ్చివాగుడు వాగకుండా నిజం చెప్పు! ఎవర్నువ్వు?" గొంతులో మరింత క్రౌర్యం ధ్వనించింది సారి.

భవానీ శంకర్ కి అర్ధమయిపోయింది. తను కానిస్టేబుల్ కాదని అతనికి తెలిసిపోయింది. ఎలా తెలిసిందో తనకనవసరం. ఇంక తను మారు రూపం దాల్చటం వేస్టు. కానిస్టేబుల్ వేషం వాళ్ళ తనకు వెంటనే మాధవరావుతో మాట్లాడే అవకాశం దొరికింది.

"చాలా అద్భుతంగా నేను కానిస్టేబుల్ ని కాదని తెలుసుకున్నారు కామ్రేడ్ మాధవరావు! మీరు స్కాట్లాండ్ యార్డు వాళ్ళ డాక్యుమెంటరీ చూసి ఉండబట్టే ఈ కేస్ ఇంత అమోఘంగా పరిష్కరించారని నాకనిపిస్తోంది....."

"షటప్! నేనడిగిన దానికి మాత్రమే జవాబు చెప్పు నువ్వెవరు?"

"ఒకే కామ్రేడ్! అధిక ప్రసంగం నాకూ అయిష్టమే కానీ చాలా మంది దాన్నే లైక్ చెస్తుండటం వలన రాజకీయ నాయకులు ఉపన్యాసాలు వింటూ నేను ప్రాక్టీసు చేసాను......"

మాధవరావు టేబుల్ అంచున వున్న బటన్ నొక్కాడు. మరుక్షణం పక్క గోడలు కలిసిపోయినట్లున్న ఓ తలుపు తెరచుకుని ఓ లావుపాటి వ్యక్తీ బయటికొచ్చాడు.

"నీకు పది సెకండ్లు టైమిస్తున్నాను. నా ప్రశ్నకు సమాధానం చెప్పకపోతే వీడి చేతిలో చావు దెబ్బలు తిని హాస్పిటల్ లో చేరతావు."

భవానీ శంకర్ ఆ లావుపాటి వ్యక్తీ వేపు చూశాడు. మాధవరావు చెప్పిన మాటల్లో ఎలాంటి అసత్యం కనిపించటం లేదు. ఆ వస్తాదు చేతిలో పడ్డవాడు పిండి అయి హాస్పిటలులో చేరాల్సిందే.

## 13

"అల్ రైట్ కామ్రేడ్! మీరు కత్తి గొప్పదా, కలం గొప్పదా అనే డిబేటింగ్ లో కత్తే గొప్పదని వాదించినట్లున్నారు చిన్నప్పుడు అంచేత అదే బ్రెయిన్ లో ఫిక్సయిపోయింది. నాపేరు భవానీ శంకర్.'

"మాధవరావులో కొంచెం చలనం కలిగింది. టేబులు అంచు మీదున్న ఓ టేబుల్ లైట్ లాంటి స్టీలు గొట్టాన్ని ముందుకి వంచాడు. అందులో నుంచి విస్కీ దానికిందే వున్న గ్లాసులోకి పడింది. సన్నని ధారతో గ్లాసు నిండాక ఆ స్టీలు గొట్టాన్ని వదిలేశాడు. విస్కిలో ఏమి కలపకుండానే కొంచెం గొంతులో పోసుకున్నాడు.

"ఎందుకొచ్చావిక్కడికి?"

"మీతో ముఖాముఖీ శీర్షికలో పాల్గొనాలని కామ్రేడ్!"

"ఏం మాట్లాడాలి?"

"అదే కామ్రేడ్. నా మీదకు పోలీసుల్ని తోలటం, మా ఇల్లు సోదా చేయించటం, దొంగ మర్డర్ కేసులు బనాయించి నన్ను జైల్లోకి తోయ్యాలను కోవడం ఇవన్నీ చాలా పాతట్రిక్స్ కామ్రేడ్! ఈరోజుల్లో ఎవ్వరు వాడటం లేదని లేటెస్ట్ ట్రిక్స్ కావాలంటే నన్నడగండి! నేను సప్లయి చేస్తాను. పాతిక టన్నులున్న బౌండు బుక్ వెల ఆరోందల రూపాయలు. అదే లైబ్రరీ ఎడిషన్ అయితే నాలుగువేల నాలుగొందలు. జనత ఎడిషన్ అయితే మాత్రం చాలా చీప్! కేవలం  పద్నాలుగు రూపాయలు.

మాధవరావు ఆ వస్తాదుకి సైగ చేశాడు. వస్తాదు అతనిని బయటకు తోసేయబోయాడు.

"ఆ అడ్రస్ బుక్ నా దగ్గరే ఉంది కామ్రేడ్! తొందరపడి నన్ను బయటకు గెంటివేస్తున్నారు." వస్తాదుని ఆగమన్నట్లు సంజ్ఞా చేసాడు మాధవరావు. అతని ముఖంలో ఆశ్చర్యం కనబడుతోందిప్పుడు.

"ఏం పుస్తకం గురించి మాట్లాడుతున్నావు!" తనలోని కలవరాన్ని కనిపించనీయకుండా అడిగాడు.

"అదేం పుస్తకమో మీకు బాగా తెలుసు కామ్రేడ్ మాధవరావు! అయినా తెలీనట్లు దోబూచులాడుతున్నారు! ఇది మరీ చిన్న పిల్లల సైకాలజీ! మీ బ్రెయిన్ గ్రోత్ హోమియో పద్ధతిలో అద్భుతమయిన మందు ఉందని మా ఫ్రెండ్ బోస్ చెప్పాడు. మొన్నే చేపల మార్కెట్లో కనపడి."

మాధవరావు ముఖంలో కోపం ఎక్కువయిపోతోంది క్షణక్షణానికి.

"యూ ఆర్ యాన్ ఇడియట్" అన్నాడు కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ.

"ఆఫ్ కోర్స్! ఈ మాట వప్పుకుంటాను కామ్రేడ్! ఇడియట్ ని కాబట్టే ఆ అడ్రస్ బుక్ ని మరీ కారు చవకగా పదిలక్షలకే అమ్మేయటానికి వప్పుకున్నాను.

మాధవరావు ఉలిక్కిపడ్డాడు.

"ఎవరికి అమ్ముతున్నావు?" అన్నాడు ఆత్రుతగా.

"పరాయి వాడికేం కాదు కామ్రేడ్! మనవాడే! అతనూ మీరూ మొన్న మొన్నటి వరకూ పాలూ నీరులా కలిసిపోయి "స్నేహమేరా జీవితం" అంటూ చెట్టాపట్టాలేస్డుకుని తెగతిరిగేవారని విన్నాను.'

మాధవరావు కుర్చులోంచి లేచి నిలబడ్డాడు.

"సిద్దార్ధరావు పది లక్షలు ఇస్తానన్నాడా?"

"అవును కామ్రేడ్! కాకపోతే నేనే అతనికింకా మాట ఇవ్వలేదు. ఇంకెవరయినా ఇంకా ఎక్కువ మొత్తం ఆఫర్ చేస్తారేమోనని చూస్తున్నాను.

మాధవరావు పొడుగాటి చుట్ట వెలిగించి అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

"ఆ పుస్తకం నువ్వు ఎవరికీ ఇవ్వటం లేదు. వెంటనే తెచ్చి నాకే అప్పగిస్తున్నావు. లేకపోతే నిమిషాల్లో నీ శవం గుర్తుపట్టడానికి కూడా వీల్లేకుండా చేయిస్తాను" రౌద్రంగా అన్నాడతను.

"మళ్ళీ పాతాళభైరవి కాలంనాటి డైలాగులు మాట్లాడుతున్నావు కామ్రేడ్! ఆ అడ్రస్ పుస్తకం నా బెస్టు ఫ్రెండు ఒకడి దగ్గరుంది. కనుక మళ్ళీ నేను వెళ్ళి అడుగుతేనే దొరుకుతుంది. ఆ పుస్తకం మీ చేతికొచ్చే వరకూ మీరు నన్నేమీ చేయలేరు. ఈ విషయం మనందరికీ తెలుసు. అంచేత ఈ బెదిరింపు పర్వం వదిలేసి మనం ఒక ఎగ్రిమెంట్ కొస్తే బాగుంటుంది.

మాధవరావు వస్తాదు వేపు చూసి సైగ చేశాడు.

మరుక్షణం భవానీ శంకర్ ని రెక్కలు విరిచి పట్టుకున్నాడతను.

"వీడిని మన "సెల్" లో పడేసి అడ్రస్ బుక్ ఎవరి దగ్గరుందో చెప్పేవరకూ ట్రీట్ మెంట్ ఇవ్వండి" ఆజ్ఞాపించాడతను. భవానీ శంకర్ ని గడపవరకూ ఈడ్చుకెళ్ళారు వాళ్ళు. ఒక్కసారిగా వాళ్ళ చేతులు నుంచి విదిలించుకుని వెనక్కు వచ్చి మాధవరావుకీ సమీపంగా నిలబడ్డాడు భవానీ శంకర్.

"మీరిలాంటి పని చేయగలరని ముందే ఊహించాను కామ్రేడ్! అందుకే మీరూ సిద్దార్ధరావూ కలిసి చేసిన కొన్ని చీకటి పనులలో రుజువులు సంధ్యారాణి అనే ఆమె ఫ్లాట్ నుంచి సంపాదించి బయట రోడ్డు మీద ఎదుర్చుస్తోన్న మా ఫ్రెండ్ కిచ్చి వచ్చాను. నేను ఇంకో అరగంటలోగా వాడికి కనబడక పోతే వాడు వాటిని వెంటనే తీసుకెళ్ళి న్యూస్ పేపర్స్ కిచ్చేస్తాడు. దాంతో తెల్లారే సరికల్లా మీ రాజకీయ జీవితానికి తెరపడిపోతుంది! ఆ తరువాత మీ మీద ఎంక్వయిరీలు, చేసే చీకటి వ్యవహారాల గురించి కమిటీలు, అరెస్టులు, నాన్ బైలబుల్ వారెంట్లూ........"

అప్పటికే వస్తాదు లిద్దరూ వచ్చి భవానీ శంకర్ నోరు మూసి రెక్కలు విరిచిపట్టుకుని బయటకు లాక్కెళ్ళసాగారు.

"వదలండి" అన్నాడు మాధవరావు కంగారుగా. వాళ్ళు భవానీ శంకర్ ని వదిలేసి మళ్ళీ వెళ్ళి దూరంగా నిలబడ్డారు. కొద్దిగా అటూ ఇటూ పచార్లు చేశాడు మాధవరావు.

"అల్ రైట్! నీకేం కావాలో చెప్పు" అన్నాడు ఆవేశం అణుచుకుంటూ.

"ముందు నన్ను ఈ పోలీస్ కేస్ ల నుంచి తప్పించండి! అలా చేసినట్లయితే మనిద్దరం కలిసి ఆ సిద్దార్డరావుని ఎదుర్కోటానికి అవకాశముంటుంది. బైదిబై మీకు అసలు సంగతి చెప్పనే లేదు కామ్రేడ్! మిమ్మల్ని నన్నూ చంపేయాలన్న ప్లాన్ లో ఉన్నాడు సిద్దార్ధరావు."

మాధవరావు తన టేబుల్ దగ్గర కెళ్ళి మరో పెగ్ విస్కీ తాగాడు.

"నన్నెవరూ ఏమీ చేయలేరు కానీ......."

"ఆ సిద్దార్ధరావు తల్చుకుంటే నిన్ను అయిదునిమిషాల్లో మసి చేసేయగలడు" అన్నాడు మాధవరావు.

"చేయడు కామ్రేడ్! ఆ అడ్రస్ బుక్ నా దగ్గరున్నంత కాలం నన్నెవరూ ఏమీ చేయలేరు. " చిరునవ్వుతో అన్నాడు భవానీ శంకర్.

"ఆ అడ్రస్ బుక్ నాకిస్తే నీకు నారక్షణ వుంటుంది" అన్నాడు మాధవరావు.

"అందుకు ప్రతిఫలంగా నాకేమీ దొరుకుతుంది?"

"నీ ప్రాణం! ప్లస్ పదివేలు క్యాష్."

"రాయలసీమ కరువు భాధితులకు ప్రభుత్వమిచ్చే ముష్టి నిధులులాగా పదివేలేమిటి కామ్రేడ్! ఆ పుస్తకం విలువ కనీసం పాతిక లక్షలుంటుందని మీకూ తెలుసు."

మాధవరావు మరో పెగ్ విస్కీ గడగడతాగాడు.

"సరే! లక్షరూపాయలిస్తాను" అన్నాడు భవానీ శంకర్ వేపు చూస్తూ.

"నో నో నో ! మనసుని ఇంకొంచెం విశాలం చెయ్ కామ్రేడ్! మరీ అంత ఇరుకు మనస్తత్వం ఉండకూడదు మనిషికి. ఆఫ్ కోర్స్ రాజకీయ నాయకులు వేరనుకోండి! అయినా - పదిలక్షలయినా ఇవ్వకపోతే -"

"సరే! అయిదులక్షలిస్తాను. సరేనా" కోపం దిగమింగుకుంటూ అన్నాడతను.

భవానీ శంకర్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఓ.కే. కామ్రేడ్! ముందు కాష్ డౌన్ చేయండి. ఆ తరువాత పుస్తకం ఇస్తాను. నాకు రాజకీయ నాయకుల మీద కొంచెం నమ్మకం తక్కువ."

మాధవరావు ఆవేశం అణచుకోలేక టేబుల్ మీద గట్టిగా కొట్టాడు.

"నన్నింత వరకూ ఎవరూ బ్లాక్ మెయిల్ చేయలేదు. చేసినందుకు జీవితమంతా పశ్చాత్తాపపడాల్సి వస్తుంది నువ్వు."

"ఫర్వాలేదు కామ్రేడ్! పశ్చాత్తాపం సర్వ పాపాలను హరిస్తుందని మా గ్రాండ్ మదర్ అంటుండేది. అంచేత అటు సైడు ఎక్కువ శ్రమపడి ఆలోచించకండి! క్యాష్ ఎప్పుడు డౌన్ చేస్తారనేది ముఖ్యం నాకు! ఇంకో గంటాగి రమ్మంటారా?"

"నువ్వు రానవసరం లేదు. రేపు నేనే పంపిస్తాను."

"థాంక్యూ కామ్రేడ్! అందరు రాజకీయ నాయకులూ మీలాగా ఇలా స్పాట్ డెసిషన్స్ తీసుకుంటే దేశం ఎంతో బాగుపడేది. గుడ్ బై కామ్రేడ్! మరోసారి ఓటరు - ప్రజాపతినిది లెవెల్లో కల్సుకుందాం."

అంటూ బయటకి నడిచాడు భవానీశంకర్.

## 14

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు స్మితారాణి మాధవరావు యింటి ముందు కారు దిగింది. ఆమె పక్కనే కూర్చున్న భవానీశంకర్ "విష్ యూ గ్రాండ్ సక్సెస్ కామ్రేడ్" అన్నాడు చిరునవ్వుతో. - శ్యామ్ కారు ముందుకు నడిపించాడు.

ఘూర్ఖా స్మితారాణిని చూస్తూనే సెల్యూట్ కొట్టాడు. గేటు తెరవగానే లోపలికి నడిచిందామె. తలుపు దగ్గర కూర్చున్న వస్తాదు ఆమెను చూడగానే లేచి - "నమస్తే మేడమ్ " అంటూ తాళం చేతులతో తలుపు తెరిచాడు.

స్మితారాణి లోపలకు నడిచింది. లోపలి గది విజటర్స్ రూమ్ అని తెలిసిపోతోందామెకి. ఎదురుగ్గా వున్న తలుపులు తెరచుకొని ఇంకా లోపలి కెళ్ళాలనేసరికి భయం ప్రారంభమైందామెకి.

తనను గుర్తుపట్టేస్తారేమో ఒకవేళ. పట్టకపోయినా తనేమైనా చిక్కులలో పడుతుందేమో వేగంగా కొట్టుకుంటున్న గుండెతో ఆ తలుపు దగ్గరికి నడిచి తలుపు లోపలకు తోసింది.

తలుపు తెరుచుకోగానే ఇంటిలోంచి మాటలు వినిపించటం మొదలయింది. ఓ మూల నుంచి టీవీలో ఏదో విడియో సినిమా చూస్తున్న శబ్దం అయితే ఏదీ స్పష్టత లేదు.

లోపల హాల్ చాలా పెద్దది. అందమైన ఫర్నిచర్ , కర్టేన్సు, పాత కాలంనాటి బొమ్మలూ, పెయింటింగ్స్, ఫ్లవర్ వాజ్ లు.

లోపలకు అడుగు పెట్టింది స్మితారాణి. ఏసి రూము అవటం వలన చల్లగా ఐస్ లా తగిలింది గాలి.

హాలుకి అనుకోని వున్న పడకగదిలోకి తొంగి చూసిందామె. టి,వి చూస్తున్న ఓ యువకుడు ఆమెను చూసి త్రుళ్ళిపడ్డాడు. ఒక్క ఉదుటున లేచి వచ్చాడామే దగ్గరికి.

"సంధ్యా! ఏం జరిగింది? ఎందుకు వచ్చావు?" అన్నాడు ఆత్రుతగా. స్మితారాణికి చటుక్కున గుర్తువచ్చింది. తను

తల నొప్పిగా వున్నట్లు నటించాలని.

"అంతా తరవాత చెపుతాను. ముందు డాక్టర్ని పిలు! నాకు తలనొప్పిగా వుంది" అంది రెండు చేతులతో తలపట్టుకుంటూ.

అతను కంగారుపడ్డాడు.

"ఇలారా! ముందిక్కడ పడుకో" అంటూ ఆమె భుజం మీద చేయి వేసి జాగ్రత్తగా నడిపించుకుంటూ లోపల మరో బెడ్ రూములోకి తీసుకెళ్ళాడు. అక్కడి మంచం మీద నిస్సత్తువుగా వరిగిపోయిందామె.

"అబ్బా అబ్బా" అంది బాధతో విలవిలలాడిపోతున్నట్లు నటిస్తూ. అతను వెంటనే బయటకు పరుగెత్తాడు "అక్కా" అని పిలుస్తూ, చటుక్కున కళ్ళు తెరిచి గదంతా పరీక్షగా చూసిందామె.

టేబుల్ మీద పెద్ద ఫోటోఫ్రేములో అచ్చం తనలాగానే కనబడుతోంది సంధ్యారాణి. డ్రస్సింగ్ టేబుల్ దగ్గర మేకప్ సామాను వుంది. ఓ మూలగా రకరకాల ఖరీదయిన ఎత్తు మడమల చెప్పులు . బహుశా ఈ గది సంధ్యారాణిదే అయుండాలి అనుకుంది స్మిత. గడపదగ్గర అడుగుల చప్పడు వినిపించి మళ్ళీ కళ్ళు మూసుకుందామె. ఒక స్త్రీ గొంతు, ఇద్దరు పిల్లల గొంతులు, ఓ కఠినమయిన మగగొంతు అడుగులతో పాటు సమీపంగా వచ్చినాయ్. అతను తన పక్కనే మంచం మీద కూర్చున్నట్లు తెలుస్తోంది. అతని చెయి తన నుదుటి మీద నిమిరింది.

"సంధ్యా! సంధ్యా! ఓసారి కళ్ళు తెరమ్మా!" అన్నాడతను. స్మిత కళ్ళు తెరిచింది కొంచెంగా. "అబ్బా! నొప్పి" అంది మళ్ళీ కణతలు నొక్కుకుంటూ. అతని రూపం భయంకరంగా వుంది. భవానీ శంకర్ అతని ఫోటో ముందే చూపబట్టి అతనే మాధవరావు అని తెల్సిపోతోంది.

"డాక్టర్ వచ్చేస్తున్నారమ్మా! కొంచెం ఓపిక పట్టు" అన్నాడతను.

స్మిత మళ్ళీ కళ్ళు మూసుకుంది.

"తిరుమల నుంచి ఎలా వచ్చావమ్మా? ఫయిట్ లోనా?"

అవునన్నట్లు తలూపింది.

"ఎందుకొచ్చాశావు? అక్కడేమయినా ఎవరయినా ఎటాక్ చేసారా?" కర్ణుడేమయాడు? నీతో రాలేదు.

"అబ్బా!' అంటూ మరోవేపుకి తిరిగి పడుకుందామె.

"ఒకవేళ వాళ్ళేమైయినా పాయిజన్ చేశారేమో బావా" అన్నాడు ఆ యువకుడు అనుమానంగా.

"అవును! నాకూ అదే అనుమానంగా వుంది" అన్నాడు మాధవరావు.

"నువ్వు వెంటనే డాక్టర్ చరియను కి ఫోన్ చేసి అవసరమయితే సంధ్యను వాళ్ళ హాస్పిటల్ లో అడ్మిట్ చేస్తామని చెప్పు. ఆయనను రెడీ గా వుండమను.

"అలాగే బావా" అంటూ వెళ్ళిపోయాడతను.

"నేను కాఫీ తయారు చేయిస్తాను" అంది ఓ స్త్రీ గొంతు కొంచెంగా కళ్ళు తెరిచి ఆమె వేపు చూసింది స్మిత. లావుగా, పొడవుగా అందంగా వుండామే. కానీ, మాధవరావ్ కంటే వయసులో చాలా చిన్నదిగా కనబడుతోంది.

"మమ్మీ - సంధ్య అక్కకి ఏమయింది మమ్మీ?" ఓ పిల్ల అడుగుతోంది.

"ష్! మీరంతా వెళ్ళిపొండి. డాక్టరు వచ్చి మందువేస్తే తగ్గిపోతుందిలే" అన్నాడు మాధవరావు.

"పాయిజన్ కి కూడా మందు వుందా డాడీ?" చిన్న కుర్రాడు అన్నాడు.

"ముందు మిమ్మల్ని ఇక్కడ్నుంచి వెళ్ళిపోమ్మన్నానా?" కోపంగా అన్నాడు మాధవరావు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోతున్న అడుగుల చప్పుడు.

"బావా - డాక్టర్ గారు వచ్చేశారు" అంటూ లోపలికి వచ్చాడు ఆ యువకుడు.

"గుడ్ ఈవినింగ్ సార్" అంటూ డాక్టర్ లోపలికొచ్చాడు.

"ఏమిటింతాలాస్యం? త్వరగా చూడండి. అమ్మాయికేదో విపరీతమయిన తలనొప్పి ఉందట."

"దారిలో పెట్రోలు రిజర్వులో కొచ్చింది. పెట్రోలు బంకుదగ్గర క్యూ అందుకని లేటయిపోయింది" అంటూ తన బాగ్ టేబుల్ మీద పెట్టి మంచం పక్కనే వున్న కుర్చీ మీద కూర్చున్నాడు.

"ఏదమ్మా చెయ్యి ఇలా ఇవ్వు" అంటూ ఓ చేతిలో స్మిత ముంజేయి పట్టుకుని మరో చేతితో ఆమె నుదుటి మీద నిమిరాడు.

"ఎప్పటి నుంచమ్మా ఈ నొప్పి" అడిగాడతను.

"నిన్నటి నుంచీ" అంది స్మిత.

"ఒకవేళ ఎవరయినా ఆమె భోజనం పాయిజను చేయటం వలన ఇది రాలేదు కదా?" అడిగాడు మాధవరావు.

డాక్టరు ఆశ్చర్యంగా చూశాడు.

'అంటే అలా ఎవరయినా చేసేందుకు అవకాశముందా?"

"ప్రస్తుతానికి వుంది. "క్లుప్తంగా చెప్పాడు మాధవరావు.

డాక్టరు ఇంకేమీ ప్రశ్నించలేదు.

"ముందీ టాబ్ లెట్స్ తెచ్చి వాడండి. దానివల్ల గుణం కలగకపోతే అప్పుడు ఆలోచిద్దాం మిగతా విషయాలు" అంటూ కాగితం మీద టాబ్ లెట్స్ రాసిచ్చాడు. ఆ తరువాత లేచి తన బాగ్ లో నుంచి ఇంజెక్షన్ సిరంజి తీశాడు.

"ఒక ఇంజెక్షన్ కూడా ఇస్తాను. అంటూ ఆమె చేతికి ఇంజెక్షన్ ఇచ్చి "ఇంకాసేపట్లో ఆమె నిద్రపోతుంది డిస్టర్బ్ చేయకండి. అవసరమనుకుంటే మళ్ళీ నాకు ఫోన్ చేయండి" అన్నాడతను.

డాక్టరు తో పాటు అందరూ బయటికెళ్ళి పోయారు. స్మిత కళ్ళు తెరచింది. ఇంజక్షను చేసినచోట రుద్దుకుంటూ. అప్పుడే మాధవరావు భార్య మళ్ళీ వచ్చింది ఓ పనిమనిషితో పాటు.

"నిద్ర లేపి కాఫీ ఇవ్వు" పురమాయించిందామె. పని మనిషి కాఫీ కప్పుతో పాటు దగ్గరవచ్చి పిలవసాగింది.

"అమ్మా! కాఫీ తెచ్చానమ్మా?"

స్మిత కల్లుతెరచి ఆమె వంక చూసి ఆమె చేతిలోని కప్పు అందుకుని తలగడ మీదకు జరిగి కూర్చుంది.

"ఎలా వుంది తలనొప్పి?" అడిగిందామె.

"ఇంకొంచెం వుంది" అంది బాధపడుతున్నట్లు ముఖంలో ఫీలింగ్స్ యిస్తూ.

కాఫీ తాగి కప్పు పనిమనిషికి ఇచ్చేసిందామె.

ఇద్దరూ తలుపు దగ్గరగా వేసి బయటి కెళ్ళిపోయారు. అరగంట తర్వాత స్మిత నెమ్మదిగా లేచి తలుపు దగ్గర కెళ్ళి శబ్దం కాకుండా లోపలి నుంచి బోల్టు వేసేసుకుంది. ముందు కిటికీ దగ్గరున్న టేబుల్ దగ్గర కెళ్ళి సొరుగులు లాగి చూసింది. లోపల అనేక రకాల విదేశీ వస్తువులున్నాయ్. కొన్ని గోల్డు రిస్ట్ వాచీలు, సెంట్లు, సబ్బులూ, పెన్నులూ, పాకెట్ సైజు తీ.వి.లు. వీడియో గేమ్స్, కెమెరాలు - మరో మూలగా వున్నా స్టీల్ అల్మారా తెరవటానికి ప్రయత్నించిందామే. కానీ దాని డోర్ లాక్ చేసి వుంది. తాళం చేతుల కోసం వెతకసాగింది. తలుపు మీద సన్నగా

వేళ్ళతో కొట్టిన చప్పుడవటంతో కంగారు పడి మళ్ళీ తన మంచం మీద పడుకుంది స్మిత. ఈసారి ఎవరో కించెం గట్టిగానే తలుపు తట్టారు. తీయలా వద్దా అన్న సందిగ్ధంలో పడిందామే. మరోసారి ఇంకొంచెం గట్టిగా కొట్టేసరికి భయపడుతూనే లేచి వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా పనిమనిషి నిలబడి వుంది. స్మితను తోసుకుని లోపలికొచ్చి తలుపు మళ్ళీ దగ్గరకు వేసిందామే.

"మీకో విషయం చెప్పాలని వచ్చాను సంధ్యమ్మా?" రహస్యంగా మాట్లాడిందామె.

"ఏమిటది?" ఊపిరి బిగపట్టి అడిగింది స్మిత.

":అమ్మగారు మిమ్మల్ని విషం పెట్టి చంపేయాలని ప్రకాష్ బాబుగారితో మాట్లాడుతుంటే విన్నాను."

స్మిత ముఖం పాలిపోయింది.

"చంపేస్తారా?"

"అవునమ్మా? నా చెవులతో నేను విన్నాను. అసలు నాకు వాళ్ళిద్దరి మీదా అనుమానం ఎందుక్కలిగిందో తెలుసామ్మా?" అంటూ అటూ ఇటూ చూసిందో సారి - ఎవరైనా వింటున్నారేమోనని.

స్మితకు భయం పెరిగిపోతోంది.

"వాళ్ళిద్దరికీ సంబంధం వుందమ్మా" మరింత రహస్యంగా చెప్పిందామె.

స్మితాకేమీ అర్ధం కాలేదు "ఎవరిద్దరికీ?" అడిగింది ఆసక్తి లేకుండా.

"అదేనమ్మా! శారదమ్మగారికి, ప్రకాష్ బాబు గారికి - నేను కళ్ళార చూశాను పదిరోజుల క్రితం. అసలు ఆ ప్రకాష్ బాబు శారదమ్మ తమ్ముడు కాదట. దూరపు బంధువు. ఇద్దరికీ మొదటి నుంచే సంబంధం వుంది. అందుకే తమ్ముడనే వంకతో వాడు వచ్చి వుంటున్నాడు. - అసలు మీ అమ్మను కూడా ఈ రాక్షసే విషం పెట్టి చంపి వుంటుందమ్మా! నాకిప్పుడు అనుమానం కలుగుతోంది."

స్మితకు పై ప్రాణం పైనే పోయింది. తను ఒక విషయం కోసం వస్తే ఇక్కడ మరో భయంకరమైన పరిస్థితి ఎదురయింది. పనిమనిషి చెప్పే విషయం నిజమే అయుండవచ్చు. శారద మొఖం చూస్తేనే తనకు అనుమానం కలుగుతోంది. చాలా క్రూరత్వం కనబడుతోందామె కళ్ళల్లో.

"జాగ్రత్తగా ఉండమ్మా! నేను కిటికీలోనుంచి సైగ చేసే వరకూ నువ్వే వస్తువు తినకు. ఏమిటోనమ్మా! నాకు నిన్ను చూస్తుంటే జాలి వేస్తోంది. మీ అమ్మగారు బ్రతికుకున్నప్పుడు మీ గురించి బాధపడేవారు - "అమ్మాయి పూర్తిగా చెడిపోయిందే విమలా!" అంటూ ఏడవని రోజూ లేదమ్మా! ఆమె పోయాకయినా మీరు మారతారేమోననుకున్నా, కానీ ఇప్పుడీ ఉపద్రవం వచ్చి పడింది" కన్నీరు తుడుచుకుంది పనిమనిషి.

స్మితకు ఒక్కొక్కటిగా చాలా విషయాలు అర్ధమవుతున్నాయ్.

"వస్తానమ్మా! మీరు మాత్రం నేను సైగ చేసేవరకూ ఏ వస్తువు ముట్టుకోకండి." హెచ్చరించి వెళ్లిపోయిందామె.

తలుపు మళ్ళీ బోల్టు వేసి మంచం మీద పడుకుంది స్మిత. మాధవరావుకి ఇద్దరు భార్యలన్న మాట. పెద్దమే కూతురు సంధ్య. బాగా చేడిపోయినమ్మాయ్. రెండో భార్య శారదమ్మే పెద్దమెను చంపింది. ఇప్పుడు ఆమె కూతురు సంధ్యను కూడా చంపాలనుకుంటోంది. ఈ ఇంట్లో ఇన్ని ప్రమాదాలున్నాయని తెలిస్తే తను ఇక్కడికి రావటానికి వప్పుకునేదే కాదు."

అయితే అసలు విషయాలు తనకింత వరకూ ఏ మాత్రం అంతుబట్టటం లేదు. సంధ్యారాణి తిరుమలలో

ఎందుకుంది? ఎక్కడుంది? ఆమెను చంపటానికి ఎవరు ప్రయత్నిస్తున్నారు? ఆ అడ్రస్ బుక్ తో ఆమెకేమి సంబంధం?

ఆలోచనలతోనే నిద్ర పట్టేసిందామెకి. ఎవరో పిలుస్తున్నట్లు వినిపించింది మెలకువ వచ్చింది. అప్పటికే పూర్తిగా తెల్లారిపోయింది. చటుక్కున లేచి బట్టలు సర్దుకుని తలుపు తెరచింది. మాధవరావ్ లోపలికొచ్చాడు మౌనంగా.

"తలనొప్పి ఎలా వుంది ?" అడిగాడు కుర్చీలో కూర్చుంటూ.

"తగ్గిపోయింది"

"గుడ్! నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి."

స్మిత అతని కెదురుగా కుర్చీలో కూర్చుంటూ.

"ఆ అడ్రస్ బుక్ కొట్టేశాడు తెలుసా?" అడిగాడతను భవానీ శంకర్ ఇచ్చిన సూచనల ప్రకారం స్మిత ఆశ్చర్యం నటించింది. "మైగాడ్! ఎవరు కొట్టేశారు? సిద్దార్ధరావా?"

"కాదు! భవానీ శంకర్ అనీ - వాడెవడో తెలీటం లేదు సరిగ్గా! ఒకవేళ వాడు సరికొత్త గాంగ్ కు చెందినవాడెమోనని అనుమానంగా వుంది. కాకపోతే సిద్దార్ధరావే వాడి ద్వారా నాటకమాడుతుండి వుండాలి! ఏదీ ఖచ్చితంగా తెలీటం లేదు."

"మరిప్పుడెలా?"

"అదే నాకూ అర్ధం కావటం లేదు. కిందటి సారి నువ్ తెచ్చిన స్టాక్ అలాగే పడివుంది. ఆ పుస్తకం దొరుకుతే గానీ ఎవరది వాళ్ళకు పంపడానికి వీలుకాదు. అసలు ఆ అడ్రస్ పుస్తకం అంత అజాగ్రత్తగా ఎలా దాచావ్ నువ్వు?" చిరాకుగా అడిగాడతను.

"నేను జాగ్రత్తగానే దాచాను! ఓ ఇంగ్లిష్ నవల బైండింగ్ తాలూకు రాక్ లో దాచాను - అయినా కనుకున్నారంటే ఆశ్చర్యంగా వుంది నాకు."

"ఆ సిద్దార్ధరావుగాడు మనిద్దరి మీదా పగబట్టాడు. నువ్వింకొన్నాళ్ళు తిరుమలలోనే ఉండటం మంచిది. అప్పుడే ఎందుకొచ్చేశావసలు?"

'అక్కడ ఎవరో నన్ను వాచ్ చేస్తున్నట్లు అనుమానం వచ్చింది?" తడబడుతూ అందామె......

"అదీగాక తలనొప్పి - విపరేతమయిన నొప్పి వచ్చేసరికి భరించలేక -కర్ణుడిని రెండ్రోజులాగి రమ్మన్నాను - నా పక్కనుంటే కనుక్కుంటారని."

మాధవరావు లేచి పచార్లు చేయసాగాడు.

"ఆ అడ్రస్ పుస్తకం మనం సంపాదించడం సాధ్యం కాదా?" అడిగిందామె.

"అయిదు లక్షలడుగుతున్నాడు వాడు."

"అయిదు లక్షలే?" ఆశ్చర్యం నటిస్తూ అందామె.

"మన బిజినెస్, మనకొచ్చే ఆదాయంతో పోల్చి చూస్తె అది పెద్ద మొత్తమేమీ కాదనుకో! కానీ అదిచ్చినా వాడు పుస్తకం ఇస్తాడా అని అనుమానం! అనుకోకుండా అంతా మిస్ అయిపొయింది! ఆ సిద్దార్ధరావుగాడిని లేపేస్తే గాని మన బిజినెస్ స్మూత్ గా వుండదు."

"కాని ఆ అడ్రస్ బుక్ లేకపోతే ఏమిటి నష్టం?" అన్న ప్రశ్న అడగటం రిస్కు అని తెలిసినా ధైర్యం చేసి అడిగేసింది స్మిత.

మాధవరావు ఆ ప్రశ్న వింటూనే నిశ్చేష్టుడయ్యాడు. స్మితకు అతనిని చూస్తే వణుకు వచ్చేస్తోంది.

"నీకేం మతిపోలేదు కదా! అది లేకపోతే హిరాయిన్ ఎవరికి, బ్రౌన్ షుగర్ ఎవరికి, ఎల్, ఎస్సు. డి. ఎవరికి, చరస్ ఎవరికీ అనే విషయం ఎలా తెలుస్తుంది? అసలు మన డ్రగ్స్ ఏయే అడ్రసులకో ఎవరికి సప్లయి చేయాల్సింది ఎలా తెలుసుకోవటం? వాటిని రెగ్యులర్ గా కారులో తీసుకెళ్ళి అందించే భార్గవ్ ని ముందే మర్డర్ చేసేశాడు కదా ఆ సిద్దార్థగాడు?"

స్మిత గుండె వేగంగా కొట్టుకోసాగింది. తనలోని నెర్వస్ నెస్ ని అతను కనుక్కుంటాడేమోనన్న భయం పెరిగిపోతోంది. మరో పక్క విపరీతమయిన అనందం? ఆ అడ్రస్ బుక్ రహస్యం ఇదా! మాధవరావు సిద్దార్ధరావు కలిసి డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నారన్నమాట. దాని విలువ కోట్ల మీదే ఉంటుంది కాబట్టి ఒకరినొకరు మోసగించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

"ఆ అవునవును - ఈ తలనొప్పితో నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలియటం లేదు" అంది తన తప్పుని కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

"ఇంక మనం ఆ సిద్దార్ధగాడి మీద అఫెన్స్ వెళ్ళకపోతే మనకు ప్రమాదం - వీలయితే ఈ భవానీ శంకర్ గాడినే మనం ఎరగా చేసుకుని వాడిని అంతం చేయాలి. ఒకే దెబ్బకు రెండు పిట్టలు."

స్మితారాణి గుండె ఝల్లుమంది.

"అంటే భవానీ శంకర్ ని కూడా చంపేస్తారా?" వణుకుతోన్న గొంతుని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ అంది.

"ఇప్పుడే కాదు. సిద్దార్ధరావుగాడేగిరిపోయాక."

"కానీ భవానీ శంకర్ సిద్దార్దరావు లాంటి పెద్ద రౌడీని ఎలా చంపగలదు?"

"మన డబ్బు సాయంతో! - ఎంత పెద్ద రౌడీ అయిన చివరకు మరో చిల్లర రౌడీ చేతిలో చావవలసిందేగా! సరే - నేనా కార్యక్రమాన్ని త్వరితం చేస్తాను. నువ్వు పూర్తిగా గదిలోనే విశ్రాంతి తీసుకో! గదిదాటి బయటకు రాకు! సరేనా?"

"సరే!"

అతను వెళ్ళిపోయాడు.

స్మిత తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. మంచం మీద పడుకోబోతుండగా ప్రకాష్ గదిలోకొచ్చేశాడు.

వస్తూనే తలుపు మూసి బోల్ట్ వేశాడు.

తర్వాత స్మిత దగ్గరకొచ్చి మంచం మీద కూర్చుని వంగి ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

స్మితారాణి నిశ్చేష్టురాలై పోయింది. వళ్ళు జలదరించినట్లయింది.

"అబ్బ! రాత్రంతా నిద్రపోకుండా ఎన్నిసార్లు తలుపు తట్టానో తెలుసా? నువ్వసలు లేస్తేకదా!"

స్మితకు కంగారు ఎక్కువయి పోతోంది.

"నాకు తెలీనే తెలీదు - తలుపు కొట్టిన విషయం అంది కూడతీసుకుంటూ.

"అవునులే రాత్రంతా అలసి నిద్రపోయి ఉంటావు - అందుకే నేనూ గట్టిగా ప్రయత్నించలేదు " చిరునవ్వుతో

అన్నాడు.

స్మితకు ఆశ్చర్యంగానూ, భయంగానూ కూడా వుంది.

ప్రకాష్ కీ, శారదమ్మాకూ సంబంధం ఉందని పనిమనిషి చెబుతోంది. మరి ప్రకాష్ తనతో ప్రవర్తిస్తోన్న తీరు చూస్తుంటే అతనికీ, సంధ్యారాణికి సంబంధం వుందని అనుమానం కలుగుతోంది.

హటాత్తుగా అతను సంధ్యారాణిమీదకు పూర్తిగా వరిగిపోయాడు.

"సంధ్యా! ఇన్ని రోజులు నీ పొందు లేకుండా ఎలా వుండగలననుకున్నావు? ఎప్పటికప్పుడు తిరుమల వచ్చేయాలని అనుకునేవాడిని - కానీ అందువల్ల నీకు హాని కలుగుతుందేమోనని .'

స్మితకు అతని శరీర స్పర్శ, వెచ్చగా తన ముఖానికి తగులుతున్న అతని ఊపిరి ఎలర్జీ కలిగిస్తున్నాయ్.

"నాకేం హాని కలిగిస్తుంది?" ఊపిరి బిగపడుతూ అడిగిందామె.

"భలేదానివే - ఏ హానేమిటి? ఆ సిద్దార్ధరావుగాడి మనుషులు మొత్తం మనవాళ్ళందరి కదలికలూ ఎక్కడికక్కడా కనిపెడుతూ కాపలా ఉన్నారు- మాలో ఒక్కరూ నీ దగ్గరకు రావటానికీ గానీ, నీతో ఫోన్ చేసి మాట్లాడ్డానికి గానీ ప్రయత్నించామో - నీ శవం కూడా దొరకదు మాకు."

అతను ఉధృతమవుతున్న కోరికతో ఆమెను పూర్తిగా అలుముకుంటూ పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

స్మిత ఎంతో ప్రయత్నం మీద అతని తలపక్కకు జరిపింది.

"ఎందుకలా తప్పించుకుంటావు సంధ్యా! అక్కా బావ ఇంట్లో లేరు. ఇప్పుడే భాగీరాద్ దగ్గరకి వెళ్ళారు. ఇంకో గంటవరకూ రారు -----" ఆనందంగా అంటూ ఆమె చీర కుచ్చేళ్ళ మీద చేయి వేసి లాగాడు .

స్మితకు వణుకు వచ్చేసింది.

భయంతో ఊడిపోతున్న చీరను గట్టిగా పట్టుకుంది.

"ఇప్పుడొద్దు ప్లీజ్ " అంది బ్రతిమాలే ధోరణిలో.

అతని ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

"అదేమిటి? ఎప్పుడూ నువ్వే మీదపడి "కావాలి" అంటూ గొడవ చేసేదానివి ఇలా మారిపోయావు?"

"ఆ - అదీ - నాకు వంట్లో బాగుండలేదు ప్రకాష్. తలనొప్పి ఇంకొంచెం ఉంది. దానికితోడు జ్వరం వచ్చినట్లు -" అంది తడబడుతూ -

ప్రకాష్ ముఖంలో నిరుత్సాహం కనిపించింది.

తన పక్కకు వంగి ఆమెను బలవంతంగా తన మీదకు లాక్కున్నాడు.

"చాలా డిసప్పాయింట్ మెంట్ గా ఉంది. ఓ.కే. రేపతివరకూ వదిలేస్తాను. ఆ తరువాత మాత్రం నావల్లకాదు . సరేనా?"

"సరే" చిరునవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అంది.

అతను ఈసారి ఆమె తలను రెండు చేతుల్తో పట్టుకుని గాడంగా పెదాలమీద ముద్దు పెట్టుకుని లేచి కూర్చున్నాడు.

"వస్తా - మళ్ళీ సాయంత్రం మాట్లాడుకుందాం" అంటూ బయటకు వెళ్ళిపోయాడు. లోపల్నుంచి తలుపు బోల్టు వేసి మళ్ళీ గదంతా వెతకటం ప్రారంభించిందామె. తను ఈరోజే - పారిపోవాలి. కానీ పగలే బయట వాచ్ మెన్

కళ్ళు గప్పి పారిపోవటం సాధ్యం కాని విషయం. తన బాగ్ లోని తాళం చెవులు తీసి స్టీల్ అల్మారా తెరవడానికి ప్రయత్నించసాగిందామె.ఎంత ప్రయత్నించినా అది తెరచుకోవటం లేదు. ఆమెకు నిరాశా , నిస్పృహ భయం ఎక్కువయిపోతున్నాయ్. ఆ అల్మారాలో ఏమున్నాయో తెలుసుకోగాలిగితే ఏమయినా ఉపయోగం ఉంటుందేమో -

నిరాశగా మళ్ళీ మంచం మీద వాలిపోయిందామె. తనింక ఇక్కడ ఉండటం వల్ల తన ప్రాణానికే కాదు , శీలానికి కూడా ముప్పు కలిగేట్లుంది.

ప్రకాష్ తనకు ఇంకొక్క రోజు మాత్రమే గడువిచ్చాడు.

తర్వాత బలవంతంగా నయినా తన శీలాన్ని హరించేట్లున్నాడు.

అదీగాక తిరుమలలో ఉన్న సంధ్యారాణి ఫోన్ ద్వారా గానీ, మరో విధంగా గానీ మాధవరావుని కాంటాక్ట్ చేసిందంటే తన గుట్టు కాస్తా బయట పడిపోతుంది.

స్మిత మళ్ళీ లేచి కూర్చుంది అశాంతిగా.

అక్కా, బావ ఎక్కడికో వెళ్ళారని ప్రకాష్ చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయామెకి!

అవును, ఇదే మంచి సమయం! ఇప్పుడు తను పారిపోగలిగితే.

లేచి గది బయటకొచ్చిందామె. అంతా నిశ్శబ్దంగా , ఖాళీగా వుంది - ముందు గదిలో యధాప్రకారం వీడియో శబ్దం వినబడుతోంది.

నెమ్మదిగా హాల్లోకి అడుగు పెట్టిందామే.

హాలంతా ఖాళీ.

మెయిన్ డోర్ దగ్గరకొచ్చి నిలబడి ఓసారి హాలంతా కలియజూసింది. ఎవరయినా రహస్యంగా తనను గమనిస్తున్నారేమోనన్న అనుమానం.

మెయిన్ డోర్ తెరచుకుంది నిశ్శబ్దంగా.

బయటకు అడుగు పెట్టిందామే. ఇంటిముందే కూర్చుని ఉన్నారు నలుగురు గార్డులు. అందరి దగ్గరా తుపాకులు, బుల్లెట్స్ పట్టీలు వున్నాయ్.

స్మితను చూడగానే నలుగురు ఒక్క ఉదుటున లేచి నిలబడి సెల్యూట్ చేశారు.

"ఏం కావాలి మేడమ్?" అడిగాడు ఒకడు.

"అలా - కాసేపు మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళివద్దామని" తడబాటును కప్పి పుచ్చుకోడానికి ప్రయత్నిస్తుంది.

"సారీ మేడమ్! మిమ్మల్ని బయటకు వెళ్ళనీయవద్దని చెప్పారు బాస్-----"

స్మిత ముఖం పాలిపోయింది.

"ఎందుకని?"

"మీ ప్రాణానికి అపాయం కలగవచ్చని అన్నారు."

స్మిత కింకేం మాట్లాడ్డానికి తోచలేదు. వెనక్కు తిరిగి తన గదిలోకి నడిచి మంచం మీద వాలిపోయింది మళ్ళీ.

క్షణక్షణానికీ ఆందోళన అధికమయిపోతోంది.

ఏదొక భయంకరమయిన సంఘటన జరగబోతోందన్న భయం చుట్టు ముట్టేస్తోంది.

తనిక్కడి నుంచీ బయట పడాలంటే భవానీ శంకర్ సహాయం ఉండాల్సిందే. కానీ అతనినే చంపటానికి

మాధవరావు ప్రయత్నాలు చేస్తున్న విషయం భవానీ శంకర్ కింకా తెలీదు. అతనికా విషయం తనే తెలియజేయాలి.

కానీ ఎలా?

ఎలాగోలా తనను ఎవరో ఒకరు కలుసుకుంటారని భవానీ శంకర్ చెప్పాడు గానీ ఇంతవరకూ ఎవరి జాడాలేదు. బహుశా తనకోసం అఖిలభాను వచ్చినా ఆమెను లోపలకు రానివ్వరు.

గెట్ దగ్గర్నుంచి వెనక్కు తిరిగి వెళ్ళాల్సి వుంటుంది.

హాల్లో నుంచి ఎవరో మాట్లాడుకోవడం వినబడుతోంది. క్రమేపీ ఆ గొంతులు దగ్గరవుతున్నాయ్.

స్మిత కళ్ళు మూసుకుంది.

గది తలుపులు తెరచుకున్నాయ్ హటాత్తుగా.

శారదమ్మా గొంతు వినబడుతోంది.

"ఇంకా లేవనేలేదే విమలా! త్వరగా లేపు నిన్న రాత్రి కూడా భోజనం చేయలేదు. ఎంత ఆకలవుతుందో ఏమో -"

విమల చేయి తన నుదుటి మీద చల్లగా కదలటం తెలుస్తూనే ఉంది.

"అమ్మా! లెండమ్మా, భోజనం తెచ్చాను -'

స్మిత అప్పుడే మెలకువ వచ్చినట్లు కళ్ళు తెరచి చూసింది.

"లేమ్మా, సంధ్యా! భోజనం చెయ్."

స్మితా లేచి ముఖం కడుక్కుని వచ్చి భోజనం ముందు కూర్చుంది. శారదమ్మే దగ్గర కూర్చుని వడ్డిస్తోంది.

నాలుగు ముద్దలు తిన్నాక కిటికీ వేపు చూసింది స్మిత.

కిటికీ బయట నిలబడి పనిమనిషి విమల సంజ్ఞలు చేస్తోంది భోజనం చేయవద్దు అన్నట్లు.

స్మిత గుండె వేగంగా కొట్టుకోసాగింది. వళ్ళంతా చెమటలు పట్టేసినాయ్. ఏమి చెయ్యాలో తెలీని పరిస్థితి.

సరిగ్గా అప్పుడే శారదమ్మా లేచి బయటకు వెళ్ళింది.

విమల పరుగుతో లోపలి కొచ్చింది.

"ఆ పాయసం తాగకండమ్మా! అందులో విషం కలిపిందామె." చెప్పేసి మళ్ళీ బయటకు వెళ్ళిపోయింది.

స్మిత భయకంపితురాలయి పోయింది.

పాయసం చూస్తుంటే భోజనం కూడా చేయబుద్ది కావటం లేదు. కూరల్లో కూడా ఏదయినా కలిపిందేమోనన్న అనుమానం.

'అబ్బ - ఇంకొద్దు - తినబుద్ది కావటం లేదు" అంటూ కంచంలో చేయి కడిగేసుకుందామె.

శారదమ్మా ముఖం వెలవెలబోయింది.

"పోనీ ఈ పాయసమయినా తాగు" అంటూ పాయసం గిన్నె ఆప్యాయంగా అందించింది.

"ఊహు! వద్దు! ఏమీ సయించటం లేదు. వాంతి అయేట్లుంది అంది వికారంగా.

"కొంచెం రుచి చూడు పోనీ" బ్రతిమాల సాగిందామె.

"వద్దు" ఖండితంగా చెప్పేసింది స్మిత.

శారదమ్మా ముఖంలో కోపం స్పష్టంగా కనిపించింది.

లేచి విసురుగా బయటకు నడిచింది.

"ఏయ్ విమలా - ఇవన్నీ తీసుకెళ్ళి లోపల పడేయ్" అరచింది గట్టిగా.

విమల వచ్చి ట్రే తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

చాలాసేపు ఆ షాక్ నుంచి కోలుకోలేకపోయింది స్మిత.

తను వీలయినంత త్వరగా ఆ యింటి నుంచి పారిపోవాలి? లేకపోతే ఇక్కడే సమాధి అయిపోవటం ఖాయం.

తలుపు బోల్టు వేసుకుని నిస్సహాయంగా మంచం మీద వాలిపోయింది.

## 15

భవానీ శంకర్, శ్యామ్, అఖిలభాను, తులసి కూర్చుని పేకాడుతున్నారు.

"అరెరే! జోకర్ వేసేశావేంటి వదినమ్మా! మనసు ఎక్కడికో వ్యాహ్యాళికెళ్ళినట్లుంది. వాపస్ తీసుకురా దానిని" చిరునవ్వు తో అన్నాడు భవానీ శంకర్.

అఖిలభాను తన చేతిలోని ముక్కలు టీపాయ్ మీద పడేసింది అనాసక్తిగా.

"నా మనసు బావుండలేదు. స్మితకేమైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయంగా వుంది" అంది దిగులుగా.

'అవును భవానీ! స్మితను పంపి మనం తప్పుచేశామేమో అనిపిస్తోంది" అన్నాడు శ్యామ్ కూడా.

"నో కామ్రేడ్స్! ఆందోళన ఏమాత్రం వాంఛనీయంకాదు. ఆ అడ్రస్ బుక్ మన దగ్గర ఉన్నంతకాలం మనలో ఎవరి ప్రాణానికి హాని వుండదు."

"అసలు మనం స్మితను కాంటాక్టు చేయటం ఎలా? ఎన్ని సార్లు ఎన్ని రకాలుగా ఫోన్ చేసినా "సంధ్య" అనే ఆమె ఇంట్లో లేదని చెపుతున్నారు" నిరాశగా అంది అఖిలభాను.

"ఇంక మిగిలింది ఒక్కటే మార్గం వదినమ్మా! నువ్వు "ఉర్సులా" పేరుతో డైరెక్టుగా స్మితను కల్సుకోవటమే!"

"నన్నయినా యింట్లోకి రానిస్తారనీ, ఆమెతో మాట్లాడనిస్తారనీ ఏమిటి నమ్మకం?"

"స్మిత ఈపాటికి అందుకుతగ్గ ఏర్పాట్లు చేసి వుంటుందనే నా ఆశ - ఎనీవే (ట్రైల్ కాస్టు) నథింగ్ " అన్నాడు. "కంజూసి ఫెలో! కనుక మిసెస్ ఉర్సులాగా మీరిప్పుడే స్టార్తయితే........."

"సరే - ఇప్పుడే రెడీ అవుతాను." అందామె లేచి లోపలి కేళుతూ.

"మరో నేనో!" అంది తులసి.

"నువ్విప్పుడే రంగంలోకి దిగకు మైడియర్ స్టూడెంట్! చైల్డు ఆర్టిస్టుకి మధ్య డిమాండ్ పడిపోయిందని విన్నాను - అంచేత కొంచెం రెస్ట్ తీసుకుంటే స్లంప్ పిరిడ్ అయిపోగానే పిలుపోస్తుంది - అన్నట్లు కామ్రేడ్ శ్యామ్, నేను వెళ్ళి ఓ ప్రవేటు టాక్సీ మాట్లాడి తెస్తాను. మిసెస్ ఉర్సులా కారులో వెళితేనే కొంచెం లెవెల్ బావుంటుందని మా లేవెల్లు హెడ్స్ కమిటి రిపోర్టు" అంటూ బయటికి నడిచాడతను.

## 16

అరగంట గడిచిందో లేదో తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

ఆందోళన అణుచుకుంటూ వెళ్ళి తలుపు తెరిచింది స్మితారాణి.

ఎదురుగా శారదమ్మా నిలబడుంది.

"నీకోసం ఎవరో "ఉర్సులా" అనే అమ్మాయి వచ్చిందట. ఎవరా అమ్మాయి? ఇంతకు ముందెప్పుడూ నీ ఫ్రెండ్స్ లో అలాంటి పేరేవరికీ వున్నట్లు లేదే?" అనుమానంగా అడిగింది.

స్మిత ముఖం ఆనందంతో వికసించింది.

అఖిలభాను "ఉర్సులా" అనే పేరుతొ వస్తుందని ముందే అనుకున్నారు.

"అ!ఆ!! అవును! నిన్న తిరుమల నుంచి విమానంలో వస్తుంటే ఫ్లేయిట్ లో ఫ్రెండ్ షిప్ అయింది. లోపలకు పంపించమని చెప్పు" తొణకకుండా మాట్లాడిందామె.

"నువ్వు ఎవర్ని కల్సుకోకూడదని మీ నాన్నగారు మరీ మరీ చెప్పి వెళ్ళారు."

"ఈమె చాలా గొప్పింటి అమ్మాయి. ఈవెన్ క్లబ్ సెక్రటరీ . మన వ్యాపారానికి చాలా అవసరం వుంటుంది. అసలందుకే నేనీమేతో ఫ్రెండ్ షిప్ చేసుకున్నాను. ఆ అడ్రస్ బుక్ దొరుకుతుందో లేదో ఆ భవానీ శంకర్ అనేవాడు అదెవరికిస్తాడో తెలీదు! ఈలోగా మనక్కావలసిన కస్టమర్స్ ని మనం ఏర్పాటు చేసుకోవటం మంచిది . అందుకే ఆమెను మన యింటికి ఆహ్వానించాను."

శారదమ్మ మొఖంలో మార్పు కనిపించింది.

"సరే" అంటూ బయటికి నడిచింది.

ఐదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చిందామే లోపలకు.

"హాల్లో కూర్చుంది. వెళ్ళి మాట్లాడు"

స్మిత హాల్లోకి నడిచింది.

అఖిలభాను ఆమెను చూస్తూనే ఆనందంగా పలకరించింది.

"హలో"

"హలో ఉర్సులా. మీరోస్తారనే ఎదురు చూస్తున్నాను."

"అవసరం మాది కదా - రాక తప్పుతుందా ?"

స్మిత క్రీగంట పక్కలకు చూసింది - ఎవరయినా తమ సంభాషణ వింటున్నారేమోనని.

శారదమ్మ కర్టెన్ వెనుక నిలబడుంది.

ముందు అఖిలభానే టీపాయ్ మీదున్న మైక్ ని గమనించింది.

టీపాయ్ క్లాత్ తొలగించి మైక్ ను చూడమని స్మితకు సంజ్ఞా చేసిందామె.

స్మిత ఎలర్టయిపోయింది. ఇలాంటి ఏర్పాట్లే వో వుంటాయని ముందే ఊహించినది తను.

కనుక సంభషణలోనే ఆతురతతో - ఆ అడ్రస్ బుక్ డ్రగ్ తీసుకునే కస్టమర్స్ అడ్రస్ లతో వున్న పుస్తకమని అఖిల భానుకి తెలియజేస్తే చాలు.

మిగతాదంతా భవానీ శంకర్ కి అర్ధమయిపోతుంది.

"చూడండి మిసెస్ ఉర్సులా! మీ క్లబ్ లో కొంతమంది లేడీస్ కి డ్రగ్స్ తీసుకునే అలవాటుందని మీరు ఫ్లేన్ లో

చెప్పారు కదా! ఆ విషయం మాట్లాడటానికే రమ్మన్నాను మిమ్మల్ని" అంది స్మిత కను సైగచేస్తూ.

అఖిలభానుకి ఆమె మాటలేమీ అర్థం కాలేదు! గానీ డ్రగ్స్ కి సంబంధించిన రహస్యమేదో వుందని తెలిసింది.

"ఆ - అవును - మా క్లబ్ మెంబర్స్ లో చాలామందికి ఆ అలవాటుంది" అంది చిర్నవ్వుతో.

'అయితే మీరు వెంటనే ఎవరికి ఆ డ్రగ్ కావాలీ ఎంత మోతాదులో కావాలీ తెలియజేస్తే మేము మీకు అన్నీ వారానికోసారి సప్లయ్ చేస్తుంటాము. సప్లయ్ అవగానే అక్కడికక్కడే మీరు క్యాష్ కట్టేయాల్సి వుంటుంది. మీరిచ్చే అడ్రస్ లూ- వాళ్ళు వాడే డ్రగ్స్ అన్ని వివరాలూ మా అడ్రస్ బుక్ లో నోట్ చేసుకుంటాము. అడ్రస్ బుక్ అంటే మీకు తెల్సుగదా - డ్రగ్స్ కి సంబంధించిన పూర్తి వివరాలుంటాయి అందులో"

కావాలనే ఆ పాయింటు ఎత్తి చెప్పిందామె.

అఖిలభాను ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

మొత్తం అర్థమయిందామెకి.

"సారీ! అడ్రస్ ఇవ్వటం కుదరదు. మీరు డైరెక్టుగా మా క్లబ్ కి సప్లయ్ చేస్తే మేము మా మెంబర్స్కిస్తాము. ఎందుకంటే మా మెంబర్స్ అందరూ కోటీశ్వరుల భార్యలు. వాళ్ళ పేర్లు బయట పెట్టకూడదని ఖచ్చితంగా చెప్పారు" కల్పించి మాట్లాడింది అఖిలభాను.

"సరే - మీ ఇష్టం . మీకెలా వీలయితే అలానే చేయండి. అయితే రెండు రోజుల ముందే ఏయే డ్రగ్స్ ఎంతెంత కావాల్సింది మాకు తెలియజేయాలి. మా మనిషి ఒకతను మీ దగ్గరకొచ్చి ఆ వివరాలు తీసుకుంటాడు."

"ఓ.కే. ! నే వెళ్ళిరానా మరి?"

"థాంక్ యూ వెరీ మచ్"

అఖిలభాను బయటికెళ్ళి పోతుంటే ఆమెతో పాటు తలుపు వరకూ నడిచింది స్మితారాణి.

"నన్ను వెంటనే ఇక్కడి నుంచి విడిపించండి. లేకపోతే నా ప్రాణానికే ప్రమాదం."

అఖిలభాను ముఖంలో భయం కనిపించింది.

"ఓ.కే. వస్తాను" అంది కలవరపాటుతో. స్మిత చేయి ఊపి లోపలి కొచ్చేసింది.

అఖిలభాను చెప్పిన వివరాలు వింటూనే భవానీ శంకర్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అయితే ఇది డ్రగ్స్ రాకెట్ అన్నమాట. మన ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో వెనుకబడిన రాష్ట్రమనీ, భారతదేశం ప్రపంచంలో వెనుక బడిన దేశమనీ తెలుసుగానీ, ఈ డ్రగ్స్ వాడకంలో మన రాష్ట్రం , మన దేశం ఏమాత్రం వెనుకబడలేదని మన ప్రజలు ఋజువు చేస్తున్నారు. కామ్రేడ్! నిజంగా ఒండర్ ఫుల్ ఎచీవ్ మెంట్ ఇది! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో అతివేగంగా అభివృద్ధి చెందినవి మూడే మూడు. జనాభా, మందు, డ్రగ్స్ ---"

"నాకు నమ్మబుద్ధి కావటంలేదు! మన రాష్ట్రంలో డ్రగ్స్ తీసుకునే జనాభా ఎక్కువగా వుందని -" అన్నాడు శ్యామ్ ఆశ్చర్యంతో.

"డ్రగ్స్ అనేది ముసుగులో జరిగే కార్యక్రమం కామ్రేడ్! బయటకు తెలిసింది మన రాష్ట్రంలోని ఇంజనీరింగ్ మెడికల్ కాలేజీల్లో పదిహేనేళ్ళ క్రితమే మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లటం ప్రారంభమయింది. ప్రస్తుతం అన్ని కాలేజీల్లో , యునివర్సిటీలూ, వీటికి మహారాజపోషక సంస్థలు. ఇవి కాక వ్యాపారస్తులు కూడా పెద్ద ఎత్తున ఆదరించటం ప్రారంభమయింది ఈ మధ్యే. అందుక్కారణం హైదరాబాద్ అరబ్ దేశాల మధ్య రాకపోకలు

ఎక్కువవటం? మీకు తెలుసో తెలీదో - నేను డ్రగ్స్ ఎడిషన్ గురించి మా పేపరులో పెద్ద ఫోటో ఫీచర్స్ చేశాను కామ్రేడ్! ఆ దెబ్బతోనే పేపర్ సర్క్యులేషన్ మూడొంతులు పడిపోయింది -"

"అదేమిటి ? ఎందుకు పడిపోయింది?" ఆశ్చర్యంగా అడిగింది అఖిలభాను.

"అప్పట్లో ఆ పేపర్ చదివే వాళ్ళంతా డ్రగ్సు కొట్టే బాపతన్నమాట. సర్క్యులేషన్ పడిపోయాక ఆ విషయం తెల్సి నాలిక్కరుచుకున్నామనుకోండి - అది వేరే సంగతి - కనుక - కనుక - ఇంతవరకూ నేనే విషయం గురించి మాట్లాడుతున్నాను కామ్రేడ్!"

"మనకు దొరికిన అడ్రస్ బుక్ గురించి"

"కరెక్ట్! మనకి ఇప్పుడో ఇంకాసేపటికో కబురొస్తుంది బ్రదర్! కామ్రేడ్ మాధవరావు ఇవాళే అయిదు లక్షలు కాష్ డౌన్ చేస్తానని ప్రామిస్ చేశాడు ఈ బుక్ కోసం.

శ్యామ్ , అఖిలభాను ఆలోచనలో పడ్డారు.

భవానీ శంకర్ ట్యూన్ నెంబర్ ఫోర్ పాడటం ప్రారంభించాడు.

కొద్దిసేపటి తర్వాత మాటలాడాడు శ్యామ్.

"భవానీ!"

"యస్ కామ్రేడ్!"

"మనం ఆ డబ్బు తీసుకుని ఆ అడ్రస్ బుక్ ఇచ్చేయటం తప్పు కదూ? అయ్ మీన్ మోరల్ గా - తప్పనిపిస్తోంది నాకు."

"ఆ డబ్బు పోలీసులు తీసుకునే బదులు మనం తీసుకుంటున్నాం బ్రదర్. ఇందులో తప్పేముంది?"

"ఏమో! అలా చేసే బదులు - ఈ విషయమంతా పోలీసులకు చెప్పటం మంచిదని అనుకుంటున్నాను " అంది అఖిలభాను.

"పోలీసు రిపోర్టు వలన ఏ సమస్యా పరిష్కారం కాదు కామ్రేడ్! అనుభవంలో చెపుతున్నాను. మీరు చిన్నప్పుడు చదువుకున్న పాఠం పుస్తకాల లెవల్లోనే వున్నారింకా!"

సరిగ్గా అప్పుడే డోర్ బెల్ మోగింది.

భవానీ శంకర్ వడివడిగా వెళ్ళి తలుపు తెరిచాడు.

ఎదురుగ్గా , లావుగా , పొడుగ్గా కండలు తిరిగిన ఓ వ్యక్తి నిలబడి వున్నాడు.

అతనిని చూస్తూనే గుర్తు పట్టేడు భవానీ శంకర్.

మాధవరావు కోసం తను ఆ ఇంటికెళ్ళినప్పుడు తనను బయటకు గెంటించడానికి మీట నొక్కి గోడలో నుంచి రప్పించిన వ్యక్తే ఇతను.

"హలో కామ్రేడ్!" ఆప్యాయంగా పలుకరించాడు భవానీ శంకర్.

"హలో" అన్నాడా వ్యక్తి పొడిగా.

"చాలా పెద్ద సర్ ప్రైజ్ కామ్రేడ్ నువ్విక్కడకి రావడం! సాధారణంగా మాధవరావు భవనంలో బటన్ నొక్కగానే గోడ చీల్చుకుని రావటం వరకే ఫీట్స్ పరిమితం అని నేననుకున్నాను. కానీ ఇలా సోషల్ విజిట్స్ కూడా చేస్తావని తెలీదు కామ్రేడ్ ! ఎండలో నిలబడి వున్నావ్ లోపలి కొచ్చి కూర్చో-"

"అవసరం లేదు--"

"అల్ రయిట్! బహుశా చిన్నప్పుడు స్కూల్లో ఎండలో గోడ కుర్చీ వేసి ఎక్కాలు చదివావనుకుంటాను. చాలామంది అంతే బ్రదర్! చిన్నప్పటి అలవాట్లను చచ్చేవరకు అలాగే మెయింటెయిన్ చేస్తుంటారు. అందాకా ఎందుకు? ఇడుగో కామ్రేడ్ శ్యామ్ చిన్నప్పుడు వీడి హాబీ ఏమిటో తెలుసా? బాక్సింగ్. రోజుకి ఇద్దరు స్కూలు పిల్లల చొప్పున పట్టుకుని బాక్సింగ్ చేసి చావగోడతుండే వాడు. అదే అలవాటు అలా వుండిపోవడం వల్ల ఇప్పుడు చాలా ఇబ్బంది ఫీలవుతున్నాడు. ఆఫ్ కోర్స్ ఎంత స్కేర్సిటీ వున్నా రోజు కొకడయినా దొరుకుతుంటాడులే."

ఆ వ్యక్తి మొఖంలో కోపం, విసుగు కనిపించినాయ్.

## 17

"మాధవరావుగారు మధ్యాహ్నం నిన్ను కలుసుకోమని చెప్పారు."

"ఎక్కడికి కామ్రేడ్?"

"సరిగ్గా రెండు గంటలకు జూపిటర్ ఎపార్టు మెంట్స్ లో ఫ్లాట్ నెంబర్ 666 కి. అక్కడ నీకివ్వాల్సి డబ్బు సిద్దంగా వుంటుంది. డబ్బు తీసుకోగానే నువ్వా డబ్బు ఇచ్చేయాలి. అర్ధమయిందా."

"అయింది కామ్రేడ్! కాకపోతే నీ తెలుగు కొంచెం డిటెక్టివ్ బుక్ లాంగ్వేజ్ లో వుంది. అయినా ఫర్వాలేదు అయి కెన్ మేకవుట్--"

"ఇంకొక్క విషయం గుర్తుంచుకో ! అతి తెలివి ప్రదర్శించావనుకో శాల్తీ గల్లంతవుతుంది. నువ్వు నిర్ధాక్షిణ్యంగా చంపబదతావ్-"

"మీ గ్రూప్ అందులో ఎక్స్ పర్ట్శ్ అన్న విషయం నాకు తెలుసు కామ్రేడ్ - వేరే చెప్పనక్కరలేదు."

అతను వెళ్ళిపోయాడు.

భవానీ శంకర్ టైం చూశాడు.

ఒంటిగంట -

"అరె! ఇంకొక్క గంటె ఉంది. కామ్రేడ్ శ్యామ్ - త్వరగా రడీ అవ్ - "జయంబు నిశ్చయంబురా" అని పాడుకుంటూ "జూపిటర్ లోకి వెళ్ళిపోదాం - " అంటూ భవానీ శంకర్ లేచి నిలబడ్డాడు ఉత్సాహంగా.

"ఒక్క నిమిషం భవాని ---" అన్నాడు శ్యామ్.

"యస్ కామ్రేడ్ - ఏమిటది?"

"మనం మనకు తెలీకుండా చాలా చిక్కుల్లో ఇరుక్కుపోతున్నట్లు నాకు అనిపిస్తోంది . ఇంక ఈ గేమ్ ఆపేసి పోలీసు దగ్గరకెళ్ళి జరిగిందంతా చెప్పేయటం మంచిది -"

అఖిలభాను కూడా వెంటనే అందుకుంది.

"అవును భవానీ - నేనూ అదే అనుకుంటున్నాను! ఆ పుస్తకం మన దగ్గరున్నంత కాలం మనకేమీ భయం లేదనీ మనమనుకుంటున్నాం. కానీ ఇప్పుడు స్మిత వాళ్ళ దగ్గర ఉంది. కనక మనం కూడా వాళ్ళ చేతుల్లో ఇరుక్కుపోయి ఉన్నాం. ఈ పరిస్థితుల్లో పోలీసు సహాయం వుంటే గానీ మనం బయటపడలేము-"

భవానీ శంకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఒకే కామ్రేడ్! తివిరి ఇనుమున తైలంబు తీయవచ్చు గానీ, చీరి మూర్ఖుని మనసు రంజింపలేమని మన సీనియర్ ఎవరో రిటెన్ గా స్టేట్ మెంటిచ్చాడు గనుక -------పదండి! తిన్నగా పోలీస్ దగ్గరకేళదాం."

అఖిలభాను మొఖంలో సంతోషం కనిపించింది.

"పదండి ! వేళదాం " అంది శ్యామ్ తో.

అందరూ ఆటోలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆఫీస్ కి చేరుకున్నారు.

ఆఫీసంతా చాలా హడావుడిగా ఉంది.

బయట బోలెడు మంది జనం "క్యూ" లో కూర్చుని ఉన్నారు.

శ్యామ్ తలుపు దగ్గర నిలబడ్డ కానిస్టేబుల్ దగ్గరకు నడిచాడు.

"మేము అర్జంటుగా మీ ఎస్పీగారిని చూడాలి -----" అన్నాడు ఆత్రుతగా.

కానిస్టేబుల్ పాన్ నోట్లో పెట్టుకుని చేతులు తుడుచుకుని దూరంగా ఉన్న "క్యూ" వేపు చూపించాడు.

"ఆ క్యూలో నిలబడండి!"

శ్యామ్ కి కోపం ముంచుకొచ్చింది.

"క్యూలో వెళ్ళేంత టైము లేదయ్యా! అవతల కొంపలు మునిగిపోతాయే - వెంటనే చూడకపోతే."

"మరీ అర్జంటా?" అడిగాడు కానిస్టేబుల్ పక్కనే వున్న స్పిటూన్ లో ఊస్తూ.

"కాస్తా కూస్తా కాదు. పెద్ద డ్రగ్స్ రాకెట్ ."

కానిస్టేబుల్ ముఖంలో కొంత మార్పు కనిపించింది.

"డ్రగ్స్ రాకెట్టా?"

"అవును"

"ఈ మధ్య నవలల్లో రాస్తున్నారు. డ్రగ్స్ స్మగ్లింగ్, మాఫియా అంటూ అదేనా?"

"అవును అదే కొన్ని కోట్ల రూపాయల రాకెట్."

"ఇందులో మర్డర్స్ గిర్డర్స్ అన్నీ సైలెంట్ గా జరిగి పోతుంటాయ్ కదూ?"

"అవును."

"అయితే పెద్ద కేసే . అదిగో ఆ చిన్న క్యూ ఉంది చూడండి అందులో నిలబడండి."

శ్యామ్ ముఖం మాడిపోయింది.

"ఏయ్ , నీకేమయినా మతిపోయిందా? ఆలస్యమయితే అవతలి వాళ్ళు తప్పించుకు పోతారంటే వినవేం? అదీగాక కొంతమంది అమాయకుల ప్రాణాలు పోయినా పోవచ్చు."

"తెల్సండీ! ఆ క్యూలో ఉన్న వాళ్ళందరివీ కూడా అదే కేసులు - ఆ ఎనిమిదో ఆయనను చూశారా? అయన కుటుంబాన్నంతా విరోధులు చుట్టూముట్టారనీ పోలీస్ సహాయం కావాలనీ అడగటానికొచ్చాడు. ఈపాటికి అందర్నీ చంపేసి ఉంటారని కూడా ఆయనే అన్నాడు. ఇన్నీ ఇంచుమించుగా అలంటి కేసులే కనుక మీరూరికే తొందరపడితే లాభం లేదు."

"పదండి , క్యూలో నిలబడదాం" అంది అఖిలభాను.

గంట సేపటి తర్వాత ముగ్గురు లోపలికెళ్ళారు.

జరిగినదంతా తాపీగా విన్నాడు పోలీస్ అధికారి.

"సరే, మా వాళ్ళను పంపిస్తాం. మీరింటికి వెళ్ళిపొండి. మాధవరావు గారికి గూడా ఫోన్ చేసి కనుక్కుంటాలే లోపల" అన్నాడు పోలీస్ అధికారి.

"అదేమిటి మాతో పంపించారా?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామ్ .

'ఎక్కడా? కానిస్టేబుల్స్ ఏరీ?"

"అంటే ఏమయి పోయారు?"

"ఎలక్షన్ డ్యూటీ కెళ్ళారు. వారం రోజుల్లో వచ్చేస్తారు. రాగానే పంపిస్తాను. మీరు వెళ్ళండి."

"దిసీజ్ టూ మచ్" అన్నాడు శ్యాం కోపంగా.

"ఇంక బయటికేళ్ళండి. ఇక్కడ ఎక్కువ మాట్లాడకూడదు."

"మీరంతా మాధవరావు చేసే వెధవ పనుల్లో పార్టనర్స్."

అయన బెల్ నొక్కాడు.

వెంటనే కానిస్టేబుల్ లోపలికొచ్చాడు.

"ఈ బాస్టర్స్ ముగ్గురినీ బయటకు గెంటు" శాంతంగా చెప్పాడు.

కానిస్టేబుల్ రెండు చేతులూ ఇద్దరి మెడ మీదా వేసి బయటకు తోశాడు గట్టిగా.

శ్యాం అతని చేతిని వదిలించికొట్టి బయటి కొచ్చేశాడు.

రోడ్ మీద కొచ్చేవరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"వాడ్డూ యూ సే కామ్రేడ్ ఆర్కే శ్యామ్! ఇప్పటికయినా నీ ఆలోచన ధోరణి మార్చుకుంటావా?" అడిగాడు భవానీ శంకర్.

"సారీ బ్రదర్! నేను నా అభిప్రాయాన్ని ఎప్పటికీ మార్చుకోను. పోలీసుల సంగతలా వదిలేయ్. సామాజికంగా నేరం చేస్తున్న మాధవరవుని చేతనయితే పోలీసులకు పట్టించాలి లేదా వదిలేయాలి. అంతే కాని అతనిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు తీసుకోవటం తప్పు."

"ఆ డబ్బు మన కోసం కాదు బ్రదర్!"

"మరెవరి కోసం ?"

"ఆ మాధవరావు అన్యాయం చేసిన వారికోసం."

శ్యాం, అఖిలభాను ఆశ్చర్యంగా చూశారతని వేపు.

"ఎవరువాళ్ళు?"

"నా రూం దగ్గరున్న మురికివాడల వాళ్ళు."

"వాళ్ళను మాధవరావు ఏమన్యాయం చేశాడు?"

వాళ్ళలో సగం మందిని చంపేశాడు."

"ఎలా?"

"అదివరకు వాళ్ళు మాధవరావు కట్టిన ఫ్యాక్టరీ వెనుకే వుండేవారు. వాళ్ళందరికీ కామన్ గా ఒక పెద్ద బావి ఉండేది. మాధవరావు కట్టిన మందుల ఫ్యాక్టరీ నుంచి వెలువడే ప్రమాదకరమయిన రసాయనికద్రవాలు ఆ బావి

దగ్గరే ఒక పెద్ద గొయ్యి తీసి ఆ గోతిలోకి వదిలేశారు. ఆ కెమికల్స్ భూమి అడుగునుంచి ఊరి ఆ బావిలో కొచ్చి కలుషితం చేసే సరికి నెలరోజుల కాలంలో నలబై మంది పిల్లలు, ఇరవై ఆరుగురు పెద్దాళ్ళు రోజుకి ఒకరిద్దరు చొప్పున మరణించారు. ఈ సంగతి తెలిసి అక్కడికి దగ్గరలోనే వున్న ఒక యంగ్ లాయరు కోర్టులో కేసు వేశాడు. అంతే కోర్టు నుంచి సమన్ లు వచ్చిన మర్నాడే సిద్దార్ధరావు గుండాలు రంగంలోకి దిగి ఆ లాయర్ ని ఇంట్లో భోజనం చేస్తుండగానే డైనింగ్ టేబుల్ మీదే గొడ్డళ్ళతో తల నరికేశారు. ఆ పాకల్లో వున్న వాళ్ళందరి సామాన్లు రాత్రికి రాత్రి తీసుకొచ్చి ఊరుబయట పారేశారు. వాళ్ళందరినీ కూడా లారీల్లో ఎక్కించి ఊరి బయట వదిలి తెల్లారేసరికల్లా వాళ్ళ పాకలన్నీ ఆనవాలు కూడా లేకుండా చేసి వాటి స్థానంలో సిద్దార్ధరావ్ వాళ్ళ షెడ్లు నిర్మించేశారు. ఉదయం వాళ్ళంతా పోలీసు స్టేషన్ కెళ్ళినా ప్రయోజనం ఏముంది? వాళ్ళ పాకలు లేనేలేవని తమవాళ్ళ షెడ్లు ఎప్పటినుంచో ఉన్నాయనీ సిద్దార్ధరావు డబాయించాడు. మాధవరావు పోలీస్ అధికారులను గుప్పెట్లో పెట్టుకోవటం వల్ల వాళ్ళంతా చేసేది లేక ఈ మురికివాడలో సెటిలయ్యారు."

శ్యాం కి చటుక్కున గుర్తు కొచ్చేసింది.

"అవును! ఆ గొడవ పేపర్లో కూడా చదివిన గుర్తు."

"దాని వెనుక వున్నది ఈ మాధవరావు, సిద్దార్ధరావులే! నేను ఫొటోలతో సహా మా న్యూస్ పేపరులో ప్రచురించింది కూడా ఆ పాకల్లోని వాళ్ళకు జరిగిన అన్యాయం గురించే. అప్పట్లో నాకూ, మా ఎడిటర్ కి కూడా తెలీదు. మాధవరావుకి బినామీ పేర్లతో మా న్యూస్ పేపర్ యాజమాన్యంలో భాగం ఉందని. తెలిసేసరికి చాలా ఆలస్యం అయిపోయింది. మా ఇద్దరి ఉద్యోగాలూ పోయాయ్."

శ్యాం కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

"అయినా సరే భవానీ! అలాంటి దుర్మార్గులతో పేచీ పడటం మనకు మంచిది కాదు. మనం వాళ్ళకున్న హంగుతో ఏవిధంగాను సరితూగలేము."

"అది పిరికివాళ్ళనుకునే మాట కామ్రేడ్! ఆ హత్య చేయబడ్డ లాయర్ కుటుంబం ఎప్పుడు ఏ పరిస్థితులో ఉందో తెలిస్తే నువ్విలా మాట్లాడవు. అతని భార్య పాచిపని చేసి కుటుంబాన్ని పోషిస్తోంది. అతని పిల్లలూ ఇద్దరూ సినిమాహాలు బయట బఠానీలు అమ్ముతున్నారు. నేను మాధవరావు దగ్గర ముక్కు పిండి వసూలు చేయబోయే డబ్బు వీళ్ళందరకూ ఉపయోగపడుతుంది కామ్రేడ్! మనం మన కోసం బ్రతకటం ముఖ్యం కాదు బ్రదర్ మన చుట్టూ వున్న వారి కోసం కూడా బ్రతుకుతూండాలి" ఆవేశంగా అన్నాడు భవానీ శంకర్.

"మరి సంగతి ఎప్పుడూ చెప్పలేదేం మాకు?"

"ఈ అడ్రస్ బుక్ వెనుక ఈ మాధవరావు, సిద్దార్ధరావులు ఉన్నదని తెలిసిన తర్వాతే నేను దీని అంతుచూడాలని నిర్ణయించుకున్నాను వదినా! అందుకే స్లోగా నేనే వాళ్ళ ఫోటోలు పేపర్లో వేసినవాడినని తెలీకుండా జాగ్రత్తగా మసులుతున్నాను---"

"ఏదేమయినా అలాంటి రాక్షసులతో పేచీ పడటం మంచిది కాదు భవానీ! ఎలుకలు కొన్ని ఏనుగుని ఎదిరించినట్లుంటుంది." అంది అఖిలభాను అనునయంగా.

"సారీ! వదినమ్మా! ఈ విషయంలో నేను వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు. ఈ డ్రగ్స్ స్మగ్లింగుని గానీ, దీని వల్ల సమాజానికి జరిగే నష్టం గురించి గానీ నేను పట్టించుకోదల్చుకోలేదు. అది ప్రభుత్వం సోషల్ వర్కర్స్ చేయాల్సిన

పని! కానీ ఆ మాధవరావుకి వీలయినంత నష్టం అన్నీ రకాలుగా కలిగించగలిగితే నాకు సంతృప్తిగా వుంటుంది. ఆ నష్టం - ఆ లాయర్ కుటుంబానికీ, నురికివాడల్లో వున్నావాళ్ళకి ఉపయోగపడితే నా ధ్యేయం నెరవేరినట్లే. ఆ విషయంలో కొంచెం రిస్కు తీసుకోవడానికి కూడా నేను సిద్ధంగా వున్నాను -"

"అసలు కారణం అది కాదు? నీకూ డబ్బు పిచ్చి పట్టింది ? అందుకే ఇలా మాట్లాడుతున్నావు" అందామె కోపంగా.

"ఓ.కే. కామ్రేడ్! అది మీ అభిప్రాయం. ఒకరి అభిప్రాయాన్ని ఖండించడం నా అభిమతం కాదు . ఎవరికి వారే వాటిని మార్చుకోవాలి - వస్తాను మాధవరావు నా కోసం జూపిటర్ టవర్స్ లో ఎదురు చూస్తుంటాడు -----"

శ్యాం ముఖంలో ఆవేదన కనబడింది.

"కానీ ఒక విషయం గుర్తుంచుకో! నీ గొడవల్లో మమ్మల్ని యిరికించకు. డబ్బు లేకపోయినా మేము సుఖంగా ఉంటున్నాం. అందామె.

"ష్యూర్ సిస్టరిల్లా! మీ మీద ఈగ కూడా వాలకుండా చూసే పూచి నాది-"

"గుడ్ బై-" అన్నాడు శ్యాం.

"గుడ్ బై - సీయూ" వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే భవానీ శంకర్ కూడా వడివడిగా నడవసాగాడు మరోవేపు.

## 18

భవానీశంకర్ జూపిటర్ టవర్స్ చేరుకునేసరికి మాధవరావు బంటు బయటే నిలబడి ఎదురుచూస్తున్నాడు.

"త్వరగా రా! బాస్ నీ కోసమే ఎదురుచూస్తున్నారు."

భవానీ శంకర్ ఫ్లాట్ లోకి నడిచాడు.

లోపల సోఫాలో కూర్చుని ఉన్నాడు మాధవరావు.

అతని చేతిలో లెదర్ బాగు వుంది.

"అడ్రస్ బుక్ తెచ్చావా?" అడిగాడతను.

"తెచ్చాను-"

"ఇదిగో క్యాష్! ఆ బుక్ ఇటివ్వు."

"అప్పుడేనా కాష్ లెక్క పెట్టుకోనియండి."

అంటూ బాగు అందుకుని ఓపెన్ చేశాడు. వందనోట్ల కట్టలు కనిపించాయతనికి. ఒక్కొక్కటి పదివేలు బండిల్. అలాంటివి పదే వున్నాయి.భవానీ శంకర్ బిగ్గరగా నవ్వాడు.

"నాకు తెలుసు కామ్రేడ్! నువ్విలాంటి సినిమా ట్రిక్స్ ప్లే చేస్తావని! ఛ ఛ తెలుగు సినిమాలు మీలాంటి వాళ్ళను ఎంత దారుణంగా చెడగొడుతున్నాయో తల్చుకుంటేనే రోతగా వుంది ."

ఏమిటి నువ్వు మాట్లాడేది?" కోపంగా అన్నాడు మాధవరావు.

"మిగతా నాలుగు లక్షల సంగతి."

"అది నువ్వు అడ్రస్ బుక్ ఇచ్చాక."

"ఆ విషయం మన ఎగ్రిమెంట్ లో లేదు కదా కామ్రేడ్."

మాట్లాడుతూ అతని నోట్లకట్టలు అతని మీదకే విసిరేశాడు.

"నేను వెళుతున్నాను కామ్రేడ్! డబ్బంతా తెచ్చినప్పుడు కలుసుకుందాం."

వెనక్కు తిరిగాడతను.

వెనుకే తనకు రివాల్వర్ ఆనించి సిద్ధంగా నిలబడి వున్నాడు ఆ లావుపాటి వ్యక్తి.

"అతి తెలివి చూపించావంటే పైకి పంపిస్తాను. ముందా పుస్తకం ఇటివ్వు."

భవానీ శంకర్ కి నవ్వాగలేదు.

విరగబడి నవ్వుతూ వెళ్ళి మాధవరావు పక్కనే సోఫాలో కూలబడ్డాడు.

"ఎంత మూర్ఖపు జనం మనాళ్ళు! బాస్ తెలివితక్కువ రకం అయితే వాడి శిష్యులు కూడా అలానే తయారవుతారా ఎక్కడయినా? రివాల్వర్ ఆ మూల పడేయ్ కామ్రేడ్!"

"ముందా పుస్తకం తీస్తారా లేదా?"

మాధవరావు కూడా మరో రివాల్వర్ తీసి భవానీ శంకర్ కి గురి పెట్టాడు.

"మీ ఇద్దరికీ పిచ్చెక్కింది కామ్రేడ్! లేకపోతే మీలాంటి మాట నిలకడ లేని వాళ్ళను నమ్మి నేను ఆ పుస్తకం తెస్తానా? మీరిలాంటి వెధవ వేషాలేస్తారని ముందే నాకు తెలుసు. అందుకే అది తీసుకురాలేదు."

లావుపాటి వ్యక్తి అతని మాటలు వినిపించుకోలేదు. అతని జేబులన్నీ తడిమి చూసాడు. పుస్తకం కనిపించలేదు. మాధవరావు మోహంలో కోపం- కసి - నిరాశ అన్నీ మిళితమయి కనిపించినాయి.

భవానీ శంకర్ మొఖం మీద రివాల్వర్ తో లాగి కొట్టాడతను. భవానీ శంకర్ రెండు చేతులూ ముఖానికి అడ్డు పెట్టుకున్నాడు బాధతో.

"బాస్టర్డ్ ! మమ్మల్ని మోసం చేస్తావా?"

భవానీ శంకర్ కోపం ఆగలేదు. ఆ దెబ్బకు నుదురు కొంచెం వాచింది.

"ఓ.కే. కామ్రేడ్! ఇదే మంచిపద్ధతని మీరనుకున్నట్లయితే ఆయామ్ రెడీ - కామ్రేడ్-' అంటూ హటాత్తుగా మాధవరావు చేతిమీద బలంగా తన్నాడు.

అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది . వెంటనే మాధవరావు భుజాలు పట్టుకుని తనకు అడ్డంగా పెట్టుకున్నాడు.

లావుపాటి వ్యక్తి కేం చేయాలో తోచలేదు.

"ఇప్పుడు కాల్చు బ్రదర్ నీ రివాల్వర్ - కమాన్" హేళనగా అరిచాడు.

ఆ లావుపాటి వ్యక్తి తెల్లమొఖం వేసి చూస్తుండిపోయాడు.

భవానీ శంకర్ నెమ్మదిగా మాధవరావుని లాగుతూ టీపాయ్ దగ్గరకు నడిచాడు.

ఆ పక్కనే వున్న లెదర్ బాగ్ అందుకున్నాడు నెమ్మదిగా.

అతనిని అడ్డు పెట్టుకునే బయటి తలుపు దగ్గరకు నడిచి మాధవరావుని లోపలకు ఒక్క తోపు తోసి ఫ్లాట్ తలుపు లాగి మూసి బయట బోల్టు వేసి పరుగుతో మెట్లు దిగేశాడు.

రోడ్ మీద అప్పుడే వస్తోన్న ఖాళీ ఆటోను ఆపి ఎక్కేశాడు.

"త్వరగా పోనీ కామ్రేడ్! ఎంత స్పీడు గా వెళితే అంత ఎక్కువ ఇస్తాను డబ్బు."

ఆటో గాలిలో తేలుతున్నట్లు వెళ్తోంది.

అరగంట పట్టిందతనికి తన గదికి చేరుకోడానికి.

పాకల్లో ఉన్నవారందరూ అతని చుట్టూ ముట్టేశారు ఆనందంగా.

"ఎక్కడికి వెళ్ళారంకుల్? ఇంటి కెందుకు రావటంలేదు?" అంటూ పిల్లలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అందరికీ సమాధానం చెప్పి రాజయ్య వేపు చూశాడతను.

"రాజయ్య! ఇవాల్టినుంచి మన పాకల్లోని పదిమంది చాకుల్లాంటి కుర్రాళ్ళు నాతోపాటు పనిచేయాలి. నాతోపాటే తిరగాలి. అలా చేసినందుకు ఒక్కొక్కరికి తలో అయిదువేలూ ఇస్తాను --"

అందరూ ఆశ్చర్యంగా నోరు తెరిచేశారు.

"అంతే కాదు! మన ప్లాను సక్సెస్ అయితే అందరికీ మంచి ఇళ్ళూ అందరికి బిజినెస్ చేసుకునేందుకు డబ్బూ-"

అప్పటికప్పుడే రాజయ్యతో సహా పదిమంది భవానీ శంకర్ తో పాటు తిరగడానికి ఎన్నికయిపోయారు.

## 19

మాధవరావు మనసు మనసులో లేదు.

తను భవానీశంకర్ చేతిలో దొరికిపోవటం చాలా చికాకు కలిగిస్తోంది. రాజకీయాలలో ఎంతోమందిని అలాంటి మోసాలెన్నో చేశాడు. ఎంతోమందిని బ్లాక్ మెయిల్ చేసి తనక్కావలసిన పనులు నెరవేర్చుకున్నాడు. ఆఖరికి కుడిభుజంగా మెలిగి తన కెన్నో సహాయాలు చేసిన సిద్దార్ధరావుని కూడా మూడు చెరువుల నీళ్ళు తాగించాడు. కానీ ఓ అనామకుడు దగ్గర్నుంచీ ఓ అడ్రస్ పుస్తకం సంపాదించలేకపోతున్నాడు. లేచి హాలులో పచార్లు చేయసాగాడతను.

తను వాడికి అయిదు లక్షలు ఇవ్వక తప్పేట్లు లేదు. ఎటూ కాకుండా వాడు లక్ష రూపాయలు లాక్కుపోయాడు. తనమీద కోపం కొద్దీ ఆ పుస్తకం తీసికెళ్ళి సిద్దార్ధరావు కిచ్చాదంటే తన అట కడుతుంది. లక్షల వ్యాపారం - కాస్తా తనచేయి జారిపోతుంది.

తను భవానీ శంకర్ తో రాజీ పడి మిగతా నాలుగు లక్షలూ ఇచ్చి పుస్తకం సంపాయించడం ఉత్తమం. కానీ నాలుగు లక్షలంటే అతనికి మనసోప్పటం లేదు. సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది.

"ట్రంక్ కాల్ ఫ్రమ్ తిరుమలా సాబ్" ఆపరేటర్ గొంతు. మాధవరావు ఆశ్చర్యపోయాడు.

"తిరుమల నుంచా? యస్సార్"

"వెంటనే సంద్యారాణి గొంతు వినిపించింది.

"డాడీ - నేను సంధ్యారాణిని........."

మాధవరావు ఉలిక్కిపడ్డాడు.

"సంధ్యా?"

"అవును డాడీ! అక్కడి పరిస్థితులెలా వున్నాయ్ డాడీ? నేనింకా వచ్చేయ్యవచ్చా ఇక్కడి నుంచి?"

మాధవరావుకి నోటమాట రావటం లేదు.

"నువ్ - నువ్వు ......"

"నాకిక్కడ చాలా బోర్ గా ఉంది డాడీ! త్వరగా చెప్పండి! గొడవ లేమీ లేకపోతే ఇవాళే బయల్దేరి వచ్చేస్తాను.'

మధవరావు ఉక్కిరి బిక్కిరయిపోతున్నాడు.

"వన్ మినిట్ బేబీ-" అంటూ ఫోన్ పక్కన పెట్టి లేచి సంధ్యారాణి గది దగ్గర కెళ్ళి తలుపు తెరచి చూశాడు.

స్మితరాని నిద్రపోతూ కనిపించింది.

అతని కేమీ అర్థం కావటం లేదు.

సంధ్యారాణి నిజంగా తిరుమల నుంచి మాట్లాడుతున్నట్లయితే అచ్చం సంధ్యారాణి లాగానే వున్న ఈ అమ్మాయి ఎవరు? యిద్దరికీ మరీ ఇన్ని పోలీకెలా వచ్చాయ్?

అసలీ అమ్మాయినీ ఎవరు పంపించారు?

ఒకవేళ ఇది ఆ సిద్దార్ధరావు పని కాదుగద?

వాడికయినా ఇలా పంపించడం వలన యేమిటి లాభం? అడ్రస్ బుక్ తనదగ్గరుందనుకుంటున్నాడా?

బెడ్ రూంలోకి నడిచి మళ్ళీ ఫోన్ అందుకున్నాడు.

"ఈ మిస్టరీ తేలాలంటే ఆ ఫోన్ లో వున్న అమ్మాయిని వెంటనే ఇంటికి రమ్మని చెప్పేయాలి."

"హలో" అన్నాడతను.

"హలో డాడీ ! ఏ సంగతి చెప్పరేం డాడీ! వచ్చేయాలా?"

"వచ్చేసేయమ్మా , ఇక్కడ పరిస్థితులు బాగానే ఉన్నాయి........"

"అయితే రేపు ఎయిర్ పోర్టుకి మనవాళ్ళను పంపించండి డాడీ! ముందుగా తిన్నగా మనింటికి వచ్చేస్తాను. తర్వాత వేరే ఫ్లాటులోకి మారిపోతాను."

"ఓ.కే. బేబీ-"

"థాంక్ యూ డాడీ."

ఫోన్ డిస్ కనెక్ట్ అయిపొయింది. అతనికి గొంతు విన్నకొద్దీ ఆమె తనకూతురు సంధ్యారాణే నన్న నమ్మకం కలుగుతోంది. మిగతా రాత్రంతా నిద్రపట్టలేదు మాధవరావుకి. తనింట్లో ఉన్న అమ్మాయిని బెదిరిస్తే అసలు సంగతి బయటపడుతుంది.

లేచి తన బెడ్ పక్కనే ఉన్న బెల్ నొక్కాడు.

గార్డు ఒకడు పరుగుతో వచ్చాడు.

"ఏమిటి సార్?"

"పద - అంటూ అతనితో పాటు స్మిత గడివేపు నడవసాగాడు.

## 20

భవానీ శంకర్ లేచి గదిలోంచి బయటికొచ్చాడు. రాజయ్యా శంకర్, కన్నారావు ముగ్గురూ అతనిని వెంబడించారు. అతనెక్కడికి వెళ్ళినా ఆ ముగ్గురూ తనని నీడలా వెన్నంటి కనిపెడుతుండాలని భవానీ శంకర్ వాళ్ళకు అదేశాలిచ్చాడు.

ఫోటో స్టూడియో లో విక్రమర్కారావు ఆనందంగా సినిమా పాట పాడుకుంటున్నాడు.

"గుడ్ ఈవెనింగ్ సర్!" అన్నాడు భవానీ శంకర్ ని చూడగానే హుషారుగా.

"నీ అమితోత్సాహానికి కారణమేమిటి ఫ్రెండ్! స్టూడియోకి ఒకరికి తెలీకుండా ఒకరు బాంకు లోన్స్ ఇచ్చారా?"

"నాలుగు బ్యాంకులు లోన్స్ ఎప్పుడో ఇచ్చేసినాయ్ సార్! అదికాదు నన్ను టి.వి. ఆడిషన్స్ ఆర్టిస్టుగా సెలెక్టు చేసుకున్నారు సార్."

"అదేమిటి కామ్రేడ్! నువ్వు కేవలం రైటర్ వె కదా?"

"టి.వి. వాళ్ళకలాంటి వేమీ లేవు సార్ తెలిసిన వాళ్ళంతా ఎవర్నయినా లాగించేస్తారు -"

భవానీ శంకర్ కూర్చుని ఫోను అందుకున్నాడు. రింగ్ చేస్తూనే రిసీవర్ ఎత్తారెవరో.

"హలో" అంది తియ్యని గొంతు.

"హలో నేనోసారి కామ్రేడ్ సిద్దార్ధరావుతో మాట్లాడచ్చా ఫ్రెండ్?"

"మీరెవరు?"

"నా పేరు భవానీ శంకర్ డియర్!"

"వన్ మినిట్-"

కొద్ది క్షణాల తర్వాత తిరిగి ఆమె గొంతు వినిపించింది.

"హలో ! లైన్లో ఉండండి!"

భవానీ శంకర్ వెయిట్ చేయసాగాడు.

రెండు నిమిషాల తర్వాత సిద్దార్ధరావు గొంతు వినిపించింది.

"హలో!"

"హలో కామ్రేడ్! కిందటి సారి మనం కలుసుకున్నప్పుడు ఆ అడ్రస్ బుక్ కోసం గుండాలను మా యింటి మీదకు పంపిస్తానని ప్రామిస్ చేశావు కదా! మరి నీ మాట నిలబెట్టుకోలేదెం బ్రదర్ - నేనిక్కడ అనవసరంగా మీ వాళ్ళ కోసం అని ఏర్పాట్లూ చేసి వుంచాను - కామ్రేడ్!"

సిద్దార్ధరావు కోపంతో రోప్పటం వినిపించింది భవానీ శంకర్ కి.

"తొందరపడక - వస్తున్నారు - నీ పొగరణుస్తారు " అన్నాడు ఆవేశంగా.

"ఓ.కే. కామ్రేడ్! త్వరగా పంపించు. అన్నట్లు నేనిప్పుడు నా రూమ్ లోనే వుంటున్నాను. చెంజాఫ్ అడ్రస్ గురించి నీకు చెప్పటం మంచిదని ఫోన్ చేస్తున్నాను."

"హు!" అంటూ డిస్ కనెక్ట్ చేశాడతను.

రూమ్ కి తిరిగి వచ్చేశాడతను.

రాజయ్య వెనుకే వచ్చాడు లోపలకు.

"ఏమయినా పని వుందా సార్ యిప్పుడు?"

"లేకపోవటమేమిటి రాజయ్యా! ఇవాళ రాత్రికే కొంతమంది అతిధులు మన గదికి రాబోతున్నారు. వాళ్ళందరికీ అతిధి మర్యాదలు సక్రమంగా చేయకపోతే మనకే ప్రమాదం . కనుక మన వాళ్ళందరినీ పిలువు. అందరి దగ్గర రకరకాల అయుధాలుండాలి."

రాజయ్య ముఖం వికసించింది.

"అలాగే సార్ మా ఆడాళ్ళు ఇలాంటి యుద్దాలు చేసి చాలా కాలమై పోయింది సార్! మళ్ళీ యింత కాలానికి ఛాన్స్ వచ్చింది -" అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు.

భవానీ శంకర్ టేబుల్ దగ్గర కూర్చుని ఓ తెల్ల కాగితం తీసుకుని పెన్సిల్ తో ప్లాన్ తయారు చేయసాగాడు.

కొద్దిసేపటి తర్వాత మాధవరావు వుంటున్నవీధి ప్లాన్ అంతా గీయగాలిగాడు ఆ కాగితం మీద.

ఆ ప్లాన్ ని ముందు పెట్టుకుని ఎన్ని రకాలుగా ఆలోచించినా స్మితరాణిని ఎలా తీసుకురావాలీ అనేది తెలీటంలేదతనికి. మాధవరావు ఇల్లు చాలా విశాలమైన ఆవరణలో ఉండటం వలన ఎటు వేపు నుంచయినా ఆ గార్డ్స్ కంట పడకుండా లోపలికి చేరుకోవటం అసాధ్యం.

సిద్దార్థరావు మీద భయంతో ఇప్పుడు ఇంటి చుట్టూ కూడా గార్డ్స్ చాలా మందిని ఏర్పాటు చేశాడతను.

తీవ్రంగా ఆలోచిస్తుంటే టైమెంత గడిచిపోయిందో కూడా తెలియలేదతనికి.

అప్పుడు వినిపించింది తలుపు తట్టిన శబ్దం.

చటుక్కున లేచి వెళ్ళి తలుపు తెరిచాడు. లావుపాటి వ్యక్తీ, సన్నటి వ్యక్తీ చొరవగా లోపలికొచ్చారు.

"ఇంకేవో చచ్చు ప్లాన్స్ వేస్తున్నట్లున్నాడు గురూ వీడు. కాగితం మీద ఇళ్ళ బొమ్మలున్నాయి చూడు" అన్నాడు లావుపాటి వ్యక్తీ.

సన్నటి వ్యక్తీ టేబుల్ దగ్గరకు నడిచి ఆ ప్లాను కాగితం అందుకున్నాడు.

"వీడు డ్రాయింగ్ మాస్టర్ గా వెళితే బాగా షైనయి పోయేవాడు ఖర్మకాలి మన లైన్ లో కొచ్చాడు" అన్నాడు హేళనగా.

భవానీ శంకర్ కల్పించుకున్నాడు.

"ఖర్మ మనది కాదు కామ్రేడ్ మీది. మీ ఖర్మకాలి ఈ లైన్ లో కొచ్చారు."

సన్న వ్యక్తీ లావు వ్యక్తీ వేపు చూశాడు.

"చూశావా గురూ! ఎంత స్మార్ట్ గా మాట్లాడుతున్నాడో"

"ఎప్పటికప్పుడు మనం వదిలేయటం వల్ల కొంచెం ఓవర్ స్మార్ట్ అయ్యాడు."

"ఏయ్ ఎదా పుస్తకం?" లావుపాటి వ్యక్తీ హటాత్తుగా భవానీ శంకర్ సమీపంగా వచ్చేశాడు.

"మర్యాదగా వచ్చిన దారినే వెళ్ళిపొండి కామ్రేడ్! అనవసరంగా టైం వేస్ట్ చేసుకోకండి! టైం ఈజ్ మనీ అన్న సూత్రాన్ని నమ్ముకోండి తిరుగుండదు-"

సన్న వ్యక్తీ రివాల్వర్ తీశాడు.

"నువ్విలా వెర్రివేశాలేస్తావని బాస్ ముందే చెప్పాడు. అంతేకాదు - ఇన్ స్టాల్ మెంట్ పద్ధతిలో నీ ఒక్కొక్క అవయవాన్నీ పని చేయకుండా చూడమని కూడా చెప్పాడు. అంచేత ప్రస్తుతానికి నీ ఎడమచేయి తీసేద్దాం" అంటూ ట్రిగ్గర్ నొక్కబోయాడు.

ఆఖరి క్షణంలో కనుక్కున కిటికీలోంచి వచ్చి అతని భుజంలో దిగింది కత్తి. నిశ్చేష్టుడై వెనక్కు తిరిగి చూశాడతను.

గది చుట్టూ బయటా , లోపలా జనం నిలబడి వున్నారు. అందరి చేతులలోనూ కర్రలు, కత్తులు, గొడ్డళ్ళు వున్నాయి!

ఇద్దరి ముఖాలు మాదిపోయినాయ్.

అంతకుముందు హేళనగా మాట్లాడిన వాళ్ళకు భయంతో గొంతు పెగలటం లేదు.

సన్నటి వ్యక్తీ సడెన్ గా విజిల్ నోట్లో పెట్టుకుని బిగ్గరగా ఊదసాగాడు.

ఎంతసేపు ఊదినా ఎవరూ రాకపోయేసరికి అందరూ విరగబడి నవ్వసాగారు.

రాజయ్య నవ్వాపి లావుపాటి వ్యక్తి దగ్గరకొచ్చాడు.

"ఏయ్ - నువ్వు బయట కాపలా పెట్టుకున్న వాళ్ళందరినీ లారీలో పడేసి మీ ఇంటికి పంపించివేశాము కనుక ఊదటం ఆపేయ్."

సన్నటి వ్యక్తి తన భుజానికున్న కత్తి లాగేసరికి రక్తం ధారగా కారా సాగింది.

"ఇంకా వెధవ ఫోజులు పెట్టి నిలబడకు! తిన్నగా హాస్పిటల్ వెళ్ళు. లేకపోతే దారిలోనే చస్తావు" అన్నాడు కన్నారావు."

అందరూ మళ్ళీ నవ్వారు.

"కమాన్ కామ్రేడ్స్! త్వరగా కాళ్ళకు బుద్ధి చెప్పండి. లేకపోతే పరిస్థితులు విషమిస్తాయి. మీ బాస్ కి ఇక్కడి విశేషాలు చెప్పి ఇంకో సారిక్కడికిలా ఎవరినీ పంపవద్దని వార్నింగివ్వండి."

ఇద్దరూ బయటకు నడిచారు వడివడిగా.

భవానీ శంకర్ అందరి వంకా ఆప్యాయంగా చూశాడు.

"ఒండర్ ఫుల్  యూనిటీ కామ్రేడ్స్! దెబ్బతిన్న త్రాచుల్లా సిద్దార్థారావు మనుషులు మళ్ళీ మనమీదకు దండెత్తే అవకాశాలు చాలా హెచ్చుగా వున్నాయి. అంచేత రాత్రింబవళ్ళు కొంతమంది మన ఏరియాని కాపలా కాస్తూ వుండాలి!"

"అలాగే సార్"

అందరూ వెళ్ళిపోయాక భవానీ శంకర్ మళ్ళీ ప్లాన్ కాగితం ముందు పెట్టుకుని కూర్చున్నాడు.

రాత్రి పదకొండవుతుండగా మళ్ళీ తలుపు మీద సన్నగా తట్టిన శబ్దం వినిపించింది. ఎందుకయినా మంచిదని ఇనుపరాడ్ తీసుకుని తలుపు పక్కనే నిలబడి తలుపు తెరచాడతను. నిశ్శబ్దంగా , నెమ్మదిగా లోపలికి వచ్చింది ఓ యువతి.

భవానీ శంకర్ ఆశ్చర్యంగా తలుపు చాటునుంచి ముందుకొచ్చాడు.

ఆమె చటుక్కున వెనక్కు తిరిగి అతనిని చూసింది.

భవానీ శంకర్ ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"హలో స్మితా మీరా!" అన్నాడు నమ్మలేనట్లు.

ఆమె చిన్నగా నవ్వింది.

"నేనే!"

"ఎలా తప్పించుకు వచ్చాను అక్కడనుంచి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అందరూ నిద్రపోతున్నారు. వేనుకవేపు నుంచి గోడదూకి వచ్చేశాను."

"ఒండర్ ఫుల్ కామ్రేడ్! సెన్సేషనల్ ఎడ్వెంచర్ ! నేను ఇంకా తల పగలగొట్టుకుంటున్నాను మిమ్మల్నెలా తీసుకురావాలా అని."

ఆమె కుర్చీ మీద కూర్చుని రూమంతా కలియజూసింది.

"ఓహో! మా నివాసానికి మీరిదే మొదటిసారి కదూ అడుగు పెట్టడము? సారీ కామ్రేడ్! అర్ధరాత్రయిపోయింది. లేకపోతే పెద్ద ఎత్తున స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేసేవాడిని."

"థాంక్యూ."

"అన్నట్లు మీరు అక్కడి విశేషాలు త్వరగా చెప్పండి కామ్రేడ్! మీకేమీ ఇబ్బంది కలగలేదు కదా అక్కడ? మీరు సంధ్యారాణి కాదని ఎవరికయినా అనుమానం కలిగిందా?"

"అలాంటిదేమీ లేదు. అందరూ నేనే సంధ్యారాణిని అనుకుంటున్నారు."

"డ్రగ్స్ గురించి వివరాలేమిటి కామ్రేడ్? దాని తాలూకు గోడౌన్ లాంటిది ఎక్కడయినా ఉన్నట్లు తెలిసిందా?" ఆత్రుతగా అడిగాడతను.

"ఊహు! అదేమీ తెలీలేదు - నేనూ తెలుసుకోడానికి ఎక్కువ ప్రయత్నం చేయలేదు. ఎవరికయినా అనుమానం వస్తుందేమోనని."

"ఏం ఫర్లేదు కామ్రేడ్! సమయానికి ముఖ్యమైన వివరాలు అఖిలభాను ద్వారా పంపించటం ఎంతో మంచిదయిపోయింది. ఇప్పుడు చూడండి. ఆ మాధవరావు, సిద్దార్ధలను ఒకాట ఆడిస్తారు."

ఆమె అలసటగా నవ్వింది.

"నాకు నిద్రొస్తుంది. వెళ్ళిన దగ్గర్నుంచి కంటినిండా నిద్రలేదు" అంది కళ్ళు మూతలు పడుతుండగా.

"ఒసారీ కామ్రేడ్! ఒక్క నిమిషంలో మీకు పక్క ఏర్పాటు చేస్తాను సరేనా" అంటూ గదిలో ఓ మూలకు చాప పరచి దానిమీద తలగడా దుప్పటీ వేశారు. తరువాత టేబుల్ ఫాన్ తెచ్చి దూరంగా పెట్టి స్విచ్ అన్ చేశాడు.

"ఆ! ఇప్పుడు పడుకోండి. మిగతా విషయాలు వచ్చే సంచికలో గుడ్ నైట్!"

ఆమె పక్కమీదకు వరిగిపోయింది.

"మరి మీరు?"

"నేనా? ఈ గోడ పక్కన లాగించేస్తాను ఫ్రెండ్."

ఆమె అలసటగా కళ్ళు మూసుకుంది.

భవానీ శంకర్ అందమైన ఆమె ముఖం వంకే తన్మయత్వంతో చూస్తూ కూర్చుండిపోయాడు. ఆమె అంత ధైర్యంగా మధవరావు ఇల్లు లాంటి కంచుకోట నుంచి తప్పించుకు వచ్చిందంటే ఇంకా నమ్మబుద్ధి కావటం లేదు.

అదీ తిన్నగా తన దగ్గరకు రావటం . అతని ఆలోచనలకు బ్రేక్ పడింది.

హటాత్తుగా గుర్తుకొచ్చిందతనికి.

అవును - ఆమెకు తన గది ఎలా తెలుసు? ఎప్పుడూ తన గదికి రాలేదే? ఇంతా రాత్రివేళ గది ఎలా కనుక్కోగలిగింది?

అదీగాక ఆమె అఖిలభాను ఇంటికి వెళ్ళాలి గానీ తన దగ్గర కెందుకొచ్చినట్లు? తులసి కూడా అఖిలభాను దగ్గరే వుందని ఆమెకు తెలుసు.

అసలు వచ్చిన దగ్గర్నుంచి తులసీ సంగతి గానీ అఖిలభాను సంగతి గానీ అడగలేదేమేటి?

అతనికి నవ్వు వచ్చింది.

తను మరీ అతిగా ఆలోచిస్తున్నాడు.

బహుశా తులసి ద్వారా తన గది అడ్రస్ కనుక్కొని వుండుంటుంది అదీ వరకే - అయినా అంతగా అలసిపోయినమ్మాయి అందరి గురించి అడగటం, ఆలోచించటం , అసంభవం.

టైమ్ రెండవుతోంది.

గాడ నిద్రలో వుంది స్మిత.

భవానీ శంకర్ కి నిద్ర అవహించేస్తోంది. లేచి కిటికీలో నుంచి ఈసారి చూశాడు. బయట దూరంగా రాజయ్య అతని మనుషులు కాపలా తిరుగుతూనే వున్నారు.

భవానీ శంకర్ ని చూసి కిటికీ దగ్గరకొచ్చాడు రాజయ్య.

"ఆ అమ్మాయెవరో మీ గదివేపు వస్తూంటే చూశాం గానీ ఆడపిల్లే గదా ప్రమాదేమేమీ ఉండదని వదిలేశాం సార్" ఎవరా అమ్మాయ్?"

"మన స్టూడెంట్ తులసి వాళ్ళ పిన్నే రాజయ్యా! ఇప్పుడే పులి నోట్లో నుంచి బయటపడి మనింటికొచ్చింది."

రాజయ్య వెళ్ళిపోయాడు మళ్ళీ.

భవానీ శంకర్ మరో దుప్పటి తీసుకుని మరో మూల పరచుకుని పడుకున్నాడు. వెంటనే నిద్ర పట్టేసిందతనికి.

ఏదో చప్పుడయి చటుక్కున మెలకువ వచ్చేసరికి లేచి కూర్చున్నాడు ఒక్క ఉదుటున.

గదంతా అంధకారంతో నిండిపోయి వుంది.

కన్ను పోడుకుకున్నా ఏమీ కనిపించటం లేదు. గదిలో ఓ మూలగా ఏదో కదులుతున్న చప్పుడు , తన టేబుల్ మీద ఎవరివో చేతులు పాకుతున్న శబ్దం.

ఊపిరి బిగపట్టి కళ్ళు నులుముకుని మళ్ళీ జాగ్రత్తగా చూశాడతను.

నీడలా మసగ్గా కనబడుతోందో మనిషి ఆకారం.

హటాత్తుగా చిన్న టార్చిలైట్ వెలిగించి టేబుల్ మీద యేదో వస్తువు కోసం వెతుకుతోందా ఆకారం పుస్తకాలల్లోనూ, టేబుల్ సొరుగుల్లోనూ.

భవానీ శంకర్ నెమ్మదిగా కదిలాడు.

ఒక్కసారిగా ఆ అక్కరాన్ని తను వెనుక నుంచి పట్టుకుంటే ఆ ఆకారం కదలటానికి వీలులేకుండా బంధించవచ్చు. తర్వాత అవసరమైతే గట్టిగా ఓ కేక వేశాడంటే రాజయ్య పరుగెత్తుకు వస్తాడు.

అతి జాగ్రత్తగా , నిశ్శబ్దంగా అడుగులో అడుగువేస్తూ ఆ ఆకారం వెనుకకు చేరుకున్నడతను. ఆ ఆకారం ఇప్పుడు టేబుల్ వదిలి గది అంతా టార్చ్ లైట్ వెలుగులో వెతుకుతోంది.

బాగా సమీపంగా వచ్చేశాక హటాత్తుగా వెనుక నుంచి బలంగా చేతులు వేసి బంధించాడు భవానీ శంకర్.

కెవ్వున అరిచిందా ఆకారం.

ఆ గొంతు వింటూనే ఉలిక్కిపడ్డాడతను. మెత్తగా దూదినా తగుతోన్న స్పర్శ.

ఆమె స్త్రీ -

ఆమెను అమాంతం వదిలేసి లైటు స్విచ్ వేశాడు.

ఎదురుగా భయంతో నిలబడి వుంది స్మిత.

"మీరా?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగాడతను.

"అబ్బ! ఇంకెవరో అనుకుని భయపదిపోయాను" అంది స్మిత కూడా కూడదీసుకుంటూ.

"ఏమిటి - చీకట్లో వెతుకుతున్నారు ?" అడిగాడతను.

"మంచినీళ్ళు! బాగా దాహం వేసింది. గదంతా చీకటి, లైటు స్విచ్ కనిపించలేదు - అందుకని టార్చిలైటుతో

వెతుకుతున్నాను."

"చంపేశారు! నన్ను పిలిస్తే నేను లేచి ఇచ్చేవాడిని కదా! నేనింకా ఎవరో మళ్ళీ మనల్ని ఎటాక్ చేయటానికి వచ్చారేమో అని భయపడ్డాను. అవిగో! ఆ మూల కూజాలో ఉన్నాయ్ మంచినీళ్ళు, తాగండి!"

ఆమె కూజా దగ్గర కెళ్ళి మంచినీళ్ళు తాగి ఓసారి కిటికీ వేపు చూసి మళ్ళా కెవ్వున అరచింది. భవానీశంకర్ అదిరిపడి తనూ వెనక్కు తిరిగి చూశాడు.

రాజయ్య అతని అనుచరులు అందరూ కిటికీల్లోంచి విచిత్రంగా చూస్తున్నారు.

"అమ్మాయిగారి కేక వినబడి వచ్చేశాము సార్" అన్నాడు రాజయ్య.

భవానీ శంకర్ నవ్వేశాడు.

"మరేం లేదు రాజయ్యా! కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనీ షేక్స్ పియర్ అనే పెద్ద మనిషి రాశాడు. దాని తాలూకు విజువల్స్ జరుగుతున్నాయ్. ఇక వెళ్లి పడుకోండి! తెల్లారిపోతోంది కదా."

అందరూ వెళ్ళిపోయారు.

"ఇంక పడుకోండి" అన్నాడతను.

స్మితారాణి మళ్ళీ తన పక్కమీద పడుకుంది.

భవానీ శంకర్ లైటు తీసేశాడు. మళ్ళీ నిద్రపడుతుండగా అతని మెడ చుట్టూ ఏదో పాకినట్లనిపించి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

వెచ్చగా ముఖం మీద తగులుతోంది ఊపిరి. గాజులు గలగల తన మెడ చుట్టూ అలుముకుంటున్నాయ్.

భవానీ శంకర్ మెదడు మొద్దుబారిపోయింది. ఏం జరుగుతుందో తెలీటం లేదు. మరికొద్ది క్షణాల్లో మెత్తని ఆమె స్పర్శ తన శరీరాన్నంతా తాకుతూ మరింత వేడి కలిఫిస్తోంది.

"స్మితా!" అతి కష్టం మీద పిలిచాడతను.

"నన్ను కౌగలించుకోండి! ప్లీజ్" రహస్యంగా మత్తుగా అంటోందమె గొంతు!

భవానీ శంకర్ విస్తుపోతున్నాడు. స్మిత ఇలా ప్రవర్తిస్తోందంటే నమ్మబుద్ధి కావటం లేదు.

అతని ప్రయత్నమేమీ లేకుండానే అతనికి చుట్టుకుపోతోంది. భవానీశంకర్ కి మతిపోతోంది. మనసు, శరీరం పోటీపడి ముందుకి దూకుతున్నాయి. స్వాదీనం తప్పుతున్నాయి. కోరిక గెలిచేస్తోంది.

ఆమె పెదాలు అతని పెదాలను అందుకున్నాయి.

"హలో కామ్రేడ్! ఇది ఇద్దరికీ మంచిది కాదు కామ్రేడ్" పూర్తిగా అతని శిరస్సుని తన గుండెకు హత్తుకుందామె.

భవానీ శంకర్ నోటమాట కూడా రావటం లేదు.

అంతా తనకు ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నట్లుంది. అతి కష్టం మీద దూరంగా జరిగాడతను.

ఆమె అతని పక్క నుంచి లేచి కూర్చుంది.

"అడగటం మర్చిపోయాను . అడ్రస్ బుక్ జాగ్రత్తగా దాచారా" మాధవరావు వాళ్ళు ఏ క్షణానయినా దానికోసం ఇక్కడికొచ్చే అవకాశం వుంది" అందామె.

భవానీ శంకర్ ఆశ్చర్యపోయాడు. ఇంత హటాత్తుగా ఆమె ఆ సబ్జెక్టు తేవటం వింతగా అనిపించిందతనికి.

"అది చాలా భద్రంగా దాచాను. కనుక్కోవటం ఎవరివల్లా కాదు" నవ్వుతూ అన్నాడతను.

"ఎక్కడ దాచారు?" కుతూహలంగా అడిగిందామె.

భవానీ శంకర్ కి ఆశ్చర్యం పెరిగిపోయింది.

"మన స్టూడెంట్ దగ్గర."

"ఎవర స్టూడెంట్?"

"నీకు తెలీదు. ఆ పిల్ల పేరు సుశీల."

"ఓ!" ఆమె గొంతులో నిరుత్సాహం కనిపించింది.

"నేనిలా మీతో చనువుగా ప్రవర్తిస్తున్నానని మీకు ఆశ్చర్యంగా వుంది కదూ?" సిగ్గుపడుతూ అడిగిందామె.

"ఆశ్చర్యమేమిటి కామ్రేడ్! స్పృహతప్పే పరిస్థితిలో వున్నాను."

"ఏమిటో సడెన్ గా మీలో ఇక్యం అయిపోవాలనిపించింది" తలదించుకునే మాట్లాడింది.

"ఆ కోరిక కొంచెం పోస్టుఫోన్ చేసేయ్ కామ్రేడ్! మంచిరోజులు మరెంతో దూరంలో లేవు. అతి సమీపంగా వచ్చేసినాయ్. ఈ వ్యవహారం ముగిసిపోగానే మంగళం పాడేయటం , అప్పుడు సరికొత్త జీవితం సరికొత్త సెట్టింగులు ప్రారంభించటం."

దూరంగా గుళ్ళో సుప్రభాతం రికార్డులు వినిపించటం ప్రారంభమయింది."

"చూశారా కామ్రేడ్! తథాస్తు! అందుకే సుప్రభాతం కూడా మొదలయింది. శుభసూచకంగా. నాకింకా నమ్మబుద్ధికావటం లేదు. మీరింత త్వరగా దగ్గరయ్యారంటే."

"అంకుల్ - " కిటికీలో నుంచి ఓ పాప పిలవటం వినిపించింది.

"యస్ , మైడియర్ స్టూడెంట్!"

"మమ్మీ కాఫీ పంపించింది.'

భవానీ శంకర్ తలుపు తెరచి ఫ్లాస్కు అందుకున్నాడు.

"థాంక్ యూ మైడియర్ చైల్డ్! మీ నాన్న రాజయ్యకు గవర్నర్ పదవి రాగాక!"

స్మిత నవ్వేసింది.

"అదేమిటి గవర్నర్ పదవి అంత తేలికా!"

"అవును కామ్రేడ్! మీక్కావాలా చెప్పండి. కాంగ్రెస్ లో చేరితే చాలు! అయిదు నిముషాలలో గవర్నరు పోస్టూ వేయించుకోవచ్చు -"

భవానీ శంకర్ లేచి ఇద్దరికీ కప్పుల్లో కాఫీపోసి ఇచ్చాడు.

"మీరింక త్వరగా రడీ అయితే మనం కామ్రేడ్ ఆర్కే శ్యామ్ ఇంటికెళ్ళాలి స్మితాజీ! మిమ్మల్ని చూస్తేనే గానీ అఖిలభాను వదినమ్మకి మనసు కుదుటపడదు . లేకపోతే నన్ను నెంబర్ వన్ విలన్ లాగా చూస్తున్నారు నిన్నటి నుంచీ--"

"ఓ! ఇప్పుడే రడీ అవుతాను - కానీ ఓ షరతు."

"షరతా? ఈ నవల్లో షరతులెలా ఉంటాయి కామ్రేడ్? ఇది కేవలం క్రైం కదా?"

"మరేం లేదు - అక్కడ కాసేపున్నాక మళ్ళీ మీతో ఇక్కడికొచ్చేస్తాను - ఇక్కడే మీతోనే ఉంటాను --"

భవానీ శంకర్ కి మతిపోయినట్లయింది.

"న దగ్గరుంటారా?"

ఆమె తలవంచుకుంది. "అవును! ఈ రెండురోజుల్లో ఎందుకో మీరే నా కళ్ళల్లో ఉన్నారు. ఇంతగా మిమ్మల్ని ప్రేమించానన్న విషయం మీరు దూరంగా ఉన్నప్పుడు గానీ తెలీలేదు."

"కానీ స్మితాజీ - ఇలా ఉండటం ఏ రకంగా ఆలోచించినా అంత మంచిదిగా నాకనిపించటం లేదు. ఒక పక్క మన మీద దాడులు జరుగుతున్నాయి. మరోపక్క అఖిలభాను వాళ్ళుండగా మనిద్దరం కలిసి ఒకే గదిలో గడపటం - అందరికీ ఇబ్బందికరంగా ఉంటుదని నా అభిప్రాయం."

ఆమె కోపంతో మూతి ముడుచుకుంది.

"అదిగాక తులసి కూడా మీతో ఇక్కడికే వచ్చేస్తానని పట్టుపడుతుంది కదా-"

స్మిత అయోమయంగా చూసిందతనివంక - "తులసా?" అడిగింది భయపడుతూ -

"అవును! తులసిని ఈ రెండ్రోజులలోనే మర్చిపోయారా ఏమిటి? ఆహా అక్క మీద ఎంత ప్రేమరా దేవుడా?" నవ్వుతూ అన్నాడతను.

స్మిత చప్పున తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించింది .

"ఓ -మీరనేది మా అక్క తులసి గురించా? అబ్బే ఆమెను మర్చిపోవటమేమిటి? ఏదో ఆలోచిస్తూ అడిగానలా"

భవానీ శంకర్ నివ్వెరపోయాడు.

ఆమె మాటలు, ప్రవర్తన అతనికి అనుమానం కలిగించసాగినాయ్.....

"ఒకే కామ్రేడ్! గెట్ రెడీ" అంటూ తను లేచి బాత్ రూమ్ వేపు పరుగెత్తాడు. స్నానం చేస్తున్న అతని ఆలోచనలు ఆగటం లేదు.

స్మితకేమైనా మతిస్తితిమితం తప్పిందా? లేకపోతే అలా ఎందుకు మాట్లాడుతున్నట్లు?

తులసి తన అక్క అటుందేమిటి? ఒకవేళ ఆ మాధవరావుగారేమైనా బ్రెయిన్ వాష్ చేయించాడా?

వెంటనే శ్యామ్ ఇంటికెళితే గానీ తన ప్రశ్నలకు సమాధానం దొరకదు. అఖిలభాను ఆమెతో మాట్లాడితే మరికొంత వివరం దొరకవచ్చు --

మరి కాసేపట్లో ఇద్దరూ ఆటోలో శ్యామ్ ఇల్లు చేరుకున్నారు.

స్మితను చూడగానే అఖిలభాను ముఖం ఆనందంతో వికసించింది. తులసి పరుగుతో వచ్చి స్మితను చుట్టేసింది ఆప్యాయంగా.

"ఎలా వచ్చేశావు జైలునుంచి? భవానీ తీసుకొచ్చావా?" అడిగింది అఖిలభాను.

"ఊహు! నేనే తప్పించుకొని పారిపోయి వచ్చేశాను."

"మైగాడ్! అంత ధైర్యం ఎలా వచ్చింది నీకు?"

"ప్రెజర్ ఎక్కువైతే పిల్లి కూడా ఎదురు తిరుగుతుంది" నవ్వేస్తూ అందామె.

అందరూ కూర్చున్నారు కుర్చీలలో.

"అక్కడ నీమీద ఎవరికీ అనుమానం రాలేదా?" అడిగాడు శ్యామ్.

"ఊహూ ! ఎంత బాగా ఏక్షన్ చేశానంటే ఇంతకూడా ఎవరికీ అనుమానం రాలేదు."

తులసి తన భుజం మీద వేసిన స్మిత చేయి వంకే పరీక్షగా చూసింది.

"అవునూ - మర్చిపోయాను మా అక్కేదీ?" హటాత్తుగా గుర్తుతెచ్చుకుంటూ అడిగిందామె.

ఆ ప్రశ్నకు అందరూ ఆశ్చర్యపోయారు.

"మీ అక్కా?" నమ్మలేనట్లు అడిగింది అఖిలభాను.

"అదే! మా అక్క తులసి......." కొంచెం తడబడుతూ చెప్పిందామె.

మరోసారి అందరూ మొఖాలు చూసుకున్నారు.

హటాత్తుగా తులసి లేచి నిలబడింది.

"పిన్నీ - నీ చేతిమీద పుట్టుమచ్చ వుండాలిగా ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగింది.

ఆ ప్రశ్నతో అందరి దృష్టి స్మిత చేతిమీదకు మళ్ళినాయ్. ఆమె ముంజేతి మీద పెద్ద పుట్టుమచ్చ వుండటం అందరికీ తెలుసు.

స్మిత ముఖంలో కంగారు కనిపించింది.

అక్కడేమీ లేకపోవటం చూసేసరికి భవానీ శంకర్ కి అనుమానం ఎక్కువయిపోయింది. శ్యాం వేపూ, అఖిలభాను వేపూ చూసి సైగ చేశాడు అతను.

"అల్ రైట్ కామ్రేడ్! కుశల ప్రశ్నలు తరువాత - ముందు మాకు కొంచెం కాఫీ లాంటి ద్రావకం ఏదయినా సరఫరా చేస్తే ఈ షాక్ ల పర్వం నుంచి కోలుకుంటాము."

అఖిలభాను లోపలికెళ్ళిపోయింది.

భవానీ శంకర్ మంచం మీద వరిగిపోయాడు. తులసి అతని పక్కనే చేరింది.

"మళ్ళీ ఎవరైనా విలన్స్ వచ్చారా అంకుల్?" అడిగిందామె.

"రాకపోవడమేమిటి కామ్రేడ్ ! రాత్రంతా భీషణ సంగ్రామం .........వాళ్ళంతా ఓ పక్కా - నేనూ , మన రాజయ్యా, కన్నారావ్, వాళ్ళంతా మరో పక్క" మాటాడటం ఆపి స్మిత కోసం చూసాడు భవానీ శంకర్.

ఆమె ఎక్కడా కనిపించలేదు.

"స్మితా" అంటూ లోపలి గదిలోకి పరుగెత్తాడతను.

శ్యామ్ అఖిలభాను ఆశ్చర్యంగా వచ్చేశారక్కడికి.

"స్మిత హాల్లోనే వుండాలి గదా?" అడిగాడు శ్యామ్.

"అదే నేనూ చూస్తున్నాను, వన్ మినిట్" అంటూ చెప్పులేసుకుని రోడ్ మీదకు పరుగెత్తాడతను.

అప్పటికే ఆమె సందు చివరలో అటో ఎక్కుతూ కనిపించింది.

శరవేగంతో పరుగెత్తాడతను.

కానీ అటో కనుమరుగైపోయింది.

అతనికి అర్థమయిపోయింది. ఆమె స్మితారాణి కాదు - సంధ్యారాణి మధవరావు తనాడిన నాటకం తెల్చుకుని అదే నాటకం ఇప్పుడు తనమీద ప్రయోగించాడు . స్మిత పేరుతొ సంధ్యారాణిని ఆ అడ్రస్ బుక్ కోసం పంపించాడు.

అందుకే ఆమె అర్ధరాత్రి లేచి తన టేబుల్ సొరుగులు వెతుకుతోంది. తను లేచేసరికి మంచినీళ్ళు కావాలని అబద్ధం చెప్పింది.

అందుకే ఆ అడ్రస్ బుక్ ఎక్కడ దాచారని మళ్ళీ అడిగింది.

బహుశా ఇపుడు సుశీల వాళ్ళ పాకదగ్గరికి కెళ్ళి ఆమెను ఆ అడ్రస్ బుక్ యిమ్మని అడుగుతుందేమో!

భవానీ శంకర్ కి నవ్వొచ్చింది.

సుశీల తనకు తప్పితే మరెవరికి ఆ పుస్తకం ఇవ్వదు. అలా తర్ఫీదు ఇచ్చాడు తను.

ఎదురుగా వున్న ఆటోలో కూర్చుని "త్వరగా పోనీ కామ్రేడ్! అవతల గంటకు రెండువందల కిలోమీటర్ల వేగంతో మన కొంపలు మునుగుతున్నాయ్" డ్రయివర్ తో చెప్పాడతను.

శరవేగంతో రెండు యాక్సిడెంట్స్ తప్పించుకుని అతని రూమ్ కి చేరుకుంది ఆటో.

అప్పటికే పాకల్లో అందరూ సంధ్యారాణి చుట్టూ మూగివున్నారు.

"మా సుశీల దగ్గర కొచ్చి నోట్ పుస్తకం అడుగుతోంది సార్! సుశీల భయపడి కేకలేసేసరికి అందరం పరుగుతో వచ్చాం. మాకే తుపాకీ చూపించి పారిపోవాలనుకుంది గానీ మేమిలాంటివి సినిమాలలో చిన్నప్పటి నుంచీ చూస్తున్నాంగా? అందుకని చుట్టుముట్టేశాము" చెప్పాడు రాజయ్యా.

"ఈ కార్యక్రమాన్ని చాలా వండర్ ఫుల్ గా నిర్వహించారు కామ్రేడ్ కీపిటప్ - ఇదే నాంది అనుకోండి - ఇకనుంచీ శరవేగంతో జరుగుతుంటాయ్ కార్యక్రమాలన్నీ. అంచేత రడీగా వుండండి. బైదిబై ఈ చిన్నారినీ మీ ఆడాళ్ళకప్పగించి జాగ్రత్తగా బందీ చేసి ఉంచమనండి. ఏ క్షణంలో నయినా మన కళ్ళల్లో కారంకొట్టి పారిపోగల కెపాసిటీ వుంది."

సంధ్య తలదించుకుంది.

పాకలలోని ఆడాళ్ళు వచ్చి ఆమెను ఓ పాకలోకి తీసుకెళ్ళిపోయారు.

భవానీ శంకర్ త్వరత్వరగా ఫోటో స్టూడియో చేరుకుని సిద్దార్ధరావ్ కి రింగ్ చేశాడు.

అమ్మాయి ఫోన్ అందుకుంది.

"త్వరగా సిద్దార్ధరావుకి కనెక్షనివ్వు కామ్రేడ్! హాస్పిటల్లో చేరిన అతని గాంగ్ మెంబర్స్ పరిస్థితి ఎలా వుందో ఒక్కసారి కనుక్కోవాలి"

సిద్దార్ద రావ్ వెంటనే లైన్ లో కొచ్చాడు.

"హలో" అన్నాడు కోపంగా.

"హలో కామ్రేడ్! ఎలా వున్నారు మీవాళ్ళు? వట్టి గాయాలేనా ఎవరయినా ఎగిరిపోయారా?"

"ఎవరూ చావలేదు."

"ఇంకోసారి వస్తే మాత్రం చావులు తప్పవు బ్రదర్! మా వాళ్ళను అతి కష్టం మీద ఆపాను ఈసారికి. వాళ్ళు ఎప్పుడూ నామాట వింటారన్న నమ్మకం నాకులేదు. అంచేత మళ్ళీ దాడి చేయాలని ప్రయత్నిస్తే చరిత్ర ట్రాజెడీ అయిపోతుంది."

అతను కొద్ది క్షణాలు మాట్లాడలేదు.

"ఇదిగో - సిద్దార్ధరావు అంటే అంత గాజులు తొడుక్కుని కూర్చోలేదు. నేను తలుచుకుంటే నువ్వూ, పాకలవాళ్ళూ అందరూ లేచిపోతారు. అదే జరుగబోతోంది కూడా!"

భవానీ శంకర్ పగలబడి నవ్వాడు.

"వండర్ ఫుల్ జోక్ కామ్రేడ్! బార్ ఒనర్సుకి. గుండా లీడర్సుకి ఇలాంటి సెన్సాఫ్ హ్యూమరు వుండటం చాలా

అరుదు. ఓ.కే. కామ్రేడ్! నీకంత సరదాగా వుంటే ఇక్కడే తేల్చుకుందాం- బైదిబై ఇంకొక్క విషయము చెప్పటం మర్చిపోయాను. నాకు , మాధవరావుకి ఇప్పుడే బేరం కుదిరింది. ఇంకో గంటలో ఆ అడ్రస్ బుక్ ని నాలుగు లక్షల కమ్మేస్తూన్నాను."

సిద్దార్ధరావుకి నోట మాట రాలేదు కొద్ది క్షాణాల పాటు.

"ఇదిగో చూడు భవానీ శంకర్."

"యస్ కామ్రేడ్! హృదయపరివర్తనేమయినా జరిగిందా బ్రదర్?"

"మనం ఓసారి మాట్లాడుకోవటం మంచిది."

"ష్యూర్ కామ్రేడ్! జెనీవాటెక్స్ అన్నమాట- అయితే రేపు ఉదయం టాంక్ బండ్ దగ్గర రన్నింగ్ కెళ్ళినప్పుడు పరిగెడుతూ మాట్లాడుకుందాం."

"రేపు కాదు - ఇప్పుడే ఆ అడ్రస్ బుక్ మాధవరావుకిచ్చే లోగానే మాట్లాడుకోవాలి.నేను ఓ ఆఫర్ ఇవ్వదల్చుకున్నాను -"

"ఇప్పటికి నీ బ్రెయిన్ డెవలప్ అయింది బ్రదర్! చాలా మంచి సూచన ఇది. భవిష్యత్తులో కూడా అది అలాగే పనిచేయాలని ప్రార్ధనలు చేసేస్తాను- బైదిబై నీ ఆఫర్ ఏంటో తెలుసుకోవచ్చా?"

అతను కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఆలోచించాడు.

"మూడు లక్షలు"

భవానీ శంకర్ నవ్వాడు.

"మూడు లక్షలా?" "నెల రోజుల్లో గణితశాస్త్రం నేర్చుకోండి" అనే పుస్తకం వెంటనే కొని ప్రాక్టీస్ చెయ్ సిద్దార్ధరావు ! అవతల నాలుగు లక్షల కాష్ వస్తోంటే మూడు లక్షలంటావావేమిటి?"

"నాలుగు లక్షలు టూ మచ్."

"అని నువ్వనుకుమ్తున్నావ్ కామ్రేడ్! కానీ మాధవరావు అలా అనుకోవటం లేదు."

మరికొద్ది క్షణాలు ఆలోచించడతను.

"అల్ రైట్ - మూడున్నర అంతకంటే ఒక్క పైసా కూడా ఇవ్వలేను. నా దగ్గిరున్న డబ్బంతా కలిపి ఇదే వుంది ప్రస్తుతం-"

"సారీ కామ్రేడ్ ! మనం ఇంక మాట్లాడుకోవటం అనవసరం " ఫోన్ డిస్కనెక్ట్ చేయబోయాడతను. సిద్దార్ధరావు కంగారుగా మాట్లాడాడు.

"హలో- భవానీ శంకర్ ! అల్ రైట్ - మనం మాట్లాడుకుందాం! ఒకసారి ఇక్కడికి రాగలవా?"

"సారీ బ్రదర్! బార్సుకి, రెస్తారెంట్లకి తిరిగే స్టేజి దాటిపోయానిప్పుడు. ఓ పని చేయకూడదూ? రవీంద్రభారతి దగ్గర కల్సుకుందాం.'

"సరే - ఎప్పుడు?"

"ఇప్పుడే మరో పావుగంటలో-"

"ఓ.కే. "

ఫోన్ డిస్ కనెక్టయింది.

త్వరగా రవీంద్రభారతి చేరుకున్నాడు భవానీ శంకర్.

ప్రభుత్వం తాలుకూ ఓ సంస్కృతిక ప్రదర్శనకు ప్రేక్షకులను బ్రతిమాలి పిలుస్తున్నారు నిర్వాహకులు.

మరో అయిదు నిమిషాల తర్వాత సిద్దార్ధరావు వచ్చాడు కారులో.

"హాయ్ కామ్రేడ్ కమాన్. అలా ఆ మెట్టుమీద కూర్చుని మాట్లాడుకుందాం.'

"అక్కర్లేదు ఇక్కడే మాట్లాడదాం!"

"ఓ.కే. మాట్లాడు కామ్రేడ్."

"నీకు నాలుగు లక్షలిచ్చేస్తాను. పుస్తకం నాకిచ్చేయ్."

"ఓ.కే. కామ్రేడ్ - వప్పుకుంటున్నాను . కాష్ డౌన్-"

"ఇస్తాను - కానీ ఇక్కడ కాదు - మా ఇంటి దగ్గర-'

"అదే వద్దు కామ్రేడ్. ఇలాంటి విషయాలు పబ్లిక్ ప్లేసెస్ లో జరగాలి ........"

"అంటే?"

"ఉదాహరణకు మనం రవీంద్రభారతిలో మన కార్యక్రమం నిర్వహించామనుకో - ఎంత గ్లామరస్ గా వుంటుంది. ఫంక్షన్! నీ సూట్ కేస్ డబ్బుతో నాకిస్తావు నేను ఓసారి డబ్బు సరి చూసుకుని బయటికొచ్చి నీ బుక్ నీకిచ్చేస్తాను . ఎలా వుంది?"

సిద్దార్ధరావు మొహం పాలిపోయింది.

"పోలీసు ఆఫీసు ఎదురుగానా ఇలాంటి పనులు?"

"అదేమిటి బ్రదర్! పోలీసులు ఏమీ యాక్షన్ తీసుకోకుండా ఉండాలంటే వాళ్ళ కనుసన్నల్లోనే అన్నీ జరగాలి. ఉదాహరణకి ఓ కానిస్టేబుల్ కళ్ళ కెదురుగా మర్డర్ జరిగిందనుకో! ఏం చేస్తాడు? అతి సమీపంగా వున్న సందులోకి పరుగెత్తికెళ్ళిపోతాడు. ఇంక జన్మలో రోడ్డు మీదకు రాడు మళ్ళీ . కనుక ."

"సరే!" అన్నాడు సిద్దార్ధరావు "ఎన్ని గంటలకు కలుసుకుందాం !"

"రేపు ఉదయం పది గంటలకు."

"ఓ.కే. " అని వెళ్ళిపోబోతూ అగాడతను.

"చూడు! బిజినెస్ అంటే బిజినెస్సే! అక్కడ మళ్ళీ అతి తెలివి చూపించవు కదా!"

"ఆ ప్రశ్న నేనడగాలి కామ్రేడ్! కిందటిసారి మా ఫ్రెండొకడికి ఇలాగే ఎవరో పనికిరాని దొంగనోట్లు ఇచ్చాడు."

"నా దగ్గర దొంగనోట్లే లేవు. ఎప్పుడో అయిపోయినాయ్."

"అయితే సరే."

అతను వెళ్ళిపోయాక భవానీ శంకర్ ఆటోలో మాధవరావు ఇల్లు చేరుకున్నాడు.

అతని పేరు చెప్పగానే లోపలకు పంపించాడు కాపలా వున్న గార్డు.

లోపల సోఫాలో కూర్చుని న్యూస్ పేపరు చదువుతున్నట్లు నటిస్తున్నాడు మాధవరావు . ఆ విషయం అతనిని చూడగానే తెలిసిపోతుంది.

"ఏం కావాలి?" అడిగాడతను.

"ఓవరాక్షన్ వద్దు కామ్రేడ్! ఇప్పటికే తెలుగు ప్రజలు దాంతో నానా చావూ చస్తున్నారు. ఎవరికి ఏం కావాలో మనిద్దరికీ తెల్సు."

"నీకు ఒక్క పైసా కూడా ఇవ్వను. రేపు ఉదయం వరకూ టైమిస్తున్నాను. ఈలోగా ఆ అడ్రస్ బుక్ నాకు చేరకపోయిందంటే మీ స్మితారాణి శవం వస్తుంది మీ ఇంటికి."

భవానీ శంకర్ నవ్వేశాడు.

"మీ రాజకీయ నాయకులందరూ ఇంతే కామ్రేడ్! బ్రెయిన్ పూర్తిగా డెవలప్ అవదు-"

"అతిగా వాగకు" కోపంగా అరిచాడు మాధవరావు.

"లేకపోతే ఏమిటి బ్రదర్! మీ అమ్మాయి సంధ్యారాణి మా బందీగా వుందన్న సంగతి మర్చిపోతున్నావు."

"అది నీ భ్రమ?"

:అంటే!" కలవరపాటుతో అడిగాడతను.

"ఎప్పుడో తప్పించుకుని వచ్చేసింది."

భవానీ శంకర్ కంగారుపడ్డాడు. "అంతా అబద్ధం."

"అబద్ధమో కాదో ఇంటికెళ్ళి చూసుకో! రేపుదయం పదిగంటల కల్లా ఆ పుస్తకం నాకు చేరకపోతే చెప్పిన పని చేసేయటం ఖాయం! జాగ్రత్త. ఇంకవేళ్ళు--

భవానీ శంకర్ మెదడు మొద్దుబారిపోయింది.

నిజంగానే సంధ్యారాణిని ఎత్తుకు పోయారా వీళ్ళు. అదే జరిగి వుంటే రాజయ్యనూ, మిగతా వాళ్ళను కూడా మాధవరావు మనుషులు గాయపరిచి వుండాలి.

"ఒకే కామ్రేడ్! మిగతా విషయాలు ఫోన్ లో మాట్లాడుతాను ..........." అంటూ త్వరత్వరగా బయటకు నడిచాడు.

ఇంటికి చేరుకునే సరికి అందరూ విచారంగా కనిపించారు.

"ఏం జరిగింది రాజయ్యా?" ఆత్రుతగా అడిగాడు.

"మా వల్ల తప్పు జరిగిపోయింది సార్!"

"ఏమయింది?"

"ఆ అమ్మాయి తప్పించుకుని పారిపోయింది-"

"మరి మీరేం చేస్తున్నారు?"

"అందరం- అడా మగ కూడా మీరిచ్చిన డబ్బుతో తాగాం సార్."

భవానీ శంకర్ కి కోపం ఆగలేదు.

"రాజయ్యా! మీ జీవితాన్ని ఎవరూ బాగుచేయలేరు. తాగుడు తప్పేతే మరో ధ్యేయమేలేని మూర్ఖులు మీరు. సుఖంగా బ్రతకమంటే కేవలం తాగడమే అని మీ ఉద్దేశ్యం - మీలాంటి తాగుబోతులున్నంత కాలం మీకే కాదు మీరున్న దేశం కూడా బాగుపడదు."

ఎవరూ మాట్లాడలేకపోయారు.

"ఇంతకూ ఆ అడ్రస్ బుక్ అయినా వుందా?"

"ఉంది సార్ అది మాత్రం జాగ్రత్తగానే దాచాం-"

"ఏం లాభం? మీరు చేసిన ఈ పొరపాటు వల్ల ప్లానల్నీ సర్వనాశనమయిపోయినాయ్. మీ జీవితాలు ఉద్దరిద్దమను కున్న ఆశలన్నీ అడుగంటిపోయినాయ్."

భవానీ శంకర్ తన గదిలోకొచ్చేశాడు.

శ్యామ్ గదిలో కూర్చుని ట్రాన్సిస్టర్ వింటున్నాడు.

"హలో భవాని! ఏమయింది ఆ డూప్లికేట్ స్మితా రాణి కథ.-"

"మనం ప్లే చేసిన ట్రిక్కు మనమీదే ప్లే చేశాడు వాడు. చివరకు ఆ అమ్మాయి అందరిని ఫూల్ చేసి పారిపోయింది - ఇప్పుడు వాడు స్మితను ఎరగా పెట్టుకుని అడ్రస్ బుక్ అడుగుతున్నాడు."

"తప్పదు కామ్రేడ్! ఇలాంటి గేమ్స్ లో అప్స్ అండ్ డౌన్స్ కామనే. మారిప్పుడెం చేయదల్చుకున్నావ్ నువ్వు?"

భవానీ శంకర్ చిరునవ్వు నవ్వాడు.

"అదే తెలీటం లేదు కామ్రేడ్! పరిస్థితి కొంచెం కన్ ఫ్యుజన్ గా వున్నమాట నిజమే కాని పూర్తిగా చేయి దాటిపోలేదని నా నమ్మకం."

శ్యాం లేచి భవానీ శంకర్ భుజం మీద చేయి వేశాడు.

"భవానీ! యూ ఆర్ మై బెస్టు ఫ్రెండ్! అందుకే చెప్పాను. మాధవరావు లాంటి సీజన్ ఫెలోస్ తో తలపడటం మన కేపాసేటీకి తగదని - ఇప్పటికయినా మించిపోయింది లేదు. ఆ అడ్రస్ బుక్ వాడి ముఖాన్న పారెయ్.

స్మితారాణి సేఫ్ గా మనింటి కొచ్చేస్తుంది. ఆమె ప్రాణం ఎంతో ముఖ్యం మనకిప్పుడు."

"ఆఫ్ కోర్సు! నీ మాట నిజమే! స్మితారాణి కంటే నాకు డబ్బు గానీ, ప్రస్టేజీ గానీ ముఖ్యం కాదు శ్యాం. అయినా ఇంకా చాలా వ్యవధి వుంది నాకు. రేపుదయం పదిగంటలలోగా నిర్ణయం తీసుకోవాలి. కనుక ఈ రాత్రి యేమయినా వుపాయం దొరుకుతుందేమో చూస్తాను. లేకపోతే సరెండర్ తప్పదు="

"అదే చెప్పడానికొచ్చాను భవానీ! స్మితారాణి విషయంలో ఎలాంటి రిస్కూ తీసుకోవద్దు. లేకపోతే జీవితాంతం అందరం పశ్చాత్తాపపడవలసి వస్తుంది. ముఖ్యంగా అఖిలభాను ఈ విషయం మరీ మరీ చెప్పమంది."

"వదినమ్మతో చెప్పు కామ్రేడ్! స్మితారాణిని క్షేమంగా తెచ్చి అప్పజెప్పే పూచీ నాది -"

"సరే! నేను వెళతానిక."

"ఒకే కామ్రేడ్! థాంక్యూ"

శ్యాం వెళ్ళిపోగానే భవానీ శంకర్ చాపమీద పడుకుండిపోయాడు నిస్త్రాణంగా.

చీకటి పడుతోన్న కొద్ది అతనికి టెన్షన్ పెరిగిపోతోంది. తనీ సమస్యనుంచి తప్పించుకోవటం చాలా తేలికే! ఆ పుస్తకం మాధవరావు కిచ్చేస్తే మొత్తం చిక్కులన్నీ విడిపోతాయ్. కానీ తన కోరికమీద మాధవరావుకి సిద్దర్థారావుకి వ్యతిరేకంగా ఎదిరించి నిలబడి, ఆ అమాయకులకు జరిగిన అన్యాయాన్ని కోర్టు కీడ్చి కొన్ని లక్షల పరిహారం ఇప్పించాలనుకున్న ఆ లాయరు కుటుంబం సంగతేమిటి?"

తను అతని దగ్గరకెళ్ళి మనకోసమే కాకుండా మన చుట్టూ వున్న వారి కోసం కూడా బ్రతకాలి అని చెప్పి వప్పించి అతనిని ఆ దుర్మార్గులకు చాలెంజ్ చేయించినందువల్లనే అతనిని దారుణంగా హత్య చేశారు వాళ్ళు. అందుకు పరిహారం ఏనాటికయినా వాళ్ళు చెల్లించేలా చెయ్యాలని ఆ రోజే నిర్ణయించుకున్నాడు తను. ఇప్పుడు అలాంటి అవకాశం దొరికినా చేజేతులా తన తెలివి తక్కువతనం వల్ల వదిలేసుకుంటే మరో అవకాశం వస్తుందన్న నమ్మకం యేమాత్రం లేదు.

రాత్రి పదయిపోయింది.

లేచి గదంతా తిరగసాగాడతను.

సరిగ్గా పన్నెండు గంటల సమయం మిగిలివుందింకా.

గదిలో అంతకు ముందు రోజు తయారు చేసి మూల పారేసిన కాగితం ఉండ తీసుకుని టేబుల్ లాంప్ ముందు పెట్టుకుని చూశాడు మరోసారి.

మాధవరావు ఇంటికి నాలుగు వేపులా ఖాళీ స్థలం వుంది. ఎటువేపు నుంచి గోడ దూకినా స్పష్టంగా కనబడిపోతుంది. అదీగాక ఆ గోడలు మరీ ఎత్తుగా వుంటాయి.

మళ్ళీ కాసేపు పచార్లు చేశాడతను.

మెయిన్ గేట్లో నుంచి వెళ్ళటం అసలు అసంభవం.

హెలికాప్టర్ లోనుంచి వెళ్ళి ఆ భవనం పైన దిగితే తప్ప మరో రకంగా లోపలి అడుగుపెట్టడం అసాధ్యం.

ఏమీ తోచటం లేదతనికి.

సుశీల ఫ్లాస్కులో టీ తీసుకొచ్చి ఇచ్చిందతనికి.

"హల్లో మైడియర్ కామ్రేడ్! ఇంకా నిద్రపోలేదా నువ్వు?"

"పోయాను. అమ్మ లేపి టీ ఇచ్చిరమ్మంది."

"థాంక్యూ మైడియర్ చైల్డ్. ఇంక వెళ్ళి నిద్రపో."

ఆమె వెళ్ళిపోయింది.

బయట రాజయ్య గాంగు వాళ్ళు కర్రలతోనూ, కత్తులతోనూ కాపలా తిరుగుతూనే వున్నారు.

కప్పులో "టీ" పోసుకుని కొంచెం తాగాడో లేదో స్పార్క్ లాగా వచ్చిందో ఉపాయం అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది.

సంతోషం! భయం - అనుమానం అన్నీ కలగాపులగంగా ఆక్రమించుకుంటున్నాయి.

పరుగుతో తలుపు తెరచుకుని బయటకు వచ్చాడు.

"రాజయ్యా-"

"ఏం సార్!" పరుగుతో వచ్చాడు రాజయ్య.

"ఇలారా!"

ఇద్దరు గదిలోకి వచ్చారు.

"మనళ్ళల్లో ఒకరెవరో మున్సిపల్ కార్పోరేషన్ లో పని చేస్తుండాలి కదూ?"

"అవున్సార్ - చెన్నయ్య-"

"ఏం చేస్తుంటాడు?"

"డ్రైనేజ్ వర్క్ సార్ - "

భవానీ శంకర్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అర్జంటుగా పీల్చుకురా చెన్నయ్యను-"

రాజయ్య బయటికి వెళ్ళి "చెన్నయ్యా" అంటూ గట్టిగా పిలిచాడు కొద్ది క్షణాల్లో వచ్చేశాడతను.

"ఏమిటి సార?"

"చెన్నయ్యా! నువ్వు ఏ ఏరియాలో వర్కు చేస్తుంటావు!"

"తొమ్మిదీ, పదే వార్డ్స్ లో సార్."

"మన ఎమ్మెల్లే మాధవరావు వాళ్ళది ఏ వార్డు?"

అతను కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"తెలీదు సార్ - వార్డు నెంబరు తెలీదు-"

"పోనీ ఆ వార్డులో పనిచేసే వారెవరయినా తెలుసా నీకు!"

అతను ఓ క్షణం ఆలోచించాడు. "ఆ! తెలుస్సార్ ! మైసయ్య అనీ మా చిన్నమ్మ కొడుకే."

"ఎక్కడుంటాడతను?"

"ఇక్కడికి దగ్గరే సార్! ఇంకా డౌన్ లోకి పోతే ఉంటాడు -"

"అయితే వెంటనే వెళ్ళి అర్జంటుగా మైసయ్యను తీసుకురా."

"అలాగే సార్ -"

అతను పరుగుతో వెళ్ళిపోయాడు బయటకు.

రాజయ్య, కన్నారావ్ , అందరూ కుతూహలంగా , ఆత్రుతగా చూస్తున్నారు భవానీ శంకర్ వేపు.

"రాజయ్యా మనందరం కలిసి అతి సాహసమైన పని ఒకటి చేయబోతున్నాం. మీరందరూ ఇంటికెళ్ళి మీ గడ్డపలుగులూ, పారలూ అన్నీ తీసుకురండి. త్వరగా."

"ఎందుకు సార్ అవన్నీ?"

"ప్రశ్నలొద్దు కామ్రేడ్! ఇలా ఇందిరాగాంధీని ప్రశ్నలు వేసే బోలెడుమంది ఎమర్జెన్సీలో జైలు కెళ్ళిపోయారు. ఇంకా మీకు బుద్ధి రాకపోతే ఎలా? మన దేశానికి ప్రశ్నలు పనికిరావు బ్రదర్! సైలెంట్ గా వర్కు చేసేసుకోవటమే?"

"అలాగే సార్ -"

వాళ్ళు మాట్లాడుతుండగానే చెన్నయ్య మైసయ్యను వెంబడి తీసుకొచ్చాడు.

"నమస్తే సార్" అన్నాడు మైసయ్య.

"నమస్తే కామ్రేడ్. ఇలారా ఇటు కూర్చో."

"ఫర్లేదు సార్ నిలబడే ఉంటా."

"ముందు కూర్చో కామ్రేడ్, మర్యాదలూ, గౌరవాలూ, సన్మానాలూ, ఇవన్నీ వర్కు ఉన్నప్పుడు కాదు, లేనప్పుడు. టైం పాస్ కి ఉపయోగించుకునేవి. ఇలారా ఇటు కూర్చో."

మైసయ్య కుర్చీలో కూర్చున్నాడు.

అతని కెదురుగా తను గీసిన ప్లాన్ కాగితం ఉంచాడు భవానీ శంకర్.

"చూడు కామ్రేడ్! ఇది మాధవరావు భవనం. ఆ చుట్టూ పక్కల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం గురించి నువ్వు మాకు చెప్పాలి. ఎందుకంటె మేమందరం మాధవరావు భవనంలోకి అండర్ గ్రౌండ్ డ్రేయినేజ్ సిస్టం ద్వారా వెళ్ళాలి."

"ఎందుకు సార్?"

"అదే వద్దన్నాను కామ్రేడ్. ప్రశ్నలు వద్దు - సమాధానం చెప్పు."

అతను కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"అలా కాగితం మీద గీయటం నాకు చేత కాదు సార్. కావాలంటే చెపుతాను."

"అల్ రైట్! పోనీ చెప్పేసెయ్."

"మరేం లేద్సార్! ఇది మాధవారావు బిల్డింగ్ అనుకోండి. ఇదిగో యాభయ్ గజాల దూరంలో జంక్షన్ ఉంది. అంటే అక్కడ నుంచి లోపలకు దిగి మీరు ఇదుగో ఈ బిల్డింగ్ కి ఈ ప్రక్కవరకూ రావచ్చు. అక్కడ మీకు కాంపౌండ్ వాల్ తగులుతుంది. అప్పడింకెల్లా వెళతారు సార్ లోపలకు?"

"అక్కడ నుంచీ ఆ కాంపౌండ్ వాల్ పునాదులు తవ్వుకుంటూ ఆ కాంపౌండ్ లోపలకు చేరుకోవచ్చు కదా!"

"తవ్వటం చాలా కష్టం కదండీ."

"కష్టే ఫలి" అన్నారు కామ్రేడ్! కష్టం కదా అని మనం ఎన్నో పనులు చేయకుండా ఊరుకుంటున్నామా? అంచేత నువ్వు చేయాల్సిందేమిటంటే మా వాళ్ళందరినీ వెంట పెట్టుకుని మాధవరావు కాంపౌండ్ వాల్ వరకు డ్రేయినేజ్ గోతిలోపల నుంచీ తీసుకెళ్ళు - మిగతా వ్యవహారం నేను చూసుకుంటాను సరేనా?"

మైసయ్య మాట్లాడలేదు.

"మాట్లాడవేం మైసయ్యా! ఎనీ ప్రాబ్లమ్?"

"సార్ రేపు నా కొంపమీద కేమీ రాదు కదా."

"పిచ్చివాడా! నీ ప్రాణానికి మా ప్రాణం అడ్డు వేస్తాను సరేనా!"

"సరే సార్!"

"అయితే ఇంక ఆలస్యం అనవసరం, అందరూ రెండు టాక్సీలలో వెళ్ళటం మంచిది. కమాన్ రాజయ్యా సెంటర్ దగ్గరకెళ్ళి టాక్సీలు తీసుకురా."

"అలాగే సార్!"

మరో పావుగంటకి టాక్సీలు వచ్చేసినాయ్.

గడ్డపలుగులూ, పారలూ డిక్కీలో వేసుకుని మాధవరావు ఇంటికి కొద్ది దూరంలో దిగారందరూ.

కొంచెం ఖరీదయిన వాళ్ళుండే లోకాలిటీ కావటం వల్ల నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా ఉందా ప్రాంతమంతా.

"నేనీ డ్రయినెజ్ కవర్ ఓపెన్ చేసి లోపలకు దిగుతాన్సార్! ఆ తర్వాత ఒకరొకరే దిగిరండి" చెప్పాడు మైసయ్య.

"అలాగే కామ్రేడ్!"

మైసయ్య ఓసారి అటూ ఇటూ దిక్కులు చూసి డ్రయినేజ్ కవర్ తొలగించి పక్కన పడేశాడు. తరువాత భవానీ శంకర్ సాయంతో లోపలకు దిగాడు.

భవానీ శంకర్ తన దగ్గరున్న టార్చ్ లైట్ అతనికిచ్చాడు.

"ఇంక రడీగా వుండు కామ్రేడ్. ఒకరొకరినీ దింపేస్తున్నాను."

"అలాగే సార్"

అయిదు నిమిషాల్లో అందరూ లోపలకు దిగిపోయారు సామానులతో పాటు.

"ఇంక పదండి!" అన్నాడు భవానీ శంకర్.

మైసయ్య వెనుకే అందరూ టార్చిలైట్లతో నడవసాగారు.

దిగేవరకూ ప్లానంతా భవానీ శంకర్ మనసులో తను వెళ్ళాల్సిన డైరెక్షన్ గుర్తుంది గానీ కొంతదూరం నడిచాక

డైరెక్షన్ సెన్స్ పోయింది.

పది నిమిషాల తర్వాత ఓ చోటకు చేరుకున్నారు.

"ఇదిగో సార్ ఇక్కడి నుంచి తవ్వుకుంటూ వెళితే అయిదారు అడుగుల దూరం వుంటుంది మాధవరావు ఇంటి కాంపౌండ్ వాల్! దాన్ని పగలగొట్టారంటే కాంపౌండ్ వాల్ లోపలికెళ్ళిపోవచ్చు"

చెప్పాడతను.

భవానీ శంకర్ మనసక్కడలేదు.

క్షణక్షణనికీ పెరిగిపోతున్న సఫోకేషన్ గురించి ఆలోచిస్తూన్నాడు. దుర్వాసనలవల్ల, గాలి సరిగా అందకపోవడం వల్లా స్పృహ తప్పుతారేమో అనిపించేట్లుంది.

"మైసయ్యా! ఇక్కడెక్కడయినా ఇంకోకవరు ఓపెన్ చేసే అవకాశం వుందా?" అడిగాడతను. "లేకపోతే ఊపిరాడేట్లు లేదు."

"అదిగో ఆ మూలకే మరో కవరు ఉందండి. అది కూడా తెరచేస్తే అప్పుడప్పుడు దాని కింద నిలబడి మంచి గాలి పీల్చుకోవచ్చు."

"అయితే త్వరగా ఆ పని చెయ్ కామ్రేడ్! లేకపోతే మనందరం తెల్లారే సరికి పోలీస్ స్టేషన్ లో కళ్ళు తెరుస్తాం!" మైసయ్య మరో వ్యక్తిని సాయంగా తీసుకుని వెళ్ళి ఆ కవరు కూడా తెరిచాడు.

"ఆ! కమాన్ రాజయ్యా ఇంక త్వరగా తవ్వటం ప్రారంభించండి. తవ్విన మట్టిని కొంతమంది గొనె సంచుల్లో తీసుకెళ్ళి పైన దూరంగా పడేస్తుండండి"

"అలాగేనండి"

త్రవ్వటం ప్రారంభమయిపోయింది.

వాళ్ళు రోజూ చేసేపని కావడంతో చాలా తేలికగా తవ్వేయసాగారు.

భవానీ శంకర్ టైమ్ చూసుకున్నాడు.

ఇంకో నాలుగుగంటల్లో ఈ కార్యక్రమం పూర్తవ్వాలి. అయిదు గంటలకల్లా ఆ కాలనీ లో జన సంచారం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయ్.

బహుశా ఇంకో గంట సేపట్లో త్రవ్వటం పూర్తవచ్చు.

మరో గంట గడిచిపోయింది గానీ తవ్వకం పూర్తవ్వటం లేదు. భవానీ శంకర్ లో ఆందోళన పెరిగిపోతోంది.

"కమాన్ రాజయ్యా కొంచెం ఎక్ స్ట్రా శ్రమ పడండి ఇది మన సొంతపని అని గుర్తుంచుకోండి!" అన్నాడు తొందరపెడుతూ.

వాళ్ళు పని మరింత త్వరితం చేయసాగారు.

రాజయ్య గడ్డపలుగు కంగుమన్న శబ్దం చేసింది. అందరి ముఖాలలో అనందం వెల్లివిరిసింది.

"వచ్చేసింది సార్ కాంపౌండ్ వాల్ తగిలింది" అన్నాడు రాజయ్య ఉత్సాహంగా.

"వెరీ గుడ్ కామ్రేడ్స్! ఇంక విజయం అతి చేరువగా ఉంది కానీయండి"

అందరూ మరింత ఉత్సాహంగా పని చేయసాగారు. కొండరాళ్ళు ఒకటొకటే తీసుకెళ్ళి దూరంగా పెర్చసాగారు.

మళ్ళా టైమ్ చూసుకున్నాడు భవానీ శంకర్. రెండున్నరయింది. మహా అయితే ఇంకో అరగంటలో

మాధవరావు కాంపౌండ్ లో కొచ్చేస్తాడు. అంటే మూడువుతుందప్పటికి. ఓ అరగంటలో లోపల స్మితను వెతకటం బయటకు తీసుకురావటం జరిగిపోవాలి.

భవానీ శంకర్ రిలాక్స్ అయిపోయాడు.

ఇంకేమీ ప్రాబ్లమ్ లేదు. అంతా సవ్యంగా జరిగిపోతుంది. ఎటొచ్చి ఆ భవనం లోపలికి పైప్ గొట్టాల ద్వారా వెళ్ళేప్పుడే కొంచెం జాగ్రత్తగా ఉండాలి. గార్డ్స్ వెనుక వేపు ఒక్కరే ఉంటారు. కనుక వాడిని నిద్ర పుచ్చటం అంత కష్టమేమీ కాదు.

అప్పుడు వినిపించింది ఉరుము అతనికి. దాని వెనుకే మెరుపులు మాన్ హోల్ నుంచే లోపలకు ప్రవేశించి ప్రకాశవంతం చేసేంత పెద్ద మెరుపులు.

భవానీ శంకర్ గుండెలు జల్లుమన్నాయ్.

ఒకవేళ వర్షం కురుస్తుండా?

పరుగుతో మాన్ హోల్ కిందకొచ్చి పైన కనబడుతున్న ఆకాశం వేపు చూశాడు. నల్లని మబ్బులు శరవేగంతో పరుగెడుతున్నాయ్. దానికి హోరు గాలి . చల్లని గాలి . అంత చల్లని గాలికి అర్ధం ఏమిటో అతనికి తెలుసు.

వర్షం చుట్టూ పక్కలెక్కడో కురుస్తుంది. అతి త్వరలో ఆ ప్రదేశానికి కూడా చేరుకోవచ్చు.

అతని ముఖం పాలిపోయింది.

అంతవరకూ కలిగిన ఉత్సాహమంతా నీరుకారిపోయింది.

వర్షం కురిస్తే ఏం జరుగుతుందో తనకు తెలుసు.

మొత్తం వర్షపు నీరంతా డ్రయినెజ్ లోకి వరదలాగా వచ్చేస్తుంది. వర్షం మరీ పెద్దయితే ఆ ఫోర్స్ కి తామందరూ కొట్టుకు పోయినా పోవచ్చు.

"మైసయ్యా! దూరంగా నిలబడి బీడీ కాల్చుకుంటున్న మైసయ్య ను పిలిచాడతను.

"ఏం సార్?"

"వర్షం కురిసేట్లుంది కదూ?"

"అవున్సార్-"

"ఒకవేళ కురిస్తే ఏమవుతుంది?"

"నేను అదే ఆలోచిస్తున్నా సార్! కొంచెం పెద్ద వర్షం కురిసిందంటే మనందరం బయటికెళ్ళిపోక తప్పదు సార్."

"మరిప్పుడేమిటి చేయటం మనం?"

"ఇంకేం చేస్తాం సార్? దేవుడికి దణ్ణం పెట్టుకోవడమే."

"దేవుడికి దణ్ణం పెట్టుకుంటే ఆగిపోతుందంటావా?"

"ఆగిపోద్ది సార్! అయితే మనలో "సత్యం వుండాలి. మా చిన్నాడికి జబ్బు చేసినప్పుడు ఎన్టీఆర్ ప్రభుత్వం పడిపోవాలి అని నేను కోరుకున్నాను."

"అదేమిటి ఎందుకు?"

"నాకు అసలే జీతం చాలటం లేదు కద్సార్? ఎన్టీఆర్ రాగానే ప్రొఫెషనల్ టాక్స్ కట్ చేశాడండీ నా జీతంలో.

అందుకని అలా కోరుకున్నాన్సార్! ఆ డబ్బుంటే వాడికి డాక్టరు బిల్లుకి సరిపోయేది కదండీ"

"అవునవును - ఇంతకూ దేవుడు నీ కోరిక తీర్చాడా?"

"తీర్చాదండీ! ఆ మర్నాడే భాస్కరరావు ప్రభుత్వం వచ్చేసిందండి- ఎందుకంటె ఆ రోజుల్లో నేను చాలా సత్యంగా ఉండేవాడిని"

సరిగ్గా అప్పుడే ఓ చినుకు పడింది భవానీ శంకర్ మీద.

దాని వెనుక మరికొన్ని చినుకులు.

భవానీ శంకర్ రాజయ్య దగ్గరకు పరుగెత్తాడు.

"రాజయ్యా! వర్షం కురిసేట్లుంది. త్వరగా మనం పూర్తీ చేసుకోకపోతే మాధవరావు బిల్డింగ్ లోనే ట్రాప్ అయిపోతాం!"

"మీకెందుకండీ ఇంకో అయిదునిముషాలు అంతే"

మరింత వేగంగా పట్టుదలతో త్రవ్వసాగారు వాళ్ళు.

భవానీ శంకర్ మళ్ళీ కవరులోంచి పైకి చూశాడు.

మబ్బులు మరింత భయంకరంగా మూసుకోస్తున్నాయ్. గాలి కూడా మరింత ఎక్కువయిందిప్పుడు.

ఇంకొక్క గంట టైము మిగిలివుంది తనకు.

ఈలోగా వర్షం కురవకపోతే చాలు.

అశాంతిగా ఆకాశం వేపే చూడసాగాడతను.

వర్షం మొదలయిపోయి వెనక్కు తిరగాల్సిన పరిస్థితి వస్తే తను ఒడిపోయినట్టే. శ్యామ్ చెప్పినమాటే నిజమవుతుంది. సమాజంలో పేరు ప్రఖ్యాతలున్న పెద్దమనుషులను తనలాంటి సామాన్య యువకులు ఏమీ చేయలేరని ఋజువవుతుంది. అతనెంత దుర్మార్గుడయినా సరే! ఆ దుర్మార్గాత్వానికి అందరూ నిశ్శబ్దంగా బలయిపోవటమే.

"సార్ పైకి వచ్చేశాం." పరుగుతో వచ్చి చెప్పాడు రాజయ్య ఉత్సాహంగా.

భవానీ శంకర్ ఆనందంగా పరుగెత్తాడు. ఒకసారి ఒకే మనిషి దూరేంత గోతి లాంటి చిల్లు.

అతనికి అనందం కలిగింది.

"రాజయ్యా! నువ్వు కన్నారావు నావేనుకే రండి! మిగతావాళ్ళను మన సామానులన్నీ తీసుకుని ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పు - మైసయ్యను మెయిన్ రోడ్డు దగ్గర ఓ ఆటోలో సిద్దంగా ఉండమను."

"అలాగేనండీ!"

అయిదు నిమిషాల్లో ఏర్పాట్లన్నీ పూర్తయిపోయినాయ్.

అప్పుడు ప్రారంభమయింది వర్షం.

ముందు సన్నగా తుపరలా ప్రారంభమై క్రమేపీ పెద్దదవుతోంది.

భవానీ శంకర్ ఇంక ఆలస్యం చేయలేదు. త్వరగా ఆ గోతిలో నుంచి పైకి వచ్చాడు. సరిగ్గా పూల మొక్కల మధ్యకు చేరుకున్నారందరూ.

భవనానికీ వేనుకవేపు ప్రాంతం స్పష్టంగా కనబడుతోంది . ఒకే ఒక్క గార్డు కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

"మెల్లగా శబ్దం కాకుండా నా వెనుకే రండి" చెప్పాడతను.

ఇద్దరూ పరుగులతో ఆతని వెనుకే నడవసాగాడు.

ఆ గార్డుకి అతి సమీపంగా వచ్చేశారు వాళ్ళు,

"మీ ఇద్దరూ వెళ్ళి వాడి నోరు మూసి నెత్తిమీద ఒకటి కొట్టండి. వాడి గొంతు బయటకు వినబడకుండా ముందు పీక నొక్కటం ముఖ్యం" రాజయ్యతో చెప్పాడతను.

"అలాగేనండీ"

ఇద్దరూ వెళ్లి ఆ గార్డుని చుట్టుముట్టి మీద పడ్డారు.

రెండు నిముషాలు పెనుగులాడిన తరువాత కుప్పగా కూలిపోయాడతను.

"వెరీ గుడ్ కామ్రేడ్! ఇప్పుడు నేను వాటర్ పైపు పట్టుకుని మేడ మీదకు ఎక్కుతాను. మీరిద్దరూ ఆ మూల కిటికీ చువ్వలు వంచి పారేసి లోపలకు వచ్చేయండి. అందరం లోపల కలుసుకుందాం."

"అలాగేనండీ"

"ఎవరయినా నిద్రలేచి మిమ్మల్ని చూస్తె అరవకుండా నోరుమూసి నెత్తిమీద ఒకటికొట్టి కిందపడేయండి. బయటకు అరుపులు వినిపించాయో - బయట వున్న గార్డ్స్ అంతా తుపాకులతో లోపలికొచ్చి మనపని పడతారు."

"ఏం ఫర్లేదులెండి - అంతా మేము చూసుకుంటాం కదా?"

"ఓ.కే."

"భవానీ శంకర్ పైపు పట్టుకుని మేడమీదకు పాకసాగాడు. వర్షం కురుస్తోండటం వలన పట్టు జారిపోతోంది. అతి కష్టం మీద మేడ మీదకు చేరుకున్నాడతను. పక్కనే వున్న బాల్కనీ లోకి దిగి టార్చిలైటు లోపలి గదిలోకి వేసి చూశాడు.

ఓ యువకుడు నిద్రపోతున్నడక్కడ.

అతని పక్కనే వున్న కుర్చీ ఎత్తి బలంగా అతని తలమీద కొట్టాడు భవానీ శంకర్. ఏమాత్రం శబ్దం చేయకుండా నిద్రనుంచే కోమాలోకి వెళ్ళిపోయాడతను.

ఆ గదిలో నుంచి పక్కనే ఉన్న హాల్లోకి ప్రవేశించాడు.

మెడకిందకు మెట్లు కనిపిస్తున్నాయి.

త్వరత్వరగా మెట్లు దిగాడు. అదీ ఓ చిన్న హాలే!

దానికి నాలుగువైపులా నాలుగు గదులున్నాయి. ఏ.సి. మిషన్స్ పనిచేస్తున్న శబ్దం కందిరీగల మోతలా వినబడుతోంది.

బహుశా మాధవరావు ఏదో గదిలో ఉండుండాలి.

మరో గదిలో ఎక్కడో స్మిత కూడా ఉండుంటుంది. స్మిత ఎక్కడుందో తెలుసుకోవటం అంత తేలికయిన విషయం కాదు.

మాధవరావుని నిద్రలేపకపోతే తన టైమ్ చాలా వెస్టవుతుంది.

హాలంతా కలియజూసాడతను.

ఓ మూల కనిపించింది టెలిఫోన్.

అతని హృదయం ఆనందంతో ఎగిసిపడింది. దానికి ఎక్స్ టెన్ షన్ బజర్ కూడా వుంది. నెమ్మదిగా దాని దగ్గరకు నడిచి రిసీవరు తీసుకుని బజర్ నొక్కాడు.

కొద్ది క్షణాల తర్వాత బద్ధకంగా వినిపించింది మాధవరావు గొంతు.

"హలో - ఎవరు?"

"నేనే సార్!" గొంతు కొంచెం మార్చి అన్నాడు.

"ఏమిటి?" నిద్రమత్తులోనే మాట్లాడుతున్నట్లు తెలిసిపోతోంది.

"మిమ్మల్ని అర్జంటుగా కలుసుకోవాలనుకుంటున్నారు  సార్"

"ఎవరు?"

"పోలీస్ ఇన్ స్పెక్టర్ గారు"

మాధవరావు నిద్రమత్తు చాలావరకు వదిలిపోయింది. గోడ గడియారం వేపు చూశాడు - మూడయింది.

"ఏమికావాలట?"

"చెప్పటం లేద్సార్?"

"ఎక్కడున్నాడిప్పుడు?"

"విజిటర్స్ రూమ్ లో కూర్చున్నారండీ."

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"సరే వస్తున్నాను."

లేచి తలగడ కింద దాచుకున్న పిస్టల్ తీసి జేబులో వేసుకున్నాడు. గోడకున్న తాళం చేతితో తలుపు తెరచి బయటకు అడుగుపెట్టాడు.

భవానీ శంకర్ గోడపక్కనే సోఫా వెనుక కూర్చోవటంతో అతని కేమీ కనిపించలేదు.

లైట్ స్విచ్ వేయబోతుండగా భవానీ శంకర్ లేచి ఫ్లవర్ వాజ్ తీసుకుని అతని తలమీద బలంగా కొట్టాడు. నోటిమీద చేయి అడ్డు పెట్టాడు. పెద్దగా మ,మూలిగి కిందకు వరిగిపోయాడు మాధవరావు.

భవానీ శంకర్ అతనిని కిందపడకుండా ఆపాడు.

అప్పుడు చూశాడతని ముఖం.

"నువ్వా?" అన్నాడు అస్పష్టంగా.

నెత్తిమీద సన్నగా రక్తం కారుతోంది.

"అవును కామ్రేడ్,  హింసను నేను లైక్ చేయను గానీ - ప్రస్తుతానికి ఇంతకంటే గత్యంతరం లేకపోయింది.

మాధవరావు హటాత్తుగా అతని చెయి తొలగించి, గట్టిగా అరవబోయాడు.

భవానీ శంకర్ మెరుపు వేగంతో మళ్ళీ అతని నోరు మూసేశాడు.

"అనవసరంగా పిచ్చి చేష్టలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోకు కామ్రేడ్. బుల్లెట్ తిన్నగా గొంతులో దిగబడుతుంది."

మాధవరావుకి తలమీద తగిలిన గాయం బాధ ఎక్కువయిపోయింది. అతి కష్టం మీద కూడదీసుకుని లేచి నిలబడ్డాడు.

"ఏం కావాలి?" అడిగాడు నెమ్మదిగా.

"అదే తెలివి తక్కువ ప్రశ్న మైడియర్ ఫ్రెండ్! ఏం కావాలో మనిద్దరికీ తెలుసు! అంచేత నటన వద్దు. స్మితారాణి ఎక్కడ?"

"పద చూపిస్తాను" హాలు నానుకుని వున్న నడవాలోకి నడిచాడతాను. భవానీ శంకర్ జాగ్రత్తగా అతనినే గమనిస్తూ ఫాలో అవసాగాడు. కిచెన్ వరకూ వస్తూనే జేబులో నుంచి అతివేగంగా పిస్టల్ తీసి భవానీ శంకర్ గుండె మీద పెట్టాడతను.

భవానీ శంకర్ నిశ్చేష్టుడయాడు.

అంత వేగంగా అతను ఆ పని చేయగలడని ఉహించలేకపోయాడు తను.......

"నాతోనే వేళాకోళాలా" అంటూ ట్రిగ్గర్ నొక్కబోయే సమయంలోనే "ధన్" మన్న శబ్దం వినిపించింది కిచెన్ లో.

కలవరపడి కిచెన్ వేపు చూశాడు మాధవరావు.

ఆ అవకాశం కోసమే చూస్తున్న భవానీ శంకర్ అతి వేగంగా అతని చేతిమీద తన శక్తినంతా వినియోగించి కొట్టాడు.

పిస్టల్ యెగిరి సీలింగ్ కొట్టుకుని మాధవరావు వెనకపడింది.

మాధవరావు వెనకకు తిరిగే లోపలే కిచెన్ లో నుంచి రాజయ్య గడ్డపలుగు తో బయటికొచ్చి నిలబడ్డాడు.

"ఎంతకాలానికి దొరికావురా నా కొడకా" అన్నాడు రాజయ్య కసిగా . భవానీ శంకర్ చటుక్కున వంగి పిస్టల్ అందుకున్నాడు.

మాధవరావులో భయం ప్రవేశించింది.

"నువ్వింత ఇడియట్ వనుకోలేదు కామ్రేడ్! బయట సిద్దార్ధరావు మనుషులు మీవాళ్ళను చావగొట్టి నీకోసం ఎదురుచూస్తున్నారు. నువ్వు వెధవ్వేషాలేయకుండా స్మితారాణిని మా కప్పగించి నీ రూం లో నువ్వు పడివుంటే నీ ఆరోగ్యం బావుంటుంది. లేకపోతే జలుబూ తలనొప్పి రావటం తర్వాత తల లేచిపోవటం లాంటి అనారాగ్యాలొచ్చేస్తాయ్ - అర్ధమయిందా?"

మాధవరావు ముఖం అవమానంతో నల్లబదిపోయింది.

అర్ధమయిందన్నట్లు తలూపాడు.

"అయితే పద! త్వరగా స్మితారాణిని చూపించు."

మాధవరావు తన జేబులోని తాళం చేతులతో ఆ పక్కనే వున్నగది తలుపులు తెరచాడు. ఆ శబ్దానికి మంచం మీద పడుకున్న స్మితారాణి ఉలిక్కిపడి లేచింది.

భవానీశంకర్ గదిలోకి అడుగుపెట్టి లైట్ స్విచ్ వేశాడు. భవానీ శంకరుని చూడగానే ఆమె ముఖం ఆనందంతో నిండిపోయింది.

"వచ్చేశారా?" అంది ఉత్సాహంగా.

"కమాన్ ఫ్రెండ్! త్వరగా వెళ్ళిపోవాలి మనం. లేకపోతే ఈ ముసలినక్కగాడు మళ్ళీ అతి తెలివికి పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటాడు."

స్మితారాణి పరుగుతో గది బయట కొచ్చేసింది.

"కమాన్ కామ్రేడ్ మాధవరావు నువ్వు కూడా బయటకు పద!" ఆజ్ఞాపించాడు భవానీ శంకర్. అందరూ గదిలో నుంచి బయటికొచ్చారు.

"ఇప్పుడు ఇంటి వెనుక తలుపు తెరిచాడు.

"పద కామ్రేడ్! మాతో పాటు నువ్వూ వీడ్కోలుపు సీన్ లో పాల్గొనాలి కమాన్" పిస్టల్ అతని వీపుకి గురిపెడుతూ అన్నాడు.

అందరూ డ్రెయినేజీ గొయ్యి దగ్గర కొచ్చారు. వర్షం మరి కొంచెం ఎక్కువయిందిప్పుడు.

"రాజయ్య నువ్వు ముందు దిగు! నీ వెనుకే కామ్రేడ్ మాధవరావు దిగుతాడు. ఆ తరువాత నేనూ, స్మిత, కన్నారావు దిగుతాం."

రాజయ్య దిగాడు కిందకు.

"నేనెందుకు? మిమ్మలేమీ అనను నన్నొదిలేయండి" అన్నాడు మాధవరావు భయంగా.

"కంగారుపడకు కామ్రేడ్! నిన్ను మర్డరు చేసే స్కీమ్ ప్రస్తుతం మన దగ్గర లేదు. కనుక భయపడకుండా దిగు. నిన్ను డ్రైనేజ్ లోపల సమాధి చేస్తామని అనుకుంటున్నావేమో! నీలాంటి విషప్పురుగుల వల్ల డ్రైనేజీ పాడవకుండా చూడాల్సిన బాధ్యత మా మీద ఉంది కదా! అందుకని అలా కూడా చేయం."

చేసేది లేక మాధవరావు కూడా దిగాడు.

ఆ తరువాత భవానీ శంకర్, స్మితలు, కూడా ఆ బురదలో నుంచి డ్రైనేజీ కిందకు జారిపోయారు. వర్షం మరింత ఎక్కువయిపోయిందిప్పుడు. వర్షపు నీరు ఆవేశంతో అన్నీ వేపుల నుంచీ డ్రైనేజీ లోకి మోకాలు లోతున ప్రవహిస్తున్నాయ్.

భవానీ శంకర్ కి భయం కలిగింది.

క్షేమంగా తామంతా డ్రైనేజీ పైకి చేరగలమా?

మాధవరావు వణికిపోతున్నాడు.

"నన్నొదిలేయండి." అంటున్నాడు చీకట్లో ఏం జరుగుతోందీ తెలీక.

టార్చిలైటు వెలుగులో జాగ్రత్తగా ముందుకి నడుస్తున్నాడు రాజయ్య. అతని వెనుకే నడుస్తున్నరందరూ. హటాత్తుగా అతి భయంకరమయిన నీళ్ళ శబ్దం వినిపించింది అందరికీ భవానీ శంకరుకి అర్థమయిపోయింది!

పెద్ద ప్రవాహమేదో అతి వేగంగా వచ్చేసింది. ఏ క్షణంలోనయినా తామందరినీ ముంచేస్తుందది.

దూరంగా డ్రైనేజీ కవరు పై నుంచీ మైసయ్య గొంతు వినబడుతోంది గట్టిగా.

"త్వరగా వచ్చేయండి నీళ్ళొచ్చెస్తున్నాయ్."

ప్రాణాలకు తెగించి పరుగెత్తారందరూ. ముందు స్మితను రెండు చేతులతోనూ నడుము పట్టుకుని పైకి ఎత్తేశాడతాను. మైసయ్య పైనుంచి సాయం చేయడంతో ఆమె పైకి ఎక్కేసింది. ఆమె వెనుకే రాజయ్య పైకి ఎక్కేశాడు. అతని వెనుక కన్నారావు.

మాధవరావు వణికిపోతున్నాడు.

"భవానీ శంకరు నన్ను ఎక్కనీ! ఈ ముసలాడి మీద కనికరం లేదా నీకు." రెండు చేతులూ జోడించాడు. భవానీ శంకరు అతనిని పైకి ఎత్తుతుండగానే నీళ్ళు వచ్చేసినాయ్. ఆ వేగానికి భవానీ శంకరు పక్కకు కొట్టుకు పోయాడు. నడుము లోతు వచ్చేసినాయి నీళ్ళు ఇప్పుడు మరింత పెద్ద శబ్దం మరింత చెరువుగా వస్తోంది.

ఈసారి దానిని తట్టుకుని నిలబడటం వల్ల మాధవరావు పైకెక్కేశాడు.

మైసయ్య, రాజయ్య గడ్డపలుగు పైనుంచి లోపలకు దించి పట్టుకున్నారు.

"సార్ - ఇది పట్టుకోండి! లేకపోతె కొట్టుకుపోతారు" అరుస్తున్నాడు రాజయ్య. భవానీ శంకరు గోడను బల్లిలా కరుచుకున్న వాడల్లా ఆ పలుగుని అందుకోటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. అడుగు కదుల్తే చాలు ఆ ప్రవాహం వేగంలో పడి అంతులేకుండా కొట్టుకుపోవడం ఖాయం.

అప్పటికే అతి సమీపంగా వచ్చేస్తోంది మరో ప్రవాహపు కెరటం.

ఈసారి డ్రైనేజీ పూర్తిగా నిండిపోతుందని తెలిసిపోతూనే ఉంది. శక్తినంత కూడదీసుకుని పలుగు వేపు ఓ అడుగు వేసి ఎగిరి రెండు చేతులతో పలుగు పట్టుకున్నాడతను.

అప్పటికే కెరటం యెగిరి పడిందతని మెడలవరకూ.

"కమాన్ రాజయ్యా! లాగేసేయ్"బిగ్గరగా అరచాడతను రాజయ్య మైసయ్య కలిసి అతనిని బయటకు లాగేశారు.

థాంక్యూ కామ్రేడ్! ఒండర్ ఫూల్ సర్వీస్ చేశారు మీరు. హల్లో మాధవరావు చూశావా? నువ్వు నీ ఫ్యాక్టరీ ద్వారా విషపూరితమయిన కెమికల్స్ ని బయటకు వదిలి చుట్టూ ప్రక్కలున్న బావుల్ని కలుషితం చేసి ఆ నీరు తాగే జనాన్ని చంపితే వీళ్ళు నిన్ను చావు బ్రతుకుల మధ్య నుంచి రక్షించారు. ఎంత తమాషా గా ఉందో చూశావా సిట్యుయేషన్."

మాధవరావు ముఖం తిప్పుకున్నాడు.

వర్షపు హోరులో మాటలు కూడా సరిగ్గా వినబడటం లేదేవరికి.

సార్ ఒకే ఒక్క ఆటో దొరికింది" అన్నాడు మైసయ్య.

"చాలు కామ్రేడ్! అదే పుష్పక విమానం అవుతుంది కాసేపు పదండి."

అందరూ వడివడిగా నడవసాగారు మెయిన్ రోడ్ వేపు.

"అన్నట్లు కామ్రేడ్! మాధవరావు నువ్వు కొంచెం వెనక్కు వెనక్కు జారుకుంటున్నట్లు అనుమానంగా ఉంది. కొంచెం ముందుకిరా బ్రదర్ !" అన్నాడు భవానీ శంకర్ మాధవరావ్ వేపు చూస్తూ.

"నన్నింక వదిలేయండి. యింక నాతో ఏం పని వుంది?" దీనంగా అన్నాడతను.

"అప్పుడే కాదు కామ్రేడ్! యింకొంచెం సేఫ్టీ కావాలి మనకు పద!"

అందరూ అటో దగ్గరకు చేరుకున్నారు.

"ఏం సార్ యింతమందా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆటోవాడు.

"తప్పదు కామ్రేడ్! మీటరు మీద ఓ పాతిక ఎక్ స్ట్రా కడతాంలే కానీ."

అతను సైలంటయిపోయాడు.

రోడ్డంతా మోకాలు లోతు నీళ్ళు నిండిపోయినాయి.

వర్షం తగ్గు ముఖం పట్టిందిప్పుడు.

సగం దూరం వెళ్ళాక ఆటో ఆపెయించాడు భవానీ శంకర్.

"ఇంక దిగు కామ్రేడ్ మాధవరావు."

"ఇక్కడా?"

"అవును కామ్రేడ్! ఇక్కడే."

"ఇక్కడ నుంచి మా యింటి కేలా వెళ్ళటం. అసలే చీకటి రోడ్డంతా వరద."

"తప్పదు కామ్రేడ్! జీవితంలో ఎడ్వం చర్ చాలా అవసరం. నువ్వు రాంగు ట్రాక్ లో పడి అదే ఎడ్వంచర్ అనుకుంటున్నావు."

మాధవరావు ఆటో దిగగానే "గుడ్ నైట్ మాధవరావు . విష్ యూ స్వీట్ డ్రీమ్స్ " అన్నాడతను. ఆటో మళ్ళీ బయల్దేరింది.

భవానీ శంకర్ స్మితారాణితో పాటు శ్యామ్ ఇల్లు చేరుకునే సరికి తెల్లారు జామున అయిదయిపోయింది.

వాళ్ళిద్దరినీ చూస్తూనే అఖిలభాను ఆనందంతో పొంగిపోయింది.

"అబ్బ! నువ్ ప్రాణాలతో తిరిగొస్తావనే నమ్మకం పోయింది నాకు" అంది ఆప్యాయంగా.

"నేనూ అదే అనుకున్నాను. కానీ ఈలోపల ఎక్కడో ఆశ వుంది. భవానీ శంకర్ నా కోసం ఏదో ఒకటి చేస్తారని." భవానీ శంకర్ చిరునవ్వు నవ్వాడు.

"థాంక్యూ కామ్రేడ్! నిన్నగాక మొన్న స్నేహితులమయినా మీ కంత నమ్మకం వుంది నామీద. కానీ ఎప్పటి నుంచో ప్రాణంగా మెసలుతున్న కామ్రేడ్ శ్యామ్ కీ, అఖిలభాను సిస్టరిల్లా కి మనమీద బొత్తిగా నమ్మకం లేకుండా పోయింది."

"చాల్లల్లె! లక్కీగా తీసుకురాగలిగావు గనుక మాట్లాడుతున్నావు. ఒకవేళ తీసుకురాలేకపోతే పరిస్థితి ఏమిటి?" చిరుకోపంతో మాట్లాడిందామే.

"ఎలా తీసుకురాగలిగావసలు?" అడిగాడు శ్యామ్.

"సినిమాల్లోలా జరిగింది విమలా! కాంట్ ఇమేజిన్! డ్రైనేజీ గోతిలో నుంచి లోపలికొచ్చి నన్ను తీసుకొచ్చేశారు. ఎంత టెన్షన్ తెలుసా? తిరిగి పైకి వచ్చేవరకూ నా ప్రాణంలో ప్రాణం లేదు."

శ్యామ్ నిశ్చేష్టుడయిపోయాడు.

"డ్రైనేజీ లో నుంచా?"

"ఒకే కామ్రేడ్! నేను రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమయింది. కనుక ఈ ఒక్కరోజూ మీరంతా ఏదయినా హోటల్ రూంలో వుండటం మంచిదని నా అభిప్రాయం. ఏ క్షణంలోనయినా స్మిత కోసమో, లేదా నా కోసమో మీ ఇంటి మీదకు జంతువులు ఎటాక్ చేసే అవకాశాలున్నాయి."

శ్యామ్ , అఖిలభాను ముఖం వేపు చూశాడు.

"అవును! మనం వెళ్ళిపోవటమే మంచిది" అంది అఖిలభాను.

"అయితే రెడీ అవండీ" బయట ఆటోని మీ కోసమే ఆపి వుంచాను."

కొద్ది నిమిషాల్లో అందరూ రెడీ అయి ఆటో ఎక్కారు.

భవానీ శంకరు తన రూమ్ కి చేరుకొని స్నానం ముగించే సరికి పూర్తిగా తెల్లారిపోయింది. త్వరత్వరగా స్టూడియోకి చేరుకొని మాధవరావు కి ఫోన్ చేశాడు.

"హలో" అంది అమ్మాయి గొంతు.

అప్పుడు "హయ్ కామ్రేడ్! నా పేరు భవానీ శంకర్ అని మీ కామ్రేడ్ తో చెప్పండి. అయన మాట్లాడాలని అంటే మాట్లాడతాను. లేదంటే లేదు."

నిమిషంలో ఫోన్ లో కొచ్చాడు మాధవరావు.

"హలో"

"హలో కామ్రేడ్! తలకు తగిలిన దెబ్బేలా వుంది? బాగా తగిలిందా? నేను కావాలనే మెల్లగా తగిలేట్టు కొట్టాను. ఎందుకో తెలుసా? తల పూర్తిగా పగిలిపోతే ఇవాళ బిజినెస్ మాట్లాడటం కష్టం కదా అందుకే నన్నమాట."

"నీ అతి తెలివినెలా అణచాలో నాకు తెలుసు- " ఉడికిపోతూ అన్నాడు మాధవరావు.

"అరె! బాయిలరులో నీళ్ళలాగా అలా అవిరయిపోతున్నారేం కామ్రేడ్! ఏమిటి సంగతి? బిజినెస్ మాట్లాడదల్చుకోలేదా?"

"ఏం మాట్లాడాలి?"

"అదే కామ్రేడ్! ఆ పుస్తకం నీకు కావాలా వద్దా! ఫైనల్ గా నీ ఫిగర్ చెప్పేస్తే ఆ సిద్దార్ధారావు తో డీల్ కుదిర్చేసుకుంటాను."

"నేను ఒక్క పైస కూడా యివ్వకుండా ఆ పుస్తకం సంపాదించుకుంటాను" కసిగా అన్నాడు.

ఆ మతి చలించిన మాటలే వద్దు కామ్రేడ్! నీ చుట్టూ వున్న చచ్చురకం గాంగుతో నువ్వేమీ చేయలేవు.

"స్మితారాణిని తీసుకెళ్ళిపోయినంత మాత్రాన పెద్ద విలువగాడివయి పోయిననుకోకు. నీకు చాలా గట్టి దెబ్బ తగుల్తుంది. మళ్ళీ కోలుకోలేనంత దెబ్బ."

"ఏక్షన్ వద్దు కామ్రేడ్! జనం చదవటం లేదిప్పుడవి. కం టూ రియాలిటీ బ్రదర్! నాకు హాని చేయడం నీ తాత వల్ల కూడా కాదు. ఎందుకో తెలుసా? నీ దగ్గర్నుంచీ డబ్బు తీసుకుని పనిచేసే మనుషులు. నా దగ్గర నీ మీద పగ తీర్చుకోవటం కోసం ఎదురు చూస్తున్న మనుషులున్నారు --------- రెండింటికి ఎంత తేడా వస్తుందో చూడు."

మాధవరావుకి అతని మాటలు అర్ధం కాలేదు. తన మీద పగ తీర్చుకోవాలనుకుంటున్న మనుషులంటే ఎవరు?

అలా ఆలోచిస్తే చాలామందికి తను అన్యాయం చేశాడు - ఒకవేళ వీడు వాళ్ళందరినీ పోగుచేయటం లేదు కదా!

అతనికి చెమటలు పట్టేసినాయి.

అదే నిజమయితే భవానీ శంకరుని ఎదుర్కోవటం తనవల్ల కాదు. ఇంతకాలం సిద్దార్ధారావు , అతని గుండాలు తన చేతికింద వున్నారు కాబట్టి తానూ ఆడింది ఆటగా చెల్లుబడి అయింది. ఇప్పుడేమిటి చేయటం?

"ఓ.కే. కామ్రేడ్! ఆ పుస్తకం నీ కవసరం లేదని తేలిపోయింది. వుంటాను. "ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.

అతనికి కొంచెం నిరుత్సాహం కలిగింది.

మాధవరావు దగ్గరా, సిద్దార్ధరావు దగ్గరా కలిపి తొమ్మిది లక్షలు సంపాదించాలనుకున్నాడు. కానీ మాధవరావు లొంగేట్లు కనిపించడం లేదు.

సిద్దార్ధరావుకి రింగ్ చేశాడతను.

రింగవగానే ఫోన్ లో కొచ్చాడతను.

"సిద్దార్ధారావు"

"హలో కామ్రేడ్! నేను భవానీ శంకరుని."

"నేను రెడీగానే వున్నాను."

"నేనూ రడీయే కామ్రేడ్."

"సరిగ్గా పది గంటలకు కదూ?"

"అవును! సరిగ్గా పదిగంటలకు."

"నాతో పాటు మా అసిస్టెంట్ ని కూడా తీసుకొస్తాను."

"ఎవడిని? లావాటి వాడినా?"

"ఎవడోకడు."

"సరే, అలాగే నాతోనూ ఒక అసిస్టెంట్ వస్తాడు."

"ఎవరతను?"

"మా వాడి పేరు రాజయ్యా మీ వాళ్ళలాగా ఫేమస్ కాదులే! సైలెంటుగా తలలు తీసేసే కేస్."

"సరే!"

భవానీ శంకర్ లేచి గది దగ్గర కొచ్చేసరికి మాధవరావు మనిషి ఎదురు చూస్తూ కనిపించాడు.

"యస్ కామ్రేడ్! యేమిటి మళ్ళీ దర్శనం? మీ బాస్ అన్నీ తెగ తెంపులు చేసేసుకున్నాడుగా."

"అర్జంటుగా మిమ్మల్ని ఫోన్ లో మాటాడమంటున్నారు."

"మరీ ఇంత ముదురు కేస్ అనుకోలేదు మీ బాస్! ఏం చేస్తాం. పొట్ట కోసం తిప్పలు తప్పదు కదా! నువ్వెళ్ళిపో కామ్రేడ్! నేను మాటాడతానులే."

మళ్ళీ ఫోటో స్టూడియో కొచ్చాడు భవానీ శంకర్.

విక్రమార్కారావు ఆశ్చర్యంగా చుశాదతనివేపు.

"గురూజీ! ఏమిటి నిన్నటీ నుంచి లక్షలు, కిడ్నాప్ అంటూ ఫోన్ లో తెగ మాటాడుతున్నారు. ఎవరితో!" భవానీ శంకరు చిరునవ్వు నవ్వాడు.

"అదంతా కథ కామ్రేడ్? సినిమా తీస్తానన్న పెద్ద మనిషికి కథ చెప్తున్నా! క్లయిమాక్స్ యింకా సేటిలవలేదు అది ప్రాబ్లమ్."

అంటూ మాధవరావుకి ఫోన్ చేశాడతను.

"హలో మిస్! మళ్ళీ నేనే! భవానీ శంకరుని మీ బాస్ కి తిక్క కుదిరినట్లుంది. ఫోన్ చేతికివ్వు."

ఆమె కిసుక్కున నవ్వింది.

"మీరు భలే తమాషాగా మాటాడతారు."

"థాంక్ యూ కామ్రేడ్! ఈ మాత్రం కామన్ సెన్స్ కూడా లేకపోవటం వల్ల మీ బాస్ తలకు పట్టివేసుకుని ఇంట్లో కూర్చున్నాడు."

మాధవరావు లైనులో కొచ్చాడు.

"హల్లో."

"హలో కామ్రేడ్! స్పృహలో కొచ్చారా?"

"స్పృహ ఏమిటి?"

"ఇందాక ఫోన్ లో ఏదో కలవరించారు కదా! మళ్ళా వెంటనే మీ మనిషి యింటి కొచ్చేసరికి యిప్పుడే స్పృహ వచ్చి వుంటుందనిపించింది."

"యూ ఆర్ ఓవర్ స్మార్ట్."

"నథింగ్ ఈజ్ బెటర్ దెన్ నథింగ్."

"అల్ రైట్ ! మిగతా నాలుగు లక్షలివ్వటానికి వప్పుకుంటున్నాను."

ఆలస్యమయినా అద్భుతమైన నిర్ణయం తీసుకున్నావు కామ్రేడ్. తెలుగుజాతి అంటా నీ నిర్ణయానికి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు  చేస్తారు."

"ఆ పుస్తకం తీసుకుని వెంటనే ఇంటికి వస్తే డబ్బిస్తాను."

భవానీ శంకర్ ఘోల్లున నవ్వాడు.

"ఎందుకా నవ్వు?" కోపంగా అడిగాడు మాధవరావు.

"లేకపోతే పట్టపగలే టెలిఫోన్ లో ఏమిటా కలవరింతలు? కొంచెం నిద్ర మేల్కో బ్రదర్! లేకపోతే ఈ మాటలు వినే టెలిఫోన్ ఆపరేటర్లు నవ్వుతారు."

సరిగా అప్పుడే టెలిఫోనులో ఆపరేటరు కిలకిల నవ్వటం వినిపించింది.

"చూశావా కామ్రేడ్! నేను చెప్పలేదూ? అంచేత వెంటనే స్పృహలో కొచ్చేసేయ్."

"అంటే?"

"నువ్వే నేను చెప్పే చోటు కొచ్చి డబ్బు అందించాలి."

"ఎక్కడికి రావాలి.?"

"అలా మాడు ముఖం వేసుకుని ప్రశ్నలు వేయకు కామ్రేడ్. కొంచెం చిరునవ్వుతో మాటాడటం నేర్చుకో" మాధవరావు మరింత ఉడికిపోయాడు.

"ఎక్కడికి రావాలో త్వరగా చెప్పు."

"రవీంద్రభారతికి కామ్రేడ్! రేపు ఉదయం పదిగంటలకు డాన్స్ ప్రోగ్రాం ఉందందులో. దానికి డైరెక్టరు జనరల్ ఆఫ్ పోలీస్ వస్తున్నారు. నేను ముందు వరుసలో కూర్చుని ఉంటాను. నా పక్క సీటు మీద కర్చీఫ్ వేసి ఉంచుతాను. నువ్వు అందులో కూర్చుంటే ఎక్స్ఛేంజ్ చేసేసుకోవచ్చు."

"నీకేమయినా పిచ్చెక్కిందా? ఇలాంటి వ్యవహారాలూ అలాంటి పబ్లిక్ ప్లేసెస్ లోనా!"

"ఈ రోజుల్లో అంతా పబ్లిక్ గానే జరుగుతోంది కామ్రేడ్! అసలు వెధవ పన్లన్నీ కూడా పబ్లిక్ గా చేస్తేనే జనం హర్షిస్తున్నారు. కనుక నీకేమీ భయం అక్కర్లేదు. నువ్వెలాగూ ఎమ్మెల్యేని గనుక నీకు స్వాగతం కూడా వుంటుంది."

"నో అక్కడికయితే నేను రాను."

"నిన్నెవరూ రమ్మని బ్రతిమాలటం లేదు కామ్రేడ్. నీకు అవసరమయితే వస్తావు. పదిగంటలకల్లా నువ్వు రాకపోతే పదింబావుకి సిద్దార్ధరావు వస్తాడు. పదిబావుకి సిద్దార్దారావు రాకపోతే పదిన్నరకి మనోహర్ మిక్వాడా వస్తాడు."

మాధవరావు ఉలిక్కిపడ్డాడు.

"ఈ మిక్కాడాగాడేవడు?"

"అది నీ కనవసరం బ్రదర్! ఇంక ఫోన్ డిస్కనెక్ట్ చేయనా?"

"అల్ రైట్! నేను లోపలకు రాగానే నువు నాకు కనిపించి నీ సీట్ దగ్గరకు తీసుకెళ్ళాలి!"

"ష్యూర్ కామ్రేడ్! ఇద్దరం వెళ్ళి సీట్లలో కూర్చుంటాం. కూర్చోగానే మీ కాష్ సరిగా ఉన్న సూట్ కేస్ నాకిస్తారు. నేను దానిని వెనుకే కూర్చున్న మా అసిస్టెంట్ కిస్తాను. అతను క్యాష్ సరిగా ఉందో లేదో చెక్ చేసి ఓ.కే. రిపోర్టు ఇస్తాడు. అప్పుడు నేను నా దగ్గరున్న అడ్రస్ బుక్ నీకిచ్చేస్తాను. ఎలా వుంది మన ప్లాన్?"

"సరే" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.

* * * *

భవానీ శంకర్ రూము కొచ్చేసరికి లారీ ఒకటి ఆగి వుందక్కడ. వాకిట్లో జనమంతా లారీలో నిండిపోయి వున్నారు. రాజయ్య అందరినీ లారీ ఎక్కిస్తున్నాడు.

"హలో రాజయ్యా! ఏమిటి హడావుడి?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీ శంకర్.

"మీరే చెప్పారు కదా్సర్- మనవాళ్ళందరినీ రవీంద్రభారతిలో ఒక సైడంతా నిమ్పెయమని."

"ఆ మాట నిజమే! కామ్రేడ్ - కానీ ఈ లారీల్లో తోలడమేమిటి?"

"ఎక్కడికెళ్ళినా అలా లారీల్లో వెళ్ళటం మా కలవాటు సార్. అది వరకు కాంగ్రెస్ వాళ్ళ మీటింగు కి ఇలాగే లారీలో బలవంతంగా లాక్కేల్లెవాళ్ళు. ఇప్పుడు తెలుగుదేశానికి కూడా అలాగే తీసుకెళ్తున్నారు. అందుకని లారీ లేందే రామని మా వాళ్ళు మొండికేశారు."

"మంచి అలవాటు కామ్రేడ్! వెంటనే తీసుకెళ్ళు వాళ్ళకు మధ్యాహ్నం ఫుడ్ పాకెట్స్ కూడా ఏర్పాటు చేసేయ్. మాధవరావు డబ్బుంది మనకేమీ ఫర్వాలేదు."

"అలాగే సార్."

"అతను లారీతో వెళ్ళిపోగానే భవానీ శంకర్ ఆటోలో రవీంద్రభారతి చేరుకున్నాడు. స్టేజి మీద డెకరేషన్స్ చేస్తున్నారు వాలంటీర్లు.

తిన్నగా వాళ్ళ దగ్గరకు నడిచాడతను.

"యస్ కామ్రేడ్! - ఈ సంస్థ సెక్రటరీ ఎవరు?"

"మేకప్ రూంలో వున్నారు సార్."

భవానీ శంకర్ మేకప్ రూములోకి చేరుకున్నాడు. అక్కడ ఇద్దరు యువతులు మేకప్ అవుతున్నారు.

"హలో సెక్రటరీ గారేవరండీ."

"ఓ సన్నటి వ్యక్తీ దూరంగా కూర్చున్న వాడల్లా హడావుడిగా లేచి భవానీ శంకర్ దగ్గరకొచ్చాడు.

"మీరు" అడిగాడతను సందేహంగా.

"నా పేరు భవానీ శంకర్ బ్రదర్! పూర్వాశ్రమంలో పత్రికా ఫోటో గ్రాఫర్ని."

"అలాగా సార్! రండి. కూర్చోండి."

ఇద్దరూ దూరంగా వున్నా కుర్చీల్లో కూలబడ్డారు.

"మా ఫంక్షన్ కవరు చేయాలని వచ్చారా? సార్?"

"అవును బ్రదర్. అదీ గాక ఇంకో చిన్న పని కూడా వచ్చింది మీతో."

"ఎమిట్సార్ ఆ పని?"

"మీ డాన్స్ ప్రోగ్రాం కి ముఖ్య అతిధి ఎవరు?"

"డి,జి,పి. గారు సార్."

"ఆయనతో చిన్న కార్యక్రమం - అంతా కలిసి పదినిముషాలది నేను ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. మీకేమయినా అభ్యంతరమా?"

"భలే వారే మాకేం అభ్యంతరం? కానీ ఏం కార్యక్రమం అది?"

"ఓ చిన్న బహుమతి ప్రధానం! అన్నీ కలిపి అరడజను బహుమతులుంటాయ్."

"మాకేం అబ్జెక్షన్ లేదు గానీ ముందు డి.జి.పి. గారితో ఓసారి మాట్లాడండి."

"అదే వద్దు కామ్రేడ్! ఆ వ్యవహారమంతా మీది. అంటే మీరే ఆయనతో మాట్లాడి ఓ.కే. చేయిస్తారన్నమాట! అందుకుగాను మీ అసోసియేషన్ కి అయిదువేల విరాళం నేను ఇస్తాను - ఒకే.!"

ఐదువేలు అనగానే అతని ముఖం వికసించింది.

"అయిదువేలే?" నమ్మలేనట్లు అడిగాడు.

"అవును కామ్రేడ్! అయిదు వేలు హార్డు కాష్ "

"అలాగే సార్ ఆయనతో నేను చెప్పేస్తాను. అదంతా ఓ.కే. అయిపోయినట్లే అనుకోండి."

"తర్వాత మళ్ళీ ఏమీ పేచీ పెట్టరు కదూ."

"నో పేచీ సార్ అయిదు వేలిస్తే మాకింకేం కావాలి సార్! అవసరమయితే మా డాన్స్ ప్రోగ్రాం కాన్సిల్ చేసేయమన్నా రడీయే సార్. అయిదు వేలంటే మాటాలా సార్. అది రడీ కాష్.

"హార్డు కాష్."

"యస్సార్, హార్డు కాష్."

భవానీ శంకర్ జేబులో నుంచి నోట్లకట్ట తీసి అతనికి అయిదువేల రూపాయలు లెక్కపెట్టి ఇచ్చేశాడు.

"థాంక్యూ సార్ థాంక్యూ వెరీ మచ్."

"నో మెన్షన్ కామ్రేడ్! అన్నట్లు ముందు వరుసలో అరడజను సీట్లు కూడా మా కోసం కేటాయించాలి. నో ప్రాబ్లం. వాళ్ళందరిని రెండో వరుసకు నేట్టేస్తాము."

"థాంక్యూ బ్రదర్."

"నో మెన్షన్ సార్! ఇంకేమయినా కావాలా సార్."

"ఇంకేమీ అవసరం లేదు కామ్రేడ్. ఇంక మీ కార్యక్రమం మీరు చూసుకోవచ్చు. - " అతను వెళ్ళిపోగానే భవానీ శంకర్ బయటకు నడిచి ముందు వరుసలోని ఓ కుర్చీలో కూర్చుని టైం చూసుకున్నాడు.

"ఇంకో గంట టైముంది సార్" అన్నాడు రాజయ్య వెనుక కుర్చీలో నుంచి.

"మన వాళ్ళు ఈ పక్కంతా నిండిపోయినట్లు న్నారు రాజయ్యా?"

"అవున్సార్ - విజిలేస్తే చాలు - నిమిషంలో ముందుకి దూకేస్తారు."

"మరి థియేటర్ బయట-"

"అక్కడ కూడా కర్రలతో, కొంతమందిని కూర్చోబెట్టాను సార్."

"వెరీ గుడ్ ఎరేంజ్ మెంట్స్ కామ్రేడ్."

అప్పుడే జనం రావటం ప్రారంభమయింది ఒకరికరుగా.

స్టేజీ మీద ఎరేంజ్ మెంట్స్ పూర్తయిపోయాయి."

"భారతీయ లేవరా" అంటూ దేశభక్తి గీతం వినిపించసాగింది.

మరో అరగంట కల్లా థియేటర్ నిండిపోయింది.

సన్నటి వ్యక్తీ, లావుపాటి వ్యక్తీ ఓసారి లోపలికొచ్చి భవానీ శంకర్ ని చూసి బయటి కెళ్ళిపోయారు.

"సిద్దార్థరావు వచ్చినట్లున్నాడు - మనవాళ్ళను రడీగా ఉండమని చెప్పు." అన్నాడు భవానీ శంకర్ రాజయ్య తో.

మరో పావుగంట గడిచిపోయింది. సిద్దార్థరావు సూట్ కేస్ తో పాటు వెనుక ఒక బాడీ గార్డుని వెంట బెట్టుకుని లోపలి కొచ్చాడు.

భవానీ శంకర్ సాదరంగా లేచి నిలబడి ఆహ్వానించాడతనిని.

"కమాన్ కామ్రేడ్! గుండా లీడర్స్ మర్డర్స్ అవీ చేసేటప్పుడు పంక్చువల్ గా ఉంటారని తెలుసు గానీ ఇలా కొంచెం ఎడ్వాన్స్ గా కూడా వచ్చేస్తారనీ నాకు తెలీదు-'

సిద్దార్ధారావు అన్నివేపులా అనుమానంగా చూస్తూ భవానీ శంకర్ తో పాటు నడిచి అతని పక్కనే అతని బాడీగార్డుతో కూడా కూర్చున్నాడు.

స్టేజీ మీద నిలబడి మైక్ లో మాట్లాడసాగాడు సెక్రటరీ.

'ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ పోలీస్ గారిని ముఖ్య అతిథిగా వేదికనలంకరించవలసిందిగా కోరుతున్నాను."

థియేటరు అంతా చప్పట్లు మార్మోగిపోయాయి.

డి.జి.పి. స్టేజి ఎక్కి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు నగర సేల్స్ టాక్స్ అధికారి శ్రీకుమార మంగళంగారిని అధ్యక్ష స్థానం అలంకరించవలసిందిగా కోరుతున్నాను."

మళ్ళీ చప్పట్లు-

"కాష్ తెచ్చావా కామ్రేడ్" అడిగాడు భవానీ శంకర్.

"తెచ్చాను"

"ఎంత కామ్రేడ్?"

"నాలుగు లక్షలు -'

"ఇటివ్వు కామ్రేడ్."

అతను బ్రీఫ్ కేస్ భవానీ శంకర్ కిచ్చాడు. భవానీ శంకర్ దానిని వెంటనే వెనుక కూర్చున్న రాజయ్య కిచ్చాడు.

"ఏదీ  అడ్రస్ బుక్?" అడిగాడు సిద్దార్థరావు.

"ఓర్పు కామ్రేడ్! ఇలాంటి విషయాల్లో ఓర్పు అవసరమని బెర్నార్డుషా అన్నాడు. బైదిబై బెర్నార్డుషా అంటే ఎవరో నీకు తెలుసా బ్రదర్."

"తెలీదు -"

"తెలుసుకోవాలి కామ్రేడ్! రేపొద్దున్న నువ్వు మంత్రిగానో, గవర్నరుగానో అయిపోతే బెర్నార్డుషా గురించి మాట్లాడాల్సిన పరిస్థితులు రావచ్చు బ్రదర్! ఈ రోజుల్లో ఎవర్ని నమ్మటానికి వీలుంది చెప్పు. స్టేజీ ఎక్కాక హటాత్తుగా అపోజిషన్ పార్టీ వాళ్ళొచ్చి ఇప్పుడు శ్రీ సిద్దార్ధరావు గారు బెర్నర్డుషా గురించి మాట్లాడతారని అన్నరనుకో. అప్పుడేం చేయగలవు?"

"ముందు నా అడ్రస్ బుక్ ఇవ్వు" చిరాకుగా అన్నాడు సిద్దార్ధరావు.

"తొందరపడకు కామ్రేడ్! ముందు డబ్బు కరెక్టుగా వుందో లేదో మా కామ్రేడ్ పరీక్షిస్తున్నాడు. ఆ కార్యక్రమం పూర్తవగానే నీ అడ్రస్ బుక్ నీ చేతి కొచ్చేస్తుంది.

సిద్దార్ధరావుకి చెమటలు పట్టేస్తున్నాయి.

అంతమంది పెద్ద పెద్ద పోలీసు అధికారుల ముందు ఎప్పుడూ కూర్చోలేదు. తన లెవల్ కేవలం ఇన్ స్పెక్టర్ రాంక్ వరకే! మిగతా వారంతా తనను నిలబెట్టి దొంగతో మాట్లాడిట్లు మాటాడేవాళ్ళు.

అయిదు నిమిషాలు గడిచిపోయింది.

గేటు దగ్గర వాలంటీర్ల వెనుక నుంచీ మాధవరావు బాండేజీ తల గొరిల్లా తలలా అటూ ఇటూ కదిలింది.

భవానీ శంకర్ వాలంటీర్లకు సంజ్ఞా చేశాడు.

వెంటనే వారు మాధవరావుని గౌరవంగా తీసుకొచ్చారు లోపలకు.

అతనిని చూస్తూనే సిద్దార్ధరావులో అనుమానం తలెత్తింది. సిద్దార్దారావు ని భవానీ శంకర్ పక్కన చూస్తూనే మాధవరావు కూడా కలవరపడిపోయాడు.

"కమాన్ కామ్రేడ్! బ్రేకులు పడినట్లు ఆగిపోయారేమిటి? రండి కూర్చోండి! కామ్రేడ్ సిద్దర్ధరావు మన అతిధి ఇప్పుడు."

మాధవరావు అనుమానంగానే వచ్చి భవానీ శంకర్ రెండో వేపు కూర్చున్నాడు. అతని పక్కనే అతని బాడీ గార్డు కూడా కూర్చున్నడు.

"కమాన్ కామ్రేడ్ - చల్లకొచ్చి ముంత దాచటమెందుకు? బ్రీఫ్ కేస్ ఇటిచ్చేయ్" అతను ఇవ్వకముందే చటుక్కున లాగేసుకున్నాడు భవానీ శంకర్.

వెంటనే అతని చేతుల్లో నుంచి రాజయ్య అందుకున్నాడు దానిని.

"ఏదీ అడ్రస్ బుక్? మొఖానికున్న చెమటను తుడుచుకుంటూ అడిగాడు మాధవరావు.

"అదిగో! ఆ తొందరే వద్దన్నాను కామ్రేడ్! ఇప్పుడే బెర్నార్డుషా అన్న ఓ సూక్తి గురించి కామ్రేడ్ సిద్దార్దారావుకి వివరిస్తున్నాను- అన్నట్లు బెర్నార్డుషా గురించి తెలుసా కామ్రేడ్?"

"తెలుసు" అన్నాడు మాధవరావు.

"ఎవరతను?"

"అమెరికా ప్రెసిడెంట్."

"వండర్ ఫూల్! ఈ మాత్రం నాలెడ్జి చాలు బ్రదర్. రాజకీయ నాయకులకు. ప్రపంచాన్నే దున్నేయగలరు."

"అడ్రస్ బుక్ - " గొణిగాడు మాధవరావు.

"గొణగకు కామ్రేడ్ - స్పష్టంగా మాట్లాడు! ఇప్పుడు మళ్ళీ చెప్పు ఇంకోసారి?"

"అడ్రస్ బుక్" కొంచెం స్పష్టంగా కోపంగా అన్నాడతను.

"వెరీ గుడ్! అలా మాట్లాడాలి! చేసిన వాగ్దానాలు నెరవేర్చు, నేరవేర్చకపో! కానీ చేసేప్పుడు క్లారిటీ తగ్గకూడదు. కాసేపాగుతే మన కామ్రేడ్ రాజయ్య బృందం డబ్బు కరెక్టుగా ఉందో లేదో చూసి ఓ.కే. రోపోర్టిస్తారు. అప్పుడు అడ్రస్ బుక్ నీకిచ్చేస్తాను . సరేనా!"

సిద్దార్ధరావు ఉద్రేకంగా లేచి నిలబడ్డాడు.

"మోసం! అడ్రస్ బుక్ నాకిస్తానన్నావు." అన్నాడు గట్టిగా. థియేటరులో ఉన్నవాళ్ళు చాలామంది అతని వేపు చూసి "ఉష్" అనరిచారు.

"అరవకు కామ్రేడ్! అసలే డి.జి.పి. గారున్న సభ ఇది. పోలీసులు బయటికొచ్చేస్తారు.

అతను చుట్టూ చూసి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

"ఏయ్ భవానీ శంకర్! నాతో వేళాకోళలాడావంటే ముక్కలు ముక్కలు చేసేస్తాను జాగ్రత్త! క్రూరంగా అన్నాడు.

భవానీ శంకర్ రాజయ్య వేపు తిరిగాడు.

"రాజయ్యా!"

"ఏం సార్?"

"నీ దగ్గర వంకాయలు ఏమైనా ఉన్నాయా?"

"ఎందుకుసార్? కూరగాయలు తరిగేవాళ్ళేవరయినా దొరికారా?"

"కామ్రేడ్ సిద్దార్ధరావు అందులో ఎక్స్ పర్ట్ అంట రాజయ్యా! ఇంత బంధుత్వముండి మనకి ఈ విషయం ఇంతవరకూ తెలీనేలేదు చూశావా?"

"అలాగా సార్- అయితే యిప్పుడే మిగతా కూరగాయలు కూడా తెప్పిస్తాను అంతవరకూ వంకాయలు తరిగించండి సార్."

అతను మరింత ఉగ్రుడైపోయాడు.

"అడ్రస్ బుక్ ఇస్తావా ఇయ్యనా?" బిగ్గరగా అరచాడు మళ్ళీ.

"ఏయ్ - ఎవడ్రా ఆడు. సైలెన్స్" అరచాడు పక్కనే నిలబడ్డ కానిస్టేబుల్.

అతను జంకాడు.

"నీ అడ్రస్ బుక్ ఇస్తాను కామ్రేడ్! డబ్బు సరిగా వుందని మా బృందం వాళ్ళు విజిలేయగానే పువ్వుల్లో పెట్టి ఇస్తాను."

"మరి నాకిస్తానన్నావు?" కోపంగా అడిగాడు మాధవరావు.

"నీకూ ఇస్తాను."

"ఒరే బాండేజ్ హెడ్డూ - అరవకు బే -' వెనుకనుంచి ప్రేక్షకులు అరిచారు.

డి.జి.పి. గారు మైక్ ముందుకొచ్చి నృత్యకళ ఎంత ఉన్నతమైనదో వివరించసాగారు."

"నేను మద్రాస్ లయోలా కాలేజ్ లో డిగ్రీ చదువుతున్నప్పుడు -- ఒకసారి బీచ్ కెళ్ళాం నేనూ, రాదాకృష్ణమూర్తినూ! రాధాకృష్ణమూర్తి ఆ రోజులలో నా బెస్టు ఫ్రెండ్! అక్కడ బీచ్ లో ఓ పదేళ్ళ పిల్ల మా దగ్గర కొచ్చి డాన్స్ చేసింది - ఒక్క అర్ధణా కోసం. ఆహా! ఎంత గొప్ప డాన్స్ అది? ఇప్పటికి ఆ డాన్స్ ఇంకా నా కళ్ళముందు మెదులుతుంది. అంత గొప్ప డాన్స్! మర్చిపోలేకపోతున్నాను ఇప్పటికీ. అంత అద్భుతమయిన డాన్స్ -

"

"ఇద్దరికీ ఎలా ఇస్తావు ఆ అడ్రస్ బుక్" అడిగాడు సిద్దార్ధారావు కోపంగా.

డి.జి.పి. గారు కోపంగా చూశారు ముందు వరుసవేపు.

"ఎవరిప్పుడు అరిచింది?" అడిగారాయన.

"ఇతనేనండీ! పేరు సిద్దార్ధరావ్" అన్నాడు భవానీ శంకర్.

"గట్టిగా అరవకూడదు మిస్టరు సిద్దార్ధరావు! కొంచెం నెమ్మదిగా మాటాడటం అలవాటు చేసుకోండి ఓ.కే."

"ఓ.కె. సార్" అన్నాడు సిద్దార్ధరావు.

డి.జి.పి. గారు మళ్ళీ ఉపన్యాసం కొనసాగించారు.

"కనుక నేను చెప్పేదేమీటంటే నృత్యం అనేది ఒక వరం! ప్రభుత్వం వారిచ్చిన వరం అన్నమాట. అహహ -సారీ? వెరీ సారీ! ఉద్యోగంలో అలవాటు చొప్పున అలా అనేశాను. ప్రభుత్వం వారిచ్చిన వరం కారు. భగవంతుడిచ్చిన వరం. కొంతమంది ఎన్నేళ్ళు ఈ నృత్యకళ అబ్యసించినా రాదు! ఇంకొంత మందికి అసలు ఎలాంటి అభ్యాసం లేకుండానే దానంతట అదే వచ్చేస్తుంది. ఫరెగ్జాంపుల్ మద్రాస్ బీచ్ లో ఆ పిల్ల అర్ధణా కోసం అద్భుతంగా డాన్స్ చేసిన ఆ పసిపిల్ల , నేనూ రాదాకృష్ణమూర్తి ఆ డాన్స్ చూసి ఎంత ఇదయిపోయాము!"

"ఇద్దరికీ ఎలా ఇస్తావు ఆ అడ్రస్ బుక్?" ఇంక సక్సెస్ భరించలేక గట్టిగా అరిచేశాడు మాధవరావు.

"ష్! డి.జి.పి. గారి స్పీచ్ ఎంత బాగుందో చూడు" చిరాకుపడ్డాడు భవానీ శంకరు.

"మర్యాదగా సమాధానం చెప్పు. ఇద్దరికీ ఎలా ఇస్తావు అడ్రస్ బుక్?" కోపం అణచుకుంటూ మరింత గట్టిగా అరచాడు.

"ష్! అరవకు కామ్రేడ్! ఇద్దరికీ చెరో బుక్ ఇస్తాను. సరేనా? ఇంకా నిశ్శబ్దంగా ఉండు."

"ఆ! చెరో బూక్కా? ఉంది ఒకటే అయితే ఇద్దరికీ ఎలా ఇస్తావు" "జీరాక్సు కాపీలు తీయించానులే! అరవకు!" అతని జవాబు వింటూనే ఇద్దరూ త్రుళ్ళిపడ్డారు.

"ఆ! జిరాక్స్ కాపీలు తీయించావా మోసం - దగా" ఇద్దరూ ముక్త కంఠంతో అరచారు.

డి.జి.పి. గారికి కోపం అగలేదింకా.

"ఎవరక్కడ మాట్లాడింది?" భవానీ శంకర్ వేపు చూస్తూ అడిగాడు..........

"వీళ్ళిద్దరూ సార్. నేను చెపుతున్నా వినటం లేదు."

"ఏయ్ మిస్టర్! మీకేమయినా బుద్దుందా? ప్రోగ్రాం మీ కిష్టం లేక బయటకు పొండి."

ఇద్దరూ సైలంటయి పోయారు.

డి.జి.పి. గారు మళ్ళీ ఉపన్యాసంలో కెళ్ళిపోయారు.

"కనుక ప్రభుత్వం దయవల్ల ఇప్పుడీ బాలికలు - అహహ - సారీ భగవంతుని దయవల్ల ఇప్పుడీ బాలికలు --"

"మర్యాదగా నా డబ్బు నాకిచ్చేస్తావా లేదా?" ఉగ్రుడయిపోతూ అడిగాడు సిద్దార్ధరావు.

"సార్ అతను మళ్ళా మాట్లాడుతున్నాడు. లేచి రిపోర్టు చేయబోయాడు భవానీ శంకరు.

సరిగ్గా అప్పుడే రాజయ్య వెనుకనుంఛి మాట్లాడాడు.

"సిద్దార్ధరావుగారిచ్చిన నాలుగులక్షలు కరెక్ట్ గా ఉంది సార్! కాకపోతే రెండు వందనోట్లు చిరిగినవి పెట్టాడు.

కక్కుర్తి సన్నాసి -"

సిద్దార్ధరావు ఉడికిపోతూ రాజయ్య వేపు చూశాడు.

భవానీ శంకర్ రాజయ్య చేతిలోని బ్రీఫ్ కేస్ అందుకుని తిన్నగా స్టేజీ మీద కెళ్ళి దానిని డి.జి.పి. గారికి అందించాడు.

అయన చెవిలో రెండు ముక్కలు మాట్లాడేసరికి అయన ముఖం ఆనందంతో నిండిపోయింది.

"ఫ్రెండ్స్! ఇప్పుడు ఓ చిన్న కార్యక్రమం! చిన్నదే అయినా మానవత్వం మొగ్గలు తొడిగిన మహోన్నత కార్యక్రమం ఇది.

ఇంత గొప్ప కార్యక్రమాన్ని నా చేతుల మీదుగా జరిపించే అవకాశాన్ని నాకు ప్రసాదించిన ప్రభుత్వానికి నా హృదయపూర్వక - అహహ సారీ - వెరీ సారీ - ప్రసాదించిన భవానీ శంకర్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

కిందటి సంవత్సరం శ్రీ మాధవరావుగారి మందుల ఫ్యాక్టరీ తాలుకూ సొల్యుషన్ వల్ల ఫ్యాక్టరీ పక్కనే వున్న లేబరు కాలనీ కాని నీళ్ళు విషపూరితమయి, అని తాగిన ఎంతో మంది మరణించిన విషయం మనకందరికీ తెలుసు. వెంటనే మన ప్రభుత్వం ఆ చావులు నివారించడానికి ఆ కాలనీలోని లేబరుని అక్కడి నుంచి వెళ్ళగొట్టి ఎంతో సహాయం చేసిన విషయం కూడా మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు హటాత్తుగా ఆ సంఘటన గుర్తుకొచ్చి ప్రాణనష్టం జరిగిన కుటుంబాలకు అర్ధక సహాయం అందజేయాలని అర్జెంట్ నిర్ణయం తీసుకున్నారు సిద్దర్ధరావుగారు."

"మొదటిగా ఈ సహయం అందుకనే వ్యక్తీ -" అన్నాడు భవానీ శంకర్ మైక్ ముందుకొచ్చి . "శ్రీమతి కమలమ్మ "ఓ స్త్రీ ఆడిటోరియం లో నుంచి లేచి వేదిక మీదకొచ్చింది.

భవానీ శంకర్ ఆమెను చూపుతూ మళ్ళీ మాట్లాడసాగాడు.

సోదరలాగా! ఈమె కమలమ్మా! ఈమె భర్త ఇద్దరు కొడుకులూ ఆ బావిలో నీళ్ళు తాగగానే చనిపోయారు. అప్పటి నుంచీ పిచ్చిదానిలా అయిపోయి అందరినీ అడుక్కుంటూ బ్రతుకుతోంది. ఈమె పరిస్థితి చూసి సిద్దార్ధరావు గారి గుండె జాలితో నిండిపోయింది. అందుకే పాతిక వేల రూపాయలు ఆమె పేరునా, డి.జి.పి. గారి పేరునా ఫిక్సెడ్ డిపాజిట్ వేయటానికని ఇస్తున్నారు."

అంతా తప్పట్లు మార్మోగిపోయాయ్.

డి.జి.పి. పాతికవేల రూపాయలు కట్టలు లెక్కపెట్టి ఆమె కిచ్చాడు.

సిద్దర్ధరావు పూనకం వచ్చినట్లు లేచాడు.

"ఒరే భవానీ శంకర్ -- నిన్నూ - నిన్నూ - " అనేసి ఆవేశం అణచుకుని మళ్ళీ కుర్చీలో కూర్చుండిపోయాడు.

డి.జి.పి. కోపంగా చూశాడతని వేపు.

"ఎవరు మళ్ళీ అరచింది?" అడిగాడు మండిపడుతూ.

"అతనే సార్ - ఇందాక కూడా ఇలాగే అల్లరి చేశాడు."

"లాకప్ లో వేయించేస్తా వాడిని" అన్నాడతను.

"నాసా కింద బుక్ చేయించండి సార్-"

"అదే బెటరంటవా?"

"అవున్సార్!"

"సరే! ఈసారి అరిస్తే తోయిన్చేస్తాను."

భవానీ శంకర్ మళ్ళీ మైక్ దగ్గర కొచ్చాడు.

"ఇప్పుడు శ్రీరాజయ్య.

శ్రీ రాజయ్య కు ముగ్గురు పిల్లలుండేవారు . అందులో ఇద్దరు ఆ బావి నీరు తాగటం వల్ల మరణించారు.

శ్రీ సిద్దార్దారావు గారికి విషయం తెలిసి గుండె ఊడి కిందపడినంత పనయింది. అందుకని యాభయివేల రూపాయలు - కాష్ - అందజేస్తున్నారు."

డి.జి.పి. రాజయ్యకు నోట్లకట్టలు అందించాడు.

అంతా తప్పట్లు మార్మోగిపోయినాయ్.

మరో అయిదుగురికి డబ్బు అందజేశాక రాజయ్య రెండో బ్రీఫ్ కేస్ తీసుకొచ్చాడు.

భవానీ శంకర్ బ్రీఫ్ కేస్ ని పైకెత్తి జనానికి చూపించాడు.

"ఇప్పుడే సిద్దార్ధరావు గారి దాన గుణం చూసి మైమరచి పోయి ఆయనకు పోటీగా శ్రీ మాధవరావు గారు మరో నాలుగు లక్షలు దానం చేయడానికి పంపించారు."

మళ్ళీ కరతళా ధ్వనులూ మార్మోగిపోయినాయి.

"మోసం - నేనివ్వలేదు - న డబ్బు - దగా" అంటూ అరిచాడు మాధవరావు.

డి.జి.పి. కి ఒళ్ళు మండిపోయింది.

"ఏయ్ ఇన్ స్పెక్టర్ ! వాళ్ళిద్దరినీ లోపల వేసేయ్" అనరిచాడు ఉగ్రుడయిపోతూ.

ఇన్ స్పెక్టర్ లోపల వేయడానికి రెడీ అవుతుంటే భవానీ శంకర్ డి.జి.పి. దగ్గరకు పరుగెత్తాడు.

"సార్ పాపం వాళ్ళే సార్ సిద్దార్దారావు , మాధవరావులు. ఇప్పుడే వాళ్ళను పొగిడి ఇప్పుడే లోపలకు తోసేయ్యడం బాగుండదు కాద్సార్-"

డి.జి.పి. ఓ క్షణం ఆలోచించాడు.

"అవును, బావుండదు." అన్నాడు తలపంకిస్తూ.

"అంచేత వాళ్ళిద్దరినీ కూడా స్టేజీ మీదకు పిలుద్దాం సార్! ఇక్కడుంటే నిశ్శబ్దంగా ఉంటారు."

"అవునవును" ఇన్ స్పెక్టర్ ఇద్దరినీ వేదిక మీదకు తోశాడు.

"ఇప్పుడు శ్రీమతి రజని గారిని వేదిక మీదకు రావలసిందిగా కోరుచున్నాను" అన్నాడు భవానీ శంకర్.

బాగా మాసి పీలికలయిపోయిన బట్టలతో ఒకామె వేదిక మీద కొచ్చింది.

భవానీ శంకర్ ఆప్యాయంగా ఆమె భుజమీద చేయి వేశాడు.

"సోదరులారా! ఈ వదినమ్మ ఎవరో మీకు చెప్తాను.

లేబర్ కాలనీలో చాలా మంది బావిలోని కలుషితమైన నీటిని తాగి చనిపోయిన విషయం తెలిసిన వెంటనే ఓ యువకుడు రంగంలోకి దూకాడు. వాళ్ళందరికీ నష్టపరిహారం ఇప్పించాలని కంకణం కట్టుకుని కోర్టులో వారందరి తరుపునా కేస్ దాఖలు చేశాడు. కానీ ఆ రెండో రోజే కొంతమంది గుండాలు అతనిని అతనింట్లోనే దారుణంగా హత్య చేశారు. అంతే అతని కుటుంబం వీధి పాలయింది. అతని భార్య పుట్టెడు మెతుకులు కూడా

నోచుకోలేక అందరిళ్ళల్లో పాచిపని చేసుకుని ఒక పూటే తిని పస్తులుంటుంది.

ఆమె ఈ దేవత.

ఈమెకు శ్రీ మాధవరావు గారు లక్ష రూపాయలు బహుమతిగా అందజేస్తున్నారు."

అంతా కరతాళ ధ్వనులు మోతెక్కిపోయినాయ్. ఆమె డబ్బు తీసుకుని వేదిక దిగిపోయింది.

"ఇప్పుడు బేబీ కాంతి" ప్రకటించాడు భవానీ శంకర్.

చిరిగిన బట్టలతో , చింపిరి తలతో ఓ పదేళ్ళ పాప వేదిక మీద కొచ్చింది. ఆ పాపను చూస్తూనే అందరి కళ్ళు చెమర్చాయి.

"సోదరలారా! చూడండి . తల్లీ తండ్రి ఇద్దరూ ఆ బావి నీరు తాగి భయంకరమైన జబ్బుతో నరకం అనుభవించి చివరకు ప్రభుత్వాఫీసుపత్రిలో మాములుగా మరణించారు. అ రోజు నుంచీ కాన్వెంట్ లో ఫిఫ్త్ క్లాసు చదివే ఈ పాప అనాధ అయి - ప్రస్తుతం సంధ్యా టాకీస్ దగ్గర కాలనీ అమ్ముకుంటుంది.

అందుకే ఈ పాపా కథ విని వ్యధ చెందిన శ్రీ మాధవరావు గారు యాభయ్ వేల రూపాయలు ఈ పాప పేరున డి.జి.పి. గారి పేరున ఫిక్సిడ్ డిపాజిట్ వేస్తున్నారు."

డి.జి.పి. పాపకు డబ్బు అందించాడు.

మళ్ళీ కరతాళ ధ్వనులు.

మరో అయిదు నిముషాల్లో డబ్బు పంచె కార్యక్రమం పూర్తయిపోయింది.

"ఇప్పుడు ఇంత డబ్బు ఎంతో ప్రేమతో, మానవతా దృక్పథంతో నిరుపేదలకు దానం చేసిన శ్రీ సిద్దార్ధరావుగారికీ, మధవరావుగారికీ జేజేలు చెప్పాల్సిన బాధ్యత నామీదుంది.

"బోలో సిద్దార్ధరావుకీ...."

అందరూ "జై" అని అరచాడు.

"బోలో మాధవరావుకీ-"

"జై"

"ఇప్పుడు మాధవరావుగారికీ , సిద్దర్ధరావుగారికీ ముఖ్య అతిథి డిజిపీ గారికి నేను, మా మురికివాడ అసోసియేషన్ తరపున మూడు బహుమతులు అందజేస్తూన్నానని తెలియజేయడానికి ఆనందిస్తున్నాను."

అంటూ ఓ పాకెట్ విప్పి మూడు అడ్రస్ బుక్ లు తీశాడు భవానీ శంకర్.

"ఏమిటా బహుమతి?" ఎవరో అరిచాడు జనంలో నుంచి.

"వీటిని అడ్రస్ బుక్ అంటారు. చాలా ఖరీదయినవి. మాధవరావు గారూ! రండి తీసుకోండి! కలవరించి పోయారు కూడా ఇందాకటి నుంచి."

మాధవరావు అగ్గిలా మండిపోతున్న ముఖంతో ముందుకొచ్చి ఆ పుస్తకం అందుకున్నాడు.

"సిద్దార్ధరావు గారూ మీరూ రండి" ప్రేమగా పిలిచాడు భవానీ శంకర్.

సిద్దార్ధరావు రగిలిపోతూ అతని దగ్గరకొచ్చి పుస్తకం అందుకుని వెనక్కు వెళ్ళి నుంచున్నాడు.

"ఇప్పుడు డి.జి.పి. గారికి."

డి.జి.పి. వెళ్ళి పుస్తకం అందుకుని తెరిచి చూశాడు. అందులోని అడ్రస్ లు చూసినా అతనికేమీ బోధపడలేదు.

"వీటినే డ్రగ్స్ అడ్రస్ లంటారు సార్! మీరు మీ పోలీసుల్ని ఆ అడ్రస్ లు చూసినా కొద్దిరోజులు కాపలా

ఉంచారంటే మరెన్నో డ్రగ్స్ అడ్రస్ లు దొరుకుతాయ్ సార్."

"ఒకే! థాంక్యూ."

"ఇప్పుడు సిద్దార్థరావు గారు సభకు తమ కృతజ్ఞతలు తెలియజేస్తారు."

అతను మైక్ దగ్గరకొచ్చాడు కోపంగా.

"సోదరులారా! ఓర్పు చాలా అవసరం అన్నాడు సెయింట్ బెర్నార్డ్. అయన అమెరికా ప్రెసిడెంట్! అంచేత ఓర్పు పడుతున్నాను. తర్వాత చూపిస్తాను భవానీశంకర్ కి వస్తా" అనేసి స్టేజి దిగి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు మాధవరావు గారు మాట్లాడతారు" చెప్పాడు భవానీ శంకర్.

మాధవరావు క్రూరంగా భవానీ శంకర్ వేపు చూస్తూ మైక్ అందుకున్నాడు.

"నమస్కారం. ఏదో నేను చేయగలినంతా చేశాను. ఇక్కడితో ఆపకుండా ఈ ఫంక్షనయ్యాక కూడా ఇంకా చాలా చేయాలని నిర్ణయించుకున్నాను. వస్తాం" అనేసి అతనూ వేదిక దిగిపోయాడు.

వెంటనే డాన్స్ ప్రోగ్రాం గురించి మళ్ళీ మాట్లాడటం ప్రారంభించాడు డి.జి.పి "కనుక నేను చెప్పేదేమిటంటే ఇంత మంచి డాన్స్ ప్రోగ్రాం ఇస్తున్న ఈ ఇద్దరు సౌభాగ్యవతులకు జన్మనిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారికి - అహహ - సారీ - జన్మనిచ్చిన ఆమె తల్లి దండ్రులకు" భవానీ శంకర్ బయటి కొచ్చేశాడు.

అతని కోసం ఎదురు చూస్తూ నిలబడి వున్నారు - శ్యాం , అఖిలభాను స్మితారాణి , తులసి -

కంగ్రాచ్యులేషన్స్ భవానీ! ఇంత ఇంటిలిజెంట్ గా డీల్ చేస్తావనుకోలేదీ విషయం" ఆనందంగా అన్నాడు శ్యామ్."

"నిజంగా - ఆయామ్ ప్రొడాఫ్ యూ డియర్" అంది అఖిలభాను అతని చేతిని అందుకుని ముద్దు పెట్టుకుంటూ.

భవానీ శంకర్ స్మితవేపు చూశాడు ఆశగా.

"హలో కామ్రేడ్! మరి మీరూ మీ ఆనందాన్ని తెలియజేసే ముద్దు కార్యక్రమం కానిస్టే ........"

స్మిత సిగ్గుపడింది.

"అయ్ టూ లవ్ యూ" అంది నెమ్మదిగా తలవంచుకుని.

"అంటే మన సినిమాలన్నీటిలోనూ ఎడిటింగ్ సీన్ లాగా మీరిద్దరూ పాటలు పాడుతూ పరుగేడతారా అంకుల్?" అడిగింది తులసి.

"యస్ మైడియర్ యంగ్ స్టూడెంట్! కాకపోతే ఇంకొంచెం టైమ్ కావాలి. ఎందుకంటే మీ స్మితా అంటీ ముందు సినిమాలు చూసి అలాంటివన్నీ ప్రాక్టీస్ చేయాలి కదా."

"సారీ భవానీ! నువ్వు డబ్బుకోసం ఆశపడుతున్నావని అపార్థం చేసుకున్నాను" అన్నాడు ఆర్కే శ్యాం.

"ఫర్ గెటిట్ కామ్రేడ్" అంటూ ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి కలవరపడ్డాడు భవాని.

సిద్దార్థరావు మనుషులు కత్తులతోనూ , కర్రలతోనూ తమ మీదకు వస్తున్నారు.

చటుక్కున వెనక్కు తిరిగాడతను.

మాధవరావు వెనక్కు తిరిగాడతను.

మాధవరావు మనుషులు వెనుకవేపు నుంచి వస్తూ కనిపించారు.

కొద్ది క్షణాల పాటు ఏం చేయాలో తోచలేదతనికి.

"కామ్రేడ్ శ్యామ్ . మనం మళ్ళీ మన ఒరిజినల్ ఫామ్ లోకి అర్ధంటుగా వెళ్ళాల్సిన సమయం వచ్చినట్లుంది అంచేత ......." అన్నాడు బాక్సింగ్ కి సిద్ధమయిపోతూ.

"ఎందుకు పోలీసులు ఉన్నారు కదా ఇక్కడ. పోలీస్ ! పోలీస్" అంటూ అరిచాడు శ్యామ్.

పోలీసులు పరుగుతో అక్కడి కొచ్చి రెండు గ్రూపులనూ చూసి గోడదూకి రోడ్డు మీదకు పారిపోయారు.

"ఇప్పుడేవరోస్తార్రా నీకు దిక్కు" భీకరంగా మీదకొచ్చాడు లావు పాటి వ్యక్తి.

"నేన్రా" అన్నాడు రాజయ్య మూడో వేపు నుంచి మొత్తం తన గాంగు తో ముందు కొస్తూ.

అందరూ కదలటం ఆపేశాడు.

అంతా నిశ్శబ్దం.

రాజయ్య వెనుక మూకుమ్మడిగా కర్రలు పట్టుకుని నిలబడి ఉన్న జనాభాను చూడగానే మాట రావటంలేదేవారికీ.

"కామన్ కామ్రేడ్స్! ఇందాక ఏదో సందేహం తీర్చుకోవాలనుకున్నారు కదా! అడగండి కామ్రేడ్! సందేహం ఎప్పుడూ వెంటనే నివృత్తి చేసుకోవాలి గానీ అలా అణిచేసుకోకూడదు - కమాన్ అడగండి."

చిరునవ్వు తో అన్నాడు భవానీ శంకరు.

ఎవ్వరూ మాట్లాడలేదు.

అంతా ఒకరు మొఖాలోకరు చూసుకుంటూన్నారు.

"మాట్లాడండీ కామ్రేడ్స్! అలా రాళ్ళల్లా నిలబడిపోయారేమిటి ? మీకేం కావాలో చెప్పండి."

హటాత్తుగా రాజయ్య బృందం రెండు గ్రూపులుగా విడిపోయి మాధవరావు గాంగ్ నీ, సిద్దార్ధరావు గ్రూప్ నీ ఎటాక్ చేయటం ప్రారంభించారు.

క్షణంలో రోడ్డంతా పారిపోతున్న జనంతోనూ, కాలికి బుద్ధి చెపుతున్న గుండాలతోనూ నిండిపోయింది.

* * * *

మర్నాడు ఉదయం ఓ అందమైన మోటారు సైకిల్ వచ్చి హాస్పిటల్ ఆవరణలో ఆగింది.

దాని మీద నుంచి భవానీ శంకర్ , స్మితారాణి దిగి తిన్నగా స్పెషల్ రూమ్స్ లోకి నడిచాడు. లోపల బెడ్స్ మీద మాధవరావు, సిద్దార్ధరావు వళ్ళంతా బాండేజీతో పడుకుని వున్నారు.

భవానీ శంకర్ పుష్పగుచ్చాలు తీసుకెళ్ళి ఇద్దరి బాండేజీల్లోనూ గుచ్చాడు.

"మమ్మల్ని అశిర్వదించండి కామ్రేడ్! ఇప్పుడే గుళ్ళో మారేజ్ చేసుకుని వస్తున్నా" అన్నాడు అతను చిరునవ్వుతో.

ఇద్దరి బాండేజీలలో నుంచి ఏవో మాటలు వినిపించినాయ్ గానీ అవి ఏమాత్రం అర్ధం కాలేదు వాళ్ళకి.

"థాంక్ యూ కామ్రేడ్! మీరు బ్రతికి బయటికొస్తే మళ్ళీ రవీంద్రభారతిలో ప్రోగ్రాం ఏర్పాటు చేయిస్తాను -"

స్మిత భుజం మీద చేయి వేసి బయటకు నడిచాడు భవానీ శంకర్.

------- అయిపోయింది ---------